Reffered Journal &
Peer Reviewed Journals

RNI No.
APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Web : www.bhavaveena.com

Vol : 23 Issue No. 05 Monthly May 2026 ISSN No. 2456-4702 Rs. : 15/-



## యద్దనపూడి సులోచనారాణి

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253



# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522 034.

Mail : bhavaveena2024@gmail.com

Cell : 99499 29674, 79890 88274.

**BHAVAVEENA**
(SPECIAL MAGAZINE)
Journal - Arts, Literature, Culture and Language Study

Reffered Journal & Peer Reviewed Journals
ISSN No. : 2456-4702
RNI No. : APTEL/2003/12253

| | | |
|---|---|---|
| ముద్రణ | : | **మే - 2026** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/-** |
| కాపీలకు | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్ గుంటూరు జిల్లా, సెల్ : 94 94 660 509.** |




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

***Founder :***
Kolla Sri Krishnarao (Late)

***E-mail :***
bhavaveena2024@gmail.com

7989781963
9949929674
7989088274

# 135-14-716, Dwaraka Nagar,
12th Lane, Nagaralu, Guntur - 522034.

**Vol. 23 - Issue. 05 - May 2026 - Reffered Journal & Peer Reviewed Journals - Rs. : 15/-**
**| ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253 |**



**EDITORIAL BOARD**

*Honourable Editor*
**Dr. PITTA SANTHI**
*M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),Ph.D.*

*Chief Editor*
**Dr. PAYARDA NAGAIAH**
*M.A.(Tel), M.A(Pol-Sci).,M.Ed.,Ph.D.*
# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**ADVISORY COMMITTEE**

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Former Vice Chancellor,
   Dravidian University, Kuppam, A.P.
2. **Prof. G. Yohan Babu,** (Rtd.) M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Hyderabad Central University, Hydetabad, Telangana.
5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD, Dept. of Telugu
   Sri A.S.N.M. Govt. Degree College,
   Palakollu, West Godavari Dist., A.P.
7. **Prof. T. Rama Prasad Reddy**
   Dean, Faculty of Arts & Education,
   Yogi Vemana University, Kadapa, Andhra Pradesh.
8. **Dr. T. Swarupa Rani,** M.Sc., M.Ed., M. Phil., Ph.D.
   Principal,
   St.Joseph's College of Education for Women,
   Sambasivapet, Guntur, Andhra Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Prof. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI,
   Tamilnadu.

3. **Dr. D. SESHU BABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Dr. CHINTHAM PRAVEEN KUMAR**
HOD, Dept of Telugu
University Arts & Science College (UASC),
Kakatiya University Subedari - 506001
Hanumakonda,Warangal, Telangna.

7. **Prof. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Prof. N. Eswar Reddy,** M.A., PhD.
Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46,
Hyderabad, Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu
Central University, Gachibowli, Hyderabad,
Telangana.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Associate Professor, Dept. of Telugu
P.G. Centre, Gadwal,
Palamuru University,
Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narasapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur - 2. Cell : 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11 Brodipet, Guntur - 522 002,
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963, E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# యద్దనపూడి సులోచనారాణి

(జననం : 2 ఏప్రిల్ 1940 - మరణం : 18 మే 2018)

నవలా రాజ్యంలో రాణిగా గుర్తింపు పొందిన యద్దనపూడి సులోచనారాణి ప్రముఖ తెలుగు రచయిత్రి. కృష్ణా జిల్లా మొవ్వ మండలంలోని కాజాలో జన్మించిన సులోచనారాణి తాను పరిశీంచిన జీవితాలను కథా వస్తువులుగా తీసుకొని రచనలు చేశారు. ఆలుమగల మధ్య ప్రేమలు, మారుతున్న ప్రజల జీవిన విధానాలకు అనుగుణంగా కుటుంబాల్లో వచ్చిన మార్పులను ఆధారంగా ఆమె రచించిన కథలు పలు సినిమాలుగానే కాక టీవి సీరియల్స్‌గా మలచబడ్డాయి.

**నవలా రచయితగా సులోచనారాణి :**

సాహిత్యాన్ని పాఠకులకు అత్యంత చేరువగా తీసుకెళ్ళిన సాహితీ దిగ్గజం యద్దనపూడి సులోచనారాణి. సులోచనారాణి నవలల్లో ఆమె చుట్టూ ఉన్న సాధారణ మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాల జీవితాలుంటాయి. వాటిలో మట్టిలో మాణిక్యాల్లా నాయికా నాయకులు స్వంత వ్యక్తిత్వంతో ప్రకాశించే విధంగా పాత్రలు ఉంటాయి. ఈ ప్రపంచంలో ఆనందంగా ఉండేందుకు కొంత స్నేహం, కొంత అవగాహన, కొంత ప్రేమ, కొంత గౌరవం ఉంటే చాలని నిరూపించే విధంగా సులోచనారాణి నవలో పాత్రలు ఉంటాయి.

**పాఠకాదరణ పొందిన యద్దనపూడి నవలలు :**

సులోచనారాణి రచించిన నవలల్లో ఆగమనం, ఆరాధన, ఆత్మీయులు, అభిజాత, అభిశాపం, అగ్నిపూలు, ఆహుతి, అమర హృదయం, అమృతధార, అనురాగ గంగ, అనురాగ తోరణం, అర్థస్థిత, ఆశల శిఖరాలు, అవ్యక్తం, బహుమతి, బందీ, బంగారు కలలు, చీకట్లో చిరుదీపం, దాంపత్యవనం, హృదయగానం, జాహ్నవి, జలపాతం, జీవన సత్యాలు, జీవన సౌరభం, జీవన తరంగాలు, జీవనగీతం, జ్యోతి, కలల కౌగిలి, కీర్తి కిరీటాలు, కృష్ణలోహిత, మధురస్వప్నం, మనోభిరామం, మౌనభాష్యం, మౌన తరంగాలు, మీనా, మోహిత, మౌనపోరాటం, నీరాజనం, నిశాంత, ఒంటరి నక్షత్రం, పార్థు, ప్రేమదీపిక, ప్రేమలేఖలు, ప్రేమపీఠం, ప్రేమ సింహాసనం, ప్రియసఖి, రాధాకృష్ణ, రుతువులు నవ్వాయి, సహజీవనం, సంసార రథం, సౌగంధి, సెక్రటరీ, సీతాపతి, స్నేహమయి, సుకుమారి, శ్వేత గులాబీలు ముఖ్యమైనవి.

**సినిమాలుగా యుద్ధనపూడి నవలలు :**

మీనా, జీవన తరంగాలు, సెక్రటరీ, రాధాకృష్ణ, అగ్నిపూలు, చండీప్రియ, ప్రేమలేఖలు, బంగారు కలలు, విచిత్రబంధం, జై జవాన్, ఆత్మ గౌరవం

**డైలీ సీరియల్‌గా యుద్ధనపూడి నవల "గిరిజా కళ్యాణం" :**

యద్దనపూడి సులోచనారాణి వ్రాసిన "గిరిజా కళ్యాణం" నవల మూల ఆధారంగా 2006 నుండి 2008 వరకు 450 భాగాలుగా మా టీవిలో రాధ మధు డైలీ సీరియల్ ప్రసారమయ్యింది.

**కాలిఫోర్నియాలో మృతి చెందిన సులోచనారాణి :**

యుద్ధనపూడి సులోచనారాణి కాలిఫోర్నియాలోని కుపర్టినోలో 2018, మే 18న గుండెపోటుతో మృతిచెందారు.

- చీఫ్ ఎడిటర్

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | బాల వ్యాకరణం - ఔపవిభక్తిక విశేషాలు | - డా॥. పులపర్తి శ్రీనివాసరావు | 8 |
| 2. | సినిమా పాటల్లో తెలంగాణ భాష సమాలోచన | - డా॥. చింతల రాకేశ్ భవాని | 17 |
| 3. | వేమన కవిత్వంలో యోగ విఘ్నాలను అధిగమించే మార్గాలు | - డా॥. ఎమ్. ఎన్. కృష్ణవేణి | 23 |
| 4. | తెలంగాణ వర్తమాన గ్రామీణ నేపథ్య కథలు | - డా॥. జ్యోతి అనుగుల | 31 |
| 5. | శ్రీమదాంధ్ర మహాభారతం : భీష్మ పర్వం - భీష్ముని పాత్ర | - డా॥. గుబ్బల సత్యశ్రీ | 36 |
| 6. | ఆధునిక కవిత్వంపై స్వాతంత్రోద్యమ ప్రభావం | - డా॥. సూరేపల్లి గోదావరి | 42 |
| 7. | స్త్రీవాదోద్యమ సిద్ధాంతకర్త మల్లాది సుబ్బమ్మ - పరిశీలన | - డా॥. డి. సత్యలత | 48 |
| 8. | తెలుగు పత్రికలు - భారత స్వాతంత్ర్యోద్యమం : పరిశీలన | - డా॥. అర్జునరావు లక్కరాజు | 54 |
| 9. | తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో జానపద కళల ప్రత్యేకత | - డా॥. సి.హెచ్. శేఖర్ | 58 |
| 10. | తెలంగాణ శ్రామిక వర్గ పోరాటాల్లో పాట వైవిధ్యం | - డా॥. ఇలాసాగర్ ప్రభాకర్ | 64 |
| 11. | వరంగల్ జిల్లా జానపద గేయ కథలో - భీరయ్య గేయకథ | - డా॥. ధారవత్ సంతోష్ కుమార్ | 71 |
| 12. | ఆనందరావు పట్నాయక్ కథలలో మానవీయ విలువలు - విశ్లేషణ | - డా॥. తోట రామకృష్ణ | 79 |
| 13. | కసిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్యాత్మిక సంపాదకీయ వ్యాసాలు - విశ్లేషణ | - జి. నరేందర్ | 83 |
| 14. | బంజారాల గేయ సాహిత్యం సాంస్కృతిక జీవనం | - నునావత్ నాగలక్ష్మి | 89 |
| 15. | భక్తి, జ్ఞాన, వైరాగ్యాల సమ్మేళనం - ధూర్జటి - శ్రీకాళహస్తీశ్వర శతకం | - మాచిరాజు దుర్గ | 96 |
| 16. | దాక్షిణాత్య యక్షగానాలు - విహంగ వీక్షణం (తంజావూరు, కర్ణాటక, కూచిపూడి యక్షగానాలు) | - డోలి ఝాన్సీ | 101 |
| 17. | తెలుగు పంచ మహాకావ్యాలలో స్త్రీ పాత్రలు | - నడింపల్లి నీరజ | 106 |

| | | |
|---|---|---|
| 18. చిత్తూరు జిల్లా రచయిత్రుల స్త్రీ వాద కథలు - స్త్రీ జీవిత చిత్రణ | - టి. మంజుల | 113 |
| 19. కడుపు కోత కథా సంపుటి - సామాజిక విశ్లేషణ | - ఎస్. గాయత్రి | 119 |
| 20. ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారి నవలలు - దళిత స్త్రీ పోరాట గాథలు | - డా॥. సురేఖ దుగులూరు | 124 |
| 21. అక్షర శిల్పం - నమో శిల్పి : ఒక సమీక్ష | - బోరవెల్లి పవన్ కుమార్ | 130 |
| 22. ఎన్నార్ పాటలలో సమాజ పరివర్తకులు | - మఠంస్వామి రేవప్పయ్య | 132 |
| 23. వడలి రాధాకృష్ణ కథలు - స్త్రీ సమస్యల చిత్రణ | - నేరెళ్ల ఆంజనేయులు<br>- ఆచార్య జ॥రా అప్పారావు | 142 |
| 24. తెలంగాణ కథా సాహిత్యం - కులవృత్తుల విధ్వంసం | - జి. ప్రేమలత | 149 |

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-4 | April 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# బాల వ్యాకరణం - ఔపవిభక్తిక విశేషాలు



డా॥. పులపర్తి శ్రీనివాసరావు
అతిథి అధ్యాపకులు, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.
చరవాణి : 8309742248

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహం :**

'బాలవ్యాకరణము' అనేది 19వ శతాబ్దంలో పరవస్తు చిన్నయ్య సూరి రచించిన ప్రామాణిక తెలుగు వ్యాకరణ గ్రంథం. ఇది శాస్త్రీయ తెలుగు నియమాలను నిర్వచిస్తుంది. ఇది వ్యావహారిక తెలుగు కంటే లాంఛనప్రాయమైన భాషపై దృష్టి సారిస్తూ, తెలుగుకు ప్రామాణిక వ్యాకరణ గ్రంథంగా విస్తృతంగా పరిగణించబడుతుంది. ఇలాంటి వ్యాకరణంలో ఉన్న పది పరిచ్ఛేదాలలో ఆచ్ఛిక పరిచ్ఛేదం ఒకటి. ఈ పరిచ్ఛేదంలో ఔపవిభక్తిక ప్రకరణం కూడా ప్రాధాన్యత గల అంశం. ముఖ్యంగా ఔపవిభక్తికాలుగా బాలవ్యాకరణంలో చిన్నయసూరి చెప్పిన ఇ-టి-తి వర్ణాలను గురించి విపులంగా చర్చించాడు. ఈ ఔపవిభక్తికాల గురించి పూర్వగ్రంథ పరిశీలన చేసినపుడు, వికృతివివేకంలో "యత్రైతే తత్ర తత్సంజ్ఞా నామ్నామన్యత్ర చాన్యథా"(వికృతివివేకం, సంధి.పరిచ్ఛేదం:31) అని నిర్వచించబడింది. అలాగే ఆంధ్ర శబ్దచింతామణిలో "ఔపవిభక్తిక నామ్నాయత్వం స్యాత్సప్తమీ తృతీయార్థే"(ఆంధ్ర.శ.చిం.అజన్త ప్రకరణం:20) అని వివరించబడింది. ఇలాంటి ఔపవిభక్తికాలగురించి పలు పరిశోధనలు కూడా జరిగాయి. వాటిలో ఆంధ్రవిశ్వవిద్యాలయంలో 'బాలవ్యాకరణానికి సమీపకాలిక వ్యాకరణాలు పరిశీలన' అని 2012లో డా.డి.ప్రవీణ పరిశోధన పూర్తి చేశారు. దీనిలో ఒక ఉపశీర్షికలో వీటి ప్రస్తావన ఉంది. అలాగే హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సి.హెచ్.వి.ఆర్.ఎస్.అనే పరిశోధకులు 'సూరి బాలవ్యాకరణేతర వ్యాకరణాలు-ఒక పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధనలో కూడా సూచన ప్రాయంగా ఔపవిభక్తికాల గురించి ప్రస్తావన ఉంది. వీటన్నిటిని ఆధారం చేసుకుని బాలవ్యాకరణంలో చిన్నయసూరి వివరించిన ఔపవిభక్తిక విశేషాలను ఈ వ్యాసంలో పరిశీలించడమైంది.

**కీలక పదాలు :**

వికృతివివేకం, స్నాతకోత్తరస్థాయి, టింత్యాదులు, పరిచ్ఛేదం, సుబన్తం,బ ప్రాతిపదిక, క్రియావిభక్తి, ప్రాయకంబు,పర్యాయం, తఱచుగ, బహుళము, ఆగమము, ఆదేశము మొదలైనవి.

## ఔపవిభక్తికాలు – విశేషాలు :

### 1.0 ఉపోద్ఘాతం :

పరవస్తు చిన్నయ సూరి ఆంధ్రవ్యాకరణ రచన కోసం 18 సంవత్సరాలు నిరంతర నిర్విరామ కృషి చేసి, తనకంటే ముందు వచ్చిన వ్యాకరణాలను క్షుణ్ణంగా పరిశీలించి, తాను రాసిన నాలుగు వ్యాకరణాలను సైతం మార్పులు చేసుకుంటూ, మెరుగులు దిద్దుకుంటూ చివరకు పండితలోకం అంగీకరించే, ఆమోదించే వ్యాకరణం రాయగలిగాడు. అదే 'బాలవ్యాకరణం'. ఇది 1858 లో ప్రథమ ముద్రణ పొందింది. పాఠశాల స్థాయి నుండి స్నాతకోత్తరస్థాయి వరకు బాలవ్యాకరణాన్ని చదవనివారుండరు, అధ్యయనం చేయనివారుండరు. అలాగే ఇప్పటి వరకూ వచ్చిన తెలుగు వ్యాకరణాలపై బాలవ్యాకరణ ప్రభావం లేని వ్యాకరణం లేదు అంటే అతిశయోక్తి లేదు. బాలవ్యాకరణానికి వచ్చినన్ని వ్యాఖ్యానాలు మరి ఏ వ్యాకరణానికి రాలేదంటే దాని విశిష్టత ఏమిటో అర్థమౌతుంది. తెలుగులో ఎన్ని వ్యాకరణాలు వచ్చినప్పటికీ 19 వ శతాబ్దంలో ప్రతిభావంతులుగా పేరుప్రఖ్యాతులున్న తెలుగు పండితులలో చిన్నయ సూరి రచించిన 'బాలవ్యాకరణం' మొదటి వరుసలో ఉంటుంది. దీన్ని పరిశీలిస్తే ఆయన వ్యాకరణ పాండిత్యం అనన్యసామన్యమైందని అర్థమౌతుంది. ఆయన ఆలోచనా విధానం వ్యాకరణంలో అనేక ప్రయోగాలను సాధించడానికి మార్గం వేసింది అనడంలో ఏ విధమైన సందేహం లేదు.

### 1.1 ఔపవిభక్తికం అనగా :

ఉప అంటే సమీపం. ఉప విభక్తి అంటే విభక్తికి సమీపంగా ఉండేదని అర్థం. ఇ-టి-తి వర్ణాలు ఔపవిభక్తులని "ఇ టి తి వర్ణంబులు వక్ష్యమాణంబు లౌప విభక్తికంబులు" (బాల.ఆచ్ఛిక. సూ.-28)అనే సూత్రంలో వివరంగా ఔపవిభక్తికాలు గురించి చర్చించారు సూరి. ఈ సూత్రం కింద 'విభక్తి నిమిత్తకంబులయి యాదేశాగ మాత్మకంబు లయిన ఇ-టి-తి వర్ణంబు లౌప విభక్తికంబు లనంబడు' అని వృత్తినిచ్చారు. అంటే విభక్తులు పరమైనప్పుడయ్యేది ఉపవిభక్తి అన్నమాట. ఔపవిభక్తికాలు చేరే శబ్దాలను కూడ ఔపవిభక్తికాలంటారు.

'ఉత్తర పదంబగుచోటు శబ్దము 'టా' క్షరమునకు లోపంబు విభాషనగు' ఇక్కడ చోటు శబ్దం ఔపవిభక్తికం. కాబట్టి దీని సప్తమీకి అత్వమాదేశమవుతుంది. ఆచోటు + ఇందు - ఆచోటి + అ - ఆచోట.

ఔపవిభక్తికాలు రెండు రకాలు.

1. ఆదేశాత్మకములు
2. ఆగమాత్మకములు.

ఆదేశమునకు ఉదా : త్రాడు + ను - త్రాటిని

ఆగమమునకు ఉదా : గోయి + ను - గోతిని.

ఇది సంక్షిప్తంగా ఔపవిభక్తిక స్వరూపం.

### 1.2 ఔపవిభక్తికాలు–నిర్వచనాలు :

ఔపవిభక్తికాల గురించి ప్రాచీన వ్యాకరణ గ్రంథాలను పరిశీలించినపుడు అనేక విషయాలు ద్యోతకమవుతాయి. ఔపవిభక్తికాలు నామాలకే చేరుతాయిగాని పదాలకు కాదని తెలుస్తుంది. అలాగే ఔపవిభక్తిక సంజ్ఞను లాక్షణికులు ప్రాతిపదికలకే చేర్చారు.

వికృతి వివేకంలో అథర్వణాచార్యులు- "విభక్త్యోచ సమాసేస్యుః అన్యే2 ప్యౌప విభక్తికాః" (వికృతి వవేకం, అజన్త ప్రకరణం:20) అని నిర్వచించారు.

పుదూరి సీతారామశాస్త్రి ప్రశ్నోత్తరాంధ్ర వ్యాకరణంలో చింతామణిని అనుసరించే ఔపవిభక్తికాలను వివరించారు. టింత్యాదులు అని పేర్కొని "టి,ంటి,తి,తిన్ మొదలైనవి"(ప్రశ్నాంధ్ర వ్యాకరణం,పుట:25). ఈయన ఎక్కడా ఔపవిభక్తిక సంజ్ఞను ఉపయోగించలేదు.

రావిపాటి గురుమూర్తి శాస్త్రి "తెలుగు భాషయందు తుదనున్న వర్ణమునకు ఏ-తటమునందు టి-ంటి అనునవి మొదలుగా ఁగల వర్ణములు వచ్చును."(తెనుఁగు వ్యాకరణము, రావిపాటి గురుమూర్తి శాస్త్రి,పుట:43).

వేదం వేంకటరమణ శాస్త్రి ఔపవిభక్తికాలను గురించి సుబన్త పరిచ్ఛేదంలో అచ్చతెనుఁగు ప్రకరణంలో తెలిపారు. "టి-ంటి-ఇ-తి మొదలగు వర్ణంబులౌప విభక్తికంబులనంబడు"(లఘువ్యాకరణము, అంశ.71)అని నిర్వచించారు. చిన్నయసూరి భావంతో ఔపవిభక్తికాల గురించి వేదంవారు ఏకీభవించారు.

శబ్దలక్షణ సంగ్రహంలో తృతీయ పరిచ్ఛేదంలో చిన్నయసూరి "టింత్యాదులౌప విభక్తికంబులు, నామంబుల రుల్వాదులకు విభక్తి సమాసంబుల బహు ప్రకారంబులం జూపడియెడి"(శబ్దలక్షణ సంగ్రహం,తృతీయ ప్రకరణం, పుట:205)అని నిర్వచించి బాలవ్యాకరణంలో ఇ-టి-తి వర్ణాలనే ఔపవిభక్తికాలుగా తెలియజేశాడు.

### 1.3 బాల వ్యాకరణం – ఔపవిభక్తిక విశేషాలు :

బాలవ్యాకరణంలోని ఆచ్ఛిక పరిచ్ఛేదంలో ప్రత్యేకించి ఔపవిభక్తిక ప్రకరణం చేర్చి వాటిని విపులంగా చర్చించాడు చిన్నయసూరి. దీనిలో భాగంగా ఆయన అనుకున్న ఇ-టి-తి అనే ఔపవిభక్తికాల గురించిన సూత్రాలను పరిశీలించడమైంది.

ఔప విభక్తికాలు "ఇవి ద్వితీయయాద్యేక వచనంబులు పరంబులగునపుడు నామంబులకుం గొన్నింటికిం బ్రాయికంబుగ నగు" (ఆచ్ఛిక-29) అనుట వల్ల ద్వితీయాది విభక్తులు ఏకవచనాలు పరమైనప్పుడే కొన్ని ప్రాతిపదికలకు తరచుగా వస్తాయని సూత్రార్థం. అయితే చింతామణి వికృతి వివేకాలలో "టి, ంటి" వంటి వర్ణాలు అనేకం కలవని 'ప, ర్తి' మొదలైనవి కూడా ఔపవిభక్తికాలు అనడం చేత సూరి ఈ ఇ టి తి అనే మూడింటికకే ఔపవిభక్తికాలనే సంజ్ఞను తెలియజేశాడు. 'ంటి' వర్ణాన్ని మాత్రం ప్రక్రియలో నిరూపించాడు. సూరి సూత్ర వృత్తిలో 'ద్వితీయైక వచనంబు పరంబగునపుడౌప విభక్తికంబులు రావని కొందఱు వక్కాణించిరి. అయ్యది అక్ష్యలక్షణ విరుద్ధంబగుటం జేసి యనాదరణీయంబు' అని తెలిపారు. .

### 1.3.1 ఔపవిభక్తిక వర్ణం – 'ఇ' :

ఔప విభక్తికాలైన ఇ-టి-తి వర్ణాలు ఆగమాదేశాది విధాలుగా వచ్చినట్లు ఆయా సూత్రాల్లో చెప్పబడింది. అందులో మొదటిది 'ఇ' వర్ణం.

"ఊరు మొదలగు వాని కిత్వంబగు"(ఆచ్ఛిక-30) అని సూత్రం. ద్వితీయాది ఏకవచనములు పరమైనచో 'ఊరు' మొదలైన శబ్దముల చివరి అచ్చుకు ఇత్వం('హ్రస్వ' ఇకారం) వస్తుందని సూత్రార్థం.

ఉదా : ఊరు + ను = ఊరిని

'ఊరిని' అనే ప్రయోగంలో, 'ఊరు' అనేది ప్రాతిపదిక.

నువర్ణం ద్వితీయ"(తత్సమం -2) అనే సూత్రం ప్రకారం-

ఊరు+ను

ప్రస్తుత సూత్రం(ఆచ్ఛిక-30) చేత-

ఊర్ + ఇ+ ను = ఊరి +ను అవుతుంది.

"ఇకారంబు మీఁది కునువు క్రియావిభక్తుల యుత్తంబున కిత్వంబగు"(తత్సమ-26) అనే సూత్రం చేత-

'ఊరిని' అనే రూపమేర్పడుతుంది.

ఇలాగే, కాలు + ను = కాలిని

మ్రాను + ను = మ్రానిని

నోరు + ను = నోరిని

చోటు + ను = చోటిని ఇత్యాదులు ఇలాంటివే.

**1.3.2 ఔపవిభక్తిక వర్ణం–'టి' :**

ఔప విభక్తికాల్లో రెండవదైన 'టి' వర్ణం గురించి "టి వర్ణంబు గొన్నింటి యంతాక్షరంబున కాదేశంబును, గొన్నింటి కంతాగమంబును, గొన్నింటికిం బర్యాయంబున రెండును బ్రాయికంబుగనగు" (ఆచ్ఛిక-31) అని చెప్పబడింది. 'టి' వర్ణం కొన్ని శబ్దాల చివరి వర్ణానికి తరచుగా ఆదేశంగాను, కొన్నింటికి తరచుగా ఆగమంగాను, మరిగొన్ని చోట్ల తరచుగా ఆగమాదేశాలుగాను పర్యాయంగా వస్తుంది.

ఆదేశానికి ఉదా : త్రాటిని

'త్రాడు' అనేది ప్రాతిపదిక

"నువర్ణంబు ద్వితీయ" చేయగా-

త్రాడు + ను

ప్రస్తుత సూత్రం ప్రకారం 'టి' వర్ణం ఆదేశంగా వస్తే -

'త్రాటి+ను' అవుతుంది.

"ఇకారంబు మీఁది కునువు క్రియావభక్తుల యుత్తంబున కిత్వంబగు"(తత్సమ-26) అనే సూత్రం చేత ఇత్వం చేస్తే -

'త్రాటిని' అనే రూపమేర్పడుతుంది.

ఇలాగే కాడు+ను= కాటిని, నోరు + ను= నోటిని, ఏఱు+ను = ఏటిని మొదలైనవి.

ఆగమానికి ఉదా:- 'అన్నిటిని'

'అన్ని' -ప్రాతిపదిక

అన్ని + ను 'నువర్ణంబు ద్వితీయ'(తత్సమ-2) చేయగా-

ప్రస్తుత సూత్రం ఆచ్ఛిక-31చే 'టి' వర్ణం ఆగమంగా వస్తే-

అన్ని+టి+ను = అన్నిటి+ను అవుతుంది.

ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. "హ్రస్వము మీఁది టివర్ణంబునకు ముందు పూర్ణబిందువు బహుళముగానగు"( ఆచ్ఛిక-32) అనే సూత్రం చేత టివర్ణానికి ముందు పూర్ణబిందువు రావాలి. అక్కడ బహుళము అనటం చేత పూర్ణబిందువు రాకపోతే, "ఇకారంబు మీఁది కునువు క్రియావిభక్తుల యుత్తంబున కిత్వంబగు" (తత్సమ-26) అనే సూత్రం చేత- 'అన్నిటిని' అనే రూపమేర్పడుతుంది.

ఇలాగే ఎనిమిది- ఎనిమిదిటిని, వేయి -వేయిటిని ఇత్యాదుల గమనించదగినవి.

ఆగమాదేశాలు పర్యాయంగా, ఉదా: ఏటిని, ఏమిటిని.

'ఏమి' అనేది ఆదేశంలోను, ఏటిని' అనేది ఆగమంలోను చెప్పబడింది.

ఏటిని, ఏమిటిని- ఏమి అనేది ప్రాతిపదిక

ఏమి + ను (తత్సమం-2)

తుది అక్షరానికి 'టి'వర్ణం ఆదేశమైతే -

ఏటి + ను

తత్సమ -26 "ఇకారంబు మీఁది..." అనే సూత్రం చేత-

'ఏటిని' అనే రూపమేర్పడుతుంది.

అలాగే ఏమి+ను అన్నప్పుడు, ఏమి శబ్దానికి చివర టివర్ణం ఆగమమైనచో-

ఏమిటి+ను అవుతుంది.

తత్సమ -26 ఇకారంబు మీఁది అనే సూత్రం చేత-

'ఏమిటిని' అనే రూపమేర్పడుతుంది.

ఇదేవిధంగా, పగలు- పగటిని, పగలిటిని మొదలైనవి.

బాలవ్యాకరణంలో 'టి' వర్ణానికి ముందు పూర్ణ బిందువు వచ్చేందుకు రెండు సూత్రాలు చెప్పబడ్డాయి. "హ్రస్వము మీఁది టివర్ణంబునకు ముందు పూర్ణబిందువు బహుళముగానగు"(ఆచ్ఛిక-32) అని సూత్రం. ఈ సూత్రంలో బిందువు పదంలోని ఏ హ్రస్వం తరవాత 'టి' వర్ణానికి ముందు వస్తుందో చెప్పలేదు. కాబట్టి పదంలో హ్రస్వం ఎక్కడ ఉన్నా దాని మీద 'టి' వర్ణానికి ముందు పూర్ణ బిందువు బహుళంగా వస్తుందని గ్రహించాలి.

ఉదా : 'అన్నిటిని'.

ఈ ఉదాహరణలో రెండవ వర్ణం హ్రస్వం. దాని మీద 'టి' వర్ణానికి ముందు బిందువు వచ్చి 'అన్నింటిని' అవుతుంది. ఈ పూర్ణ బిందువు బహుళం కనుక రానిచో 'అన్నిటిని' అని కూడా ఉంటుంది.

అలాగే ఎనిమిదిటిని-ఎనిమిదింటిని, పగటిని - పగంటిని మొదలైనవి.

అలాగే "పదాద్యంబగు హ్రస్వంబు మీఁది టివర్ణంబునకు ముందు పూర్ణబిందువగు"(ఆచ్ఛిక-33) అనే సూత్రంలో పదాది హ్రస్వానికి తర్వాటి 'టి' వర్ణానికి ముందు పూర్ణ బిందువు నిత్యంగా వస్తుందని చెప్పబడింది.

ఉదా : కంటిని

కన్ను - ప్రాతిపదిక.

కన్ను+ ను (తత్సమ-2) ప్రకారం.

దీనికి ఆచ్ఛిక -31 సూత్రం ప్రకారం 'టి' వర్ణం ఆదేశంగా వస్తే-

కటి+ ను; ను వర్ణానికి ఇత్వం వచ్చి 'కటిని' అని కాగా, ప్రస్తుత సూత్రం (ఆచ్ఛిక-33) చేత తొలి వర్ణం మీది 'టి' వర్ణానికి ముందు పూర్ణ బిందువు వచ్చి 'కంటిని' అనే రూపమేర్పడుతుంది.

అలాగే మిన్ను+ ను=మిటిని-మింటిని, ఇల్లు + ను = ఇటిని- ఇంటిని ఇత్యాదులు గమనించాలి.

టి-తి వర్ణాలు పరమైతే దానికి ముందున్న ఉత్వానికి ఇత్వం వస్తుందని "టితివర్ణంబులు పరంబగునపు డుత్వంబున

కిత్వంబగు''(అచ్చిక-36) చెప్పబడింది. ఆగమములగు టితి వర్ణములు పరమైతే ఉత్వమునకు ఇత్వం వస్తుందని సూత్రార్థం.

ఉదా : రెండిటికి

'రెండు'- ప్రాతిపదిక

''కు-యొక్క- లోపల : షష్ఠి''(తత్సమ-6) అనే సూత్రం ప్రకారం షష్ఠి -కు వర్ణం చేస్తే-

రెండు + కు అవుతుంది.

అచ్చిక -31 సూత్రం ప్రకారం దానికి 'టి' వర్ణం ఆగమంగా చేస్తే-

రెండు + టి + కు అని కాగా,

ప్రస్తుత సూత్రం (అచ్చిక-36) ప్రకారం టివర్ణం పరమైంది. కనుక దానికి ముందున్న 'రెండు'లో ఉకారానికి ఇత్వం వచ్చి-

రెండి+టి+కు అని ఏర్పడుతుంది.

దీనికి ''ఇకారంబు మీఁది...''(తత్సమం-26) సూత్రం చేత ఇత్వం వస్తే-

'రెండింటికి' అవుతుంది.

ఇలాగే మూడు= మూడుటికు-మూఁడిటికి. నాలుగిటికి, పగలిటికి, మొదలిటికి, పెక్కిటికి ఇత్యాదులు గమనించాలి.

ఇదే సూత్రం దగ్గర 'కొండకచో నుత్వంబున కిత్తంబు చూపట్టదు' అను వివరణ వాక్యం వలన ఉత్వానికి ఇత్వం రావలసి ఉన్నా, అది నిషేధింపబడింది.

ఉదా : నెత్తురు-నెత్తుటికి మొదలైనవి.

టివర్ణానికి సంబంధించి మరో సూత్రం ''టివర్ణంబు పరంబగునపుడు క్రిందు, మీఁదు, ముందు, పువర్ణంబుల కత్వంబగు'' (అచ్చిక-37) అని చెప్పబడింది. టివర్ణం పరమైతే క్రిందు, మీదు, ముందు మరియు పువర్ణంలోని ఉత్వానికి అత్వం నిత్యంగా వస్తుందని ఈ సూత్రార్థం.

ఉదా : 'క్రిందటిని'

'క్రిందు' - ప్రాతిపదిక

క్రిందు+ను 'నువర్ణంబు ద్వితీయ'(తత్సమ -2)

అచ్చిక -31 చేత టివర్ణం ఆగమంగా చేస్తే-

'క్రిందు+టి+ను' అవుతుంది.

ప్రస్తుత సూత్రం (అచ్చిక -37)చేత 'క్రిందు'లోని ఉత్వానికి అత్వం చేయగా-

'క్రింద+టి+ను' అవుతుంది.

''ఇకారంబు మీఁది కునువు....''(తత్సమ-26)ప్రకారం ఉత్వానికి ఇత్వం వచ్చి-

'క్రిందటిని' అనే రూపమేర్పడుతుంది.

ఇలాగే మీఁదు=మీఁదుటిని-మీఁదటిని, ముందు=ముందుటిని- ముందటిని ఇత్యాదులు గమనించాలి.

**1.3.3 ఔప విభక్తిక వర్ణం 'తి' :**

ఔప విభక్తికాల్లో చివరి వర్ణం 'తి'. దీని గురించి కూడా బాలవ్యాకరణంలో వివరిస్తూ "అఱ్ఱు మొదలగు శబ్దముల కంతాగమంబు తివర్ణంబును రేపంబున కొక్కటికి లోపంబునగు"(ఆచ్ఛిక-34) అని సూత్రీకరించాడు. 'అఱ్ఱు' మొదలైన శకట రేఫ ద్విత్వంతో ఉన్న శబ్దాలకు చివర ఆగమంగా 'తి' వర్ణం వస్తుంది. అలాగే తివర్ణం వచ్చినపుడు శకట రేఫ ద్విత్వంలో ఒకటి లోపిస్తుంది అని దీని అర్థం.

ఉదా : 'అఱ్ఱితిని'

'అఱ్ఱు'- ప్రాతిపదిక

'ను వర్ణంబు ద్వితీయ' చేస్తే-

అఱ్ఱు+ను అని అవుతుంది.

ప్రస్తుత సూత్రం(ఆచ్ఛిక-34) చేత తివర్ణం, శకట రేఫ, ద్విత్వంలో ఒకటి లోపిస్తే-

'అఱు+తి+ను' అవుతుంది. "టితివర్ణంబులు పరంబగునపు డుత్వంబున కిత్వంబగు"(ఆచ్ఛిక-36) అను దాని ప్రకారం-

'అఱి+తి+ను' అని కాగా,

"ఇకారంబు మీఁది కునువు క్రియావిభక్తుల యుత్వంబున కిత్వంబగు"(తత్సమ-26) అను సూత్రం చేత

'అఱితిని' అనే రూపమేర్పడుతుంది.

ఇదే విధంగా కఱ్ఱు- కఱితిని, గొఱ్ఱు- గొఱితిని, మిఱ్ఱు-మిఱితిని మొదలైనవి ఏర్పడతాయి.

'తి' వర్ణకం గురించి మరో సూత్రంలో "విభక్తి పరంబగునపుడు గోయి ప్రభృతుల తుది యక్షరంబు తివర్ణంబగు"(ఆచ్ఛిక-35)అని చెప్పబడింది. విభక్తి ప్రత్యయం పరమైతే 'గోయి' మొదలైన శబ్దాల చివరి వర్ణం స్థానంలో 'తి' వర్ణం ఆదేశంగా వస్తుందని సూత్ర వివరణ.

ఉదా : గోయి-గోతులు

'గోయి' -ప్రాతిపదిక

దీనికి 'లు వర్ణంబు బహువచనంబు"(తత్సమ-12) చేస్తే-

గోయి+లు అని అవుతుంది.

కాగా ప్రస్తుత సూత్రం చేత తివర్ణాదేశం వస్తే-

'గోతి+లు' ఏర్పడుతుంది.

దీనికి "ఇత్తునకు బహువచనంబు పరంబగునపు డుత్వంబగు"(తత్సమ-45) అను సూత్రంచే-

'గోతులు' అనే రూపమేర్పడుతుంది.

ఇలాగే - చేయి- చేతులు-చేతిని, నూయి- నూతులు-నూతిని మొదలైనవి.

ఈ సూత్రంలో ఇచ్చిన ఉదాహరణలన్నీ 'యి' వర్ణం చివర గల శబ్దాలే. దీనిని బట్టి 'యి' వర్ణం చివర గల శబ్దాలకే విభక్తి పరమైతే 'యి' వర్ణానికి తివర్ణం ఆదేశంగా వస్తుంది అని గ్రహించాలి. అదేవిధంగా 'యి' వర్ణాంత శబ్దాలన్నీ దీర్ఘం పూర్వమున్నవేనని ఉదాహరణలను బట్టి తెలుసుకోవాలి.

తరవాత "ఔపవిభక్తికముల తృతీయా సప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగా నగు"(అచ్చిక-38) అని సూత్రం.

ఔప విభక్తికాల మీది తృతీయ సప్తమీ విభక్తులకు హ్రస్వ అకారాదేశం బహళంగా వస్తుందని దీని అర్థం. ఉదా: 'గోరను గీఱెను'.

గోరు - ప్రాతిపదిక.

గోరు +చేత (తత్సమ-3) చేత,

గోరి+చేత (అచ్చిక -30) సూత్రం చేత,

ప్రస్తుత సూత్రం ప్రకారం తృతీయా విభక్తికి అత్వం ఆదేశంగా వస్తే-

'గోరు+అ+గీఱెను' అని కాగా

'అపదాది స్వర సంధి జరిగి'(సంధి-11)

'గోరను గీఱెను' అవుతుంది.

ఇదేవిధంగా ఊరి+అందును+ఉన్నాడు, ఊరునున్నాడు. గొడ్డలి+చేత+ నఱికెను=గొడ్డలినఱికెను, ఇంటి+అందు+లేడు= ఇంటలేడు ఇత్యాదులు గమనించదగ్గవి.

**1.4 ముగింపు :**

ఈవిధంగా బాలవ్యాకరణంలో ఔపవిభక్తికాల గురించి వివరించబడింది.అయితే సంప్రదాయ వ్యాకరణాలలోనే ఈ సంజ్ఞ కనిపిస్తుంది కానీ, స్వతంత్ర వ్యాకరణాలలో ఎక్కడా కనిపించదు. వీటి గురించి పరిశీలన చేసినప్పుడు, ఒకప్పుడు ఔపవిభక్తికాలుగా ఉన్న పదాలు తరువాత కాలంలో అనౌపవిభక్తికాలుగాను, ఒకప్పుడు అనౌపవిభక్తికాలుగా ఉన్న పదాలు తరువాత ఔపవిభక్తికాలుగా మారడం గమనించాల్సిన విషయం అని అర్థమవుతుంది. ఇంకా చెప్పాలంటే, బాలవ్యాకరణంతో పాటు ఆ సమకాలీన వ్యాకరణాలను పరిశీలించినపుడు ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది. ఔపవిభక్తికాలు అర్థవంతాలు కాకపోవడం వల్ల వర్ణములేకాని, వర్ణకాలు కావు అని అర్థమయ్యింది. అంతేకాదు బాలవ్యాకర్త ఔపవిభక్తిక సూత్రాలను పరిశీలించినపుడు మరింత స్పష్టమైంది. ఔపవిభక్తికాలను లాక్షణికులు వర్ణకాలుగా ఎక్కడా చెప్పలేదు కూడా. అలాగే ఇవి వేటికి చేరుతాయి? వేటికి చేరవు? అనేది గుర్తించుకోవాలే తప్ప, గుర్తుపట్టే మార్గాలు చాలా తక్కువ అని అర్థమైంది. ఈ క్రమంలో నిఘంటువులు దేశ్యపదాలలో ఏవి ఔపవిభక్తికాలో ఏవి కాదో సూచించడం మంచి పరిణామం. మొత్తానికి బాలవ్యాకర్త వివరించిన ఔపవిభక్తిక విశేషాలను పరిశీలించిన తరువాత 'ప్రయోగమూలం వ్యాకరణం' అనేది ఒకటి స్పష్టమయితే, మరొకటి ఆంధ్ర శబ్దచింతామణి చెప్పినట్టు లోకవ్యవహారాన్ని బట్టి ఇవన్నీ ఏర్పడ్డాయని గ్రహించవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. అథర్వణాచార్యుడు, వికృతి వివేకము(అథర్వణకారికావళి), కవిజనమండన సహితము, వావిళ్ళప్రతి,1955.
2. చిన్నయ సూరి, పరవస్తు, బాలవ్యాకరణము,స్టూడెంట్స్ ఫ్రెండ్స్ పబ్లిషర్స్, నరసారావుపేట, 1911.
3. నాగభూషణం, డాక్టర్ అంబపూడి, బాలవ్యాకరణము, అర్థదీపికావ్యాఖ్య, మోహన్ పబ్లికేషన్స్, కోటగుమ్మం, రాజమహేంద్రవరం.
4. రామకృష్ణారావు, వంతరాం, బాలవ్యాకరణ ఘంటాపథము(12 వ ముద్రణ), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,2014.

5. వెంకటరమణశాస్త్రి, దువ్వూరి, రమణీయం, ఆంధ్రా యూనివర్సిటీ ప్రెస్, వాల్తేరు, 1964.
6. వెంకటేశ్వర్లు, ఆచార్య బూదాటి, సంప్రదాయ తెలుగు వ్యాకరణాలు, తెలుగు అకాడమి ప్రచురణ,2014.
7. శ్రీరామచంద్ర, పుల్లెల "లఘు సిద్ధాన్త కౌముది" (ఆంధ్రభాషా వ్యాఖ్య) దక్షిణ భారత ప్రెస్, ఖైరతాబాద్, హైదరాబాద్, 500 007.
8. సీతారామాచార్యులు, బహుజనపల్లి, ప్రౌఢవ్యాకరణము, విశాలాంధ్ర పబ్లిషర్స్, విశాఖపట్నం,1999.

★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-4 | April 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Link : https://www.bhavaveena.com/

# సినిమా పాటల్లో తెలంగాణ భాష సమాలోచన



డా॥. చింతల రాకేశ్ భవాని
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇబ్రహీంపట్నం,
రంగారెడ్డి జిల్లా. మొబైల్ నెంబర్ : 92466 07551,
ఈమెయిల్ ఐడి : rakeshbhavani125@gmail.com.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహం :**

పలుకుబడిలో సొగసు నింపుకున్న తెలంగాణ భాష తెలుగు సినిమా పాటల్లో అరుదుగా కనిపించింది. ఒకప్పుడు ఒకటో రెండో ఉర్దూ పదాలు ఎక్కడైనా వస్తే అదే తెలంగాణ భాషగా భావించబడేది. జోరు, హుషారు, షికారు, పరేషాను మొదలైన పదాలే తెలంగాణ పదాలుగా చలామణి అయ్యాయి. అచ్చతెలుగుతనాన్ని పలికించే తెలంగాణ మాటలు ఎక్కడా వినిపించలేదు. కానీ ప్రస్తుతం పరిస్థితులు మారిపోయిన తరుణంలో, సినిమాలలో "కొమురం భీముడో" వంటి పాటలు వస్తున్నాయి. ప్రేక్షకుల్ని ఆకర్షించడానికి కొత్తదనాన్ని అందించడానికి తెలంగాణ భాష ఆవశ్యకమయ్యింది.

**కీలకాంశాలు :**

కామ కళ, కంకణాలు, అగ్నిహోత్రం, శుక్తిమతి, కోల హాలుడు, శృంగార నైషదం.

తొలి తెలుగు సినిమా గేయ రచయిత చందాల కేశవదాసు తెలంగాణాకు చెందిన వారైనా గ్రాంథికంలో సాగిన ఆయన రచనల్లో తెలంగాణ ప్రత్యేకత ఏమి కనిపించదు. పద్య నాటకాల నుండి సినిమాలు రూపొందిన ఆ కాలంలో పద్య నాటకాలకు అనుగుణమైన పాటలనే రాశారు. ఆయన తరువాత చాలా కాలం పాటు సినిమాలలో తెలంగాణ నుండి కవులు లేరు. నిజం చెప్పాలంటే తెలంగాణ ఉద్యమం మొదలయ్యాకనే సినిమాలలో తెలంగాణకు ప్రాధాన్యత దక్కింది.

**ప్రవేశిక :**

చందాల కేశవదాసు తరువాత దాశరథి కృష్ణమాచార్యులు 1961లో గీత రచయితగా తెలుగు సినీరంగంలో ప్రవేశించారు. 'ఖుషీఖుషీగా నవ్వుతూ చలాకి మాటలు రువ్వుతూ' (ఇద్దరు మిత్రులు, 1961), 'గోదారి గట్టుంది గట్టు మీన సెట్టుంది' (మూగ మనసులు, 1964) వంటి హుషారైన పాటలు 'రారా కృష్ణయ్యా దీనులను కాపాడ

రారా కృష్ణయ్యా'(రాము, 1968) లాంటి భక్తి పాటలు 'మదిలో వీణలు మ్రోగె ఆశలెన్నొ చెలరేగె'(ఆత్మీయులు, 1969) లాంటి వీణ పాటలు 'ఏ దివిలో విరిసిన పారిజాతమో'(కన్నెవయసు, 1973) మొదలైన ప్రణయ గీతాలు ఎన్నో రాశారు. అన్నింటిలో అద్భుతమైన కవిత్వాన్ని పలికించినా ఖుషీ, నిషా వంటి ఉర్దూ పదాలు తప్ప వీరి పాటలలో తెలంగాణ ముద్ర కనిపించలేదు. అప్పటి పరిస్థితులు ఆయనను అలా నిగ్రహించుకునేలా చేశాయి కావచ్చు.

తెలుగు సినిమాలలో తెలంగాణ పలుకుబడిని తొలుత ప్రయోగించినవారు డాక్టర్.సి.నారాయణరెడ్డి. పల్లెటూరు నేపథ్యంలో వచ్చే పాటల్లో, హుషారెక్కించే ప్రత్యేక గీతాల్లో అవకాశం ఉన్న ప్రతిచోటా తెలంగాణ మాటలు ప్రయోగించారు. సిసింద్రీ చిట్టిబాబు (1971) సినిమాలో "ఓహోం ఓహొ జంబియా" అనే ప్రత్యేక గీతంలో "వగలమారి జంబియా / నాతోని మాట్లాడు నాంపల్లి జంబియా" అని రాశారు. నాతో అనడానికి 'నాతోని' అనడం తెలంగాణ ప్రత్యేకత. ఇంకా ఆ గీతంలో నర్తకి "అద్దాల రైకబట్ట తెస్తనంటివి / గద్వాలచీర కొనుక్కొస్తనంటివి / పొద్దంత పత్తాలేవు అద్దరాతిరైనా రావు / కల్లంగడిలో రాత్రి గడిపి వస్తివా / తెల్లవారినంక నేను యాదికొస్తినా" "సారథీ స్టూడియోకు పోదమంటివి / హీరో నాగేశ్వర్రావును చూపిస్తనంటివి" అంటూ పాడుతుంది. తెలంగాణ భాషలో కొన్నిచోట్ల దీర్ఘాలు లోపిస్తాయి. ఈ పాటలోనూ క్రియా పదాలు అన్నింటిలోనూ దీర్ఘం లోపించింది. ఉదాహరణకు తెస్తానంటివి - 'తెస్తనంటివి', కొనుక్కొస్తానంటివి - 'కొనుక్కొస్తనంటివి'. పగటిపూట కాలాన్ని 'పొద్దంతా' అనడం, అర్ధరాత్రిని 'అద్దరాత్రి' అనడం, కనిపించకుండాపోతే 'పత్తాలేవు' అనడం, గుర్తుకొచ్చానా అంటే 'యాదికొస్తినా' అనడం తెలంగాణ నుడికారం. ప్రసిద్ధమైన 'గద్వాలచీర'ను ప్రస్తావించి తెలంగాణలోని ప్రముఖప్రాంతాన్ని గుర్తుచేశారు. 'దుకాణం'/'సంత'ను తెలంగాణలో 'అంగడి' అంటారు. కల్లు దొరికే దుకాణమే 'కల్లంగడి'. ఈ పాట పల్లవిని కొంచెం మార్చి మల్లేశం(2019) సినిమాలో గోరేటి వెంకన్న "ఓహో జంబియా ఓలంపల్లి జంబియా / నాతోని మాట్లాడు నాంపల్లి జంబియా/ ఏమేమి కావాలి సామికి / నల్లగొండ మౌలాలికి / బుట్టలు గావాలె సామికీ / దట్టీలు గావాలె సామికి" అని రాశారు.

బ్రహ్మర్షి విశ్వామిత్ర (1989) సినిమాలో "కల్లు పొంగినట్టు పిల్ల నవ్వినట్టు తెల్లతెల్లగుంది ఎన్నెల" పాటలో క్రియాపదాలలో తెలంగాణ ప్రత్యేకత పాటిస్తూ 'ఎక్కిండు, వేసిండు, లేసిండు, ఊగుడే' అని ప్రయోగిస్తూ "గుర్రమెక్కిండు సూడు ఒరబ్బో సుక్కరాయుడు / ముంత కాజేసి కుండ బోర్లేసి ఈల వేసిండు లేసిండు వీరబాహుడు", "అన్ని ఉడిగిన బైరాగైనా ఆడగాలికి ఊగుడే" అని రాశారు.

అమ్మమాట (1972) సినిమాలో "మాయదారి సిన్నోడు మనసేలాగేసిండు" పాటలో కూడా "సిగురుల్లో.. మాటేసి కన్నుగీటిండే / జివ్వున పానాలు తోడేసిండే" "బుడుంగున మీదికి తేలిండే / నా తడికొంగు పట్టుకుని లాగిండే" "గబుక్కున కళ్లు రెండు మూసిండే / రివ్వున వాటేసి నవ్వేసిండే" క్రియాపదాలలో తెలంగాణ ప్రత్యేకత పాటిస్తూ రాశారు.

ఒసేయ్ రాములమ్మా (1997) సినిమాలో "ఓ ముత్యాల రెమ్మా - ఓ మురిపాల కొమ్మా - ఓ పున్నమి గుమ్మా - ఓ పుత్తడి బొమ్మా - ఓ రాములమ్మా రాములమ్మా" పాటలోని చరణాల్లో "ఏం సూపులోయమ్మా - యేగు సుక్కలేనమ్మా - సిరినవ్వులోయమ్మా - సెంద్రవంకలేనమ్మా", "నువ్వు కడవ మీద కడవ బెట్టి కదిలితేనమ్మా / ఆ కరిమబ్బు వరిదొబ్బు కన్ను గిలిపేనమ్మ / నువ్వు సింద మీద సిందేసి సెంగుమంటే నమ్మ / ఆ జింకపిల్ల పాదాలకు జంకు పుట్టెనమ్మ" అని రాశారు. అరుంధతి (2009) సినిమాలో "జేజమ్మా మాయమ్మ" పాటలో "కమ్ముకున్నా చీకట్లోనా / కుమ్ముకొచ్చే వెలుతురమ్మా / కచ్చకట్టి కత్తి పడితే / చిచ్చురేపే కాళీవమ్మా" అని సినారె అవకాశం ఉన్న ప్రతిచోట తెలంగాణ మాటను సినిమా పాటల్లో అద్భుతంగా ప్రయోగించారు. తెలంగాణ బిడ్డగా సినారె పాటల్లో అనేక చోట్ల

తెలంగాణ నుడికారం కనపడుతుంది - "యాదగిరీ నరసన్న ఆదమరిచి నిదరోయే" (సూత్రధారులు, 1989), 'రేలా రేలా రేలారే రేగూ తోపుల్లో .. రెల్లూ పూలా గాలోరె రేతిరి ఏలల్లో ' (మన్నెంలో మొనగాడు, 1986).

ఆరుద్ర 1968లో వచ్చిన 'బందిపోటు దొంగలు' సినిమాలో ఒకపాటలో "గండరగండ సోగ్గాడివంటా / కండలు తిరిగిన పోరగాడి వంటా", "జంగిలిమామా - పైటచెంగున కడతా నిన్ను", "అన్నవున్నడూ ఉరిమి చూస్తడు - ఉండర హుషారుగా" అని తెలంగాణ పదాలను ఉపయోగించి రాశాడు. పంతాలు పట్టింపులు (1968) సినిమాలో "రమ్మంటే రాడు పెద్ద సోగ్గాడో సోగ్గాడు" పాటలో పోరగాడు పదాన్ని ప్రయోగించాడు - "సిటికేసి పిలుస్తాడు పోరగాడు - కళ్లు సిట్లించి సూస్తాడు పోరగాడు".

మొండి మొగుడు పెంకి పెళ్ళాం (1992) సినిమాలో - సాహితి (చెరుకుపల్లి శ్రీరామచంద్రమూర్తి) "లాలూ దర్వాజ లస్కర్ బోనాల్ పండగకస్తనని రాకపోతివి / లకిడీకాపూల్ పోరికి లబ్బర్ గాజుల్ తెస్తని తేకపోతివి / ఒట్టి జూట మాట చెప్పి ఒచ్చేదాక లొల్లిపెట్టి / పట్టుకుంటె పోరగాడు పలకనామ పారిపోయె... తుర్" అనే పాటను రాశారు. జనరంజకమైన పాటల్లో ఇది ఒకటి. ఈ పాటలో హైదరాబాదులోని ప్రాంతాల పేర్లు ఎక్కువగా వినిపిస్తాయి. తెలంగాణేతర సినిమా రచయితలకు, దర్శకులకు తెలంగాణా అంటే హైదరాబాదే నని, తెలంగాణాభాష అంటే హైదరాబాదు భాషే నన్న అభిప్రాయానికి ఈ పాట ఉదాహరణ. జూటా, లొల్లి ఇంకా గల్లీ లాంటి పదాలు హైదరాబాదులోనే ఎక్కువగా వినిపిస్తాయి. తెలంగాణ పదాలే అయినప్పటికీ మిగతా జిల్లాల్లో వాటి వాడకం చాల తక్కువ. ఉర్దూ పదాలు కూడా హైదరాబాదు భాషలోనే ఎక్కువగా ఉంటాయి. కానీ తెలంగాణా పాట అనగానే ఉర్దూ పదాలు అధికంగా వాడడం కూడా కనిపిస్తుంది. అయితే సి. నారాయణరెడ్డి గారి పాటలు ఇందుకు మినహాయింపు. వారు తెలంగాణ ప్రత్యేకతతో రాసిన పాటల్లో ఉర్దూ పదాలు మిగతా తెలుగు పాటల్లో ఉన్నట్టే అవసరం మేరకే ఉంటాయి.

సి. నారాయణ రెడ్డి గారి తర్వాత సుద్దాల అశోక్ తేజగారు అధికంగా తెలంగాణా భాషను సినిమాపాటల్లో ప్రయోగించారు. నమస్తే అన్న (1990) సినిమాలో "గరం గరం పోరి నా గజ్జెల సవ్వారి / బుంగ మూతి ప్యారి నా బుల్ బుల్ సింగారి" అనే పాటతో సినీరంగంలో ప్రవేశించారు. ఒసేయ్ రాములమ్మా (1997) సినిమాలో రాసిన పాటల్లో చక్కని తెలంగాణా పదాలను ఉపయోగించారు - "రామసక్కని తల్లి రాములమ్మో రాములమ్మ / రాయొలే కూసున్న వెందుకమ్మో ఎందుకమ్మా", "తాసుపాములు కరిసె ఇసువంటి తావుల్లా / భూతాలు దెయ్యాలు తిరిగేటి గడియాల్లా", త్రాచుపామును తెలంగాణలో తాసుపాము అనడం కద్దు. ఇంకా 'చోటు' అనడానికి బదులు జాగాతో పాటు 'తావు' అనే పదాన్ని కూడా ఎక్కువగా వాడుతారు. వీటినే కాక త్రాగించడం లేదు అనే పదానికి 'తాపలేదు' అనే తెలంగాణ ప్రయోగాన్ని కరుణరసావిష్కరణంలో వినియోగించారు - "తల్లిపాలను తాపలేదు / ఒడిలో నిన్ను ఊపలేదు". ఇలా వందలాది పాటల్లో సుద్దాల అశోక్ తేజగారు తెలంగాణ భాషను రసోచితంగా, సందర్భోచితంగా అద్భుతంగా ప్రయోగించారు.

అయితే ఇదంతా తెలంగాణ ఉద్యమానికి ముందు. అక్కడక్కడా చమత్కారం కోసమో లేక సందర్భావశాత్తో తెలంగాణ భాషలో పాటలు వచ్చాయి. ఆర్. నారాయణమూర్తి లాంటి వాళ్ళు తీసిన విప్లవ సినిమాలలో, తెలంగాణా సమస్యల మీద ప్రత్యేకంగా తీసిన సినిమాలలో తెలంగాణ భాషలో పాటలు వచ్చాయి. అవి ఎక్కువగా విప్లవగీతాలు, అభ్యుదయగీతాలు. గద్దర్, గూడ అంజయ్య, గోరేటి వెంకన్న, అందెశ్రీ తెలంగాణ ప్రజాకవులుగా ప్రసిద్ధి చెందాక సినిమాల్లోకి వచ్చారు. ఇప్పటికీ వీరికి ఉద్యమకవులు, ప్రజాకవులుగానే గుర్తింపు. వీరు తెలంగాణ పల్లె పదాలు అద్భుతంగా అందంగా ప్రయోగించగలరు.

గద్దర్ మాభూమి(1980)తో సినిమాలకు పరిచయం అయినా తొలి సినిమా పాట 'మదనా సుందరి' రంగులకల(1983) సినిమాలో రాశారు. " నీళ్లల్ల కదిలేటి నీ నీడ సూసో మదనసుందరి / ఎన్నెల్ల రాత్రుల్లో వన్నెలు సూసో మదనసుందరి / దారిన పోవంగ దొరగాడు కాసే మదనసుందరి / సందుళ్లు కాసిండు సైగా చేసిండో మదనసుందరి". లోపల అనే అర్థంలో 'లో' అని అనవలసిన దగ్గర 'ల' అనడం తెలంగాణ ప్రత్యేకత. అందుకే నీళ్ళల్లో బదులు 'నీళ్లల్ల' అని ప్రయోగించారు. వచ్చేటప్పుడు పోయేటప్పుడు అనడానికి రాంగ పోంగ అనడం తెలంగాణ ప్రత్యేకత. పాటల్లో రావంగ పోవంగ అని కూడా ప్రయోగిస్తారు. 'కాసిండు' వంటి తెలంగాణ క్రియారూపాలని కూడా గద్దర్ ఉపయోగించారు. "నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా / తోడబుట్టిన రుణం తీర్చుకుంటనే చెల్లెమ్మ" అని ఒరేయ్ రిక్షా(1995) సినిమాలో గొప్ప పాటను రాశారు గద్దర్. ఈ పాటలోని ప్రతి పదంలో తెలంగాణ భాష అందం తొణికిసలాడుతుంది.

"ఊరు మనదిరా ఈ వాడ మనదిరా"... "దొర ఏందిరో ఆడి పీకుడేందిరో" అని రాసిన గూడ అంజయ్య తిరుగుబాటును తెలంగాణ మాటల్లో ప్రతిధ్వనింప చేసిన గొప్పకవి. ఆయన రాసిన పాటలు సినిమాలలో కెక్కాయి. సినిమాలకు ప్రత్యేకంగా కూడా పాటలు రాశాడు. అన్నింట్లోనూ తెలంగాణ భాష విప్లవ ధ్వనులు చేస్తుంది. గోరేటి వెంకన్న ఎన్కౌంటర్(1991), కుబుసం(2002), శ్రీరాములయ్య(1999) మొదలైన సినిమాలలో రాసిన పాటలు తెలంగాణ పదాలతో ప్రజల హృదయాలకు హత్తుకున్నాయి. కుబుసం సినిమాలో రాసిన "పల్లే కన్నీరు పెడుతోంది" అనే పాట చెరగని ముద్రతో జనాన్ని కట్టిపడేసింది. అందెశ్రీ కూడా వేగుచుక్కలు(2003), బతుకమ్మ(2008) మొదలైన సినిమాలలో మంచి పాటలతో ఆకట్టుకున్నారు. బతుకమ్మ సినిమాలో "చినుకమ్మ వానచినుకమ్మా" పాట ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది.

2001లో తెలంగాణా ఉద్యమం మొదలయ్యాక సినిమా సాహిత్యంలో కూడా నెమ్మదిగా మార్పు వచ్చింది. హైదరాబాదే కాక ఇతర తెలంగాణ ప్రాతాల నేపథ్యంలో కూడా సినిమాలు మొదలయ్యాయి. తెలంగాణా భాషను అవమానకరరీతిలో సినిమాల్లో ఉపయోగించడం క్రమంగా తగ్గింది. సినిమా మాటల్లో వచ్చినంత స్థాయిలో కాకపోయినా సినిమాపాటల భాషలో కూడా మార్పు వచ్చింది. ఇంతకుముందు విప్లవగీతాలే వచ్చే తెలంగాణ భాషలో అందమైన పాటలు కూడా వస్తున్నాయి. ఉదాహరణకు ఫిదా(2017) సినిమాలో సుద్దాల అశోక్ తేజ రాసిన పాట - "వొచ్చిండె మెల్లామెల్లగ వొచ్చిండె / క్రీముబిస్కెటు ఏసిండె". అందమైన తెలంగాణ క్రియారూపం 'వొచ్చిండు'తో ఈ పాటను ప్రారంభించడం విశేషం. ఈ పాటలో రకరకాల భావాలని తెలంగాణ భాషతో చాల అందంగా ప్రకటించారు సుద్దాల అశోక్ తేజ. మనసును కలవరపెడుతున్నాడు అనడానికి "గమ్మున కూసోనియ్యాడె కుదురుగ నిల్సోనియ్యాడె" అని రాశారు. అమ్మాయిని ప్రసన్నం చేసుకోవడానికి అబ్బాయి రకరకాల ప్రయత్నాలు చేస్తాడు ఆ విషయాన్ని ఇంగ్లీష్ మాటలతో కలిపి తెలంగాణ భాషలో చాలా సరసంగా సొగసుగా "హె పిల్లా రేణుకా పిలగాడొచ్చిండె / డిన్నరన్నాడె... డేటు అన్నాడె / ఏలు పట్టి పోలు తిరిగి / నిన్ను ఉల్టా సీదా చేసిండే" అని రాశారు. తెలంగాణలో అబ్బాయిని 'పిలగాడు' అనడం సర్వసాధారణం. పెండ్లికొడుకుని సైతం 'పెళ్లిపిలగాడు' అంటారు. మగవాళ్లు తెలివైనవాళ్ళు, అమ్మాయిల్ని బుట్టలో పడేయడానికి చిన్నచిన్న మోసాలు కూడా చేస్తారని వాటికి పడిపోవద్దు అని "మొగవాల్లు మస్తు చాలూ మస్కలు కొడతా ఉంటరె / నువ్ ఎన్నాపూసలెక్క కరిగితె అంతె సంగతె" అంటూ రాశారు. ఇక్కడ 'చాలూ' అని అనేది తమ పనులు సాధించుకోవడం కోసం ఎవరైనా చాలాతెలివిగా ప్రవర్తించే వారికి తెలంగాణలో ఉపయోగించే విశేషణం. 'మస్కా కొట్టడం' అంటే ఇక అందరికీ తెలిసిందే. అభ్యుదయం, విప్లవాల కోసం ఉపయోగించిన తెలంగాణ భాషను ప్రణయం, సరసం లాంటి సున్నిత భావాలను ప్రకటించడానికి అద్భుతంగా పనికొస్తుంది అని నిరూపించారు సుద్దాల అశోక్ తేజ.

ఈ మధ్యనే వచ్చిన RRR సినిమాలో కూడా ఆదిలాబాద్ జిల్లాలో వాడే పదాలతో సుద్దాల అశోక్ తేజ ఒక మంచి పాటను రాశారు. "కొమురం భీముడో / కొర్రాసు నెగడోలే మండాలి కొడుకో / రగరాక సూరీడై రగలాలి కొడుకో". పొయ్యిలోంచి తీసిన మండుతున్నకట్టెను తెలంగాణలో 'కొర్కాసు' అంటారు. అదే ఇక్కడ 'కొర్రాసు' అయింది. "కాల్మొక్తా బాంచెన్ అని వొంగితోగాల / కారడవి తల్లికి పుట్టనట్టేరో / జులుము గద్దెకు తలను వొంచితోగాలా / తుడుము తల్లి పేగున పెరగానట్టేరో". 'ఒకవేళ' అనే పదం 'ఒగాల'గా మారి వంగితే ఒకవేళ అనాల్సిన చోట 'వొంగితోగాల' అనీ, వంచితే ఒకవేళ అనాల్సిన చోట 'వొంచితోగాలా' అని విలక్షణంగా వినిపిస్తుంది. అధికార పీఠాన్ని 'జులుము గద్దె' అనడం, ధిక్కార స్వరాన్ని 'తుడుము తల్లి' అనడం తెలంగాణ భాషలోని విలక్షణతే. ఆ లక్షణాన్ని సమర్థంగా పట్టుకున్నవారు, సందర్భోచితంగా ప్రయోగిస్తున్నవారు సుద్దాల అశోక్ తేజగారు.

**ముగింపు :**

చంద్రబోస్, కందికొండ యాదగిరి తెలంగాణ నుంచి గొప్ప సినిమా కవులుగా పేరు పొందారు. విజయవంతమైన పలు పాటలను సినిమాలకు అందించారు. "కోడి పాయనే లచ్చీ కోడి పాయనే" పాట రాసిన వరంగల్ శ్రీనివాస్, "పోరి చూస్తే సూపరురో / జోరుదారుగున్నదిరో" పాట రాసిన తైదల బాపు, "సినిమా సూపిత్త మామ / నీకు సినిమా సూపిత్త మామ" పాట రాసిన వరికుప్పల యాదగిరి, "నీలపూరి గాజుల ఓ నీలవేణి" పాట రాసిన కాసర్ల శ్యామ్ ఇంకా అభినయ శ్రీనివాస్, యశ్పాల్, మిట్టపల్లి సురేందర్, శ్రేష్ట, కృష్ణకాంత్, లక్మ ప్రవీణ్ తెలుగు సినిమాలలో తెలంగాణ పదాలతో మంచి పాటలు రాస్తూ ప్రేక్షకుల మనసులను ఆకట్టుకుంటున్నారు. భవిష్యత్తులో సినిమా పాటలు తెలంగాణ భాషది తిరుగులేని స్థానమని నిరూపిస్తున్నారు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సినిమాపాట చరిత్ర - డా. పైడిపాల
2. తెలుగు సినీ గేయ కవుల చరిత్ర - డా. పైడిపాల
3. ఆరుద్ర సినీ గీతాలు: తళతళా మిలమిలా పగటిపూట వెన్నెలా - ఆరుద్ర
4. ఆరుద్ర సినీ గీతాలు: నవ్వుల నదిలో పువ్వు - ఆరుద్ర
5. ఆరుద్ర సినీ గీతాలు: కురిసే చిరుజల్లులో - ఆరుద్ర

**ఉపయోగించిన పాటలు :**

1. ఖుషీఖుషీగా నవ్వుతూ చలాకి మాటలు రువ్వుతూ - దాశరథి, ఇద్దరు మిత్రులు, 1961
2. గోదారి గట్టుంది గట్టు మీన సెట్టుంది - దాశరథి, మూగ మనసులు, 1964
3. రారా కృష్ణయ్యా దీనులను కాపాడ రారా కృష్ణయ్యా - దాశరథి, రాము, 1968
4. మదిలో వీణలు మ్రోగె ఆశలెన్నో చెలరేగె - దాశరథి, ఆత్మీయులు, 1969
5. ఏ దివిలో విరిసిన పారిజాతమో - దాశరథి, కన్నెవయసు, 1973
6. ఓహోం ఓహొ జంబియా - డా. సి.నారాయణరెడ్డి, సిసింద్రీ చిట్టిబాబు, 1971
7. ఓహో జంబియా ఓలంపల్లి జంబియా - గోరేటి వెంకన్న, మల్లేశం, 2019
8. కల్లు పొంగినట్టు పిల్ల నవ్వినట్టు - డా. సి.నారాయణరెడ్డి, బ్రహ్మర్షి విశ్వామిత్ర, 1989

9. మాయదారి సిన్నోడు మనసేలాగేసిండు - డా. సి.నారాయణరెడ్డి, అమ్మమాట, 1972
10. ఓ ముత్యాల రెమ్మా ఓ మురిపాల కొమ్మా - డా. సి.నారాయణరెడ్డి, ఒసేయ్ రాములమ్మా, 1997
11. జేజమ్మా మాయమ్మ - డా. సి.నారాయణరెడ్డి, అరుంధతి, 2009
12. లాలూ దర్వాజ లస్కర్ బోనాల్ - సాహితి, మొండి మొగుడు పెంకి పెళ్ళాం, 1992
13. గరం గరం పోరి నా గజ్జెల సవ్వారి - సుద్దాల అశోక్ తేజ, నమస్తే అన్న, 1990
14. రామసక్కని తల్లి రాములమ్మో - సుద్దాల అశోక్ తేజ, ఒసేయ్ రాములమ్మా, 1997
15. వొచ్చిండె మెల్లామెల్లగ వొచ్చిండె - సుద్దాల అశోక్ తేజ, ఫిదా, 2017
16. కొమురం భీముడో - సుద్దాల అశోక్ తేజ, RRR, 2022
17. మదనా సుందరి - గద్దర్, రంగులకల, 1983
18. నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా - గద్దర్, ఒరేయ్ రిక్షా, 1995
19. ఊరు మనదిరా ఈ వాడ మనదిరా - గూడ అంజయ్య, ఎర్రసైన్యం, 1994
20. చినుకమ్మ వానచినుకమ్మా - అందెశ్రీ, రంగులకల, బతుకమ్మ, 2008
21. పల్లే కన్నీరు పెడుతోంది - గోరేటి వెంకన్న, రంగులకల, బతుకమ్మ, కుబుసం, 2002

★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# వేమన కవిత్వంలో యోగ విఘ్నాలను అధిగమించే మార్గాలు

డా॥. ఎమ్. ఎన్. కృష్ణవేణి
అతిథి అధ్యాపకురాలు, తెలుగు విభాగం, ఆంధ్ర విశ్వవిద్యాలయము, విశాఖపట్టణం.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

ఈ వ్యాసంలో పతంజలి మహర్షి యోగ సాధకులు ఎదుర్కునే విఘ్నాలను, ఎలా అధిగమించాలో చెప్పిన ఉపాయాలను ప్రస్తావిస్తూ, యోగి వేమన అందరికీ ఆమోద యోగ్యమైన పద్ధతిలో యోగ విఘ్నాలను ఎలా ఎదుర్కోవాలో చెప్పిన ఉపాయాలను వివరించడం జరిగింది.

**ముఖ్యాంశాలు :**
యోగ దర్శనము, యోగ విఘ్నాలు, సప్తధాతువులు, త్రిగుణాలు, మనస్సు, వేమన యోగ చెప్పిన యోగ విఘ్నాలు, ఉపాయాలు.

పతంజలి మహర్షి యోగ సాధకులు ఎదుర్కునే విఘ్నాలను సమాధి పాదంలో వివరించడం జరిగింది. "వ్యాధి స్త్యాన సంశయ ప్రమాదాలస్యావిరతి భ్రాంతి దర్శనా లబ్ధ భూమికత్వా నవస్థత్వాని చిత్త విక్షేపాస్తే అంతరాయా:" అని సూత్ర రూపంలో చెప్పారు. కానీ ఈ సూత్రం ఇలానే చెప్తే ఎందరికి అవగతమవుతుంది. పతంజలి యోగ దర్శనానికి ఎందరో వ్యాఖ్యాతలు అన్ని కాలాలలో ఉన్నా అవి సామాన్య ప్రజానీకానికి అందని ద్రాక్షలే. అయితే ఈ యోగ రహస్యాలను సామాన్య ప్రజల వాడుక భాషలో చిన్న చిన్న పద్యాల రూపంలో చక్కెర గుళికలలా అందించిన ఘనత వేమనదే.

ఒక సిద్ధ పురుషుని అనుగ్రహం ద్వారా లంబికా యోగ సిద్ధి పొంది విరాగియై జీవ సమాధి పొందిన వేమన యోగి నాటి సాంఘిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రజలను వారు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకు వెళ్ళాలనే తపనపడ్డారు. నాటి సామాన్య ఆర్థిక, నైతిక, పరిస్థితులను అర్థం చేసుకున్న వాడు కనుక వారికి అర్థమయ్యే రీతిలో చిన్న చిన్న పద్యాలలో వారికి తత్వాన్ని బోధించాడు. యోగ రహస్యాలను, సాధనలో గురువు యొక్క ఆవశ్యకతను, యోగంలో కలిగే ఆటంకాలను, మనో నిబ్బరంతో ఏ విధంగా సాఫల్యతను పొందాలో చక్కగా వివరించాడు. ఈ పద్యాలు ఆ తరానికే కాదు అన్ని తరాల వారికి కూడా మార్గదర్శకాలే. కాస్త వ్యంగ్యం, మరికాస్త చమత్కారం,

కొంత హాస్యం, ఒక్కోసారి చురుక్కుమనిపించేలా ఉండే వేమన పద్యాలు తెలుగువారందరికీ సుపరిచితాలే. వేమనను వెర్రి వేమన అన్నవారే యోగి వేమన అనే విధంగా తన కవితా సుధలో యోగ విఘ్నాలను గూర్చి, వాటిని అధిగమించే ఉపాయాలను గూర్చి బహు చక్కగా విశదీకరించాడు.

**వ్యాధి :**

శరీరం సప్తధాతువులతో (మజ్జ, మాంసం, క్రొవ్వు మొ॥) త్రిదోషాలతో (వాత, పిత్త, కఫ) రసాలతో (వినాళగ్రంధి స్రావాలు (హార్మోన్సు) జఠరరసాలు మొ॥. కరణాలతో (కర్మేంద్రియ జ్ఞానేంద్రియ పంచకం) కూడుకున్నది.

శరీరం వ్యాధిగ్రస్తం కావటానికి ముఖ్యకారణం పై వాటిలో సమతుల్యత లోపించడం. అందుకే గీతాచార్యుడు యోగ సాధకుడు ఉండవలసిన తీరును చెప్తూ "యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు"అని ప్రతి పని యుక్తంగా ఉండాలి లేనిచో ఇబ్బందులు తప్పవంటాడు. అయుక్త ఆహార విహారాదులతో వ్యాధిగ్రస్తమైన శరీరం యోగ సాధనకు అనుకూలం కాదు. మనసు అంతర్ముఖం కాక బహిర్ముఖమ్ అవుతుంది. కనుక యుక్తమైన ఆహార విహారాదులు, హఠయోగ సాధనలలో జాగరూకత అవసరం.

ఈ శరీరం (అన్నమయకోశం) అన్నరసంతో పోషింపబడుతుంది. "అన్నదోషేన చిత్తం కాలుష్యం సర్వదాభవేత్" అనే శాస్త్ర వాక్యం ప్రకారం అన్నదోషం వలన చిత్తం కలుషితమవుతుంది. కనుక ఆహార సేవనంలో జాగ్రత్త తప్పనిసరి. వేమన తనదైన శైలిలో

అన్న రసము వలన నలబిందు రసమయ్యె
బిందు రసము వలన బీజమయ్యె
బింబు బీజములను భేదించి చూడరా

అంటూ ఆహారం యొక్క ప్రాధాన్యతను, పిండోత్పత్తిని గూర్చి వివరించాడు. ఇప్పటి ఆహారం దానిని తీసుకునే శైలిని గమనిస్తే ఒకప్పటికి ఇప్పటికి ఎంత మార్పు అన్పిస్తుంది. ఒక పద్ధతి, క్రమం ఆహారసేవనంలో మనకు కన్పించదు. ఒకప్పుడు ఆహారం తీసుకోవాలంటే దానికి ప్రత్యేకంగా ఒక స్థలం, తీసుకునేటప్పుడు దైవ ప్రార్థన చేయడం మొ॥ ఉండేవి. అయితే ఈ సమస్యకు పరిష్కారం లేదా అంటే వేమన దానికి ఉపాయాన్ని ఈ విధంగా చెప్తున్నాడు.

"అన్నము నమృతమును నంటునంటనుచును
బరిహరింత్రు దెలియబడక ద్విజులు
యన్న మమృతమివియు హరి హర బ్రహ్మలు
యంటవన్న వాని కంటు వేమ"
"అన్నదానమునను నధిక సంపద గల్గి
యమరలోక పూజ్యు డవును మీఱి
యన్న మయము బ్రహ్మ మది కనలేరయా" అంటాడు.

వేమన అన్నమును బ్రహ్మం అని చెప్తూ అన్నదానము యొక్క మహాత్యాన్ని విశదపరుస్తూ షోడశ దానములలో అన్న దానం అధికమైనదని వివరిస్తూ అన్నమునే బ్రహ్మమనే భావంతో భుజించడం ద్వారా అన్నదోషం కలుగదు అంటాడు. 'మౌననే భోజనం అమృతం' అన్నట్లుగా మౌనంగా దైవానికి అర్పిస్తూ చేసే భోజనం అమృతంతో సమానం. తద్వారా అన్నదోషం రాదు, వ్యాధులు రావు.

**స్త్యానం :**

మనసుకి స్థిరత్వం లేకపోవడం చంచలత్త్వం. ప్రతీ విషయంలో జాప్యం, ఏ విషయంపైన దృష్టి పెట్టకపోవడం, ఏకాగ్రత లేకపోవడం, ఒకలాంటి జడత్వం ఆవహించటంగా స్త్యానం ను వర్ణించవచ్చు. మనసే మోక్షానికి బంధానికి కారణం. మనసు బహిర్ముఖం అయితే బంధం. దానిని వేమన మాటలలో మనములోన బుట్టు మదికోర్కులన్నియు

గోర్కులందు ముక్తి కుదురుపడదు
మనము బ్రహ్మమనుచు మదినెఱుంగలేరు

అని మనస్సు అన్నింటికి కారణం అని చెప్తూ అలాంటి మనసుని

మనసు కోర్కెలంటి మఱి చిక్కుపడియుండు
కోర్కెలడచు ముక్తి గుర్తెఱింగి
గుఱుతు నంటి చూడ గుణమగు దత్వంబు

అంటూ కోర్కెలలో చిక్కుపడి యున్న మనసుని యుక్తితో అణచి గుఱిగా మనస్సుని గుర్తెరిగి చూడమంటాడు. అలా అంతర్ముఖమైన మనసే మోక్షానికి కారణం

మనసు పాఱవిడిచి మనసు దా మగుడించి
మనసులోన గలుగు మనసునాని
మనసు తానె నిల్వ మఱియు దాబ్రహ్మంబు

**సంశయం :**

పశుపక్ష్య మృగాణాం నరజన్మ సుదుర్లభం............

మానవ జన్మ దొరకటంకష్టం. అందు బ్రహ్మంను గూర్చి తెలుసుకోవాలనే ఆసక్తి కలగడం ఇంకా కష్టం. సద్గురు సన్నిధి లభించడం మరీ కష్టం.

ఈ మూడు ఉన్నా సంశయంఅనే విక్షేపంలో పడిన మూర్ఖునికి సాధన ఏ విధంగా సాగుతుంది.? ఈ విక్షేసం సాధకుని లోప్రతిది సంశయమే.

దీనికి కారణం గురువుపై పరిపూర్ణ విశ్వాసం లేకపోవడమే. ఇటువంటి సాధకుని గూర్చి వేమన

గురుని సేవ జేసి గురితోడ భజియింప
వలెనటంచు నరులు వాంఛదీర

బలుకు చుంద్రుగాని భావంబుగానరు అని సాధకునికి చురకను వేస్తూ

గురుని పాదయుగము గురుతుగా తానమ్మి
గురుని హృదయము దెలిసి మరుపకెపుడు
గురుకుల వాసంబు గోరుటె యిది మేలు అంటూ

గురువుతో ఉండవలసిన విధానాన్ని , గురువును హృదయము నందు నిలుపుకోవాలని వివరిస్తూ సందియము లేని మదిలోన సత్యమాత్మ

పొందు గూడుట ప్రత్యక్ష పూర్ణమనుచు
నందుచుండుము పరతత్వ మన్దెనెపుడు
కందువదె స్వర్గసౌఖ్యము గాగ వేమ

పరతత్వానికి సందేహం లేని మదియే సాక్షి భూతం అంటాడు వేమన.

**ప్రమాదం :**

ప్రమాదమనే విక్షేపానికి కారణం సాధకునిలో అభ్యాసం లోపం. తనలోని ఆరుగురు శత్రువులను (అరి షడ్వార్గాలు - కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాదులు) ఏ విధంగా పారద్రోలాలో తెలియక తన యందు ఆరు సంపదలను (శమము, దమము, తితీక్ష, ఉపరతి, శ్రద్ధ, సమాధానం, షట్కసంపత్తి) ఏ రకంగా వృద్ధి చేసుకోవాలో తెలియక ఒకలాంటి నిర్లక్ష్య వైఖరిలో ఏ యోగాంశాలను కూడా సరిగా అభ్యాసంలో పెట్టక తన లక్ష్యాన్ని మరచి తిరుగుతుంటాడు. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. ఇటువంటి వారిని గూర్చి వేమన

ఇల మిషలనుబన్ని యేమేమి చెప్పిన
గలుగ బోదుపరము కపటముడిగి
వెలయు మనసుబట్టి వేడ్కచే చూడరా అంటూ

మిషలు చెప్తూ ఉంటే పరమును పొందలేము. మనసు ఏకాగ్రం చేయి అంటాడు.

**ఆలస్యం :**

తమోగుణం ప్రధానంగా ఉన్న సాధకుని స్థితి ఎలా ఉంటుందో చెప్తూ అలాంటి వారిని గూర్చి వేమన

అతి నిద్రావంతునకు
న్నతిపానికి నిరశనునకు నతి కోపునకున్
జతపడదీ బ్రహ్మ విద్య చాటర వేమా

అని అతిగా నిద్రపోయే వారికి, అతి కోపునకు మొ॥వారు ఈ బ్రహ్మ విద్యలో నిపుణత సాధించలేరంటాడు. ఈ తమోగుణాన్ని ఎలా పోగొట్టుకోవాలి అనేవానికి వేమన

ఇలను జ్ఞానమనెడి యీతనేర్చినవాడు
జలధియనెడు తమము జడియక విడి
విలయ మనెడి గట్టు వెఱవకు దాటురా

అని అజ్ఞానం (తమస్సు) అనే జలధిని దాటుటకు జ్ఞాన మనే యీతను నేర్చుకున్న ప్రళయమనే గట్టును భయం లేకుండా దాటవచ్చని చెప్తాడు. తమస్సు లనే జలధిని భవసాగరంలో పోల్చుతూ జ్ఞానమనే యీత నేర్చుకోమని సాధకునికి చెప్తాడు వేమన. అలా చేస్తే భవసాగరాన్ని దాటడం సులభం అని అంటాడు. అలాగే

నిద్ర మఱచినపుడె నిష్ఠుండు తానాయె
నిద్రలోన పడిన నిష్ఠపోయె అని

నిద్ర అన్ని వేళలలో పనికి రాదు. దానిని మరచినపుడు యోగ విద్యలో నిష్ణాతుడు అవుతాడు అంటాడు వేమన.

**అవిరతి :**

వైరాగ్యానికి మొదటి స్థాయి అయిన ఉపరతికి వ్యతిరేకం అవిరతి. సాధకుడు ఎంతో మనో నిబ్బరంతో యోగ సాధన చేద్దామనుకున్నా ఈ విక్షేపం మనసును ఏకాగ్రమవ్వనీయక బాహ్య విషయాలవైపు బలంగా లాగుతుంది. అందుకే వేమన మనసుని కోతితో పోల్చుతూ

ఇంటిలోన కోతి యిరవుగానకలేక
దిరుగ బోవువారు తీరకుంద్రు

కోతినొకటనిల్పి కదురుండలేరయా అంటూ
కోతిని (మనసుని) కట్టడి చేయమని బోధిస్తాడు.

వారికి ఉపాయాన్ని చెప్తూ వేమన ఇంద్రియాలను అదుపులో పెట్టమంటాడు.

ఇంద్రియములు విడిచి యేకస్థుడై నిల్చి
యెఱిగి తన్ను బిదప నెఱుకకున్న
యతడె మౌని జ్ఞాని యౌనని యందురే

అని ఇంద్రియ నిగ్రహం మౌనత్వ జ్ఞానత్వముల నిచ్చునని చెప్తూ బాహ్య విషయాలను విడచి అంతర్ దృష్టి గలవాడే ఇంద్రియాతీతుడగునని క్రింది పద్యం ద్వారా వివరిస్తాడు.

సమత గురుని దృష్టి సమముగా మదినిల్పి
బయల రుచుల మాన భద్రపరచి
పరగ జూడు బట్ట బయలగు బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినుర వేమ

**భ్రాంతి దర్శనం :**

దీనినే విపర్యయముగా వ్యాసుడు వర్ణిస్తాడు. ఈ అంతరాయలో సాధకుడు తనకు తెలిసినదే సరియైనదనే మిథ్యలో ఉంటాడు. ధ్యానంలో కూర్చుని నిద్రపోతూ తాను సమాధి స్థితిలో ఉన్నాననే భావనలో ఉంటారు. వీరిని చూసే వేమన

భ్రాంతి చేతను మర్త్యులు భక్తి విడువ
భయద మౌ పుట్టు చూపులు ప్రాప్తమయ్యె
నిట్టి పరులకు కష్టంబు లెట్లుతీరు
గురుని సన్నిధి తీర్చునా కొఱత వేమ!

అంటూ గురుని సన్నిధి అయినా ఈ భ్రాంతి దర్శనంలో భక్తిహీనమైన సందేహాన్ని తీర్చలేడంటారు.

**అలబ్ధ భూమికత్వం :**

యోగ సాధనను ప్రారంభించిన సమయంలో ఎంతో ఉత్సాహంతో ఉంటాడు సాధకుడు. సాధనలో ఒక్కో భూమిక త్వర త్వరగా అందుతున్నట్లే ఉంటుంది. కొన్నాళ్ళు గడిచిన తర్వాత ఎంత ప్రయత్నిస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉంటుంది. వేమన

కడు ధీరుండై యోగము
తొడబడి తన్నెవ్వరైన దూషించిన దా
నొడలికి నేపాటొదవిన
జడియక సాధించువాడె సాధువు వేమా!

అని ఎట్టి పరిస్థితులలోనైనా ధీరుడై ఉండి ఎవ్వరెన్ని రకాలుగా దూషించినా పట్టించుకోక ధీరతలో అనుకున్నది సాధిచాలని వేమన వెన్నుదట్టి ప్రోత్సహిస్తాడు.

**అనవస్థితత్వాని :**

పై దాని పరిస్థితే ఇది కూడా. కాకపోతే ఇందులో ఉన్నత యోగ భూమికను అందుకున్న సాధకుడు దానిని

నిలుపుకోలేకపోతాడు. సాధనలో పట్టులేకపోతే సమాధి స్థితిని నిలబెట్టుకోవడం సులభం కాదు. ధ్యాన, సమాధి స్థితులను సాధించామనే అహంకారంలో పడి పతనమైన వారు కోకొల్లరు.

వేమన కూడా ఇలాంటి వారిని గూర్చి చెప్తూ

సంతతి సమాధి ప్రజ్ఞను
వింతలు దలపోయకుండ వివరించినచో
నంతరమున బరమాత్ముడు
మంతవ్యుడు వెలుగుచుండు మదిలో వేమా!

అని సమాధిని చక్కగా పొందవలసిన పద్ధతిలో పొందినట్లయితే ఆత్మ పరమాత్మల ఐక్యాను సంధానానికి అది తోడ్పడుతుంది.

**చిత్త విక్షేపాస్తే అంతరాయా :**

ఇవన్నీ కూడా మనసును ప్రక్కదారి పట్టించే అంతరాయాలు. ఇవే సాధకుడు పతన మొందుటకు యోగ భ్రష్టుడవుటకు కారణాలు.

ఈ తొమ్మిది విక్షేపాలనే కాక పతంజలి మహర్షి మరి యొక యోగ సూత్రంలో యోగానుష్ఠాన సమయంలో వచ్చే ప్రతిబంధకాలను ఇలా వివరించాడు.

"దు:ఖ దౌర్మనస్యాంగ మే జయత్వ శ్వాస ప్రశ్వాస విక్షేప సహభువ:"

**దు:ఖం :**

మనలో దు:ఖాన్ని పంచుకునే ఆరుగురు (చిన్నయసూరి ప్రకారం) క్రోధనుడు, ఈర్ష్యాళువు, జుగుప్సావంతుడు, నిస్సంతోషి, నిత్య శంకితుడు, పర భాగ్యోపజీవి ప్రతి విషయానికి కోపోద్రిక్తుడయ్యేవాడు క్రోధనుడు, ప్రక్కవారి అభివృద్ధిని చూసి తట్టుకోలేకపోవడం ఈర్ష్యాళువు వంతు, ప్రతి చిన్న విషయానికి చీటికి, మాటికి చికాకు పడే వాడు జుగుప్సావంతుడు, కొందరికి ఎన్ని ఉన్నా సంతోషం ఉండదు. అసంతృప్తితో జీవిస్తుంటారు, కొందరుంటారు వారికి అన్నీ అనుమానమే. చివరికి తన నీడను తాను నమ్మడు, కొందరు ఇతరులపై ప్రతి విషయానికి ఆధారపడి పోతుంటారు చేసుకునే సమర్థత ఉన్నప్పటికీ.

ఈ కోణాలన్నీ మనలో దు:ఖాన్ని పెంచేవే గానీ తగ్గించేవి కాదు. ముఖ్యంగా యోగ సాధనలో కొనసాగాలి, వృద్ధి చెందాలనుకునేవారు వీటిని తొలగించుకోకపోతే ముందుకు సాగలేరు. ఇలా దు:ఖానికి కారణమైన మనసుని పట్టి బంధించి సాధనలో

మనసే లోకాలోకము
మనసే చూపించి మెచ్చు మాయల సుమ్మీ
మనసగు ముక్తికి భుక్తికి
మనసును విడనాడ మేలు మరుగును వేమా!

మనసును బంధించమంటాడు మానవుని తరింపజేసేది మనసే అంటాడు వేమన.

**దౌ : మనస్సు :**

ఎంతటి సాధకునికైనా ఒక్కోసారి కొన్ని పరిస్థితులు మన స్థైర్యాన్ని పూర్తిగా దిగజార్చివేస్తాయి. ఎంతగా తాను మనసును చిక్కబట్టుకున్నా బాహ్య పరిస్థితులు లేదా అంతర్గత పరిస్థితులు అతనిని ప్రశాంతంగా ఉంచక

అల్లకల్లోలాన్ని, అలజడిని సృష్టిస్తాయి. అర్జునిడంతటివాడే కురుక్షేత్ర సంగ్రామంలో కృష్ణభగవానుడు తన సారధి మార్గదర్శి అని తెలిసి కూడా కొంత తడవు మనో దౌర్బలత్వానికిగురయ్యాడు.

ఇటువంటి సమయంలోనే మనోదౌర్భల్యాన్ని వీడి, ధైర్యంగా ముందడుగు వేయమంటాడు వేమన.

మనసే మాయామృగమౌ
మనసేమిటి పైక గాని మఱి పోనింకా
మనసున మనసును జంపిన
మనసందే ముక్తి గలదు మహిలో వేమా!

మనో ధైర్యంతో మాయను జయించి ముక్తిని యుక్తిగా సాధించమంటాడు.

**అంగమే జయత్వం :**

నిజానికి యోగం చేయుటకు శరీరం ఆరోగ్యంగా ఉండడం అవసరమే కానీ శరీరారోగ్యం కోసం మాత్రమే యోగం కాదు.

ఎన్ని ఆసనాలు, క్రియలు, ప్రాణాయామాలు చేసినా అవన్నీ మనసు ఏకాగ్రం అవ్వటానికి, ఆసన సిద్ధిని తద్వారా ధ్యాన స్థితిని పొందటానికే. కానీ ఎన్నాళ్ళు సాధన చేస్తున్నా కొన్ని సమయాలలో శరీరం అనారోగ్యం వలననో మన: చాంచల్యం వలననో ధ్యానంలో స్థిరంగా కూర్చోలేకపోవడం జరుగుతుంది.

కనుక గమ్యం చేరటానికి ఉపయోగించే వాహనాన్ని ఎలా భద్రంగా చూసుకుంటామో అదే విధంగా ఈ శరీరాన్ని కూడా కాపాడుకోవలసిన బాధ్యత మనపై ఉన్నది. కనుకనే

బట్ట బయలందు శ్వాసను
ముట్టుచు నెగలోజి పట్టి మూలమునందే
నెట్టుచు విడుచుచు నించిన
గుట్టు పరబ్రహ్మమంచు గూడము వేమా!

ఉచ్ఛ్వాస నిశ్వాసములు ఉన్నతి స్థాయిలో నడిపి ఉత్తముడవగుము అంటాడు వేమన. శరీరాన్ని కంది పోకుండా చూసుకునే వారిని చూసేనేమో వేమన చురకపెట్టినట్లుగా

అస్థిరమగు మేని కధిక పాటులుబడి
పెక్కు విధములందు పెంచి పెంచి
యగ్ని కిచ్చు లేక యడగి నక్కల కిచ్చు

అస్థిరమని తెలిసినా దేహాన్ని పెంచి చివరకు శ్మశానం పాలు చేతురన్నాడు వేమన.

బోనులోని యెలుక పోజూచునట్టులు
జ్ఞానమందనెఱుక చనును మీద
గాన మేను మఱచి ఘన తత్వమందరా

అంటూ శరీరాన్ని మరచి సద్గతులు సాధించమన్నాడు.

**శ్వాస ప్రశ్వాస :**

పతంజలి మహర్షి ప్రాణాయామాన్ని గూర్చి చెప్తూ 'తస్మిన్ శ్వాస ప్రశ్వాసయో: గతి విచ్ఛేద: ప్రాణాయామ:'' అన్నారు.

అయితే సాధనా క్రమంలో పూరచ, రేచక, కుంభకాల అభ్యాసం సరిగా నేర్చుకోకపోయినా, పద్ధతి ప్రకారం చేయక పోయినా లేక నిరంతరాభ్యాసం లేకపోయినా ధ్యానాభ్యాసానికి

శ్వాస లాగి విడిచి సాధింప నేర్చిన
మోసపోక ముక్తి మూట గట్టు
దోసకారి గుణము గాసి జెందక పోదు

అంటూ శ్వాసను పీల్చుట, విడుచుట తెలిసినవాడే ధీరుడు అంటాడు.

**విక్షేప సహభువ :**

ఈ విక్షేపాలన్నీ సహభువ: ప్రకృతి సిద్ధంగా వచ్చే ప్రతి బంధకాలని అంటూ అయితే వీటి నుండి ముక్తి లేదా అని ప్రశ్నించేవారికి " తత్ప్రతిషేదార్థమేక తత్త్వాభ్యాస:" అని అభ్యాసమే వీటికి ఉపాయం అని తేలుస్తాడు పతంజలి మహర్షి.

భవనం దృఢంగా ఎక్కువ కాలం నిలబడాలంటే పునాది ఎంత బలంగా ఉండాలో అదే విధంగా యోగ సాధనలో యోగ భూమికలను అందుకోవాలన్నా, స్థిరత్వాన్ని పొంది అసంప్రజ్ఞాత స్థితికి వెళ్ళాలన్నా, యోగాంగాలలో చెప్పిన ప్రథమ సోపానాలైన యమ, నియమానలు ఆచరించితేనే ఫలితం కాని వాటిని వదిలివేసి మిగిలిన అంగాల వెనుకబడితే అ,ఆ లు రానివాడు కవిత్వం రాయడానికి పూనుకున్నట్లుగా ఉంటుంది.

యొడలు బదల జేసి యుగ్ర తపము........ఏమితత్వము గనవేమా.

శరీరంలో ఒక కాలు లేదా ఒక చేయి ఉంటే దానిని శరీరం అనము కదా! మొత్తం శరీర భాగాలన్నింటిని కలిపి శరీరం అంటాం. అదే విధంగా అష్టాంగాలను అన్నింటిని కలిపి అభ్యసిస్తేనే అది యోగ సాధన అవుతుందేగాని కేవలం ఒక్క అంగాన్ని అభ్యసిస్తే సరిపోదు. అందునా యమ, నియమాలలో చెప్పిన అహింస, ఈశ్వరప్రణిధానం లను ప్రధానంగా అమలు పరచడం అస్సలు మరువరాదు.

**ముగింపు :**

ఈ వ్యాసంలో పతంజలి మహర్షి యోగ సాధకులకు చెప్పిన యోగ విఘ్నాలు, తరుణోపాయాలు, వేమన చెప్పిన అధిగమించే ఉపాయాలను గురించి సోదాహరణ పూర్వకంగా వివరించడం జరిగింది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. హఠయోగప్రదీపిక, బ్రహ్మశ్రీ రాచకొండ అన్నయ్య శాస్త్రి, వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్‌సన్స్, చెన్నపురి, 1954.
2. వేమన పద్యరత్నాకరము, తాత్పర్యకర్త: శ్రీబులుసు వేంకటరమణయ్య, బాలసరస్వతి బుక్‌డిపో, మద్రాసు.
3. యోగదర్శనము - కొండూరి వీరరాఘవాచార్యులు, తెనాలి, 1982.
4. పతంజలి యోగసూత్రములు, అనువాదము : కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య, వరల్డ్ టీచర్స్ ట్రస్ట్, విశాఖపట్టణం, 1983.

★★★

భావవీణ BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-4 | April 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Link : https://www.bhavaveena.com/

# తెలంగాణ వర్తమాన గ్రామీణ నేపథ్య కథలు



డా॥. జ్యోతి అనుగుల
అధ్యాపకురాలు, హైదరాబాద్.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహం :**

ప్రపంచంలో ఏ మూలన ఉన్నా మానవ జీవితానికి తెలుసుకోవడానికైనా ప్రధాన ఆధారం సాహిత్యం. సాహిత్యం జీవితలోతుల్లోకి వెళ్ళి వారి సాధకబాధకాలను సమాజానికి అందిస్తుంది. కాలం మనిషిని నిర్ణయిస్తుంది. కానీ మనిషి కాలాన్ని నిర్ణయించలేడు. కాలానుగుణంగా మనిషి నడవ వలసిందే. ఈ క్రమంలోనే జీవితాన్ని తనకు కావాల్సిన విధంగా తీర్చి దిద్దుకుంటాడు. ఆ విధానంలో జీవితాన్ని మలచుకోవడానికి కొన్ని సమస్యలను ఎదుర్కొవలసి ఉంటుంది. అస్తిత్వ సమస్యలు సాహిత్య పరంగా సృజనీకరించుకోవడానికి రచయితలకు ముడి సరుకుగా ఉపయోగపడుతుంది. సాహిత్యానికి సమాజానికీ మధ్య ఎపుడూ విడదీయరాని సంబంధం ఉంటుంది. సమాజం లేకుండా సాహిత్యం లేదు. ఏ కాల నిర్ణయం చేయాలన్నా ఆ కాలానికి చెందిన, ఆ కాలంలో వచ్చిన సాహిత్యమే ఉపయోగపడుతుంది. అందుకే 'సమాజ దర్పణం సాహిత్యం' అన్నాడు మాక్సిం గోర్కి, సాహిత్యంలో సామాజిక నిబద్ధత కలిగిన రచనలే నిలుస్తాయి. ఆయా కాలాల్లోని సామాజిక కొలమానాలు సాహిత్యంలో కనిపించాలి. వెలువడే సాహిత్యంలో కొన్ని నియమాలుంటాయి. ఆ నియమ నిబద్ధతలకు అనుగుణంగానే సాహితీ ప్రక్రియను గుర్తిస్తాం. ఈ సాహిత్య ప్రక్రియల్లో కథానిక పాత్ర గణనీయమైంది. కథానిక ఆధునిక ప్రక్రియే అయినా ప్రపంచమంతా ప్రజాస్వామ్యం వైపు పయనిస్తున్న కాలంలో పుట్టిన ప్రక్రియ. అందువల్ల కథపై సామాజిక బాధ్యత ఎక్కువ. మన తెలంగాణ గ్రామీణ నేపథ్య కథలను, కథకులను పరిశీలిస్తే ఈ బాధ్యతను గుర్తెరిగే కథా రచయితలు కథా సృజన చేశారనిపిస్తుంది. వీటిని వివరించడమే ఈ వ్యాస ముఖ్యఉద్దేశం.

**కీలకపదాలు :**

అస్తిత్వం, కథానిక, నిబద్ధత, గ్రామీణ జీవితం, వెట్టిచాకిరి, కులవృత్తులు, సామాజిక చిత్రణ, మానవవిలువలు, ప్రపంచీకరణ, తాత్త్వికధోరణి, దృక్పథం, బహుజనులు.

**ప్రవేశిక :**

తెలంగాణ గ్రామీణ కథా సాహిత్యాన్ని అధ్యయనం చేసినట్లైతే అందులో గ్రామీణ జీవితం, సామాజిక పరిస్థితులు, గృహజీవనం, వ్యవసాయం, కూలీనాలీ బ్రతుకులు, విద్యా విషయాలు, వివిధ వృత్తులు, ఆలయాలు, ఉత్సవాలు, జాతరలు, వెట్టిచాకిరి... ఇలా ఎన్నో అంశాలు కనిపిస్తాయి. వీటికి తోడు కులాలు, వర్ణాలు, వర్గాలు దర్శనమిస్తాయి. ఆయా కుల వర్ణ వర్గాల్లో ఉన్నవాళ్లు, లేనివాళ్లు మనకు కనిపిస్తారు. అలాగే పంటలూ, భూముల క్రయ విక్రయాలు, సర్కారుపన్ను నీటిపన్ను ఇవి ప్రాధాన్యం వహిస్తాయి. వీటన్నిటికి తోడు ప్రభుత్వం, రెవెన్యూ పోలీసు వ్యవస్థ, గ్రామాధికారుల వ్యవస్థ అడుగడుగునా తొంగిచూస్తాయి. ఇంక ఇవి కాకుండా వంటలు, అభిరుచులు, మనస్తత్వాలు, ఆచారాలు, ఆటపాటలు, పెళ్లీపేరంటాలు, ఇచ్చిపుచ్చుకోవడాలు ఇలా ఒకటా రెండా తెలంగాణ గ్రామీణ కథా సాహితి విశ్లేషణ ద్వారా తెలంగాణ సర్వస్వాన్ని నిర్మాణ చేయవచ్చునని ఈ కథలు నిరూపించాయి.

**గ్రామీణ నేపథ్య కథలు విశ్లేషణ :**

**అడవిలో వెన్నెల – బి.ఎస్.రాములు :**

బి.ఎస్.రాములు 'అడవిలో వెన్నెల' కథలో 'దొరలంటే ఒక వర్గమే కాని ఒక కులం కాదు' అని, గోండులు అడవిలో జీవిస్తారు కానీ అటవీ సంపదపై హక్కంతా అధికారులు, షావుకార్లదేనని, వారు జరిపే దోపిడీని తెల్పింది. ఈ రెండు కథలు నేపథ్యాలలో ఉన్న భావజాలం ద్వారా కాలయాపన చేస్తాయి. రెండు కథల్లో భౌతిక నేపథ్యాన్ని చిత్రించటం ద్వారా భావజాలాన్ని స్ఫురింపచేయటంతో రచయితలిద్దరూ గొప్ప చాతుర్యాన్ని ప్రదర్శించారు. రైతుల జీవితాలలోని కష్టసుకాలను, కడగళ్ళను, ఆత్మహత్యలను గూర్చి ఎంతోమంది తెలంగాణా కథకులు కథలను అందించారు. వారిలో పి.చంద్, బద్‌లా సంకలనంలోని రచయితలు, తుమ్మేటి రఘోత్తంరెడ్డి, అల్లం రాజయ్య, జూకంటి జగన్నాథం ముఖ్యమైనవారు. భూనిర్వాసితులు (పి.చంద్), బద్‌లా (సంకలనం).

**నేలతల్లి – కాలువ మల్లయ్య :**

కాలువ మల్లయ్య గారి కథలు సింహభాగం తెలంగాణ రైతు జీవనాన్ని, కడగండ్లను, రైతు జీవనంతో ముడిపడి ఉన్న అనేక సమస్యలను చిత్రించినట్టివే. కాలువ మల్లయ్యగారు 'నేలతల్లి' కథలో దేశ ఆర్థిక విధానాలు రైతును సంక్షోభంలోకి నెట్టేసి, భూమికి దూరం చేస్తున్న వైనాన్ని విశ్లేషించారు. ఈ కథలో లసుమయ్య అనే రైతు కొడుకు సింగరేణి బొగ్గుగనిలో ఉద్యోగం చేసుకుంటూనే పల్లెలో ఉన్న పొలానికి పెట్టుబడులు పెడ్తుంటాడు. అయితే పండిన పంట అమ్మినప్పుడు పెట్టుబడులు కూడా రాని పరిస్థితుల్లో భూమిని అమ్మి వేయాలనే నిర్ణయానికి వస్తాడు. ఆ సందర్భంగా లస్మయ్య 'మరి ముసలోల్లున్నరు. వాళ్ళకు పని చేతగాదు, చంపి పారేత్తె అయిపోతుంది గద. లాభాలత్త లెవ్వని భూమి నమ్మొతడట' అని కొడుకుతో పలికిన మాటల్ని బట్టి రైతుకు భూమి మీదున్న ప్రేమ వ్యక్తం అవుతుంది. ఒకతరం నుండి మరోతరానికి మారినాకొద్ది భూమిని నేలత్లి, కన్నతల్లిగా భావించిన దృక్పథం నుండి లాభనష్టాలు బేరిజు వేసుకొని కొని అమ్మే సరుకుగా భూమిని సమకట్టడం వెనుక దాగి ఉన్న నేపథ్యాన్ని ఈ కథ విశ్లేషిస్తుంది.

**సంఘర్షణ – కాలువ మల్లయ్య :**

'సంఘర్షణ' కథ గ్రామీణ సమాజంలో రైతుల నిరక్షరాస్యతను ఆసరాగా తీసుకొని, వడ్డీ వ్యాపారస్థులు దొరల అండదండలతో ఎట్లా దోపిడి చేసేవారో తెల్పుతుంది. ఈ కథలో లసుమయ్య అనే రైతు తీసుకున్న అప్పు కింద షావుకారు వరుసగా పదేండ్లు పంట మీద వడ్లు కొలుసుకెళ్తాడు. గ్రామంలోకి విప్లవోద్యమాలు వ్యాప్తి చెందటంతో మిన్నకుంటాడు. కాస్త సద్దుమణిగాక ఇంకా బాకీ కట్టాలంటూ లస్మయ్యపై పంచాయితీ పెడ్తాడు. ఈ సందర్భంగా షావుకారు దుర్మార్గం వెల్లడవుతుంది. బాకీలేనని లస్మయ్య కాగితం చింపివేస్తే ఊరుకుంటానంటాడు. షావుకారు

తనను దోషిగా నిలబెట్టడానికీ ప్రయత్నిస్తున్నడని గ్రహించిన లస్మయ్య ఇన్నాళ్ళు తనలోనే జరుగుతున్న సంఘర్షణను తప్పనిసరి పరిస్థితుల్లో బయటపెడ్తాడు. ఇన్నిరోజులు దాచిన సంగతిప్పుడు సిగ్గువిడిచి చెబుతున్న, నా భార్యను గూడా ఘోరంగా వాడుకున్నాడు షావుకారి'. అని లసుమయ్య నలుగురిలో చెప్పాల్సి వచ్చిందంటే నిరక్షరాస్యులైన రైతులను ఎట్లా దోచుకున్నారో, ఎంత అనైతికంగా వడ్డీ వ్యాపారులు ప్రవర్తించారో ఈ కథలో ప్రస్ఫుటమవుతుంది.

**భస్మాసుర హస్తం – కాలువ మల్లయ్య :**

రైతు పతనానికి అప్పులు ఎట్లా కారణమవుతున్నాయో విశ్లేషించే కథ 'భస్మాసురహస్తం'. ఈ కథలో నర్సిరెడ్డి అనే తెలంగాణ రైతు పెట్టుబడుల కోసం ఊరి షావుకారు వద్ద అప్పు చేస్తాడు. షావుకారు అప్పు క్రింద పండిన పంటను తీసుకెళ్తాడు. గత్యంతరం లేక భూమి తనఖాపెట్టి బ్యాంకులో ఋణం పొందుతాడు. ముడుపుల కింద అందులోంచి కొంత ఖర్చు పెడ్తాడు. కిస్తు సకాలంలో కట్టనందుకు పరిహారం చెల్లించుకుంటాడు. మళ్ళీ అప్పు కోసం ప్రయత్నిస్తాడు. చివరకు అప్పులు రైతుల పాలిట భస్మాసురహస్తం లాంటివని, సమస్యల పరిష్కారానికి పోరాటమే శరణ్యమని గ్రహిస్తాడు.

ఎ.భూమి-స్వప్నం- కాలువ మల్లయ్య: రైతుకు భూమి మీద ఉన్న మమకారం గొప్పది. భూమిని కన్నతల్లిగా భావించే తత్త్వం రైతుది. అందుకే అతను భూమి పుత్రుడయ్యాడు. చిన్ననాటి నుండి భూమిపై పెంచుకున్న మమకారం, చివరికి అది దక్కకపోయేసరికి ఆ భూమిలోనే ప్రాణాలు వదలిన రైతు బిడ్డ కథ 'భూమి స్వప్నం'. ఈ కథలో వెంకటయ్య రైతుబిడ్డగా పుట్టాడు. చిన్నప్పటి నుండే భూమిపై ప్రేమ పెంచుకున్నాడు. చదువుకుంటూనే వ్యవసాయపు పనులు చేసాడు. ఊళ్ళో ఉంటూ రైతుగా సేద్యం చేయాలన్నది అతని స్వప్నంప తప్పని సరై ఉద్యోగంలో చేరడం వల్ల భూమికి దూరమవుతాడు. ఉన్న కొద్ది పాటి భూమిలో ఒక ఎకరం మాత్రమే పిత్రార్జితంగా దక్కడంతో మరోసారి దూరమవుతాడు. వాలంటీర్ రిటైర్మంట్ తీసుకొని వచ్చిన డబ్బులోంచి మరింత భూమికొనుక్కుంటే, శేషజీవితం అక్కడే గడపవచ్చని భావిస్తాడు. ఊళ్ళో భూమి కొనడానికే వెళ్తున్నాం అని అతని వద్ద డబ్బు తీసుకొనివెళ్ళిన భార్య, కొడుకులు ఊళ్ళో ఉన్నటువంటి ఎకరం భూమిని కూడా అమ్మకానికి పెట్టివస్తారు. మూడు తరాలలో తన 'భూమి స్వప్నం' సాకారం కానందుకు ఊరు చేరుకొని, అమ్ముడుపోయిన భూమిలో విషం తాగి ఆత్మహత్య చేసుకుంటాడు.

**సృష్టికర్త ఆవేదన – కాలువ మల్లయ్య :**

'సృష్టికర్త ఆవేదన' తెలంగాణలో మూడు తరాలలో గ్రామీణ సమాజంలో వచ్చిన మార్పులను తెలియజేస్తుంది. దొరలపెత్తనం, పోరాటాల్లో భాగంగా మారుతున్న మానవ సంబంధాలు ఈ కథలో వాస్తవికంగా చిత్రించారు రచయిత. ఈ కథకు కేంద్రబిందువు 'చింతచెట్టు'. దాన్ని నాటి పెంపు చేసిన సృష్టికర్త తొంబేళ్ళ వృద్ధడు. ప్రహారీ గోడకట్టుకునేటప్పుడు చింతచెట్టు మొదలు దొరల గోడలోపల, దానికొమ్మలు వృద్ధుడి గుడిసెపై వ్రాలి ఉన్నాయి. దాని చెత్త అంతా వృద్ధుడి గుడిసెపై, వాకిలిలో పడుతుంటే ఎన్నో ఏళ్ళుగా ఓపికతో శుభ్రం చేసుకుంటూ వస్తున్నాడు వృద్ధుడు. పోరాటాలతో చైతన్యవంతులైన వృద్ధుని మనుమలు, ఆచింతచెట్టు కొమ్మలు తమ గుడిసెపై ఉండటం వల్ల ఇబ్బందులెదుర్కొంటున్నామని, కాసే కాయలో కొంత వాటా ఇమ్మన్నారు. పంచాయితీ పెద్దల ముందు దొరల పిల్లలు ఇందుకు సమ్మతించకపోగా, ఆ చెట్టుని కొట్టమని ఆజ్ఞాపించారు. కూలీలు చెట్టును నరుకుతుంటే తమకు వాటా ఇవ్వకున్నా సరే, తాను పెట్టిన చెట్టును మాత్రం నరకవద్దంటూ రోదిస్తాడు. చింతచచ్చినా పులుపు చావని దొరతనానికి ప్రతీకగా ఈ కథ ముగుస్తుంది.

**సృష్టికర్తల చిరునామా – కాలువ మల్లయ్య :**

రైతుకు భూమంటే ప్రాణం. సర్వస్వమునూ. భూమి మీద ఆధారపడి బ్రతికేవారు కాబట్టి తమ భూమిని

వదలుకోవడానికి ఇష్టపడరు. తమ గెట్టునానుకొని ఉన్న భూమి అమ్మకానికి వస్తే దానిని వదలిపెట్టరు. ఇక తమ రక్త సంబంధీకులు గాని, పాలివారు గాని గతంలో భూమి పంచుకొని విడిపోతే వారి భూమి తమకే అమ్మాలంటూ పట్టుబడ్తారు. అట్లాంటి గ్రామీణులైన రైతుల మనస్తత్వం 'సృష్టికర్తల చిరునామా' కథలో చిత్రితమయ్యింది. సృష్టికర్తలైన రైతుల చిరునామా పల్లెలే అని, పంటపొలాలే అని కాలువ మల్లయ్య గారు ఈ కథలో వ్యక్తం చేసారు.

**వలస పక్షి – పెద్దింటి అశోక్‌కుమార్ :**

వలస పక్షి కథలో... ఈనాడు శాస్త్ర సాంకేతిక రంగాల ఎదుగుదలతో మనమెంతగానో అభివృద్ధి గాంచామని గర్వపడుతున్నాం. ఈ అభివృద్ధి మాటున యాంత్రికత వల్ల ఎందరో సాధారణ నిరుపేదలు ఉపాధి కరువై జీవించలేక విలవిలలాడిపోతున్నారు. సామాన్యుడు ఎందుకు విలవిలలాడిపోతున్నాడు, అనే ప్రశ్నకు జవాబు స్పష్టంగా చెప్పారు రచయిత పెద్దింటి అశోక్‌కుమార్.

సాయిలు తనకు వారసత్వంగా వస్తున్న వృత్తి గాడిదల ద్వారా ధాన్యం రాశుల్ని చేరవేసి జీవనాధారం పొందేవాడు. ట్రాక్టర్లు రావడం ద్వారా వారి జీవితం చిద్రమైపోయింది. కాలం మారింది మనం మారాలి ఆరు నెలల్లో ట్రాక్టర్ నడపడం నేర్చుకుంటా, మళ్ళ పంట వరకు ఎవరి ట్రాక్టర్‌నైనా నడిపి మీ అందరికి నీడైతా... భర్త సాయిలు మాటల్లో కొత్త దనం గాంచి బాలవ్వ ఆశ్చర్యపోయింది. ఈ కథలో రచయిత మారిన కాలంతో పాటు మారలేక పాత వృత్తినే నమ్ముకొని అందులో బతకలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న అనేక కులవృత్తుల వారికి, బతకడానికి కొత్తమార్గం ఎంచుకోవాలి కాని? చావడం పరిష్కారం కాదంటూ? సందేశం ఇస్తున్నారు.

**ఇగురం – పెద్దింటి అశోక్‌కుమార్ :**

ఇగురం కథలో గొల్లవారి జీవితాలతో పెనవేసుకున్న గొర్రె మేకల, జీవాలతో వారి బాంధవ్యాన్ని వారు ఆ వృత్తిలో ఎదుర్కొనే అనేక కష్టాలను చిత్రించినారు. వీళ్ళకన్న తోడేళ్ళు నయం. కటికె కిషన్, ఫకీర్ ఖాసీం, సర్పంచ్, కారోబార్, వార్డు మెంబర్ వీళ్ళందరూ విషనాగులని వీరి కన్న అడవి జంతువులేనయం... వీళ్ళ నుండి బయట పడడానికి 'ఇగురం' కావాలన్నది భార్య. ఈ మాటలు అతనిలో ఆలోచనను కలిగించాయి. మందకాడికి వెళ్ళి అక్కడ పొంచి ఉన్న వాళ్ళందరిని ఏదో విధంగా పంపించివేసినాడు బీరయ్య... చీకట్లో గడ్డం పోతును తీసుకొని బొండిగెల మంటి వాగు దాటించి అడవిలో వదిలి పెడుతూ... 'సత్తివాంటె మరిచిపోతా', 'బతికితివాంటె మందల కలుపుకుంట'... అనుకున్నాడు. ఈ కథలో కుట్ర పూరితమైన మానవుడి కన్నా జంతుజాలం నయమనే విషయం స్పష్టమవుతుంది.

**ముగింపు :**

గ్రామీణ నేపథ్య కథలు, అడవిలో వెన్నెల-బి.ఎస్.రాములు, నేలతల్లి -కాలువ మల్లయ్య, సంఘర్షణ- కాలువ మల్లయ్య, భస్మాసుర హస్తం-కాలువ మల్లయ్య, భూమి-స్వప్నం- కాలువ మల్లయ్య, సృష్టికర్త ఆవేదన- కాలువ మల్లయ్య, సృష్టికర్తల చిరునామా- కాలువ మల్లయ్య, వలస పక్షి- పెద్దింటి అశోక్‌కుమార్, ఇగురం మొదలైన కథలు తెలంగాణ గ్రామీణ నేపథ్యాన్ని తెలియజేస్తున్నాయి.

ఈ గ్రామీణ వ్యవస్థలో కథలను పరిశీలించిన తరువాత గ్రామమే మానవజీవితానికి పునాది అన్న విషయం అర్థమవుతుంది. గ్రామమంలో బహుజనులు సాంప్రదాయకమైన పనులు చేసుకుంటూ ఒకరినొకరు పరస్పరం సహాయ సకారాలు అందించుకుంటూ జీవనం సాగిస్తుంటారని ఈ కథలు ద్వారా తెలుస్తుంది. ఇలాంటి కథలు మానవుల్లోని జీవకారుణ్య గుణాన్ని పట్టి చూపుతవి. ఇవి మానవ సంబంధాల పరిపుష్టికి దోహదపడుతవి. ఇలా తెలంగాణ గ్రామీణ కథ అన్ని దిశల్లో అన్ని కోణాల్లో తన ఉనికిని ప్రదర్శిస్తుంది.

**ఆధార గ్రంథాలు:**


1. తెలంగాణ కథా - తెలుగు  కథ, డా॥కాలువ మల్లయ్య, జగన్నాథ పబ్లికేషన్స్, 2018
2. అడవి గాచిన వెన్నెల - కాలువ మల్లయ్య - కాలువ మల్లయ్య కథా సంపుటి -డిసెంబర్, 1999
3. ఇగురం పెద్దింటి అశోక్‌కుమార్, ఊటబావి కథాసంపుటి, 2002
4. ధిక్కారం - కాలువ మల్లయ్య అభ్యుదయ పత్రిక, ఫిబ్రవరి 1989
5. సాకిరేవు - పెద్దింటి అశోక్‌కుమార్- కొలిమి- లిఖిత సాహితీ బులిటెన్- సంచిక 33
6. కాగుబొత్త -పెద్దింటి అశోక్‌కుమార్ ఊటుబావి కథా సంపుటి 2005
7. దొరసానిచీర - కాలువ మల్లయ్య, ఘర్మజలానికి ఖరీదు కట్టే షరాబు? కథా సంపుటి, జనవరి 1991


★★★

భావవీణ BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
*Journal of Arts, Literary, Culture & Language Study*
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
**BHAVAVEENA | Volumne-23 | Issue-4 | April 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253**

**Article Link :** *https://www.bhavaveena.com/*

# శ్రీమదాంధ్ర మహాభారతం : భీష్మ పర్వం-భీష్ముని పాత్ర



డా॥. గుబ్బల సత్యశ్రీ
స్కూల్ అసిస్టెంట్ (తెలుగు), జిల్లా పరిషత్ హైస్కూల్, మాచర, కపిలేశ్వరపురం మండలం, అంబేద్కర్ కోనసీమ జిల్లా, చరవాణి : 9030617478.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహం :**

కవిత్రయంలో ఒకరైన తిక్కన సోమయాజి రచించిన భీష్మపర్వంలో భీష్ముని ధర్మనిష్ఠను, ఆయన ఉపదేశాలను స్ఫూర్తిదాయకంగా తీసుకోవచ్చు. ఈ పర్వంలో కురుక్షేత్ర యుద్ధ ఘట్టాలు మరియు భగవద్గీత సందేశాన్ని సామాన్యులకు సైతం అర్థమయ్యేలా ఉన్నాయి. మహాభారతంలో భీష్ముడు అత్యంత కీలకమైన, శక్తివంతమైన, గౌరవనీయమైన పాత్ర. ఆయన అసలు పేరు దేవవ్రతుడు. భీష్ముడు శంతన మహారాజు, గంగాదేవిల కుమారుడు. ఆయన అష్ట వసువులలో ఒకరైన 'ద్యు' (ప్రభాసుడు) అనే వసువు, వశిష్ఠుని శాపం కారణంగా భూమిపై జన్మించాడు. తండ్రి శంతనుడు సత్యవతిని వివాహం చేసుకోవడానికి వీలుగా, దేవవ్రతుడు పెళ్లి చేసుకోనని, ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉంటానని, హస్తినాపుర సింహాసనాన్ని రక్షిస్తానని భయంకరమైన ప్రతిజ్ఞ చేశాడు. ఈ ప్రతిజ్ఞ కారణంగానే ఆయనకు 'భీష్ముడు' (భయంకరమైన ప్రతిజ్ఞ చేసినవాడు) అనే పేరు వచ్చింది. భీష్ముడు పరశురాముని శిష్యుడు. ఆయన యుద్ధ విద్యలలో నిష్ణాతుడు, వేదవేదాంగ పారంగతుడు, పరమ ధార్మికుడు. మహాభారత యుద్ధంలో పది రోజుల పాటు పాండవులకు వ్యతిరేకంగా పోరాడిన భీష్ముడు, అర్జునుని బాణాల ధాటికి అంపశయ్యపై పడిపోయాడు. ఉత్తరాయణ పుణ్యకాలం కోసం ఆయన 58 రోజుల పాటు ఆ అంపశయ్యపైనే ఉన్నాడు. అంపశయ్యపై ఉన్న భీష్ముడు, ధర్మరాజుకు రాజనీతి, మోక్షధర్మాలను బోధించాడు. ఆ సమయంలోనే ఆయన 'విష్ణు సహస్రనామాన్ని' ఉపదేశించాడు. అలాంటి భీష్ముని పాత్ర గురించి చర్చించేదే ఈ వ్యాసం.

**కీలక పదాలు :**

స్థితప్రజ్ఞత, ధర్మనిష్ఠ, అర్థదాసత్వం, దయామయుడు, వీరరస సముద్రం, కురుక్షేత్ర యుద్ధం, వ్యూహరచన పాంచజన్యం, భక్తాగ్రేసరుడు, ఇచ్ఛా మరణం, శరతల్పం మొదలైనవి.

**భీష్ముడి ధర్మనిష్ఠ :**

భీష్ముడు కురు వంశానికి పితామహుడిగా చిరస్థాయిగా నిలిచిపోయాడు. భీష్ముడి ధర్మనిష్ఠ మరియు వ్యక్తిత్వం అత్యున్నతమైనవి. ఇవి అనేక పార్శ్వాలతో దర్శనమిస్తాయి.

**ధర్మనిష్ఠ – కర్తవ్య పాలన :**

భీష్ముడు కురుక్షేత్ర యుద్ధంలో పది రోజుల పాటు కౌరవ సైన్యానికి సర్వసేనాధిపతిగా వ్యవహరించాడు. తన పోషణ కర్త అయిన దుర్యోధనుడి పట్ల కృతజ్ఞతతో (అర్థదాసత్వం వల్ల), పాండవుల పట్ల అనురాగం ఉన్నప్పటికీ, కౌరవుల పక్షాన నిలబడి యుద్ధం చేశాడు. 'ఎక్కడ కృష్ణుడు ఉంటాడో అక్కడ ధర్మం, విజయం ఉంటాయి' అని తెలిసినప్పటికీ, ఆయన తన క్షత్రియ ధర్మాన్ని నిర్వహించాడు. స్థితప్రజ్ఞత - త్యాగనిరతి:

భీష్ముడు ఒక స్థితప్రజ్ఞుడిగా, ఊర్ధ్వరేతస్కుడిగా (బ్రహ్మచారిగా) వర్ణించబడ్డాడు. ఆయన జీవితమంతా త్యాగమయం. తన తండ్రి సుఖం కోసం రాజ్యంపై హక్కును, వివాహ సుఖాన్ని వదులుకున్న మహా త్యాగి. యుద్ధ రంగంలో తన మరణ రహస్యాన్ని స్వయంగా ధర్మరాజుకు వెల్లడించడం ఆయన సత్యసంధతకు, ధర్మనిష్ఠకు నిదర్శనంగా చెప్పవచ్చు.

**యుద్ధ నీతి – సూత్రాలు :**

యుద్ధంలో భీష్ముడికి కొన్ని కచ్చితమైన నియమాలు ఉండేవి. ఆయన స్త్రీలను, గతంలో స్త్రీలుగా ఉన్నవారిని (శిఖండి), ఆయుధం విడిచిన వారిని, భయపడిన వారిని చంపనని ప్రతిజ్ఞ చేశాడు. శిఖండి పూర్వజన్మలో స్త్రీ (అంబ) కావడం వల్ల, అతనిపై తాను బాణం వేయనని ఖరాఖండిగా చెప్పాడు. ఇక్కడ కూడా అతని నీతి, ధర్మం సక్రమంగా పాటించాడు.

**కృష్ణ భక్తి :**

భీష్ముడు కృష్ణుడిని సాక్షాత్తు పరమాత్మగా గుర్తించాడు. కృష్ణుడు తనపైకి చక్రం పట్టుకొని వచ్చినప్పుడు, ఆ భగవంతుడి చేతిలో మరణించడం తన అదృష్టంగా భావించి నమస్కరించాడు. తన మరణం భగవంతుడి సంకల్పమని ఆయన నమ్మాడు. ఇది ఆయనలోని నిగూఢంగా ఉన్న గొప్పతనానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

**అజేయ పరాక్రమం :**

భీష్ముడు యుద్ధంలో అజేయమైన వీరుడు. పది రోజుల యుద్ధంలో ఆయన పాండవ సైన్యాన్ని అతలాకుతలం చేశాడు. ఆయన ధనుర్విద్యలో సాటిలేని మేటి అని, ఇంద్రాదులు కూడా ఆయన్ని జయించలేరనేది వాస్తవ విషయం. ఇక్కడ ఆయన పరాక్రమం అజేయంగా కనిపిస్తుంది.

**కురువంశ పితామహుడు :**

మీరు పాండుసుతులు నారయ నా కొక్క । రూప కార్య మున్న రూపు వలుక
వలయు గయ్యమ ఐన వత్తు మీ లోన నా । యునికి చందమునకు నుచిత మిదియ

(టిటిడి మహాభారతం,భీష్మపర్వం, పీఠిక, పుట:23)

ఆయన కేవలం ఒక వీరుడు మాత్రమే కాదు, కురువంశానికి ఒక రక్షకుడిలా (కవచంలా) నిలిచాడు. యుద్ధం జరుగుతున్నా పాండవుల శ్రేయస్సు కోరుతూ, ధర్మరాజుకు ఆశీస్సులు అందజేసిన దయామయుడు. అందుకే కౌరవులందరికీ పితామహుడయ్యాడు.

భీష్ముడు ఒకవైపు తన ప్రతిజ్ఞా పాలన కోసం అధర్మ పక్షాన పోరాడుతున్నట్లు కనిపించినా, అంతరంగంలో

మాత్రం ధర్మానికి, దైవానికి కట్టుబడి ఉన్న ఒక మహోన్నత వ్యక్తిత్వం గల మహానుభావుడు. కురుక్షేత్ర యుద్ధం-భీష్ముడి అజేయ పరాక్రమం:

శాంతనవుం డనేక బలసంతతి నుద్భట శౌర్యసారదు
ర్దాంత పరాక్రమ స్ఫురణ దాకి సముజ్జ్వల శాతసాయక
క్రాంత పరీత నిర్మథిత కంపిత పాతితమూర్తి జేసి య
త్యంత రయంబునం దన రథంబు గతుల్ మెఱయం బ్రదీప్తుడై

(టిటిడి మహాభారతం,భీష్మపర్వం, పీఠిక, పుట:50)

కురుక్షేత్ర యుద్ధంలో భీష్ముడి అజేయ పరాక్రమం అత్యంత భయంకరమైనదిగా సాటిలేనిదిగా వర్ణించబడింది. ఆయన పది రోజుల పాటు కౌరవ సైన్యానికి సర్వసేనాధిపతిగా ఉండి పాండవ సైన్యాన్ని అతలాకుతలం చేశాడు. భీష్ముడి యుద్ధ పరాక్రమానికి సంబంధించిన ముఖ్య అంశాలు గమనిస్తే, దేవదానవులకు కూడా అజేయుడుగా కనబడతాడు. భీష్ముడు చేతిలో ధనుస్సు పట్టుకుని యుద్ధం చేస్తున్నంత కాలం ఆయన్ని జయించడం ఇంద్రాది దేవతలకు కూడా అసాధ్యమని వర్ణించబడింది. ఆయన స్వయంగా ధర్మరాజుతో "నేను ఆయుధం పట్టి ఉన్నంత వరకు నన్ను ఎవరూ జయించలేరు" అని పేర్కొన్నాడు. యుద్ధ రంగంలో భీష్ముడు విహరిస్తున్న తీరు ప్రళయకాల రుద్రుడిని తలపించిందని, ఆయన బాణ వర్షం శత్రువులకు కంటిమీద కునుకు లేకుండా చేసిందని వర్ణించారు. ఆయన బాణాలు ప్రళయకాల అగ్నిలా శత్రువులను దహించివేసేవని పేర్కొనబడింది. భీష్ముడు యుద్ధరంగంలో ఒక "వీరరస సముద్రం" వంటివాడని, ఆ సముద్రాన్ని ఈదడం ఎవరికీ సాధ్యం కాదని వర్ణించబడింది. ఆయన బాణ సమూహాలు సముద్రపు అలల వలె శత్రువులను ముంచెత్తేవి. ఎండు అడవిని దహించే దావాగ్ని లాగా భీష్ముడు పాండవ సైన్యాన్ని దహించివేసేవాడు. పది రోజుల పాటు ఆయన బాణాలనే కిరణాలతో శత్రువులను తపింపజేసి, చివరకు అంపశయ్యపై ఒరిగిపోయిన "భీష్మ భానుడు" (సూర్యుడు) అని ఆయనను పేర్కొన్నారు. భీష్ముని పరాక్రమం పాండవ సైన్యంలో కల్లోలం సృష్టించింది. భీష్ముడి ధాటికి పాండవ సైన్యం బురదలో కూరుకుపోయిన ఆవులా నిస్సహాయ స్థితికి చేరుకుంది. ఆయన ప్రతిరోజూ వేల సంఖ్యలో సైనికులను, రథికులను నేలకూలుస్తూ పాండవ పక్షంలో అపారమైన నష్టాన్ని కలిగించాడు. భీష్ముడి పరాక్రమం ఎంతటిదంటే, ఆయన ధాటికి అర్జునుడు కూడా తట్టుకోలేకపోయాడు. అర్జునుడిని రక్షించడానికి, తాను ఆయుధం పట్టనన్న ప్రతిజ్ఞను పక్కన పెట్టి శ్రీకృష్ణుడు రథచక్రాన్ని పట్టుకుని భీష్ముడిపైకి ఉరికాడు. ఇది భీష్ముడి అజేయ పరాక్రమానికి ఒక గొప్ప నిదర్శనం.

**భీష్ముని యుద్ధతంత్రం – వ్యూహ రచన :**

భీష్ముడు యుద్ధంలో సర్వతోభద్ర వ్యూహం వంటి కఠినమైన వ్యూహాలను రచించి, శత్రువులకు చిక్కకుండా మండలాకారంలో తిరుగుతూ యుద్ధం చేసేవాడని ప్రతీతి. ఆయన విలువిద్యలోని నైపుణ్యం చూసి దేవతలు కూడా ఆశ్చర్యపోయి పూలవాన కురిపించేవారని చెప్పబడింది. భీష్ముడి యుద్ధం చూసి ధర్మరాజు తీవ్రమైన భయాం దోళనలకు లోనై, ఆయనను జయించడం అసాధ్యమని భావించి తిరిగి అడవులకు వెళ్లిపోవాలని కూడా ఆలోచించాడు. భీష్ముడు తన మరణ రహస్యాన్ని స్వయంగా వెల్లడించి, శిఖండిని అడ్డుపెట్టుకుని యుద్ధం చేయమని చెప్పే వరకు ఆయన అజేయుడిగానే నిలిచాడు. ఆయన పది రోజుల పాటు కౌరవ సేనకు సర్వసేనాధిపతిగా ఉండి పాండవ సైన్యాన్ని అతలాకుతలం చేశాడు.

ఆయన యుద్ధ తంత్రం మరియు వ్యూహ రచన అసాధారణమైనవి. యుద్ధం ముగిసే సమయానికి ఆయన శరీరం నిలువెల్లా బాణాలతో నిండిపోయింది. ఆయన నేలపై పడకుండా, ఆ బాణాల ఆధారంగానే "శరతల్పం"

(బాణాల మంచం) పై పడుకున్నాడంటే ఆయన ఎంతటి సుదీర్ఘమైన, ఘోరమైన యుద్ధం చేశాడో అర్థం చేసుకోవచ్చు. భీష్ముడు తన శక్తిని పూర్తిగా ప్రయోగిస్తే ఒక్కరోజే పదివేల మంది వీరులను సంహరించగల పరాక్రమవంతుడని చెప్పబడింది. తన మరణ రహస్యాన్ని తనే స్వయంగా చెప్పేంత వరకు ఆయనను జయించడం ఎవరికీ సాధ్యపడలేదు అంటే ఆయన ఎంత బలవంతుడో, గొప్పవాడో అర్థం చేసుకోవచ్చు.

**శ్రీకృష్ణుని పట్ల భీష్ముడి భక్తి :**

భీష్మ పర్వంలో భీష్ముడికి శ్రీకృష్ణుని పట్ల ఉన్న భక్తి అత్యంత మహోన్నతమైనది, నిరుపమానమైనది. ఆయన శ్రీకృష్ణుడిని సాక్షాత్తు పరమాత్మగా, నారాయణుడిగా గుర్తించాడు. భీష్ముడి కృష్ణ భక్తిని పరిశీలిస్తే, పరమాత్మగా గుర్తింపునిచ్చాడు. భీష్ముడు శ్రీకృష్ణుని సాక్షాత్తు నారాయణుడిగా భావించాడు. శ్రీకృష్ణుడు పరమేశ్వరుడని, ఆయన అజేయుడని భీష్ముడు పదే పదే దుర్యోధనుడికి వివరించాడు. ఎక్కడ కృష్ణుడు ఉంటాడో అక్కడ ధర్మం, విజయం ఉంటాయని ఆయన ప్రగాఢంగా విశ్వసించాడు. యుద్ధరంగంలో కూడా భక్తిని ప్రదర్శించాడు. కురుక్షేత్ర యుద్ధంలో భీష్ముడు కౌరవుల పక్షాన పోరాడుతున్నప్పటికీ, అంతరంగంలో శ్రీకృష్ణుడి పట్ల అచంచలమైన భక్తిని కలిగి ఉన్నాడు. యుద్ధ రంగంలో శ్రీకృష్ణుడు తనను సంహరించడానికి వస్తే, అది తనకెంతో శ్రేయస్కరమని ఆయన భావించాడు. భీష్ముడి పరాక్రమం, భక్తి ఎంతటిదంటే, శ్రీకృష్ణుడు తాను యుద్ధంలో ఆయుధం పట్టనన్న ప్రతిజ్ఞను పక్కన పెట్టి, చక్రం ధరించి భీష్ముడిపైకి ఉరికాడు.

ధరణీ చక్రము గ్రక్కునం గదల దిగ్దంతావళశ్రేణి కం
ధరముల్ మ్రొగ్గబడన్ దిశావలయ ముత్కంపంబుగా నీబలం
బురులం బాఱగ భీష్ము పై గవిసె రౌద్రోద్రేకముం జూచి ఖే
చరలోకంబును సంచలింప హరి చంచద్బాహు ఘోరాకృతిన్

(టిటిడి మహాభారతం,భీష్మపర్వం, పీఠిక,పుట:47)

ఆ సమయంలో భీష్ముడు భయపడకుండా, భగవంతుడి చేతిలో మరణించడం తన అదృష్టంగా భావించి, శ్రీకృష్ణుడికి శరణాగతి వేడుతూ నమస్కరించాడు అంటే ఆయన భక్తి ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. కృష్ణ సంకల్పానికి విధేయత ప్రకటించడం భీష్ముని వ్యక్తిత్వంగా కనిపిస్తుంది. శ్రీకృష్ణుడు నడిపే ఈ యుద్ధ తంత్రంలో తాను కేవలం ఒక పాత్రధారిని మాత్రమేనని భీష్ముడు నమ్మాడు. పాండవుల విజయం కృష్ణుడి వల్లనే సాధ్యమని తెలిసినా, తన క్షత్రియ ధర్మాన్ని నెరవేరుస్తూనే కృష్ణుడిని ఆరాధించాడు. భీష్ముడు అంపశయ్యపై ఉన్నప్పుడు కూడా శ్రీకృష్ణుడిని ధ్యానిస్తూ, పరమాత్మ దర్శనంతో తన ప్రాణాలను వదలాలని ఆకాంక్షించాడు. తన జ్ఞానాన్ని ధర్మరాజుకు ఉపదేశించమని కృష్ణుడు కోరగా, దానిని శిరసావహించి విష్ణు సహస్రనామము వంటి మహోన్నత స్తోత్రాలను అందించాడు. మొత్తానికి భీష్ముడు శ్రీకృష్ణుని జగన్నాథుడిగా గుర్తించి, తన సర్వస్వాన్ని ఆయనకు అర్పించిన ఒక గొప్ప భక్తాగ్రేసరుడుగా కనబడ్డాడు. భీష్ముడి దృష్టిలో కృష్ణుడు కేవలం పాండవుల పక్షపాతి మాత్రమే కాదు, సర్వలోకాలకు రక్షకుడైన పరమాత్మగా దర్శనమిస్తాడు.

భీష్ముడి శరతల్పం - విశిష్టత :

ఆ శౌర్యం బా సత్త్వం। బా శీలం బా పరాక్రమాభీలత్వం
బా శుద్ధవ్రత మెందు న। నాశము లని భీష్ము బెద్ద నమ్మితిమి గదే!

(టిటిడి మహాభారతం,భీష్మపర్వం, పీఠిక, పుట:39)

భీష్మ పర్వంలో భీష్ముడి శరతల్పం (అంపశయ్య) అత్యంత విశిష్టమైనదిగా, ప్రాముఖ్యత కలిగినదిగా వర్ణించబడింది.

ముఖ్యంగా శరీరం నేలకు తాకకపోవడం విశేషం. యుద్ధం ముగిసే సమయానికి భీష్ముడి శరీరం బాణాలతో ఎంతగా నిండిపోయిందంటే, ఆయన నేలపై పడకుండా ఆ బాణాల ఆధారంగానే నిలిచాడు. ఆయన శరీరం నుండి రక్తం కారుతున్నా, ఆయన ప్రాణాలు వదలకుండా ఆ అంపశయ్యపైనే ఉన్నాడు. ఆయనకు ఉన్న గొప్ప లక్షణం విశేషమైంది. అది ఇచ్ఛా మరణం మరియు ఉత్తరాయణ నిరీక్షణ. భీష్ముడికి తన తండ్రి శంతనుడి నుండి "ఇచ్ఛా మరణం" అనే వరం ఉంది. అంటే తనకు నచ్చినపుడు మరణించే వరం. అందువల్ల, ఆయన సూర్యుడు ఉత్తరాయణ పుణ్యకాలంలోకి ప్రవేశించే వరకు తన ప్రాణాలను అరికట్టి, ఆ అంపశయ్యపైనే వేచి ఉన్నాడు. ఈ సమయం మోక్షానికి అత్యంత ప్రశస్తమైనదిగా భావించబడుతుంది. అంతేకాదు అంపశయ్యపై ఉన్న భీష్ముడికి దాహం వేసినప్పుడు, ఆయన సాధారణ నీటిని తిరస్కరించి వీరుడికి తగినట్లుగా నీరు కావాలని కోరాడు. అప్పుడు అర్జునుడు పాంచజన్యాస్త్రాన్ని భూమిలోకి ప్రయోగించి, ఒక పవిత్రమైన జలధారను నేరుగా భీష్ముడి నోటిలోకి వచ్చేలా చేశాడు. ఇది భీష్ముడి పట్ల అర్జునుడికి ఉన్న భక్తికి, భీష్ముడి వీరత్వానికి నిదర్శనంగా చెప్పబడుతుంది. అలాగే జ్ఞాన పీఠంగా శరతల్పం చెప్పబడింది. భీష్ముడు అంపశయ్యపై ఉన్నప్పుడు ఆయనను దర్శించడానికి కృష్ణుడు, పాండవులు, కర్ణుడు కూడా వస్తారు. శ్రీకృష్ణుడి సూచన మేరకు, భీష్ముడు తన చివరి రోజుల్లో ధర్మరాజుకు రాజ్య ధర్మాలను, మోక్ష ధర్మాలను, విష్ణు సహస్రనామాలను ఇక్కడి నుండే ఉపదేశించాడు. శరతల్పంపై ఉన్న భీష్ముడిని చూస్తుంటే ఆయన చుట్టూ ఒక దేవభావం ఆవహించినట్లుగా ఉందని, ఆయన తన మరణాన్ని కూడా ఒక యజ్ఞంలా భావించాడు. భీష్ముడి శరతల్పం కేవలం ఒక మరణశయ్య మాత్రమే కాదు, అది ఆయన నిగ్రహానికి, ధర్మనిష్ఠకు మరియు అత్యున్నత త్యాగానికి ప్రతిరూపంగా నిలిచింది. ఆయన తన జీవితాన్ని ధర్మ రక్షణ కోసం అంకితం చేసి, చివరకు భగవంతుడి దర్శనంతో తనువు చాలించడానికి సిద్ధమైన పరమ పవిత్ర స్థానమది.

**భీష్ముడి పతనం – శిఖండి పాత్ర :**

కురుక్షేత్ర యుద్ధంలో భీష్ముడి పతనానికి శిఖండి పాత్ర అత్యంత కీలకమైంది. భీష్ముడు అజేయమైన వీరుడు, ఆయన ఆయుధం పట్టినంత కాలం అతనిని ఓడించడం ఎవరికీ సాధ్యం కాదు. భీష్ముడి ప్రతిజ్ఞ ఎంతో శక్తివంతమైంది, ఆయన పాటించి ధర్మ సూత్రం ఆదర్శమైంది. భీష్ముడు తన జీవితంలో కొన్ని కఠినమైన యుద్ధ నియమాలను పాటించాడు. ఆయన స్త్రీలను, గతంలో స్త్రీలుగా పుట్టిన వారిని, స్త్రీ పేరున్న వారిని, ఆయుధం విడిచిన వారిని చంపనని లేదా వారిపై బాణం వేయనని ప్రతిజ్ఞ చేశాడు. ఈ క్రమంలో శిఖండి నేపథ్యం పరిశీలిస్తే, శిఖండి పూర్వజన్మలో స్త్రీ (అంబ) గా జన్మించి, భీష్ముడిపై పగతో శివుడి కోసం తపస్సు చేసి ఈ జన్మలో పురుషుడిగా మారాడు. భీష్ముడు శిఖండిని ఇప్పటికీ స్త్రీగానే పరిగణించాడు, అందుకే అతనిపై ఆయుధం ప్రయోగించడానికి నిరాకరించాడు. ఇక్కడే భీష్ముడు వెల్లడించిన రహస్యం గురించి చెప్పుకోవాలి. తనను జయించడం అసాధ్యమని తెలిసిన భీష్ముడు, స్వయంగా ధర్మరాజుతో తన మరణ రహస్యాన్ని పంచుకున్నాడు. అర్జునుడు శిఖండిని తన రథం ముందు ఉంచుకుని యుద్ధానికి వస్తే, తాను ఆయుధాలను పక్కన పెడతానని, అప్పుడు తనను పడగొట్టవచ్చని ఉపాయం చెప్పాడు. కురుక్షేత్ర యుద్ధంలో భీష్ముని విషయంలో పదవ రోజు కీలకమైంది, ప్రత్యేకమైంది. యుద్ధంలో పదవ రోజున అర్జునుడు భీష్ముడికి ఎదురుగా శిఖండిని నిలిపాడు. శిఖండిని చూడగానే భీష్ముడు విల్లంబులు విడిచి పెట్టాడు. శిఖండి భీష్ముడిపై బాణాలు వేస్తున్నా, భీష్ముడు అతనిని చూసి నవ్వుతూ ఊరుకున్నాడే తప్ప ఎదురుదాడి చేయలేదు.ఆ క్రమంలో శిఖండి వెనుక నుండి అర్జునుడు బాణ వర్షం కురిపించి భీష్ముడి శరీరాన్ని జల్లెడ చేశాడు. భీష్ముడి శరీరంపై బాణాలు ఎంతలా నాటుకున్నాయంటే, ఆయన నేలకు తాకకుండా ఆ బాణాల ఆధారంగానే అంపశయ్యపై పడిపోయాడు. భీష్ముడు అనే "వీరరస సముద్రాన్ని" దాటడానికి శిఖండి ఒక "నౌక" (పడవ) వలె ఉపయోగపడ్డాడని చెప్పబడింది. శిఖండి లేకపోతే భీష్ముడిని ఓడించడం పాండవ సైన్యానికి అసాధ్యమయ్యేది.

**ముగింపు :**

కురుక్షేత్ర యుద్ధంలో భీష్ముని పతనం ఒక శకం ముగిసినట్లుగా మరియు మరొకటి మొదలైనట్లుగా ఉంటుంది. పది రోజుల పాటు సాగిన భీకర యుద్ధం తర్వాత, పదవ రోజున అర్జునుడు శిఖండిని అడ్డుపెట్టుకుని భీష్ముడిపై బాణాల వర్షం కురిపిస్తాడు. దీనివల్ల భీష్ముడు తన గాండీవాన్ని వదిలేసి, లెక్కలేనన్ని బాణాలు గుచ్చుకున్న తన శరీరం నేలకు తాకకుండా "శరతల్పం" (అంపశయ్య) మీద పడిపోతాడు. భీష్ముడు సైన్యాధిపతిగా ఉన్నంత కాలం యుద్ధం చేయనని పట్టుబట్టిన కర్ణుడు, భీష్ముడు అంపశయ్యపై పడిపోయిన తర్వాత ఆయనను దర్శించడానికి వస్తాడు. పితామహుడికి నమస్కరించి, ఆయన ఆశీస్సులు పొందుతాడు. కర్ణుడు యుద్ధ రంగంలో ప్రవేశించడానికి మార్గం సుగమమవడంతో ఈ తొలి యుద్ధ పర్వం ముగుస్తుంది. యుద్ధం ముగిసే సమయానికి భీష్ముడు అంపశయ్యపై ఉండి ఉత్తరాయణ పుణ్యకాలం కోసం వేచి చూస్తూ ఉంటాడు. ఈ సమయంలోనే ఆయన కృష్ణుడి సూచన మేరకు ధర్మరాజుకు రాజ్య ధర్మాలను మరియు విష్ణు సహస్రనామాలను ఉపదేశిస్తాడు. ఇది భీష్మ పర్వంలో మొదలై శాంతి పర్వంలో కొనసాగుతుంది, కానీ ఇక్కడ భీష్ముడు ఒక 'నివృత్తి స్థానం'గా నిలిచినట్లు పేర్కొనబడింది. భీష్మ పర్వం కేవలం యుద్ధం గురించి మాత్రమే కాకుండా, మానవ మనస్తత్వంలోని సంఘర్షణలను, ముఖ్యంగా భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు అర్జునుడికి (మరియు మానవాళికి) కర్తవ్య బోధ చేయడాన్ని చూపుతుంది. భీష్ముడు అనే వీరరస మహా సముద్రాన్ని దాటిన పాండవులు, తదుపరి యుద్ధానికి సిద్ధమవడంతో ఈ పర్వం ముగుస్తుంది. భీష్ముడి పతనంతో ధర్మరాజుకు యుద్ధంలో విజయం లభిస్తుందనే నమ్మకం కలుగుతుంది, ఎందుకంటే భీష్ముడు ఆయుధం పట్టి ఉన్నంత వరకు ఆయనను జయించడం ఎవరికీ సాధ్యం కాదని స్వయంగా భీష్ముడే పేర్కొన్నాడు. భీష్ముడి పతనం, ఆయన ద్వారా కర్ణుడు ఆశీస్సులు పొందడం ద్వారా కురుక్షేత్ర యుద్ధం తదుపరి దశకు చేరుకుంటూ ఈ పర్వం ముగుస్తుంది. ఈ విధంగా భీష్మ పర్వంలో భీష్ముని పాత్ర ఆదర్శవంతంగాను, శక్తివంతంగాను, చైతన్య వంతంగాను కనిపిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. అంతరార్థ మహాభారతము (ముక్తిసాధనా మార్గము) - వేదుల సూర్యనారాయణ శర్మ.
2. భారతవరణము(రూపకం)- తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రచురణ.
3. శ్రీమదాంధ్ర మహాభారతము (సరళ వ్యాఖ్యాన సహితం) - తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రచురణ, 2013.

★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-4 | April 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Link : *https://www.bhavaveena.com/*

# ఆధునిక కవిత్వంపై స్వాతంత్రోద్యమ ప్రభావం



డా॥. సూరేపల్లి గోదావరి
అధ్యాపకురాలు, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహం :**

సమాజం మార్పును ఆహ్వానిస్తూ వుంటుంది. సాంఘీక, రాజకీయ మతోద్యమాలు ఆవిర్భవించడం మనకు తెలిసిందే. భరతమాతను దాస్యం నుండి విముక్తిగావించ డానికి వివిధ రంగాల ప్రముఖులు, ప్రజలు తమవంతు కృషిచేశారు. తెలుగు కవులు ఆ పవిత్ర యజ్ఞంలో ప్రత్యక్షం గానో, పరోక్షంగానో పాలుపంచుకున్నారు. వారి కలాన్ని ఆయుధంగా మలచుకొన్నారు. ఆయా కవుల రచనలు దేశప్రజలను చైతన్యవంతుల్ని చేశాయి. “జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ” అనే సూక్తి అక్షర సత్యమని జాతీయోద్యమ చరిత్ర వలన తెలుస్తుంది.

తెలుగు సాహిత్య చరిత్రలో కవిత్వం ఎక్కువ ప్రాధాన్యం వహిస్తుంది. ప్రాచీన సాహిత్యంలో రాజ్య మేలిన ఏకైక సాహిత్య ప్రక్రియకవిత్వం. కవిత్వానికి ముందు తక్కిన ప్రక్రియలు ఏవీ నిలబడలేక పోయాయి. కవిత్వానికున్న ప్రకటనా పటుత్వం, ఏ భావజాలాన్నైనా తమలో ఇముడ్చుకోగలిగిన శక్తి ఉన్నందు వలనే, కవిత్వం సాహిత్య చరిత్రలో అలనాటినుంచి ఇప్పటి వరకు మహారాణిలా వెలుగొందుతోంది. ఏ ఉద్యమంలోనైనా మొట్టమొదట స్పందిచేవారు కవులే. ఏ భారతీయ భాషలోనైనా ఉద్యమ సాహిత్యంలో కవిత్వం పుష్కలంగా వస్తుంది. భారత జాతీయోద్యమంలో కూడా కవిత్వానిదే అగ్రస్థానం.

సంప్రదాయదృష్టితోగాని ఆధునికదృష్టితోగాని చరిత్రను వర్తమానానికి స్ఫూర్తిగా తీసుకోవడం ఒక సంప్రదాయం. జీవితంలోనూ దాని ప్రతిఫలనమైన కళలలోనూ ఇది సాధారణం. సామాజిక ఉద్యమంలోనూ, ఉద్యమ కళలలో కూడా చరిత్ర ప్రధాన భూమిక పోషిస్తుంది. జాతీయోద్యమకాలంలో భారతదేశానికి గొప్పచరిత్ర, సంస్కృతులున్నాయని, మనపూర్వ నాయకులు గొప్ప వీరులని వర్తమానసమాజానికి తెలియజేసి ఉద్యమానికి ఊపిరిలూదే పనిని మన తెలుగు కవులు బాగా చేశారు. వీరి రచనల్లో స్వాతంత్రోద్య అంశాలను వివరించడమే ఈ వ్యాస ఉద్దేశం.

ప్రవేశిక :

భారతదేశంలో బ్రిటీషు పాలన ఆరంభమైంది. రైళ్ళు, టెలిఫోన్ల వంటి ఆధునిక యంత్రాలు ప్రవేశించాయి. ఇంగ్లీషు విద్య ప్రారంభమైంది. పాశ్చాత్య భాషా సాహిత్యం ప్రభావం పడింది. ఇవన్ని భారతదేశంలో ఆధునికతకు పునాదులు వేశాయి. పాశ్చాత్యుల హేతువాదం, కాల్పానిక వాదం 19, 20 శతాబ్దాలలో భారతదేశంలో ప్రవేశించాయి. భారతీయుల జీవన విధానంలో, మత, సామాజిక, రాజకీయ విధాన, పరిపాలనా రంగాలలో ఆధునిక ధోరణులు వచ్చాయి. ఇవి సాహిత్యంలో నవ్యతను తెచ్చాయి. బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా జాతీయోద్యమం ఆరంభమైంది. అది కూడా సాహిత్యాన్ని ప్రభావితం చేసింది. కందుకూరి, గురజాడ, గిడుగుల సంఘ భాషా సంస్కరణోద్యమాలు సాహిత్య ధోరణులలో నవ్యతను తెచ్చాయి. ఆత్మాశ్రయరీతి, వాస్తవికవాదం, కాల్పనిక వాదం మొదలైనవి. నవ్యకవితోద్యమం పేరుతో వ్యాప్తిలోకి వచ్చాయి.

ఆధునిక కవిత్వంపై స్వాతంత్రద్యోమ ప్రభావం: 1885లో జాతీయ కాంగ్రెస్ స్థాపనతో దేశంలో జాతీయోద్యమానికి అంకురార్పణ జరిగింది. దేశీయ ఉద్యమం ప్రారంభం, సంఘ సంస్కరణోద్యమం, నిమ్నజాతి ఉద్ధరణ, గ్రంథాలయోద్యమం మొదలయిన వాటివల్ల కవులు, రచయితల ఆలోచనలలో మార్పులు వచ్చాయి. కొత్త భావాలతో, కొత్త రచన ప్రక్రియలు చేపట్టడం ప్రారంభించారు. ఈ పరిణామదశలో ఉద్భవించిన కందుకూరి వీరేశ లింగం సాంఘిక రంగంలో సంస్కరణలకు పునుకోవడమే కాక సాహిత్య రంగంలో నూతన ప్రక్రియలకు దారి తీసి ఆధునిక యుగకర్తగా కీర్తిపొందాడు. అంతవరకు పద్యానికి గల ప్రముఖ స్థానాన్ని కాదని గద్య వాఙ్మయ ప్రక్రియలు. కథలు, వ్యాసం, నాటకం, నవల, విమర్శ మొదలైనవి ఆవిర్భావించాయి.

పరప్రభుత్వ వలసపాలనకు నిరసనగా జాతీయ పునరుజ్జీవనోద్యమం తలెత్తింది. రాజారామమోహనరాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, దయానంద సరస్వతి, స్వామి వివేకానంద, అనిబిసెంట్ మొదలైన మేధావుల ప్రబోధ ప్రభావంతో మానవతావాదం, సంఘ సంస్కరణ దృక్పథం, జాతీయత భావాలు దేశమంతటా పరివ్యాప్తమైనవి. జాతీయ పునరుజ్జీవన చైతన్యం బయల్దేరింది.

1885లో జాతీయ కాంగ్రెస్ ఏర్పడటంతో స్వాతంత్ర్య పోరాటానికి వేదిక రూపొందింది. ఎందరో దేశభక్తులు బయలుదేరి తమ ధనమానప్రాణాలను సైతం లెక్క చేయకుండా బానిసత్వ విముక్తికి పాటుబడ్డారు. ఈ పోరాటంలో తెలుగుదేశంలోని రచయితలు, కవులు కూడా ముందుంజవేసి దేశభక్తి సంభందించిన రచనలు వెలువరించి జాతిని జాగృతం చేశారు. 1897-98 ప్రాంతంలో సరస్వతి, చింతామణి పత్రికల్లో దేశ పరిస్థితిని చిత్రించే పద్యాలు ప్రచురితమైనవి. జాతీయ పునరుజ్జీవ నోద్యమ ప్రభావంతో తెలుగులో దేశభక్తి కవిత్వం, రాష్ట్రభక్తి కవిత్వం, సంఘ సంస్కరణ కవిత్వం ప్రారంమైనాయి.

తెలుగులో ఆధునిక కవిత్వం దేశభక్తి కవితా రూపంలోనే ప్రారంభమైంది. బ్రిటిష్ వారి దమన నీతికి ఫలితంగా బెంగాల్ విభజన జరగటంతో 1904-05లో దేశమంతటా నిరసన వ్యక్తమైన తరుణంలో మద్రాస్ రాష్ట్రం నుండి కూడా గంజాం, విశాఖ జిల్లాలను వేరు చేయాలన్న ప్రయత్నాన్ని ఆంధ్రులు “వందేమాతరం మనదే రాజ్యం” నినాదంతో తీవ్రంగా ప్రతిఘటించి ఆ యత్నాన్ని విరమింపచేశారు. ఈ సందర్భంలోనే ఒక అజ్ఞాత కవి “ది క్రై ఆఫ్ మదర్ ఇండియా” పేరుతో కృష్ణా పత్రికలో ప్రబోధ గీతం వెలువరించాడు.

దూడనోరు గట్టి ద్రోహంబు గొల్లలు
పాడి సమస్తముపరులకమ్ముగతి కూడ
కూడులేని నా కొడుకుల గాదని
ఏడకో నా ధనమెల్లను బోయెడి

అన్న ఈ గీతమే చిలకమర్తి వారి క్రింది ప్రసిద్ధ పద్యానికి ప్రేరకమై ఉంటుంది.

సంఘసంస్కర్త, దేశభక్తుడైన చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులు రాసిన "భరతఖండంబు చక్కని పాడియావు హిందువుల లేగదూడలై యేడ్చుచుండ తెల్లవారను గడుసరి గొల్లవారు పితుకుచున్నారు మూతులు బిగియబట్టి" అనే ప్రభోధాత్మక గేయాన్ని మొట్టమొదటి జాతీయోద్యమ కవితగా విమర్శకులు పేర్కొంటారు. 1905వ సంవత్సరంలో బిపిన్ చంద్రపాల్ గోదావరి మండల పర్యటనకు వచ్చినప్పుడు ఒక సభలో చిలకమర్తి వారు ఆశువుగా చెప్పి సభికులను ఉత్తేజితులను చేశారట. అతి సరళమైన పదాలతో నిండి ఉన్న ఈ పద్యం తెలుగువారిని ఉద్రూతలూగించింది. అయితే ఇక్కడ మరోక విషయమేమిటంటే ఈ గేయాన్ని చిలకమర్తి రాయలేదని ఎవరో ఒక అజ్ఞాతకవి (ఉన్నా ప్రగడ భానుమూర్తి) రాసిన దానిని ఈయన పాడారని కొంతమంది అభిప్రాయం.

1907లో లాలా లజపతిరాయ్ ని ఆంగ్లేయులు అరెస్టు చేసినప్పుడు చిలకమర్తి గారు రచించిన మరో జాతీయోద్యమ గేయం.

"చెరసాలల్ పృడుచంద్రశాల లెయగన్, చేదోయి గీలించున
య్యరదండల్ విరిదండలయ్యెడున్, హేయంబైన చోడంబలే
పరమాన్నంబగు, మోటు కంబళులు దాల్పన్ పట్టు సెల్లాలగున్
స్థిరుడై యేనరుడొత్మ దేశమును భక్తిం గొల్చునవ్వానికిన్"

నవ్యకవిత్వానికి అడుగుజాడ గురజాడ క్రొత్త పాతల మేలుకలయికలో తెలుగువారి మత్తువదల గొట్టిన భావ విప్లవకారుడు గురజాడ. ఈయన 1910లో రాసిన దేశభక్తి గేయం ప్రజలను ఎంతగానో ఉత్తేజితులను చేసిందని చెప్పుకోవాలి. సాహిత్యాన్ని సమాజ ప్రయోజనం కోసం ఉపయోగించిన మొట్ట మొదటి ఆధునిక తెలుగుకవి గురజాడ. ఆంధ్రలోకము తనను ఒక వ్యక్తిగా, కవిగా గుర్తించేటట్టు జీవించాడు. "దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నాది పెంచుమన్నా" అని వ్యవహారిక భాషలో అందరికి అర్థమయ్యేలా చిన్న చిన్న మాటలతో రాశారు. "చెట్టపట్టాల్ పట్టుకొని, దేశస్థులంతా నడవవలెనోయ్, అన్నదమ్ములవలెను జాతులు, మతములన్ని గురజాడ మెలగవెలెనోయ్"అని ప్రజలకు చెప్పారు. శ్రమశక్తిని గౌరవించుమన్నాడు. సాటిమనిషికి తోడ్పడాలన్నాడు. ఏ ఉద్యమానికైనా వ్యక్తిగత శక్తి అవసరం. ఆ రోజులలో స్వాతంత్ర్య సాధనకు అలాంటి ఐక్యశక్తి కావలసివచ్చింది. రాజమహేంద్రవరంలో 1907లో బిపిన్ చంద్రపాల్ స్వదేశీ ఉద్యమంలో భాగంగా సభ ఏర్పాటుజేశారు. ఆ సభలో బిపిన్ చంద్రపాల్ ఆంగ్ల ప్రసంగంతో ప్రభావి తుడైన ప్రసిద్ధ కవి, రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు చెప్పిన పద్యం అనాడు ఎంతో ప్రఖ్యాతి చెందింది.

"భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"

దీన్ని సాహితీ విమర్శకులు తెలుగులో వచ్చిన తొలి జాతీయోద్యమ రచనగా పేర్కొన్నారు.

సహాయ నిరాకరణం 1920, ఉప్పుసత్యగ్రహం 1930 మున్నగు ఉద్యమాల ప్రభావంతో విరచితమైన పాటలు, ప్రచారగీతాలు స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రజల మధ్యకు తీసుకువెళ్లాయి. గరిమెళ్ల సత్యనారాయణ, త్రిపురనేని రామస్వామిచౌదరి, బసవరాజు అప్పారావు మున్నుగు వారి గీతాలు బహుళ ప్రచారం పొందాయి. పద్య, గేయ,

పాటలు, బుర్రకథలు, కీర్తనలు దేశభక్తి కవిత్వం ద్వారా దేశదుస్థితి, దేశవైభవం, మాతృదేశభక్తి, స్వాతంత్ర్య రక్త వస్తువులుగా తీసుకొన్నారు.

రాయప్రోలు సుబ్బారావు రచించిన 'జన్మభూమి' గేయం ఎంతో చైతన్యాన్ని, స్ఫూర్తిని రగిలించింది.

"ఏదేశమేగినా ఎందుకాలిడిన
ఏ పీఠమెక్కిన ఎవ్వరెదురైన
పొగడరా నీతల్లి భూమి భారతిని
నిలువరా నీజాతి నిండు గౌరవము"

అని జాతీయాభిమానం రగిలించే కవిత్వం రచించారు. పూర్వ పుణ్యం వల్ల ఈ స్వర్గఖండంలో జన్మించావని ప్రబోధిం చారు. రాయప్రోలు వారు తన కవితావర్ణనలో దేశితనం, భాషా నిర్మాణంలో మార్గతత్వం పాటించి రచించిన ఈ గేయం జాతీయోద్యమం కాలంలోనే గాక, ఏ కాలంలోనైనా పాడుకోదగ్గ గొప్పరచన. అందుకే ఇది దేశభక్తి గేయాలలో మణిమకుటాయమానంగా నిలిచిన రచనగా స్థిర కీర్తినందుకొంది.

భారత జాతీయతను ప్రబోధించిన కవుల్లో గురజాడ అప్పారావు ఒకరు. ఆయన రచించిన 'దేశభక్తి' గేయంలో జాతీయ అభిమానంతో పాటు విశ్వమానవ ప్రేమను ప్రబోధించి సంకుచిత తత్త్వానికి కూడా సమాధికట్టాడు.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్"

- అని ఉద్బోదించిన ఈ గేయంలో

"సొంతలాభం కొంతమానుకొని
పొరుగువారికి తోడుపడవోయ్
దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్"

అని ఎలుగెత్తి చాటినాడు గురజాడ దేశభక్తి గేయము కొందరి దృష్టిలో వాచకపుస్తకములలోని నీతులు వంటిది మాత్రమే. కానీ శ్రీశ్రీ వంటి మహాకవికి "సమస్త ప్రపంచ మహాజనుల జాతీయగీతం"గా కనిపించిది, వినిపించింది. దేశభక్తికి, జాతీయతకు సరియైన అర్థమును మనవతా దృష్టితో రంగరించి రచించిన "దేశభక్తి" గేయం అంతర్జాతీయ ప్రసిద్ధికెక్కింది.

రాష్ట్ర భక్తి కవిత్వం జాతీయ పునరుజ్జీవనోద్యమ ప్రభావంతో దేశభక్తి కవిత్వం అంతర్భాగంగా రాష్ట్రభక్తి కవిత్వం వెలసింది. 1910లో గుంటూరు సభలో ఆమోదింపబడిన ఆంధ్రరాష్ట్ర తీర్మానం. 1913లో ఏర్పాటైన ఆంధ్రమహాసభ మొదలైనవి ఆంధ్రోద్యమానికి ప్రేరకమైనాయి. జాతి, దేశ, భాషభిమానాలు ముప్పేట లుగా పెనవేసుకొని ఈ ఉద్యమానికి ఊపిరి పోశాయి.

'నాదుజాతి నా దేశము నాదు భాష
అను అహంకార దర్పన మందు మాంధ్ర.

అన్న ప్రబోధం రాష్ట్రోద్యమ కవితకు బీజావాపన మైంది. ప్రాచీనాంధ్రుల ఘనవిజయాల చరిత్రను పరిశోధకులు త్రవ్వి తలకెత్తగా, అందలి ఉజ్జ్వల ఘట్టాలను వస్తువులుగా గ్రహించి కవులు కవితలల్లారు.

దేశమాతను స్తుతిస్తూ తెలుగు కవులు వేదుల సత్యనారాయణ, గురజాడ, రాఘవశర్మ, కాటూరి వెంకటేశ్వర రావు ప్రభృతులు ప్రఖ్యాత గీతాలు రాశారు. అలాగే దేశమాతను స్తుతించిన గేయాల్లో ప్రముఖంగా పేర్కొనవలసినవి దువ్వూరి వారి 'జాతీయగీతం', రాయప్రోలువారి 'జన్మభూమి, తమ్ముడా!, కాటూరివారి 'మాతృస్తవం', కవి కొండల వెంకటరావుగారి 'ఉయ్యాలా! జంపాలా !, వేదులవారి 'మా తల్లీ', 'ప్రియ భారతావనీ', దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి 'జాతీయగీతం' మొదలైనవి. ఇవన్నీ మాతృదేశ గీతాలాపనల్లో పునీతమయ్యాయి. దేశమాతను స్తుతించిన గీతాల్లో తలమానికమైన ప్రసిద్ధగీతం దేవులపల్లి కృష్ణశాస్త్రి గారిది.

"జయజయజయ ప్రియ భారత జనయిత్రీ, దివ్య ధాత్రి
జయజయజయ శతసహస్ర వరవారి హృదయనేత్రి"

గీతమయింది. అంటూ ఆ మహాకవి దేశమాతకు నివాళులర్పించాడు. 1940 దశకంలో జరిగిన అనేక విద్యార్థి సమావేశాల్లో ఈ గీతం ప్రార్థనా గీతమయింది. ఉద్యమానికి ఆరంభ సూచన మేల్కొలుపు. ఉద్యమ సాహిత్య ప్రాదుర్భావానికి ప్రారంభసూచన మేల్కొలుపు సాహిత్యం." జాతీయోద్యమంలోకి జన సమీకరణ కోసం ప్రజా కవులు ప్రజల్ని మేల్కొలిపారు. పోరాట పథాన్ని చూపారు.

"పొడుపు కొండమీద - పొడిచె నల్లదె ప్రొద్దు
తడయకింకను వేగలేరా - భారతతల్లికి పుట్టినౌరా ॥పొడుపు॥
వేగుచుక్క ఓతడ వేకువ మేల్కాంచి యోగముద్రలు
మరిచినావు ఓరి భోగాసక్తుడవై చెడ్డావు
రోగాలకెల్లను జాగా చేసితి విల్లు- పోగాల మెదురైన
పొలము చేనె విధాన ॥పొడపు॥

అనే 'మేలుకొలుపు' గీతాలు పాడుతూ గరిమెళ్ళ సత్యనారాయణ జాతిని జాగృత పరిచారు. త్యాగాలతో తల్లి ఋణాన్ని తీర్చుకొమ్మనే తత్వాన్ని ప్రబోధించారు.

'మేలుకొనుడు! మేలుకొనుడు ! మేల్మి బంగారు ఉషస్సిద్ధి" అంటూ దేశీయుల్ని మేల్కొలిపిన బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి 'ఆకులు మేల్కొంటున్నవి, పక్షులు మేల్కొంటున్నవి, గుడిగంటలు మేల్కొంటున్నవి, పిల్లపూవులు మేల్కొంటున్నవి, నరపాయపు కాల్వవలె పథము మేల్కొంటున్నది' అనే ఆశాపథాన్ని నిర్దేశించారు.

కవికుమారులు ముట్నూరి వేంకట సుబ్బారాయుడు, మంగిపూడి వేంకటశర్మ రాసిన గీతం

"దేశాభిమానంబు, దీపింపజేయమం
త్రంబు వందేమాతరంబు నుండు
సాహసౌదార్యమున్ సమకూరజేయుమం
త్రంబు వందేమాతరంబు నుండు"

అంటూ స్వాతంత్ర్యాన్ని చేతికందించే తంత్రంగా, ఐకమత్యాన్ని సాధించే మంత్రంగా, దేశాభిమానాన్ని దీపింపజేసే జంత్రంగా . 'వందేమాతరం' నినాదాన్నీ, వందేమాతరం ఉద్యమాల్నీ వర్ణిస్తుంది. ఒక వైపు మేల్కొలుపు సాహిత్యాన్ని సృష్టిస్తూనే, మరోవైపు 'బానిస భారతం' యొక్క దైన్యాన్నీ, దయనీయతనూ వర్ణిస్తూ జాతీయోద్యమ రచయితలు ప్రజల్ని కర్తవ్యోన్ముఖుల్ని చేశారు.

**ముగింపు :**

తెలుగు వారిలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిలింప జేయడంలో తెలుగు సాహిత్యం పాత్ర అమేయమైనది.

జాతీయోద్యమ నేపథ్యంలో పలు ప్రక్రియల్లో రచనలు వెలువడ్డాయి. తెలుగు వారికి పద్యం అన్నా, పాట అన్నా పంచప్రాణాలు. అందుకే పద్యప్రక్రియలకు తెలుగువారు వెయ్యేళ్లపాటు నీరాజనాలు పలికినారు. పాటను తెలుగు వారు జానపద పాటల రూపంలో బ్రతికించుకుని, ప్రతి సందర్భంలోనూ పాటరూపంలో కైకట్టి పాడడం ద్వారా పాటకు తెలుగు సంస్కృతిలో ఎంత విశిష్టమైన స్థానం ఉందో మనందరికీ అవగతమే. జాతీయోద్యమంలోనూ, విప్లవ సాహిత్యోద్యమంలోనూ, తెలంగాణా ప్రత్యేక ఆవిర్భావోద్యమంలోనూ తెలుగు పాట తనవంతు పాత్ర పోషించింది. తెలుగు సాహిత్యంలో అత్యంత శక్తివంత మైన, ఆకర్షణీయమైన ప్రక్రియల్లో పద్యం, పాట విశిష్ట మైనవి.

**ఆధార గ్రంథాలు :**


1. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి భారత జాతీయోద్యమ సాహిత్యం, నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ, డిసెంబర్ 2012.
2. గురజాడ రాఘవశర్మ (సంపాదకులు), జాతీయ గీతాలు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1973.
3. చల్లా రాధాకృష్ణ శర్మ, మాకొద్దీ తెల్ల దొరతనము (వ్యాసం), ఆంధ్రప్రభ సుచిత్ర వారపత్రిక, 1985.
4. చంద్రశేఖర్ రెడ్డి రాచపాళెం, ఆధునికాంధ్ర కవిత్వం, ఉద్యమాలు (విశాలాంధ్ర బుక్ హౌస్, హైదరాబాద్)
5. యాదగిరి, కె.ఆచార్య, 2012, తెలుగులో కవిత్వోద్యమాలు - (సం) తెలుగు అకాడమి, హైదరాబాదు.


★★★

భావవీణ
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-4 | April 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# స్త్రీవాదోద్యమ సిద్ధాంతకర్త మల్లాది సుబ్బమ్మ – పరిశీలన



డా॥. డి. సత్యలత
తెలుగు విభాగం, ఆంధ్ర విశ్వ విద్యాలయం, విశాఖపట్నం -530 003.
సెల్ - 9885910709.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహం**

ప్రముఖ మహిళోద్యమ నాయకురాలు "మల్లాది సుబ్బమ్మ గారు" తెలుగు స్త్రీవాద ఉద్యమ సాహిత్యంలో సిద్ధాంత కర్త, చైతన్యదాత, మార్గదర్శకురాలుగా అత్యున్నత స్థానం పొందారు. ఆమె రచనలు స్త్రీల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక స్థితిగతులను విశ్లేషిస్తూ, పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ ఎదుర్కొనే అన్యాయాలను స్పష్టంగా ప్రతిపాదిస్తాయి. స్త్రీ స్వాతంత్ర్యం, సమాన హక్కులు, విద్య ప్రాముఖ్యత వంటి అంశాలను ఆమె తన రచనల ద్వారా బలంగా ప్రచారం చేశారు. ఆమె భావజాలంలోని స్త్రీని కేవలం కుటుంబ పరిమితుల్లో బంధించిన వ్యక్తిగా కాకుండా, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే శక్తిగా చూస్తారు. స్త్రీ స్వీయ గౌరవం, ఆత్మనిర్భరత మరియు చైతన్యం పెంపొందించడం ద్వారా సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని ఆమె నమ్మకం.

ఈ వ్యాసంలో మల్లాది సుబ్బమ్మగారి స్త్రీవాద దృక్పథం కేవలం విమర్శాత్మకంగా కాకుండా, మార్పు దిశగా దారి చూపించే విధంగా ఉంటుంది. ఆమె రచనలు స్త్రీల హక్కుల కోసం పోరాటానికి ప్రేరణగా నిలిచాయి మరియు తెలుగు స్త్రీవాద ఉద్యమానికి బలమైన సిద్ధాంత పునాది అందించాయి. సంక్షేపంగా మల్లాది సుబ్బమ్మ గారి స్త్రీవాద సిద్ధాంతం సమానత్వం, స్వేచ్ఛ, ఆత్మగౌరవం అనే విలువలపై ఆధారపడి స్త్రీ సాధికారతకు మార్గదర్శంగా నిలుస్తుంది.

**కీలక పదాలు**

స్త్రీవాదం, పితృస్వామ్య వ్యవస్థ, అణచివేత, లింగ సమానత, ఆత్మగౌరవం, ఉద్యమం చైతన్యం, పోరాటం, సమానత్వం.

**ఉపోద్ఘాతం**

ఫెమినిజం ప్రతి విషయాన్ని స్త్రీల అనుభవాన్ని కేంద్రంగా చూస్తుంది. అవసరమైతే తనను తాను కూడా విమర్శించుకునే శక్తి కూడా దానికి ఉంది. సమాజంలోని పునాది నిర్మాణాలలో కుటుంబం, ఆస్తి, బలవంతపు

హెటరో సెక్సువల్ సంబంధాలు, కులం, వివక్ష మొదలగు అంశాలుంటాయి. ఫెమినిజం అంటే స్త్రీలకు సమాన హక్కులు అడగడం ఒక్కటే కాదు. స్త్రీల జీవితాల్లోని పబ్లిక్, ప్రైవేటు ప్రాంతాల విభజన గురించి ప్రశ్నించడమే గాక, ప్రైవేట్ ప్రాంతాన్ని కూడా రాజకీయం చేస్తుందన్నది. కుటుంబంలోనే గాక, సాంస్కృతికంగా, రాజకీయంగా కూడా సమాన హక్కులు కావాలనడం, అంటే స్త్రీలు కేవలం కుటుంబాలకే పరిమితం కాకుండా, పబ్లిక్ జీవితంలో కూడా అన్ని విషయాలలోనూ సమానత్వం కావాలని కోరడం ఇందులోని విషయాలు. కుటుంబంలోని హింసను గురించి ప్రశ్నించడం, కుటుంబంలోని భర్త భార్యను పెట్టే హింస - అది భౌతికంగానూ ఉండవచ్చు, భావాల రూపంలోనూ ఉండవచ్చు. భావాల విషయానికి వస్తే అది ప్రేమ లాగానూ, ఆప్యాయత లాగానూ, బాధ్యత లాగానూ కనపడుతుంది. ఇందులోనే భర్త భార్యకు ఇచ్చే రక్షణ కూడా ఉంటుంది. జండర్ సమస్య - ఇది కుటుంబంలో నుంచే పుడుతుంది. ఆడపిల్లల్ని మగ పిల్లల కంటే భిన్నంగా పెంచడం, వాళ్ళని కించపరచడం, అవమాన పరచడం, చివరికి ఇది ఆడ పిల్లలపై తండ్రుల అత్యాచారాలుగా పరిణమించడం, ఈ ఆడతనం అనే సమస్య జీవితాంతం పీడించడం ఈ జండర్ సమస్యలోని విషయాలు. మాతృత్వాన్ని సహజమైనదిగాచెయ్యడం ద్వారా స్త్రీలను దోపిడీకి గురి చెయ్యడం, ఇంటి చాకిరీ స్త్రీలకు స్వాభావికమైనసహజమైన స్త్రీల ప్రైవేటు ప్రాంతంగా చెప్పబడుతుండడం, లైంగికత్వం మరొక ముఖ్యమైన అంశం, స్త్రీల మీద జరిగే లైంగిక అత్యాచారాలు పురుషులకు సుఖాన్ని ఇచ్చే విలాస వస్తువులుగా స్త్రీలను పరిగణించడం, పిల్లల్ని కనే యంత్రంగా చూడటం ఇవన్నీ ఈ అంశంలోనికి వస్తాయి. మనదేశంలో వివిధ రంగాలకు సంబంధించిన ఉద్యమ భావజాలాలు పాశ్చాత్య దేశాల నుంచి వచ్చినట్లుగానే, ఫెమినిజం ఉద్యమానికి సంబంధించిన భావజాలం కూడా పాశ్చాత్య దేశాల నుంచే వచ్చింది. స్త్రీ పురుషుల సమానత్వాన్ని కోరేదే ' ఫెమినిజం అలాగే. ' ఫెమినిస్టు ' లంటే స్త్రీ పురుషుల సమానత్వాన్ని కోరేవారేనని చెప్పాలి. వీరు స్త్రీలు మాత్రమే కానక్కర్లేదు. పురుషులు కూడా కావచ్చు. ఎవరి యుద్ధం వాళ్లే చెయ్యాలని, స్త్రీల సమస్యలను స్త్రీలే రాయాలని, కొందరు ఫెమినిస్టులు చెబుతున్నప్పటికీ, అది సరికాదని సహకరించే వాళ్ళందరి సాయం తీసుకుంటే విజయం సాధించడం సులువవుతుందని చరిత్ర చెబుతోంది. అంతేగాక, స్త్రీల సమస్యల్ని ముందుగా సాహితీకరించిన వాళ్ళు, స్త్రీలకు జరుగుతున్న అన్యాయాల్ని ఎదిరించి పోరాడిన వాళ్ళు ముందుగా పురుషులేనన్న సంగతి విదితమే.

### స్త్రీవాదోద్యమవర్గీకరణ

ప్రముఖ మహిళోద్యమ నాయకురాలు, రచయిత్రి అయిన మల్లాది సుబ్బమ్మ స్త్రీవాదాల్ని ఐదు రకాలుగా వర్గీకరించి, వీటికి తాను అదనంగా మరొక స్త్రీవాదాన్ని ప్రతిపాదించారు. అవి -

1. ఉదారవాద స్త్రీ విమోచన సిద్ధాంతం (Liberal Feminism).
2. మార్క్సిస్టు స్త్రీ విమోచన సిద్ధాంతం (Marxist Feminism)
3. సోషలిస్టు స్త్రీ విమోచన సిద్ధాంతం(Socialist Feminism)
4. రాడికల్ స్త్రీ విమోచన సిద్ధాంతం(Radical Feminism)
5. సాంస్కృతిక స్త్రీ విమోచన సిద్ధాంతం (Cultural Feminism).
6. మానవ వాద స్త్రీ విమోచన సిద్ధాంతం (Humanist Feminism).

ఈ విధంగా ఈమె 'వసంత కన్నబిరాన్' చెప్పిన వాటికన్నా రెండురకాల ఫెమినిజాలను అధికంగా చెప్పారు. అంతేగాక ఈ ఫెమినిజాల గురించి కొంత వివరంగా తన గ్రంథంలో చర్చించడం జరిగింది. ఇప్పుడు మల్లాది సుబ్బమ్మ పేర్కొన్న ఆరు రకాల ఫెమినిజాలను గురించితెలుసుకుందాం.

### ఉదారవాద స్త్రీ విమోచన సిద్ధాంతం (Liberal Feminism)

ఈ సిద్ధాంతం జీవితం యొక్క అన్ని రంగాలలోనూ - అంటే సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలన్నిటా

- స్త్రీ పురుషుల మధ్య సమానత్వాన్ని కోరుతుంది. ఓటు హక్కు, విద్య, ఉద్యోగం, పరిపాలనాది రంగాలలో సమాన స్థాయి ప్రాతినిధ్యం ఆశిస్తారు వీరు. గర్భస్రావపు హక్కు కావాలంటారు. కుటుంబ నియంత్రణను ఆమోదిస్తారు. వీరు సమాజ వ్యవస్థను మార్చదలచకపోయినా, కొంతమేరకు స్త్రీ విమోచనకు వీరి కార్యక్రమాలు దోహదం చేస్తున్నాయి గనుక వీరు శ్లాఘనీయులే నంటారు మల్లాది సుబ్బమ్మ. చరిత్రలో ఫెమినిజం ముందుగా స్త్రీలకు మరిన్ని హక్కులు - ఓటు హక్కు, చదువు, పార్లమెంటుకు వెళ్ళే హక్కు, గర్భ నియంత్రణ హక్కు ఇలా మరిన్ని హక్కులు మాత్రమే కోరింది. ఇవాళ ఇవి మినహాయింపు లేని డిమాండ్లుగా కనబడతాయి. 'మేం కూడా పురుషుల వలె మానవులం విచక్షణా జ్ఞానం ఉన్నవాళ్ళం '.... అని చెప్పుకుంటూ వాళ్ళు ఈ హక్కులు అడిగారు.

## మార్క్సిస్టు స్త్రీ విమోచన సిద్ధాంతం (Marxist Feminism)

ఈ సిద్ధాంతం కుటుంబంలో జీవశాస్త్ర ప్రాధాన్యతను అంగీకరిస్తుంది. ఉత్పత్తి సాధనాలస్వభావం పై సమాజం ఆధారపడుతుందని కూడా చెబుతారు వీరు. దీనికి మూలపురుషులు మార్క్స్, ఎంగెల్స్ లు. స్త్రీపురుషుల మధ్య శారీరిక విభేదాలు స్త్రీ పురుషుల పని విభజనకు దారితీసాయని అంటుంది ఈ వాదం. స్త్రీకి గర్భధారణ, ప్రసూతి సహజ ధర్మాలు అయినందున అవి పురుషాధిపత్యానికి దారితీసాయి. మాతృస్వామ్య వ్యవస్థ పోయి పితృస్వామ్య వ్యవస్థ వచ్చింది.

పారిశ్రామికీకరణ జరిగి సోషలిజం వచ్చినతర్వాత పురుషాధిపత్యం సమసి పోతుందని అంటుందీవాదం. ఆర్థిక స్వాతంత్ర్యం వస్తే స్త్రీకి దానంతట అదే సర్వవిధాలైన స్వేచ్ఛ వచ్చేస్తుందని వీరి ఆశ.

## సోషలిస్టు స్త్రీ విమోచన సిద్ధాంతం (Socialist Feminism)

మార్క్సిస్టు విమోచన వాదము యొక్క లోపాన్ని వీరు సవరించుకుంటారు. వీరికి ఉదారవాద సిద్ధాంతం సరిపడదు. దానితో వారు తృప్తిపడరు. అలాగే మార్క్సిజన్ని స్త్రీవిమోచనోద్యమానికి గాని, స్త్రీవిమోచనోద్యమాన్ని మార్క్సిజానికి గాని లొంగేటట్లు చెయ్యరు. స్త్రీ యొక్క ప్రతిపత్తి ఉత్పత్తి సాధనాల స్థితిగతులతో సరాసరి ముడిపడి ఉండకుండా సాపేక్షంగా స్వతంత్రంగా నిర్ణయించబడుతుందని వీరి వాదన. లైంగిక అసమానత్వం, ఆర్థిక అసమానత్వానికి ముఖ్య కారణం అని వీరు అంగీకరించారు. కాగా వీరిలో చాలామంది మార్క్సిస్టు బంధాలను వీడలేకుండా ఉన్నారని మల్లాది సుబ్బమ్మ అంటారు.

## రాడికల్ స్త్రీ విమోచన సిద్ధాంతం (Radical Feminism)

ఉదారవాద స్త్రీ విమోచన ఉద్యమకారులు, మార్క్సిస్టు స్త్రీ విమోచన కారులూ శారీరకాంశాలకన్నా, సామాజిక అంశాలకు హెచ్చు ప్రాధాన్యతని ఇస్తారు. రాడికల్ స్త్రీ విమోచన ఉద్యమ సిద్ధాంతులలో జీవశాస్త్రం ఎక్కువ ప్రాధాన్యత వహిస్తుంది. పురుషుని శారీరక బలాధిక్యత సంతానోత్పత్తి విషయంలో స్త్రీ యొక్క పాత్ర ఈ రెండూ కలిసి స్త్రీని సమానత్వ స్థితికి దూరం చేశాయని వీరి విశ్వాసం. స్త్రీ పురుషుల మధ్య వర్గ విభజన, రాజకీయ విభజన ఉన్నాయని వీరి వాదం. స్త్రీల నుండి విప్లవం రావాలని వీరి ఆకాంక్ష.

వీరి దృష్టిలో స్త్రీలు ఒక వర్గం. వీరు 'శారీరక మౌలిక సార సిద్ధాంతం' పై ఆధారపడతారని మల్లాది సుబ్బమ్మఅన్నారు.

## సాంస్కృతిక స్త్రీ విమోచన సిద్ధాంతం (Cultural Feminism)

ఈ సిద్ధాంతం రాడికల్ ఫెమినిజానికి చాలా దగ్గరగా ఉంటుంది. మహిళా సంస్కృతిని వీరు శ్లాఘిస్తారు. స్త్రీల యొక్క సృజనాత్మక శక్తిని సంతానోత్పాదనలో ఆమె సామర్థ్యాన్ని చూసి పురుషుడు ఈర్ష్య పడుతున్నాడని వీరి అభిప్రాయం. ఈ విషయంలో రాడికల్ ఫెమిలిస్టులకూ, సాంస్కృతిక ఫెమినిస్టులకూ ఏకీభావమే. స్త్రీ విమోచనకు ప్రధాన శత్రువు పురుషుడేనని వీరి నిర్ణయం. రాడికల్ ఫెమినిస్ట్ ఆయిన. 'ఫైర్ స్టోన్' పురుషులతో సంపర్కం

లేకుండా కృత్రిమ గర్భధారణకు పూనుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేసింది. సాంస్కృతిక ఫెమినిస్ట్ అయిన 'రిచ్' సంతానోత్పాదన గురించి గర్వపడవలసినదిగా స్త్రీలను ఉద్బోధించింది. ఈ రెండు శాఖల వారూ 'శారీరక మౌలికసార' సిద్ధాంతాన్ని ఆమోదిస్తారు. అంటే స్త్రీకుండే సృజనాత్మక శక్తిని చూసి పురుష జాతి అసూయ చెంది వారిని అణచివేయబూనుకున్నదని ఈ వాదన ముఖ్యాంశం.

వీరు పురుష నైజాన్ని ద్వేషిస్తారు. పురుష జాతిని పురుషదురహంకార సూకరాలు (Male Chowinist Pigs) అని మెక్సికో ప్రపంచ మహిళా సభలో ఎలుగెత్తి చాటడం జరిగింది. వీరి సిద్ధాంతంలో ముఖ్యమైనది స్త్రీలకు స్త్రీత్వ లక్షణాలను ప్రకృతి ప్రసాదించిందని, వాటిని పురుషుల మానసిక లక్షణాలు కన్నా గొప్పగా పరిగణించాలని, అంతగా కాకపోతే సమానంగా లెక్కలోకి తీసుకోవాలని వీరి విశ్వాసం.

ఈ విధంగా ఈ విమోచనా సిద్ధాంతాల సారం చెప్పిన తర్వాత, వాటిపై తన విమర్శను ఈవిధంగా మల్లాది సుబ్బమ్మ చెప్పారు. "స్త్రీల విమోచన గురించిన ఈ తాత్విక సిద్ధాంతాలన్నీ అర్థసత్యాలే. వాటిలో కొంత వాస్తవం ఉంది. వాటిని పూర్తిగా అంగీకరించడానికి వీలు లేదు" అంటారామె. స్త్రీ పురుషునికి లొంగి ఉండటానికి ఏ ఆధునిక విజ్ఞాన, సామాజిక శాస్త్రాలూ సంజాయిషి ఇవ్వలేదని అన్నారామె. కేవలం మార్క్స్, ఫ్రాయిడ్ లు ఈ సమస్యకు పరిష్కారం చూపించలేరని ఆమె భావన. ఏదో సిద్ధాంతం ఊహించుకుని పరిష్కారం అన్వేషించాలి అనుకోవడం అవివేకమని, మానవవాదశీ ప్రాతిపదికపై ఈ సమస్యను పరిష్కరించాలని చెబుతూ, తాను నమ్మిన హ్యూమనిజం సిద్ధాంతం ఆధారంగా ఒక ప్రత్యేక స్త్రీ విమోచనా సిద్ధాంతాన్ని రూపొందించి, దానికి 'మానవవాద స్త్రీ విమోచన సిద్ధాంతం' (Humanist Feminism) అనే పేరు పెట్టి, స్త్రీ విమోచనకు ఇదే తగిన సిద్ధాంతమని ప్రతిపాదించారు. ఇప్పుడు ఈమె ప్రతిపాదించిన ఈ నూతన స్త్రీ విమోచన సిద్ధాంతం గురించి తెలుసుకుందాం.

**మానవవాద స్త్రీ విమోచన సిద్ధాంతం (Humanist Feminism)**

ఈ సిద్ధాంతం పై ఆధార పడినప్పుడు సమ్యక్ దృక్పథం ఏర్పడుతుందని సుబ్బమ్మ గారి నమ్మకం. సంతానోత్పత్తి విషయంలో స్త్రీ శక్తి సంపన్నతను ఇది గుర్తిస్తుందని, దాన్ని తన బలహీనతగా గుర్తించదనీ, కుటుంబం పెంపుదలకు, సామాజిక శాశ్వతత్వానికి తానుచేసే అపూర్వ సేవగా లెక్కలోకి తీసుకుంటుందనీ ఆమె అంటారు. ఇంటి పని, పిల్లల పెంపకం ఆమెకే కేటాయించడం అక్రమం, స్త్రీ పురుషుల మేధాసంపత్తిలో తేడాలు లేవు, స్త్రీ పురుషునితో సమదీటుగా వ్యవహరించగలదు. స్త్రీలకు స్వేచ్ఛ సంపూర్ణంగా కావాలి, కేవలం సామాజిక స్వేచ్ఛ మాత్రమే చాలదు.

ఆర్థిక, రాజకీయ స్వేచ్ఛలు కూడా కావాలి. స్త్రీ విమోచన పేరుతో సమాజంలో దోపిడీ పద్ధతులను గుర్తించకపోవడం పొరపాటు. అన్ని రంగాలలోస్త్రీవిమోచనకు కృషి చేయాలి - అంటూ తను కొత్తగా ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని సమన్వయ ధోరణిలో కనిపించేటట్లు చేయడానికిప్రయత్నించారు.

**ముగింపు**

సోషలిస్టు సమాజం కమ్యూనిస్టు సమాజంగా అభివృద్ధి చెందినప్పుడు అన్ని రకాల అసమానతలూ నశిస్తాయి. శ్రమకు, మేధస్సుకు సమాన గౌరవం లభిస్తుంది. వర్గాలు నశిస్తాయి. స్వంత ఆస్తి అనే స్వార్థ దృక్పథం నశిస్తుంది. బాధ్యతనెరిగి సమాజ సేవచేయాలనే దృక్పథం ఏర్పడుతుంది. అప్పుడు ఇక మానవుడి పోరాటమంతా ప్రకృతితోనే - అంటాడు మార్క్స్. అయితే వర్గ పోరాటం విజయవంతమై సోషలిజం వచ్చేదాకా మహిళలు చూస్తూ ఊరుకోవాలా? అవసరం లేదు. వర్గ పోరాటానికి ఒకవైపు మద్దతుని ఇస్తూనే, మరోవైపు మహిళాసంఘాల్ని ఏర్పరచుకుని సమస్యలపై సమిష్టిగా పోరాటం చెయ్యాలి. సమాజం మారకముందూ, మారిన తర్వాతా తమ జీవితాల్లో అభివృద్ధి కోసం మహిళలు చేయాల్సినదెంతో ఉంది.

సోషలిస్టు సమాజమే స్త్రీలకి విముక్తి కలిగిస్తున్నప్పుడు ఆ సోషలిజాన్ని స్త్రీలు మాత్రమే నిర్మించుకోలేరు. స్త్రీ, పురుషులు కలిసే నిర్మిస్తారు. కానీ సోషలిజం ఏర్పడక ముందు గానీ, తర్వాత గానీ స్త్రీల సమస్యలపై జరిగే ఉద్యమాలలో స్త్రీల చైతన్యమే చొరవే ఎక్కువ ఉండాలి అంటారామె.

**ఉపయుక్త గ్రంథాలు**


1. వసంత కన్నబిరాన్ - "స్త్రీగారాయటమంటే...", సూచిక-2, పుట-7-8.
2. మల్లాది వెంకట సుబ్బమ్మ - " స్త్రీ విమోచన సిద్ధాంతాలు ", ఆంధ్ర ప్రదేశ్ మహిళా ప్రజాస్వామ్య ప్రచురణలు ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్, 1985, పుట -- 182, 192.
3. చేకూరి రామారావు- "స్త్రీ విముక్తి ఉద్యమంలో సీనియర్ నాయకురాలు", స్మృతి కిణాంకం, చేరాపబ్లికేషన్స్-హైదరాబాద్-2000,
4. యం. రవీంద్రారెడ్డి - శాస్త్రీయ కమ్యూనిజం, తెలుగు సాహిత్యంపై మార్క్సిజం ప్రభావం -అనుబంధం, ఫ్రెండ్స్ పబ్లికేషన్స్, హైదరాబాద్.
5. అద్దేపల్లి రామమోహనరావు- స్త్రీవాద కవిత్వం - ఒక పరిశీలన - అద్దేపల్లి సాహిత్య వ్యాసాలు - 2, పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ - 1998.


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Link : https://www.bhavaveena.com/

# తెలుగు పత్రికలు-భారత స్వాతంత్ర్యోద్యమం : పరిశీలన



డా।. అర్జునరావు లక్కరాజు

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026


## వ్యాస సంగ్రహం

భారత స్వాతంత్ర్యోద్యంలో తెలుగు పత్రికలు కీలక భూమిక పోషించాయి. ప్రతి పాత్రికేయుడూ ఒక అక్షర యోధునిగా కవాతు చేశారు. తమ రచనలతో ప్రజానీకాన్ని ప్రభావితం చేశారు. ప్రజల్ని చైతన్య పరిచి స్వేచ్ఛాభావం నింపారు. బానిసత్వంపై తిరుగుబాటు చేశారు. పాత్రికేయులంతా నాడు సంస్కర్తలుగా సంఘర్షణతో జీవించారు. అక్షరయోధులు తీవ్రవాదుల్లా చెరశాలల్లో బంధీలయ్యారు. బ్రిటీష్ తూటాలకు బలైనవారూ వున్నారు. ఆ కోవకు చెందిన ఎందరో మహనీయులు తెలుగు పత్రికారంగంలో సంస్మరణీయులుగా నిలిచారు. వీరి బాటలోనే తెలుగు అక్షరం, తెలుగు పదం, తెలుగు పత్రిక జాతీయతను ప్రకటించి స్వాతంత్ర్యోద్యం పరిపూర్ణం చేశాయి.


## ప్రవేశిక

భారత జాతీయ కాంగ్రెస్‌లో 1890 నాటికి మహారాష్ట్ర నుంచి బాలగంగాధర తిలక్ బలమైన నాయకుడుగా ఎదిగారు. 'కేసరి', 'దేశసేవక్' మరాఠీ పత్రికల్లో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రచనలు చేసినందుకు 1897లో ఆయన పద్దెనిమిది నెలల జైలు శిక్ష అనుభవించారు. ఆయన చేసిన ఉపన్యాసాలు జాతీయ భావాన్ని ఇనుమడింపజేశాయి. భారతీయులే కాదు స్వాతంత్రోద్యమాన్ని సమర్థించిన బ్రిటీష్ జాతీయులు కూడా శిక్షలకు గురయ్యారు. జలియన్‌వాలాబాగ్ దురంతాన్ని తప్పుపడుతూ 'బాంబే క్రానికల్'ల్లో సంపాదకీయం రాసిన బి.జి.హార్నిమన్ దేశ బహిష్కరణ పాలయ్యారు. ఈయనే 'యంగ్ ఇండియా' పత్రికను కూడా సంక్షిప్తం చేసేవారు. తర్వాతే గాంధీ 'యంగ్ ఇండియా' పత్రికకు సంపాదకులయ్యారు. భారతీయ సిపాయిల్ని బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేయమని మూడు సంపాదకీయాలు రాసినందుకు గాంధీ కూడా పునా జైలుకి వెళ్ళాల్సి వచ్చింది. అలాంటి సందర్భంలోనే బిపిన్ చంద్రపాల్ కూడా జైలు శిక్ష అనుభవించారు. 1907లో 'యుగాంత్' పత్రిక సంపాదకుడు దీనానాథ్, 'వందేమాతరం' పత్రికలో రచనలు చేసినందుకు అరబిందో జైలు కెళ్ళారు. అంతేగాక వీరందరి మీద బ్రిటీష్ ప్రభుత్వం

దేశద్రోహ నేరం మోపింది. 'తమిళ్ ఇండియా' సంపాదకుడు శ్రీనివాస్ అయ్యంగార్ ఐదేళ్ళ దేశ బహిష్కరణకు గురయ్యారు. 'తెలుగు స్వరాజ్'లో వందేమాతర ఉద్యమ కార్యకలాపాల్ని సమర్థిస్తూ రచనలు చేసినందుకు 1908లో గాడిచర్ల హరిసర్వోత్తమరావుని అరెస్టు చేసి మూడేళ్లు జైలు శిక్ష విధించారు. దేశవ్యాప్తంగా స్వాతంత్రోద్యమంలో అనేక మంది పాత్రికేయులు శిక్షలకు గురయ్యారు.

**కీలక పదాలు**

రాజా రామ్ మోహన్ రాయ్, బాలగంగాధర్ తిలక్, కేసరి, దేశ్‌సేవక్, బాంబే క్రానికల్, యుగాంత్, తెలుగు స్వరాజ్, తమిళ్ ఇండియా, బ్రహ్మసమాజం, వివేకవర్ధిని, సతిహితబోధిని, సత్య సంవర్ధిని, కందుకూరి వీరేశలింగం పంతులు, ఆంధ్ర ప్రకాశిక.

**విషయ వివరణ**

రాజారామ్ మోహన్‌రాయ్ స్థాపించిన 'బ్రహ్మసమాజం' ప్రభావం దేశవ్యాప్తంగా విస్తరించింది. ఆంధ్రా ప్రాంతంలో కాకినాడ మరికొన్ని ప్రదేశాల్లో ఈ సంస్థ శాఖల్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రభావంతో కందుకూరి వీరేశలింగం పంతులు రాజమండ్రి కేంద్రంగా సంఘసంస్కరణ ఉద్యమాన్ని నిర్మించారు. దీనిలో భాగంగా ఆయన 1874లో 'వివేకవర్ధిని' పత్రికను ప్రారంభించారు. ఆతర్వాత ఈయన మరికొన్ని పత్రికల్ని నడిపారు. నాటి పత్రికలు సాంఘిక దురాచారాల నిర్మూలనకు ఇతోధికంగా కృషి చేశాయి. వీటిలో ప్రధానంగా బాల్య వివాహాలను అరికట్టడం, మూఢ నమ్మకాల్ని పారదోలడం, వితంతు వివాహాల్ని ప్రోత్సహించడం, స్త్రీ విద్యను ప్రచారం చేయడం మొదలయిన కార్యకలాపాల్ని చేపట్టాయి.

కందుకూరి స్త్రీల కోసం ప్రత్యేకంగా 'సతిహితబోధిని'(1883), సత్య సంవర్ధిని(1891) మొదలయిన పత్రికలను స్థాపించారు. మచిలీపట్నం కేంద్రంగా కొక్కొండ వెంకటరత్నం పంతులతో కలిసి 'పురుషార్థప్రదాయిని' (1874) పత్రికను వెలువరించారు. ఈ పత్రిక బాంబే, మద్రాస్, కలకత్తా నగరాల్లో హిందూత్వం నుంచి క్రైస్తవంలోకి మత మార్పిడుల మీద విమర్శలు చేసేది. 1875లో వచ్చిన 'లోకరంజని' పత్రిక భారత ప్రజానీకాన్ని విద్య, ఉద్యోగ వెనుకబాటుతనానికి గురిచేస్తున్న బ్రిటీష్ ప్రభుత్వ విధానాల్ని ఎండగట్టే సంపాదకీయాల్ని ప్రచురించేది. భారతీయుల్ని ఉన్నత ఉద్యోగాలకు తీసుకోకపోవడాన్ని నిరసించింది. తెలుగు భాషా, సాహిత్యాల ప్రాముఖ్యతని ప్రజానీకంలో నింపడానికి కొక్కొండ వెంకటరత్నం పంతులు 'ఆంధ్రభాషా సంజీవిని' (1871) పత్రికను ప్రారంభించారు.

భారత జాతీయ కాంగ్రెస్ (1885) ఏర్పడి బాంబేలో డబ్ల్యూ.సి. బెనర్జీ అధ్యక్షతన సమావేశం జరుపు కుంటున్నప్పుడు ఆంధ్రాప్రాంతం నుంచి పి.రంగయ్యనాయుడు, 'ఆంధ్ర ప్రకాశిక' సంపాదకులు ఎ.సి. పార్థ సారధి నాయుడు, రాజమండ్రి నుంచి న్యాపతి సుబ్బారావు మొదలయిన ప్రతినిధులు ఆ సమావేశానికి హాజరయ్యారు. తొలి కాంగ్రెస్ సమావేశంలోనే ఒక తెలుగు పత్రికాసంపాదకుని ప్రాతినిధ్యం చోటు చేసుకుంది. భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపనతో పాటే మద్రాస్ కేంద్రంగా 'ఆంధ ప్రకాశిక' రాజకీయ వారపత్రిక పుట్టడం తెలుగు ప్రజల స్వాతంత్ర్యాభిలాషను ఇనుమడింపజేస్తుంది. 1887లో ఎ.సి. పార్థసారధి నాయుడు 'భారతదేశంలో పేదరిక పరిస్థితుల మీద విచారణ నిర్వహించండి' అని సంపాదకీయం రాశారు. దీనికి స్పందించిన లార్ట్ డఫెరిన్ కమి షన్‌ను నియమించారు. దీని రిపోర్టు మేరకు కొంతమేర పేదరిక సమస్యల పరిష్కారానికి దారి దొరికింది. ఈ పత్రికను 42 ఏళ్ళు నిరాటకంగా నిర్వహించారు. కాంగ్రెస్ ఆలోచనా విధానానికి అద్దం పట్టే విధంగా సంపాదకీయాల్ని ప్రచురించేది. బ్రిటీష్ ప్రజావ్యతిరేక పాలనావిధానాల్ని విమర్శించేది. ప్రభుత్వంలో పేరుకి పోయిన అవినీతి, పోలీసు దుశ్చర్యల్ని ఈ పత్రిక ఖండించింది. 1894లో మద్రాస్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ఈ పత్రికా సంపాదకుడు పాత్రికేయ ప్రతినిధిగా పాల్గొన్నారు. వందేమాతర ఉద్యమం ఊపందుకున్న నేపథ్యంలో 1907లో బిపిన్ చంద్రపాల్ ఆంధ్రా పర్యటన ఏర్పాట్లను

'కృష్ణాపత్రిక' వ్యవస్థాపక సంపాదకుడు ముట్నూరి కృష్ణారావు పర్యవేక్షించారు. ఈ పత్రిక వ్యవస్థాపకుడు కొండా వెంకటప్పయ్య అతివాదవర్గ నాయకుడుగా వ్యవహరించారు. 'గోదావరి', 'ఆంధ్రకేసరి' పత్రికలు ఆంధ్రా ఉద్యమానికి పనిచేశాయి. బెంగాల్ విభజన నేపథ్యంలో ఉద్భవించిన వందేమాత ఉద్యమానికి ఆంధ్రా ప్రాంతంలో గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, కొమర్రాజు లక్ష్మణరావులు బాసటగా నిలిచారు. దీనిలో భాగంగా న్యాపతి సుబ్బారావు, సి.వై. చింతామణి నెల్లూరు, గుంటూరు, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించారు. స్వదేశీ వస్తువాడకం అంశం మీద మచిలీపట్నం కేంద్రంగా పట్టాభి సీతారామయ్య, మాడపాటి హనుమంతురావులు ప్రచారాన్ని ఉధృతం చేశారు. సి.వై. చింతామణి కాంగ్రెస్ ప్రతినిధిగా రెండవ రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛకు సంబంధించి బ్రిటీష్‌వారి మనస్తత్వాన్ని వెల్లడించే ఘటన 1733లో మొదటిసారి 'న్యూయార్క్ వీక్లీ జర్నల్' విషయంలో జరిగింది. మొదటి నుంచి బ్రిటీష్ పాలకులు పత్రికా స్వేచ్ఛను హరించే దిశగా నడిచారు. కాని ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామిక వాదులు చేపట్టిన కార్యాచరణ ప్రతికా స్వేచ్ఛను రాజ్యాంగ బద్ధం చేసింది. ఈ సందర్భంలో 'న్యూయార్క్ వీక్లీ జర్నల్' సంపాదకుడు పీడర్ జంగర్ వెర్సెస్ గవర్నర్ మరియు చీఫ్ జస్టిస్ విలియం కాస్బి కేసును ఉదాహరణగా తీసుకోవచ్చని ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి పేర్కొన్నారు. అమెరికా, బ్రిటన్, ఇండియా పత్రికా వ్యవస్థల లండన్‌లో పరిశోధన నిర్వహించి ఆయన 'కాంటెంపరరీ ప్రెస్' గ్రంథాన్ని వెలువరించారు.

తెలుగు పత్రికలు 19వ శతాబ్దిలో సంస్కరణోద్యమాలకు, 20 శతాబ్దిలో రాజకీయోద్యమాలకు ప్రాధాన్యత నిచ్చాయి. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 1921 స్వరాజ్య పత్రికను ప్రారంభించి జాతీయోద్యమ ప్రచార పత్రికగా తీర్చిదిద్దారు. 12 సంవత్సరాలు దక్షిణ భారతదేశంలో స్వాతంత్ర్య భావాన్ని ప్రజల్లో నింపిన పత్రిక ఇది. ఎప్పటికప్పుడు ఉద్యమ వార్తలు తెలుసుకోవడానికి మద్రాసులోని ఈ కార్యాలయం చుట్టూ ప్రజలు మూగేవారని 'తెలుగు పత్రికల ఆవిర్భావ, వికాసాలు' పరిశోధనాగ్రంథాన్ని వెలువరించిన వి.లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు.

1938లో రామ్‌నాథ్ గోయెంకా 'ఆంధ్రప్రభ' పత్రికను ప్రారంభించారు. 1942లో భారతీయ కమ్యునిస్టు పార్టీ 'పీపుల్స్‌వార్' పత్రికను ప్రారంభించింది. దీని ప్రభావంతో తెలుగునాట అనేక పత్రికలు వెలువడ్డాయి. 1942 'క్విట్ ఇండియా' నినాదంతో స్వాతంత్రోద్యమం తీవ్రరూపం దాల్చింది. ఈ సందర్భంగా బ్రిటీష్ ప్రభుత్వం 96 భారతీయ పత్రికల మీద నిషేధాన్ని విధించింది. మరికొన్ని పత్రికలు గాంధీ కోరిక మేరకు ప్రచురణని నిలిపివేశాయి. 1943 జనవరి 6న ప్రచురణ ఆపేసి పత్రికలన్నీ సమ్మె చేశాయి. ప్రభుత్వ ప్రకటనల్ని ప్రచురించకూడదని నిర్ణ యించాయి. దీంతో దిగివచ్చిన ప్రభుత్వం వారం తర్వాత పత్రికల మీద నిషేధాన్ని ఎత్తివేసింది.

ఆంధ్రాలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఆదిపూడి సోమనాథరావు, సి.వై. చింతామణి మొదలయిన స్వాతంత్రోద్యమ పూర్వరంగాన్ని సిద్ధం చేశారు. కలకత్తా కాంగ్రెస్ సమావేశానికి హాజరయిన మునగాల రాజా, కె.వి. లక్ష్మణరావు, హరిసర్వోత్తమరావులు అతివాద కాంగ్రెస్ సందేశాన్ని ఇక్కడికి అందించారు. 1907లో రాజమండ్రి నుంచి వెలువడుతున్న 'వందేమాతరం' పత్రిక తొలిసంచికలో దీనిని ప్రచురించారు. ఈ సందేశం దేశ దీనస్థితి పోవాలంటే స్వదేశీ ఉద్యమం అవసరమని ఈ పత్రిక ప్రకటించింది. ఇదే ఏడాది ముట్నూరి కృష్ణారావు సంపాదకత్వంలో 'కృష్ణాపత్రిక' బిపిన్ చంద్రపాల్ పర్యటనను ప్రచారం చేసింది. విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, బందరు, నెల్లూరుల్లో ఆయన ఉపన్యసించారు. రాజమండ్రి సభలో పాల్ ఉపన్యాసాన్ని చిలకమర్తి లక్ష్మి నరసింహ పంతులు తెలుగులో అనువదించారు. ఉపన్యాసం ముగిసిన తర్వాత ఆయన చెప్పిన 'భరతఖండంబు చక్కటి పాడియావు..' పద్యం ప్రజల్ని ఉర్రూతలూగించింది. ఈ కాలంలో రాజమండ్రి నుంచి చిలుకూరి వీరభద్రరావు నడిపిన 'ఆంధ్రకేసరి'; బందరు నుంచి చిల్లరిగె శ్రీనివాసరావు నడిపిన 'నవయుగ' పత్రికలు వందేమాతర ఉద్యమాన్ని ప్రచారం చేశాయి. 'నవయుగ' పత్రిక మూతపడిన తర్వాత ఈ పాత్రను 'దేశాభిమాని' పత్రిక పోషించింది.

వీటి ప్రభావంతో జాతీయ చైతన్యం ప్రతిబింబించే విధంగా తెలుగు దేశంలో బెజవాడ నుంచి గాడిచర్ల హరిసర్వోత్తమ రావు సంపాదకత్వంలో 'స్వరాజ్య' పత్రిక ప్రారంభమయింది.

ఓ.వి. చిదంబరం పిళ్ళై ఓడ కొనుగోలు చేసి దక్షిణాదిన వ్యాపారం మొదలెట్టడంతో బ్రిటీష్ ప్రభుత్వం ఆయనకి యావజ్జీవకారాగార శిక్ష విధించింది. ఈఘటనలో చెలరేగిన అల్లర్లలో పోలీసు కాల్పుల్లో ముగ్గురు చనిపోయారు. దీనికి స్పందించి 'స్వరాజ్య' పత్రికలో హరిసర్వోత్తమరావు 26 మార్చి, 1908న 'విపరీత బుద్ధి' శీర్షికన సంపాదకీయం రాశారు. దీనిలో 'భారత జాతీయ వాతాంకురములకు బ్రిటిష్ సామ్రాజ్యలత శోషిల్లుచున్నది' అని పేర్కొన్నారు. దీనిని తీవ్ర సంపాదకీయంగా భావించిన బ్రిటీష్ ప్రభుత్వం ఆయన మీద రాజద్రోహం కేసు నమోదు చేసి మూడేళ్ళు కఠిన కారాగారశిక్ష విధించింది.

1910 నాటికి 'ఆంధ్రభారతి' పత్రిక జాతీయోద్యమాన్ని ప్రబోధించింది. హొమ్‌రూల్ ఉద్యమాన్ని 'శశిలేఖ', 'దేశమాత' పత్రికలు ప్రచారం చేశాయి. భారతీయుల హక్కులను హరించేసే రౌలత్ బిల్లుకు వ్యతిరేకంగా గాంధీ సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభించిన సమయంలో 'హితకారిణి', 'ఆంధ్రపత్రిక'లు ఆయనకు మద్దతుగా ప్రచారంచేశాయి.

గాంధీ ఖిలాపత్ ఉద్యమాన్ని సమర్ధిస్తూ సహాయనిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించిన సమయంలో 'ఆంధ్రపత్రిక', 'దేశాభిమాని', 'హితకారిణి', 'బాలభారతి', 'సుదర్శిని', గోదావరి పత్రిక', 'నెల్లూరు' మొదయిలన పత్రికలు ఉద్యమ లక్ష్యాల్ని ప్రచురించాయి. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య 'చీరాల -పేరాల' శాసనోల్లంఘనోద్యమంలో జరిగిన పోలీసు కాల్పుల్లో కన్నిగంటి హనుమంతురావు మృతి చెందినప్పుడు 'కృష్ణాపత్రిక' భారతీయ శిక్షాస్మృతిలోని 124 (ఎ) సెక్షన్‌ను తీవ్రంగా విమర్శించింది. ఈ సందర్భంలో 'గాంధీ యే కనుక అహింసా సిద్ధాంతాన్ని ప్రజలకి నూరి పోసి వుండక పోతే పల్నాడులో ప్రవహించే 'చంద్రవంక' నీరు ఎర్రబడేది' అని 'కృష్ణాపత్రిక' రాసినట్టు మద్రాస్ నేటివ్ ప్రెస్ రిపోర్ట్స్-1920 వివరిస్తోంది. అనంతర పరిణామాల్లో కౌన్సిళ్ళలో ప్రవేశించాలని సిఆర్ దాస్, నెహ్రూలు అభిప్రాయపడినప్పుడు గాంధీ, రాజేంద్రప్రసాద్, రాజగోపాలాచారి వంటి వారు దీనిని వ్యతిరేకించారు. ఈ వాదోపవాదాల్లో కౌన్సిల్ ప్రవేశాన్ని బెజవాడ నుంచి ప్రచురణ జరిగే 'స్వరాజ్య పత్రిక', మద్రాసు నుంచి వెలువడిన 'త్రిలింగ' పత్రిక, రాజమండ్రి నుంచి వచ్చే 'స్వతంత్ర' పత్రికలు సమర్ధించాయి. 'ఆంధ్రపత్రిక', 'కృష్ణాపత్రిక' మార్పు వుండ కూడదని వ్యతిరేకించాయి.

1924 మే 8వ తేదీన బ్రిటీష్ ప్రభుత్వం అల్లూరి సీతారామరాజుని కాల్చి చంపిన వార్తను శనివారపు సుబ్బారావు సంపాదకత్వంలో వెలెవడే 'పల్లెటూరు' పత్రిక మొదటిగా ప్రచురించింది. ఈకారణంగా ఈ పత్రికను ప్రభుత్వం తగలబెట్టింది. 1928, 29 సంవత్సరాల్లో గోదావరి, విశాఖ జిల్లాల్లో అల్లూరి సీతారామరాజు చేపట్టిన బ్రిటీష్ వ్యతిరేక జాతీయోద్యమ కార్యకలాపాల్ని ప్రశంసిస్తూ 'కాంగ్రెస్' వారపత్రికలో మద్దూరి అన్నపూర్ణయ్య వ్యాసాలు రాశారు. ఆంధ్రోద్యమానికి అండగా నిలిచిన పత్రికల్లో 'గోల్కొండ' పత్రిక మద్దతు తెలిపింది. మార్చి 1930లో జోగిపేట వద్ద జరిగిన తొలి ఆంధ్రమహాసభకు ఈ పత్రికాసంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించారు. 1931లో 'కాంగ్రెస్' వారపత్రిక సంపాదకుడు క్రొవ్విడి లింగరాజు ప్రభుత్వానికి వ్యతిరేకంగా రచనలు చేస్తున్నారని, భగత్‌సింగ్‌ను ఉరితీసినప్పుడు 'వీరబలి' శీర్షికన సంపాదకీయం రాశారని రెండు సంవత్సరాలు జైలు శిక్ష, వెయ్యి రూపాయిల జరిమానా విధించారు. శాసనోల్లంఘన ఉద్యమాన్ని సమర్ధించినందుకు ముట్నూరి కృష్ణారావు, కాశీనాథుని నాగేశ్వరరావు, ఖాసా సుబ్బారావు వంటి పాత్రికేయులకు బ్రిటీష్ ప్రభుత్వం కఠినశిక్షలు విధించింది. ఆనాటి తెలుగు పత్రికల స్థితిగతుల మీద ఆచార్య మామిడిపూడి వెంకట రంగయ్య, ఎన్. ఇన్నయ్య సంయుక్తంగా 'ఆంధ్రలో స్వాతంత్ర్య సమరం' అనే గ్రంథాన్ని రాశారు. ఈ గ్రంథంలో 'పత్రికాస్వేచ్ఛను అణచివేతకు గురిచేసి, ముద్రణాలయాల మీద నిర్బంధం పెడుతూ సుమారు 17 పత్రికల మీద హెచ్చరికలు జారీ చేస్తూ, సెక్యూరిటీ కోరుతూ మేజిస్ట్రేట్

ఉత్తర్వులు జారీ చేశారు' అని పేర్కొన్నారు. 1937లో జరిగిన ఎన్నికల్లో మద్రాసు రాష్ట్రంతో పాటు కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ సమయంలో రాజకీయ ఖైదీలను విడుదల చేశారు. పత్రికల సెక్యూరిటీ డిపాజిట్లను తిరిగి చెల్లించారు. భారతదేశానికి స్వతంత్ర్యం వచ్చినప్పుడు అన్ని తెలుగు పత్రికలు ప్రత్యేక సంచికలు వెలువరించి సమరయోధుల త్యాగాన్ని శ్లాఘించాయి.

తొలినాటి తెలుగు పత్రికలు సంఘసంస్కరణ, జాతీయోద్యమం లక్ష్యాలుగా సాగాయి. ఎందరో త్యాగధనులు వ్యాపార దృక్పథం లేకుండా స్వచ్ఛమయిన లక్ష్యాలతో పత్రికల్ని నిర్వహించారు. వారి స్ఫూర్తితో తెలుగునాట ఎన్నో పత్రికలు పుట్టుకొచ్చాయి. మరెన్నో పత్రికలు విరబూసి మానవతా పరిమళాల్ని వెదజల్లుతున్నాయి. అసలుసిసలైన పత్రికలు స్వాతంత్ర్య లక్ష్యాలు సిద్ధించాలని తాపత్రాయపడుతున్నాయి.

**ఆధార గ్రంథాలు**


1. బంగోరె : బ్రౌన్ జాబులు (1892 -1857) నెల్లూరు హిస్టోరిక్ పబ్లికేషన్ 1973.
2. ఏకాంబరాచార్యులు, రాపాక : మన ప్రముఖ పత్రికా సంపాదకులు, హైదరాబాద్, 2007.
3. పట్టాభిరామారావు, పరకాల: జాతీయ స్వాతంత్ర్యోద్యమం - జాతీయపునరుజ్జీవనోద్యమం: విజయవాడ, 1999.
4. రమాపతిరావు, అక్కిరాజు : వీరేశలింగం రచనలు (మొదటి సంపుటం), ప్రథమ భాగము, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1982.
5. రాజగోపాలరావు సి.వి. : 'ఆంధ్రపత్రిక చరిత్ర': ఎ.పి. ప్రెస్ అకాడమి,హైదరాబాద్, 2004.
6. రామచంద్రగుహ : గాంధీ అనంతర భారతదేశం; ఎమెస్కో ప్రచురణ; 2010.
7. వెంకటప్పయ్య, వెలగా (సంపాదకుడు) 'నార్ల స్మరణిక'. ప్రచురణ : కొల్లి
8. వెంకటేశ్వరరావు, పొత్తూరి : ఆంధ్రజాతి అక్షర సంపద - తెలుగు పత్రికలు : ఎ.పి. ప్రెస్ అకాడమి, 1997.
9. వెంకటేశ్వరరావు, పొత్తూరి: వ్యాసప్రభ: మీడియా పబ్లికేషన్, హైదరాబాద్, 2001.
10. లక్ష్మణరెడ్డి. వి: తెలుగు జర్నలిజం ఆవిర్భావం, వికాసం: ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, గుంటూరు, 1995.
11. Bobby Vardhan. P: The Role of Telugu Press in Freedom"Movement of India : 1998."Gandhi, M.K: An Autobiography: Navajeevan Publishing"house Ahmadabad, 2008."Indian revolutionary Movement (Political, Organisation)"and Movement Review 1967 -88) Red Flag Publications,"Vijayawada, 1990."Murthy. D.V.R., Contemparary Press, Andhra University,"Visakhapatnam, 2004."Murthy. D.V.R, Gandhian Journalism: is it relavant"Today?, Kaniska Publishers, New Delhi, 2010."Sivarao DV,' Telugu Journalism : Past and Present; Studies"in the History of Telugu Journalism, Edited and Pub"lished by K.R. Shesagiri Rao, 1968.


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-4 | April 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*



# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో జానపద కళల ప్రత్యేకత

డా॥. సి.హెచ్. శేఖర్
Inspector of police, Kukatpally, Ph : 712596926.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహం :**

నిరక్షరాస్యులు సాహితీ ప్రక్రియ పాట. ఇది అత్యంత సహజమైనది. మట్టి, నీరు, గాలి, మొక్కలు ఎంత సహజమో, ప్రాకృతికమో, నిరక్షరాస్యులూ, ప్రకృతిలో జీవించే జానపదుల పాటల, సృజన అంతే ప్రాకృతికమైనది. నేటి విద్యావంతుల సాహితీ లోకపు సృజనాత్మకతతోనూ, ఛందోనియమాలతోనూ, అనుకరణ శిల్పంతో ఏ సంబంధం ఉండదు. రెండూ వేర్వేరు ప్రపంచాలు. రెండూ వేర్వేరు స్రవంతులు. అందుకే నాగరిక ప్రపంచపు ప్రభావం లేని "ప్రాకృతిక సృజన" అని దీనిని అంటారు. ఈ రీత్యా ప్రస్తుత పద్ధతుల్లో ఇదొక ప్రత్యేకమైన, అరుదైన, అవసరమైన సృజన.

పల్లె ప్రజలు సాహితీ ప్రక్రియ పాట. ఈ పాటను పల్లె ప్రజలు గేయమని పిలుస్తున్నారు. ఇది ఒక తరం నుంచి మరో తరానికి ప్రవహిస్తున్న జీవనది. దీనిలో తరతరాల సంస్కృతీ, విశ్వాసాలు, కట్టుబాట్లు, భావోద్వేగాలు ప్రతిఫలిస్తాయి. మనం కల్పించుకున్న, ఏర్పరచుకున్న నియమాలతో సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఇక భాష వినిమయంలో జానపద బాణీలు ఒక ప్రత్యేకతను సంతరించుకొని ఉంటాయి. పని పాటు పాట కూడా వారి వారి రంగాలలో మహిళల పాటలు పాడతారు. జానపద గేయాలు, జానపద కళలు, బచ్చాలాట, కర్రబిల్లాట, గోళీలాట, తప్పెటగుళ్ళాట. అవి ఈ పాటల ద్వారా తమ భావాలను వ్యక్తపరిచే విధానాన్ని ఈ వ్యాసం ద్వారా తెలియపరిచాను.

**కీలకపదాలు :**

సంస్కృతి, సృజనాత్మకత, జాతర్లు, ప్రకృతి, బోనం, గుసాడి, ఒగ్గుకథ, ఆచార వ్యవహారాలు, జానపద కళలు, పల్లె పాటలు, ఆకలి చావులు.

**ప్రవేశిక :**

సాహిత్యానికి "హితేన సహితం సాహిత్యం", సహితస్య భావఃసాహిత్యం" అని సంస్కృతంలో నిర్వచనాలు

ఉన్నాయి. అంటే మిత్రుని వలె సాహిత్యం మేలు చేసేది, ప్రీతి దాయకమైంది, నీతి బోధించినది, ధర్మప్రతిపాదన చేసేది అని భావం. సాహిత్యానికి సమాజానికి అవినాభావ సంబంధం ఉంది. సమాజంలో నుంచి సాహిత్యం వెలువడుతుంది కాబట్టి సాహిత్యం సమాజం కోసమే. ఢమరుకవాదం నుంచి వెలువడిన మహేశ్వరి సుత్రాలు వ్యాకరణలకి ఎంతగా ఉపయోగపడ్డాయో అదేవిధంగా గద్దర్, గూడ అంజయ్య, అందెశ్రీ, గోరటి వెంకన్న మొదలైనవారి పాటలు విశ్వమంతటా వ్యాప్తి చెంది సమాజాన్ని చైతన్య పరిచాయి.

తెలంగాణలోని జనగామ జిల్లాకు (ప్రస్తుతం) చెందిన చుక్క సత్తయ్య 'ఒగ్గు'కథకు జాతీయస్థాయి గౌరవాన్ని కలిగించారు. అదేవిధంగా మిద్దె రాములు ఎలమ్మకథకు తెచ్చిన ప్రాచుర్యం కూడా అలాంటిదే. ఈయన కరీంనగర్ జిల్లాకు చెందినవారు. గడ్డం సారయ్యలాంటి కళాకారులు చిందు యక్షగానానికి జాతీయస్థాయి గుర్తింపు తెచ్చారు. ఈయన వరంగల్లు జిల్లాకు చెందినవారు. ఒకప్పటి ఉమ్మడి వరంగల్లు జిల్లా చిందు యక్షగానాలకు, డప్పు, శారద, పటం కథవంటి ఎన్నో జానపద కళారూపాల కాణాచిగా ఉండేది. తెలం'గానం, సంస్కృతి, భాష, యాస ప్రజలకు చెందాలని తెలంగాణ అంతట తిరిగి పాడి, ఆడి ప్రజల వద్దకు చేర్చి ప్రజలకోసం ప్రాణమిచ్చిన కళాకారులు గజ్జెకట్టి గొగళ్ళు కప్పుకొని తల్లిపల్లె ఒడిలో ఘల్లు ఘల్లును ఆడిపాడుతూ తెలంగాణ సంస్కృతిని బతికించుకుందాం అని ప్రతి పల్లెనుండి ఏదో ఒక గడప నుండి జానపద పాటలు ధ్వనిస్తూనే ఉన్నాయి. ఈ పాటల ద్వారా కవులు కళాకారులు ఏకమై ఐక్య సంస్క ృతికోద్యమాన్ని రక్షించుకోవాలి.

**సంస్కృతి సంప్రదాయాలలో పాటల విశిష్టత :**

విభిన్న సంస్కృతుల ఖజానా తెలంగాణ ఇక్కడి సంస్క ృతి, కళల విషయనికి వస్తే భారతదేశంలో అత్యంత సృజనాత్మక రాష్ట్రాలలో తెలంగాణ ఒకటి. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 76శాతం మంది తెలుగుమట్లాడుతారు. సుమారు 12శాతం మంది ఉర్దూ మిగిలిన 12శాతం మంది ఇతర బాషలు మాట్లాడుతారు.

మనోహరమైన హైదరాబాదు హిందీ ప్రపంచంలో ఎక్కడైనా మాట్లాడే అత్యంత మనోహరమైన భాషలలో ఒకటి. రాష్ట్రం విభిన్న కులాలకు నిలయంగా ఉండటంతో తెలంగాణలో అనేక రకాల ఉత్తేజకరమైన ఉత్సవాలు ఇక్కడ జరుపుకుంటారు. దసరా ఉత్సవాల్లో భాగంగా బొడ్డెమ్మ, బతుకమ్మ తెలంగాణలో ఒక ప్రత్యేకమైన పండుగలు, బోనాలు తెలంగాణ సంస్కృతి మరియు సంప్రదాయం యొక్క మరొక ప్రదాన పండుగ. చల్లగా నిండు నూరేళ్ళ బతుకమన్న దీవెనకు ప్రతిక ఈ పండుగలు. బతుకమ్మ పండుగ కన్నా ముందుగా బొడ్డెమ్మ ఆడతారు.

**బతుకమ్మ :**

తెలంగాణలో జరుపుకొనే పండుగలు, జాతరలలో సంస్కృతి, సంప్రదాయాలతో పాటు సామూహిక భాగస్వామ్యానికి ప్రాధాన్యత ఉంటుంది. ఈ సంప్రదాయాలకు పెద్ద పీట వేసిన పండుగ బతుకమ్మ. తెలంగాణలో 1వ శతాబ్ది నాటికే బతుకమ్మ పండుగ విస్తరించిందని తెలుస్తుంది. ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, చాణుక్యులు, కాకతీయుల కాలంలో ఈ పండుగ మూలాలు కనిపిస్తాయి. మహాలయ అమావాస్య మొదలు మహార్ణనమి వరకు సాగే బతుకమ్మ ఉత్సవం తెలంగాణ సాంస్కృతిక సౌరభాలను వెదజల్లుతుంది ఈ తొమ్మిది రోజులు తొమ్మిది రకాల పుష్పాలు తొమ్మిది వరుసలు పేరుస్తారు. ఈ విధంగా బతుకమ్మ ప్రకృతిలో ఆవిర్భవించి, ప్రకృతిలో పూజింపబడి ప్రకృతి జలంలో సమ్మిళితం కావడం జగన్నాథ సృష్టి, స్థితి, లయాత్మక తలలకు ? సంకేతం. బతుకమ్మ పండు గల పూర్తిగా ప్రకృతిని పూజించే విధానం పా కనబడుతుంది.

రూసో, అరిస్టాటిల్ వంటి తత్త్వవేత్తలు ప్రకృతి వాదాన్ని ప్రచారంలోకి తెచ్చారు. ప్రకృతే యధార్థం. ప్రకృతిని మించి ఏమిలేదు. సర్వం ప్రకృతిమయం. ప్రకృతికి మించిన జ్ఞానం మరొకటీ లేదు. సమాజంలో విలువలు ఎప్పటికప్పుడు మన అవసరాలకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. అనేవి ప్రకృతి వాదం ప్రధాన సూత్రాలు.

బాహ్య ప్రకృతిని అనుసరించి మనిషి అంతః ప్రకృతి అభివృద్ధి చెందుతుంది. బతుకమ్మ పండుగ సందర్భంగా పూల కొరకు పల్లీయులు ప్రకృతిలోకి వెళతారు. బతుకమ్మను సాగనంపడం కూడా ప్రకృతిలోనే సాగుతుంది. ఈ పండుగ మానవునికి ప్రకృతితో సంబంధం ఏర్పడుతుంది. తద్వారా ప్రకృతి పట్ల ఆరాధన భావం పెరుగుతుంది. ఈ పండుగ పేరులోనే స్త్రీలు బతకాలనే ఆకాంక్ష, ఆవేదన కనిపిస్తాయి.

**బొడ్డెమ్మ :**

మట్టి గౌరవార్థం బొడ్డెమ్మ పండుగ జరుపుకుంటారు. పుట్టిన నాటి నుండి గిచ్చే వరకు ప్రతి క్రియకు భూమే ఆధారం తెలంగాణ వ్యవసాయ ప్రాంతం కనుక దీనికి ఉపయోగపడే ప్రతిదానిని పూజనీయ భావంతో చూస్తారు. పొలాలను దున్నే ఎడ్లను బసవ న్నలుగా పూజిస్తారు. ఎడ్లను అలంకరించి పూజిస్తారు. ఎడ్ల పెండతో బొడ్డెమ్మలను చేస్తారు. బొడ్డెమ్మ అనగా బొడ్డు గల అమ్మ. రేపటి పునఃసృష్టికి ఆధారమయిన గర్భాశయం కలిగిన కన్నెపిల్ల అని అర్థం. అందుకే బొడ్డెమ్మను " కన్నెపిల్లల పండుగ అని అంటారు.

బొడ్డెమ్మ బొడ్డెమ్మ ఉయ్యాలో
నీ బిడ్డ పేరేమి ఉయ్యాలో
నా బిడ్డ నెలగౌరు ఉయ్యాలో - ఈ పాటలు

పల్లె ప్రజల బివిలాలను ఆవిష్కరిస్తాయి. ఈ పాటలు వారి బాధలకు కొంత ఊరటను ఇస్తాయి. తెలంగాణ సజీవ సంస్కృతిలో కళకళలాడాలంటే ప్రభుత్వం సాంస్కృతిక విప్లవాన్ని వేగవంతం చెయ్యాలి.

**బోనాలు :**

బోనం అంటే భోజనం, కుండ అనే మరో అర్థం కూడ ఉంది. ఇది దేవికి సమర్పించే నైవేద్యం. కొత్త మట్టి కుండకు పసుపు, కుంకుకు బొట్లు పెట్టి వేపాకులను జడగా అల్లి ఆకుండలో పసుపు కలిపిన అన్నంతోపాటు పాలు పెరుగు, బెల్లం, అల్లం, మొదలైన వంటకాలను నైవేద్యంగా పెడతారు. డప్పులతో పోతరాజు ఆటలలో మంగళహారతులతో ఊరేగింపుగా గుడికి పోతారు. పండుగ మరునాడు పూనకం వచ్చిన స్త్రీ భవిష్యవాణి చెప్పుతుంది. ఆమె చెప్పినవన్ని తప్పక జరుగుతాయని ప్రజలు విశ్వసిస్తారు. ఈ పండుగ వెనుక శాస్త్రీయ కోణం కూడా దాగివుంది.

పూర్వ కాలంలో కలరా, మశూచి వంటిని అంటువ్యాదులు వ్యాపించేవి. వైద్య సౌకర్యాలు అంతగా లేని ఆ రోజుల్లో గ్రామదేవతకు సమర్పించిన నైవేద్యాన్ని రోగులకు తినిపించేవారు. నైవేద్యంలో అన్నంలో కరిపిన పసుపు రోగనిరోధక శక్తిగా పని చేస్తుంది. ఈ ప్రసాదాన్ని ఇంటిల్లీ పాదీ తింటారు. ఈ సంప్రదాయం ఈ నాటికీ పాటిస్తునే ఉన్నారు. బోనాలు పండుగను హైదరాబాదు, సికింద్రాబాదులలో చాల ఘనంగా జరుపుతారు. సికింద్రాబాదులో జరిగే బోనాల పండుగను 'లష్కరు' బోనాలు అనికూడ అంటారు.

**సమ్మక్క – సారలమ్మ జాతర :**

సమ్మక్క- సారలమ్మ జాతర ఆసియా ఖండములోనే అతిపెద్ద గిరిజన జాతరగా యునెస్కో పారిస్ వారిచే గుర్తింపు పొందింది. ఈజాతరలో సమ్మక్క-సారలమ్ములు దేవతల రూపంలో ఆరాధింపబడతారు. ప్రతి రెండు సంవత్సారాల కొకసారి మాఘశుద్ధ పౌర్ణమినాడు జరుపుకుంటారు. నాలుగు రోజుల పాటు కొనసాగుతుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని తాడ్వాయి మండలంలో ఈ జాతర జరుపుకుంటారు.

**నాగోబా జాతర :**

నాబోబా అనగా దేవత ఈ జాతర పామును దేవతారూపంలో పూజిస్తారు. ఆదిలాబాదు జిల్లాలో ఇంద్రవల్లి మండలంలో కేస్లాపూర్ గ్రామంలో గోండు గిరిజన తెగవారు పుష్యమాసంలో బహుళ అమావాస్య రోజున ఈ పండుగల

జరుపుకుంటారు. గోండు దర్బార్ నిర్వహించడానికి కలెక్టరును ఆహ్వానించి గిరిజన సమస్యలను విన్నవించుకొని సంప్రదాయాన్ని ప్రారంభిస్తాడు. ఈ జాతర్లతో పాటు గొల్లగట్టు జాతర, కొంగ గట్టు జాతర, కొమురవెల్లి మల్లన్న జాతర, ఏడుపాయల జాతర మొదలైనవి ప్రసిద్ధి చెందాయి.

అనేక కారణాల వల్ల స్త్రీ సమాజంలో బలవూతునే వుంది. స్త్రీలులేని లోకంలో సమాజ సమతుల్యత దెబ్బ తింటుంది. రేపటి తరం నిర్మాణం జరగదు. అందుకే స్త్రీలు బతకాలి అన్న నిర్వచనాన్ని చెబుతుంది. స్త్రీల ప్రాముఖ్యత బతుకమ్మ, బొడ్డెమ్మ, బోనాలు పండుగల్లో ఎక్కువుగా కనిపిస్తుంది. ఈ పండుగలద్వారా సమజంలో ఏకత్వభావన వెల్లివిరుస్తుంది. తెలంగాణ ఉద్యమంలో అస్తిత్వ సాంస్కృతిక ప్రతీకగా నిలిచింది బతుకమ్మ పోరాటానికి స్త్రీల ప్రాతినిధ్యాన్ని పంచింది.

**దండారి పండుగ :**

దండారి పండుగ ఉమ్మడి ఆదిలాబాదు జిల్లా (ఇప్పుడు నాలుగు జిల్లాలు) ఆదిలాబాదు, కుమురంభీం - ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల దానికి ఆనుకొని ఉన్నా మహారాష్ట్ర (విదర్భ)లోని జిల్లాల్లోనూ ఉండే రాజ్ గొండులకు, కొలాంలకు ప్రతేకమైనది. తలపైన నెమలి ఈకలు పెద్ద టోపీలు ధరించి విచిత్రమైన వేషధారణలతో లయబద్ధంగా నృత్యం చేస్తు కదివే "గుసాడి" దందారి పండుగలో ఒక భాగం. ఈ పండుగ గురించి క్లుప్తంగా చెప్పుకోవాలంటే దండారిలో ఒక ఊరివారు తమకిష్టమైన ఊరికి అతిథులుగా ఊరేగింపుగా వెళ్తారు. వీరి కూడా దండారి వాయిద్యాలు తుడుం, పేప్రే(సన్నాయి) కాలికొం (కొమ్ము)లతో పాటు 'పోరిక్' అంటే ఆడపిల్లల వేషాలువేసిన పోరగాళ్లు, గుసాడి వేషగాళ్ళు తోడుగా వెళ్ళతారు. అతిథ్యంఇచ్చే ఊరిలోకి చీకటి పడే వేళకు ప్రవేశించడం, మధ్య, మధ్య వినోదాత్మకమైన చిన్నచిన్న హాస్య, వ్యంగ్య నాటికా సన్నివేశాలను ప్రదర్శించటం( వీటినే ఖేలు అంటారు) ఇది ఆదివాసీల అతిముఖ్యమైన సామాజిక ఉత్సవం. ఇటువంటి పండుగలు, కళలు మన జాతికి జీవనాడులు.

**జానపద కళలు :**

జానపద కళలకు పుట్టినిల్లు తెలగాణ ప్రాంతం. మానవ జీవన సంస్కృతికి కళలు ప్రతిబింబించాలని చెప్పాలి. కళ అనంతమైనది. విశ్వజనీనమైనది. కళలు జీవితం నుండే ఉద్భవించి జీవితాన్నే ప్రతి బించిస్తాయి. జానపద కళల పుట్టుక-వికాసానికి సంబంధించిన విషయంలో తెలంగాణకు ఒక ప్రతేక ఉంది.

ఈ దృష్ట్యానే తెలుగు విశ్వవిద్యాలయంవారు వరంగల్‌లో గిరిజన జానపద పీఠాన్ని ఏర్పాటు చేశారు. చుక్క సత్తయ్య ఒగ్గు కథకు జాతీయ స్థాయి గౌరవాన్ని కలిగించారు. అదేవిధంగా మిద్దె రాములు ఎల్లమ్మ కథకు తెచ్చిన ప్రాచుర్యం కూడ అలాంటిదే. చిందు భాగవతం పేరు చెప్పగానే గుర్తు కొచ్చే కళాకారిణి చిందుల ఎల్లమ్మ. వీరు చిందులు తొక్కుతూ నాట్యం చేయటం వలన వీరిని చిందోళ్ళని, చిందుభాగవతులని అంటారు. తెలంగాణ గొప్ప సంస్కృతికీ, సంప్రదాయాలకు ఆచార వ్యవహారాలకు జానపదకళలు పుట్టినిల్లు అని చెప్పాలి..

కళమానవుని సృజనాత్మక నిపుణతకు, ఊహాశక్తి సామర్థ్యానికి ప్రతీక. గ్రామీణులు ఉత్సాహం, సామాజిక స్పృహ, సోదరభావం యీ ప్రకియ ఊపందు కోవడానికి వారిలో గ్రహణశక్తిని, ధారణశక్తిని జానపదకళలు పెపొందించాయి. తెలంగాణ ప్రాంతంలో సంస్కృతి పునరుజ్జీవనంలో జానపద కళల పాత్ర విస్మరించలేనిది. జానపద సాహిత్యంలో కూడా తెలంగాణయే గణనీయమైన స్థానం ఉంది. సర్వాయి పాపన్నకథ, సదాశివరెడ్డి కథ. నల్ల సామనాద్రి కథ, మియాసాబుకథ, వంటి దేశీకథలతో పాటు ఈ ప్రాంత చైతన్యాన్ని జాగృతం చేసిన బతుకమ్మ పాటలు తెలంగాణ జనజీవన సంస్కృతికి దర్పణం.

తెలంగాణ హస్త కళలకూ మాగాణమే. నిర్మల్ బొమ్మలు, పెయింటిగ్స్, పోచంపల్లి చీరలు, గద్వాల చేనేత,

పెంబర్తి ఇత్తడి కళాఖండాలు ఇలా ఒక టేమిటి దాదాపు ప్రతి జిల్లా ఏదో ఒక హస్తకళలో తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటుంది. లక్కను ఉపయోగించి చేసే అలంకార వస్తువులకూ నిర్మల్ పెట్టింది పేరు. పూర్వపు వరంగల్ జిల్లాలోని పెంబర్తి, ఇత్తడి కళాఖండాలకు ప్రసిద్ధి చెందింది భూదాన్ పోచంపల్లి చీరలు ప్రపంచ ప్రసిద్ది చెందాయి. రామానంద్ తీర్థ యూనివర్సిటీ వారు అందించే కంప్యూటర్ డిజైన్లలతో ఈ చీరలు నేస్తారు.

భారతీయ కళల్లో అపురూపమైన అద్భుతమైన కళ సిల్వర్ ఫిలిగ్రీ. ప్రపంచంలో ఎక్కడ కనిపించని ఈ కళ తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ లో దినదిన ప్రవర్ధమానమౌతోంది. వెండి ముద్దలను కరిగించి వెంట్రుక వాసి తీగలుగా మార్చి వాటిని చేతి కాళ్ల కదలికలతో ఒక తేర(జాతి)గా మలిచి అందమైన ఆకృతులను రూపకల్పన చేయడాన్ని ఫిలిగ్రీ అంటారు. పూర్తి హస్తకౌశలంతో యంత్రాల ప్రమేయం లేకుండా ఫిలిగ్రీ వస్తువులను తయారు చేస్తారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 15 కిలోల బరువైన అపురూప కళారూపాలను ప్రదర్శనకు ఉంచారు. అలాగే సిక్కుల పవిత్ర స్థలమైన అమృతసర్ స్వర్ణ దేవాలయంలోనూ ఫిలిగ్రీ వస్తువులు ప్రదర్శితమవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ భారతదేశ పర్యటనకు వచ్చినపుడు ఫిలిగ్రీతో తయారు చేసిన చార్మినార్ బహుకరించారు.

తెలంగాణ నిర్మాణంలో ముఖ్యంగా సాహిత్య వికాసంలో జానపదకళల పాత్ర విశిష్టమైనది. విద్యావంతువైన పండిత వర్గం ఈ పామర జనరంజకాలైన ప్రదర్శనా కళలని, జానపద సాహిత్యాన్ని చిన్నచూపు చూశారనేది కూడ వాస్తవం. పాల్కురికి సోమన లాంటి వారు జానపదధోరణిని ఆచరించారు. ఆ తరువాత ప్రాచీన సాహిత్యంలో ఏ కవి అంతగా ఆదరణ చూపలేదు. ఆధునిక కవులు, కళాకారులు జానపదకళల్ని ''వాక్యం రసాత్మకంకావ్యమ్'' అన్నవిధంగా జానపద సాహిత్యంలో ప్రతి వాక్యం రసాత్మకమై తెలంగాణ ప్రజా హృదయాలలో చిరస్థాయిగా నిలిచింది. మారుతున్న కాలానికి అనుగుణంగా చేర్పులూ - మార్పులూ చేసుకొని జానపదకళా రూపాలు రసరమ్యంగా ధూంధాం రూపాంతరంగా మారి సమాజానికి ఉపయోగ పడేవిధంగా ముందుకు వెళుతున్నాయి. అందరినీ ఆదరించడం, అందరినీ స్నేహాన్ని, ప్రేమనూ పంచడం, ఆశ్రయించిన వారికి ఆతిథ్యం ఇవ్వడం పల్లె జనవాసుల శ్లాఘ్యగుణం, మాయలు, మర్మాలు తెలియని జానపదకళాకారులు తెలియని అమాయకత, కష్టలూ, కార్పణ్యాలను ఇష్టపడని మానసిక ప్రవృతి, కష్టించి పనిచేసే స్వభావం మూర్తిభవించిన జానపదల సంస్కృతి ప్రపంచానికీ ఆదర్శం.

తెలంగాణలో పుట్టిన ప్రతికవి తెలంగాణ మట్టివాసన చూసి స్పందించి రచనలు చేసినవారే. ఈ ప్రాంతం కవి పండితులకు నిలయం. సంస్థానాలకు ఆలయం. నన్నయ కంటే ముందు పంపకని ఆయన సోదరుడు జినవల్లభుడి రచనలు, మల్లియ రేచన ఛందో గ్రంథం 'కవి జానశ్రయం వెలువడ్డాయని సాక్ష్యాధారాలు చెప్పుచున్నాయి. తెలంగాణలో జరిగిన తెలుగు సారస్వత వికాసం అనంతర కాలంలో నన్నయ భారత రచనకు అమితంగా ఉపకరించి ఉంటుందని ఊహించవచ్చు, ఈ ప్రాంత కవుల ప్రక్రియ వైవిధ్యం, వస్తు వైవిధ్యాలను నిశితంగా పరిశీలిస్తే భారతీయ భాషల్లో తెలంగాణ సాహిత్య చరిత్రకు గల విశిష్ట స్థానం, ప్రముఖ స్థానం బహిర్గతమవుతుంది.

చప్పట్లతో బతుకమ్మ ఆట ఆడుతూ పాటపాడుతూ, చిందు బాగోతాలతో చిందులేస్తూ డిల్లం పల్లెం అంటూ గొల్ల సుద్దులు, ఒగ్గు కథలు చెపుతూ దద్దనక ధన్ అంటూ డప్పుల మోతలతో డప్పుల దండోరేస్తాము. జై బోలో తెలంగాణ అంటూ చిరుతలాడుతాము. తిరుగుబాటు గీతమౌతాము.

ఈ పాటలు తెలంగాణ ప్రజల ఆకలి పేగుల నుండి వచ్చిన కేకలు, రైతన్నల, చేనేతన్నల ఆకలి చావుల అరుపులు, గోండుల తుడుం దెబ్బలు పాలమూరు బాధల దరువులు, ఇవి నీళ్లు లేక నోళ్ళు ఎండి గొడ్లు, మనుషులు గోసగోసరిల్లుతున్న గోసి గొంగడి గొల్ల గుడ్డి బతుకుల పాటలు, తరతరాలుగా దగా దోపిడి దారుణమైన

నిర్లక్ష్యానికి గురై రక్తం ముద్దైన తెలంగాణ గడ్డ అంగడిలో ఆగమైన అవ్వతీరుగా ఉన్నది. కరువు కన్నీళ్ళు కష్టాలు ఆకలిని అనుభవిస్తున్నది.

"తెలంగాణ గాన కోకిల, తెలంగాణ కళా సమితి కన్వీనర్ కా॥ బెల్లి లలితను ముక్కలుముక్కలుగా నరికి హత్య చేసింద్రు, సాంస్కృతోద్యమ నాయకుడు, గాయకుడు, కవి, కళాకారుడు కామ్రేడ్ దివాకర్‌ను కాల్చి చంపింది రాజ్యం. ఇతర కళాకారులను, పాటలు పాడకూడదని సంఘాల నాయకులను బెదిరింపులు, నాయకులను హత్య చేయడానికి బెదిరింపులు, బూటకపు అరెస్టులు, కేసులు, దాడులు, చిత్ర హింసలు పెట్టి వదిలెయ్యడం నిత్యకృత్యమైనాయి. ఇది సాంస్కృతోద్యమాన్ని అణచివేయడానికి రాజ్యంచేస్తున్న కుట్ర. ఈ కుట్రను ఎదుర్కోవడానికి కవులు, కళాకారులు ఏకమై ఐక్య సాంస్కృతికోద్యమాన్ని నడుపవల్సిన అవసరం ఎంతైనా ఉంది." (నా తెలంగాణ పాటలు, ప్రచురణ ఆంధ్రప్రదేశ్ ప్రజా కళామండలి, 2001, పుట.I)

**ముగింపు :**

తెలంగాణ సంస్కృతిలో జానపద కళలు ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉన్నాయి. ఇవి పల్లె జీవన చరిత్రలో భాగంగా బతుకమ్మ, బొడ్డెమ్మ, బోనాలు, సమ్మక్క-సారలమ్మ జాతర, నాగోబా జాతర, దండారి పండుగ, జానపద కళలు వంటివి ఆ ప్రాంత అస్తిత్వాన్ని కళాత్మకతను చాటిచెపుతాయి. అనేక శతాబ్దాలుగా వంశపారం పర్యంగా వస్తున్న ఈ  కళలు ప్రజలకు వినోదంతోపాటు సామాజిక చైతన్యాన్ని కలిగిస్తున్నాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. పల్లె జీవనానికి అద్దంపట్టే ఈ జానపద కళారూపాలు నేడు ఉపాధిలేక అనేక ఇబ్బందులు పడుతున్నాయి. దీనివల్ల అనేక సంప్రదాయ కళలు కూడా అంతరించిపోయే  ప్రమాదం ఉంది. ఈ సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వం కళాకారులకు ఆర్థిక సహాయం, పెన్షన్లు వంటివి ఇచ్చి జానపద కళాకారులను ప్రోత్సహించడం వంటి చర్యలు అవసరం.

**ఆధార గ్రంథాలు :**


1. జనగానం కె.దేవేంద్ర (సం) ప్రజా నాట్యమండలి, ముషీరాబాద్, హైదరాబాదు, అక్టోబరు, డిసెంబరు, 2011
2. గద్దర్- The Voice of Liberation జనం పాట పబ్లికేషన్స్, సికింద్రబాద్ 2002
3. ప్రజా యుద్ధ పాటకు చావులేదు- కూర్పు-సత్యం గద్దర్‌పై దాడిని ఖండిస్తూ వచ్చిన స్పందన - ప్రతి స్పందనలు, జనం పాట ప్రచురణలు 1999, సికింద్రబాద్.
4. ప్రజా కళా మండలి పాటలు 2014, ప్రజా కళామండలి ప్రచురణ, గుంటూరు
5. తెలుగు సాహిత్యం వ్యాసాల సంకలనం - బండ్ల పబ్లికేషన్స్, హైదరాబాదు 2010.


★★★

భావవీణ **BHAVAVEENA**
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
*Journal of Arts, Literary, Culture & Language Study*
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-4 | April 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# తెలంగాణ శ్రామిక వర్గ పోరాటాల్లో పాట వైవిధ్యం



డా॥. ఇలాసాగర్ ప్రభాకర్
మచ్చ బొల్లారం అల్వాల్, హైదరాబాద్, ఫోన్ : 9000609815
prabhakarelasagar@gmail.com

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.A.O) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహం :**

జానపద గేయాల్లో శ్రామిక గేయాలు జాతికి జీవ నాలుక. జీవనాడి కూడా, ఈ శ్రామిక గేయాల్ని, శ్రమకు, పాటకు విడదీయరాని సంబధాన్ని తెలుసుకోవచ్చు. తెలంగాణ కళలకు నిలయం. కళాకారులకు స్వర్గదామం. తెలంగాణలో ప్రపంచానికి తెలియని నైపుణ్యంతో కూడిన ఇటువంటి ఎన్నో కళలు మరెంతో మంది కళాకారులు ఉన్నారు. తెలంగాణలో కులాలు, ఉప కులాల మధ్య సాంస్కృతిక బదిలీకి, ఆర్థిక బదిలీకి ఈ కళలు వారధిగా పని చేస్తున్నాయి. అయితే సాంకేతిక విప్లవం, సామాజిక మాధ్యమాలు ఈ కళలు ఆదరణ కోల్పోవడానికి కారణం అవుతున్నాయి. అంతేకాకుండా ఈ కళలు, కళాకారుల గురించి తెలియజేసే సరైన సాహిత్యం లేక ప్రాచీన కళలు, కళాకారుల నైపుణ్యాలు మరుగున పడుతున్నాయి. పనులు చేసి అలసిన తెలంగాణ జనులు నాడు ఎన్నో కళలను ప్రోత్సహించి కళాకారులను ఆదరించి తమ విరామ కాలాన్ని సద్వినియోగం చేసుకునేవారు. నేడు ఈ కళల, కళాకారుల స్థానాన్ని దూరదర్శన్, అంతర్జాలం, సామాజిక మాధ్యమం ఆక్రమించాయి. శారీరక శ్రమ, మానసిక ఉల్లాసంతో కూడిన కళలు, కళాకారుల నైపుణ్యాలను గుర్తించాల్సిన, ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. తెలంగాణలోని వివిధ కులాలు, ఉపకులాల వారు ప్రదర్శించే కళారూపాలు మన చరిత్రను తెలియజేసేవి. చారిత్రక ప్రాముఖ్యతను చాటి చెప్పేవి, చాలావరకు వివిధ కులాల పుట్టుపూర్వోత్తరాలు, కులాల ఆవిర్భావం, ఆరాధ్య దైవాలకు సంభందించిన కళారూపాలే ఎక్కువ. ఈ కళల్లో చారిత్రక విషాదగాధలు, జాతీయ ఐక్యతను చాటి చెప్పేవి, చారిత్రక ప్రదేశాలను తెలిపేవి, కులాలకు గల ప్రాచీనతను తెలిపే అనేక పాటలున్నాయి. ఈ వ్యాసంలో గోరెటి వెంకటన్న, నిస్సార్, అందెశ్రీ, గద్దర్ మొదలైన వారి పాటలను వివరించడం జరిగినది.

**కీలకపదాలు :**

కళాకారులు, శ్రామైక జీవన సౌందర్య, ఉద్యమం, వలసపాలన, చేతి వృత్తులు, మానవ సంస్కృతి, సామ్రాజ్యవాదం, వీధిబాగోతాలు, మార్క్సిజం.

**ప్రవేశిక :**

జానపద గీతాల్లో శ్రామికులు గానం చేసుకునే, శ్రామికుల శ్రమల పై రాసే గీతాలను శ్రామిక గీతాలుగా వర్గీకరించవచ్చు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో శ్రమ దోపిడి, ఇతర ప్రాంతాల పాలకుల ఉపేక్ష భావనలపై గీతాలు కనిపిస్తాయి. శ్రామిక కర్షక తెలంగాణములో శ్రమైక సౌందర్యాన్ని తెలియచేస్తూనే వారి బ్రతుకులు కళాకాంతులు లేక ఏలా మోడుపోయాయో చెప్పే గీతాలను చూడవచ్చు.

దానికి ఉదాహరణగా "నాగేటి సాల్లల్ల"లో నందిని సిద్ధారెడ్డి వ్యక్త పరిచిన భావాలను మనం గ్రహించవచ్చు. 'తాడు పేనిన బతుకు తండ్లాట', 'మంటలేని కొలిమి బతకుల మంట' వంటి ప్రయోగాలు వలసపాలనలో శ్రామికుని పరిస్థితిని తెలియచేస్తున్నాయి. గోరటి వెంకన్న "పల్లె కన్నీరు పెడుతుందో'.. పాట గీతంలో కూలిపోయిన చేతివృత్తుల చిట్టా అంతా వుంది. సామ్రాజ్యవాద విషం" గ్రామస్వరాజ్యాన్ని ఏలా నష్ట పరుస్తున్నయో చెప్పాడు కవి. చేతిలో పని లేని పల్లె వలసపోవలసిన పరిస్థితులను కళ్ళకు గట్టిండు కవి.

దరవు ఎల్లన్న వలస పోతున్న గ్రామ ప్రజలను, తిప్పలు పడుతున్న తల్లిదండ్రులు, అక్క చెల్లళ్ళ వైనం 'ఓయం. ఏ జేసే సమస్న ' గీతంలో వ్యక్తపరిచాడు. వరవరరావు 'రేలారే రేలారె...' గీతంలో సింగరేణి గనుల చిందిన చెమట ఉద్యమమై పెల్లుబికి తెలంగాణ కలను సాకారం చెయ్యాలని ఆకాంక్షించాడు. పత్తి రైతు జీవితం చిత్రిస్తూ కవి వి.ప్రకాశ్ "ఓ తెలంగాణ పత్తి రైతా" అనే గీతంలో సర్కారు చేసిన దోఖాను వివరించే ప్రయత్నం చేశాడు. కడకు పురుగుమందే మరమాన్నమైన విషయం, సోయి లేని సర్కారు తీరును ఎండగట్టాడు. "నా తల్లి తెలంగాణ గీతంలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ 'సెమట ఒడ్సె' శ్రమ జీవులునన్నా కంపెనీలు చేసే మాయ వివరించాడు. తెలంగాణలో నాటి నుండి నేటి వరకు శ్రామిక గేయాల నుండి పోరాట పాటల దాకా జానపదులు సృష్టించుకున్న పాటలు ఒకెత్తైతే ఇటీవుల తెలంగాణ ఉద్యమంలో పుట్టిన పాటలు మరోక ఎత్తు. నిజాం కాలం నాటి నుండి తెలంగాణ ప్రజలు తాము అనుభవిస్తున్న కష్టాల్ని వివిధ రూపాల్లో పాటల రూపంలో వెలిగక్కారు. ఈ విధమైన శ్రామిక గేయాలను పరిశీలిండమే ఈ వ్యాస ఉద్దేశం.

**శ్రామిక వర్గ పోరాట గేయాలు – విశ్లేషణ :**

భారతదేశానికి పల్లె సీమలే పట్టు కొమ్మలని అంటారు. గ్రామస్వరాజ్యం గాంధీజీ కన్నకల. అటువంటి పల్లెలు దగాపడ్డాయి. సర్కారు పట్టణాన్ని పట్టించుకున్న రీతిలో  పల్లెను పల్లెను పట్టించుకోలేదు. తెలంగాణ ఉద్యమం నేపథ్యంలో పల్లె జీవితాన్ని, పల్లె వర్తమానంలో దగాపడ్డ వైనాన్ని చాలా గీతాల్లో చిత్రించారు కవులు.

రేలా దూల తాలెల్లాడె నేలో నా తెలంగాణ
సుడిగాలికి సెదిరిన పక్షులు గూడోలాయె నా తెలంగాణ

కొట్టమెక్కి కోడిపుంజు కొక్కొరొకో అని కూతలు పెడ్తాది
కొమ్మలసివర కూసాని కోయిల కమ్మటి గాలిన్పిస్తుంటది
గంటనూపుతు బాల సంతులు ఇంట ముంగిట దీవెనియ్యంగ
సెంగు సెంగున లేగదూడలు అంబా అంటూ పరుగులు పెట్టగ
పక్షుల కిలకిల రావాలతో పల్లే తెల్లారేనమ్మో
కక్ష్య గట్టిన హింసలతోన పల్లె అల్లాడెనమ్మ

గోరుకొయ్యలు పొడువగ లేసి అరకటెద్దుల మోటలు గట్టి
జేనె లొలికె గొంతులనెత్తి జానపాటలు పాడుతుంటే

పాటకు ఎన్నెల పరవశించి మోట దోనను ముద్దాడేది.
సుట్టు ఆమడ దూరం దాక సెట్టు సేమలు ఊగి ఆడేవి.
పక్షులు అడవి జీవరాశులు పరుగులు పెడ్తాయి పిలక బావికి
ఈ ఊట బావి మోటగిలక సడి ఏది నా పల్లెల్లోన
ఆ దాపటి వెలుపటెద్దుల తెల్లారేది నా పల్లెల్లోన (గోరెటి వెంకటన్న పాటలు, పుట. 26)

గోరేటి వెంకన్న "రేలా దూల తాలెల్లాడ నేల" గీతంలో పల్లె పకృతిని, పల్లె స్వభావాన్ని, పల్లె పల్లె సంస్కృతిని, పల్లె వినోదాన్ని వర్ణిస్తూ, వర్తమానంలో అవి ఆవిరయ్యిపోయిన విషయాన్న గుర్తు చేసుకుంటాడు.

పాత రేకు వలె మోతలు మ్రోగేటి ప్లాస్టిక్ డప్పులు
నా మ్యాతరి డప్పును పాతరేసె గదరా నా పల్లెల్లోనా
కుంకుమ దాసిన బుక్క మీద కూడ
కంపెనీ రక్కసి కన్ను పడ్డది
పూసలోళ్ళ తాళం కప్పలు
కాసిల కలిసి ఖతమైతున్నవి
బొట్టు బిళ్ళలు నొసటికొచ్చె కదరా నా పల్లెల్లోన
మా బుట్టి దాసరి బతుకులాగమాయే ఈ పల్లెల్లోనా
బతుకమ్మ కోలాట పాటలు
భజన కీర్తనల మద్దెల మోతలు
బైరాగుల కిన్నెర తత్త్వంబులు
కనుమరుగాయెరా నా పల్లెల్లో
అరె స్టారు టీవి సకలిస్త వున్నదమ్మో నా పల్లెల్లోనా
సామ్రాజ్యవాద విషమెక్కుతున్నదమ్మో మెల్లెంగ పల్లెకు (గోరెటి వెంకటన్న పాటలు, పుట.32)

"పల్లె కన్నీరు పెడుతుందో" గీతం చాలా సుప్రసిద్ధ గీతం. సహస్ర వ్యక్తుల శ్రమైన సౌందర్యం తెలిపే గీతం. వృత్తులు కూలిపోయి ఉపాధి పోయిన వారికీ ప్రత్యామ్నాయం లేదు. బహుళ జాతి కంపెనీల మాయల్లో పల్లెలు నలసి పోయాయని సిద్ధాతీకరించాడు వెంకన్న.

వాక్కనికే ఇచ్చిరి ఉయ్యాలో
వొక్కడే మాయన్న ఉయ్యాలో
వొచ్చన్న పోడాయే ఉయ్యాలో
సక్కని మాయన్న ఉయ్యాలో
సూసన్న పోదాయే ఉయ్యాలో
చిన్నారి చెల్లెండ్లు చెంగు చెంగునెగురుకుంట
చెమ్మచెక్కలాటలాడేది
మన వాకిళ్లలోన ఆడపిల్లల లొల్లేది ?
ఆడేటి ఆట లేదు పాడేటి పాట లేదు.
పల్లె సంబరాలె లేవమ్మో
నేడు టీవీలు సినిమాలు పల్లె కళలను మింగెనమ్మ (నిస్సార్ గేయాలు, పుట. 8)

నిస్సార్ రాసిన "పండు వెన్నెల' గీతంలో పండు వెన్నల్లో ఆడి, పాడే ఆటలు ఏమయిపోయాయి, పల్లెటూరి వీధి బాగోతాలు ఏమయ్యాయి. స్టేజి, మైకు, కరెంటు వంటి ఆధునిక హంగులు లేకున్నా తెల్లవారే వరకు సాగిన వీధినాటకాలు పోయాయి. గ్రామీణులు ఆడే ఆటలు కనుమరుగై పోయాడు. పల్లె సంపదను టీవీలు, సినిమాలు మింగేసినాయని వాపోతాడు.

ముంతా మామిడి పండ్ల ముచ్చట్లు లేనే లేవు
సిలకమ్మా కలికీ పండ్లా పలుకూలా జాడాలేవీ
కంట జూద్దామన్న జుంటి తేనే లేదు
అడివంతా మాయామవుతుందో
మా పల్లే తల్లీ
అల్లాడీ పోతావున్నాదో ..
చింతా చెట్లెవడూ నరికే శిథిలమైనట్టు ఊరూ
కాని కాలాల నడుమా కరువూ రాకాసీ దాడి
పట్టాణాలాకు వలసా పల్ల్యంతా బోసీవోయి
గోసెల్లాబోస్తా ఉన్నాదో
తన బతుకు దెరువూ
కొరకు పోరాడుతున్నాడో .. (అందెశ్రీ పాటలు, పుట.3)

అందె శ్రీ, "తెనుగోల్లా ఎల్లమ్మా ఏదీ.." గీతంలో పల్లెల చిరు తిండుల విషయం ప్రస్తావిస్తూ కాని కాలల నడుము కరువు రాకాసి దాడి చేస్తే పట్టణాలకు వలస పోయిన పల్లె బోసిపోయి, గోస వెల్ల బోస్తు వుంది అని వర్ణిస్తాడు.

ఈ సమాజాన్ని మార్చి నూతన సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంగా తమ హావ, భావ, నటన, వాయిద్య, గాత్రాలతో ప్రజలను చైతన్యపరచాలని ధూంధాం పరితపించి, అమరులై పీడిత ప్రజల గుండెల్లో పదిలంగా నిలిచిన ప్రజా సాంస్కృతిక యోధులకు అంకితముగా ఈ పాటలు రచించారు.

"తెలంగాణమా.... తెలంగాణమా
తెలుగు నేలపై మొలిచిన త్యాగాల వనమా,
ఎన్నెన్నో అందాలు మరువని మకరందాలు
ఈ భువిపై విరజిమ్మిన విప్లవ సుమగంధాలు
కళలకు నువ్ కాణాచి కవులకు నువ్ పురుడోసి
విప్లవాన్ని కలబోసిన పోరుకు దిక్సూచి" (ప్రజా కళామండలి పాటలు, పుట.11)

వేల కొలది వీరులు నేలపై ఒరిగినా సాగుతున్న పోరు జనహోరు సంద్రమే. మొదట అమరులపై ప్రారంభించి తెలంగాణ, రాజ్యహింస, కులం-మతం, ఇతర సామాజిక సమస్యలపై పాటలున్నాయి.

మార్క్సిజం పునాదిగా సాగుతున్న వివిధ రకాల పోరాటాలు ఈ నేల మీద పుట్టాయి. ఆ పోరాటాలలో ప్రజలు పాల్గొంటున్నారు. ప్రాణాలు అర్పిస్తున్నారు. విప్లవం కావచ్చు, తెలంగాణ కావచ్చు, దళిత పోరాటాలు కావచ్చు. పేరు ఏదైనా సమాజంలో మౌలిక మార్పుతేవడం కోసం మనుషులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. కళ్ల ముందరి చరిత్రలో ప్రజాస్వామ్య తెలంగాణ కోసం బెల్లిలలిత, ఐలన్న, ఆకుల భూమయ్య అమరులయ్యారు.

భౌగోళిక తెలంగాణ కోసం వేలాది మంది బలిదానమయ్యారు. ఈ ప్రజాకళామండలి కవులు అక్షర బద్ధం చేసారు. 'గాత్రమంతా గాత్రమై' ఎలుగెత్తారు.

ఆకుల భూమయ్యను రాజ్యం హత్య చేస్తే ప్రజాస్వామ్య తెలంగాణ గొంతు మూగపోతుందా?! లేదు. ఎందుకంటే చరిత్ర ఎప్పుడైనా ముందుకే పోతుంది. అది 'వచ్చుకాలం మేలు గత కాలంకంటే". కనుక ఉద్యమాల పెద్దదిక్కు ఆకుల భూమయ్య "ఉదయించే సూర్యుడై కదిలివస్తాడు" కాలినడకన కరీంనగర్ మొత్తం తిరిగి బడిపంతుళ్లను ఏకం చేస్తాడు. కత్తుల వంతెన మీద నడిచి 'నెత్తుటి జెండాను ఎత్తుకునే ధైర్యం నెత్తుర్లో ఈదిన చరిత్రనే ఇచ్చింది. తెలంగాణ వసంతం వాడిపోతున్న వేళ అతడు రాజకీయ వక్తగా వచ్చాడు. గరిక మైదానం నవ్వులా జగిత్యాల జైత్రయాత్రలా వచ్చాడు. బాల్యానికి అతడు కొన్ని భావాలను తాపాడు. మట్టి స్వప్నాల మీద బడిపంతుళ్లకు ఎన్నో బోధనలు చేసాడు.

కళాకారులను, కవులను కలిచివేసింది. సముద్రపు అలల వలె అతని భావాలు ఎగిసిపడేవి. జలపాతాల్లా ప్రవహించేవి. మనువాదం గుండెల్లో దండోరా వేసిన జ్యోతిబాపూలే, అక్షర కిరణంతో అణగారినోళ్ల బతుకుల్లో వెలుగును నింపిన కనకాచారి, ప్రజల గుండెల తలుపు తట్టిన పౌరహక్కుల అమరులు, దళితుల కన్నీటి బతుకుల్లో కాంతి రేటైన అంబేద్కర్ మొదలైన అమరులపై పాటలున్నాయి.

"అదిలాబాద్ జిల్లా. ఆదివాసుల జిల్లా. కొమురంభీం జిల్లా. కోటిగానాల జిల్లా. తెలంగాణకు తలమానికమైన జిల్లాలో పుట్టి పెరిగిన ఆశన్న సహజంగానే అడవి కళ్లతో తెలంగాణను చూసాడు. శ్రమజీవితం నుంచి తెలంగాణను గానం చేసాడు. 'కష్టం చేసి కనకరాశులు బోసిన తెలంగాణకు కాలేకడుపులు ఎందుకు మిగిలాయని' ఆంధ్ర పాలకులను ప్రశ్నించాడు. ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోతే ఫలితం లేదు. చరిత్రలో ఎప్పుడైనా ప్రశ్న పిడిబాకుగా మారితేనే ప్రజలకు న్యాయం దొరుకుతుంది. అందుకే "తూర్పు కొండల నిప్పుపుట్టెరా తెలంగాణము/ ఆంధ్ర పాలకుల గుండెలదిరెరా" అనే దృక్పథాన్ని సత్తెయ్య పాటగా మలిచాడు. ఉస్మానియా చుట్టూ ఇనుప కంచెలు అల్లినా ఉద్యమాన్ని ఆపడం ఎవడితరం కాదనే నమ్మకం ప్రజలలో నింపటం వలన ఆత్మస్థైర్యం చెక్కు చెదరకుండా ఉంటుంది. ఈ పనిని కవి మాత్రమే చేయగలడనే విశ్వాసం ఈ పాటలను చదివాక కలుగుతుంది. కవిత్వాన్ని, పాటను సంవాద రూపంలో నడపటం ఒక టెక్నిక్. ఈ టెక్నిక్లో నైపుణ్యం సాధించిన కవి మంచి పాటను ప్రజలకు అందించగలడు. నర్సింహులు ఆ పని చేసాడు. వేమన వలె మొదట ఒక ఊహను ప్రతిపాదించి, రెండు వాక్యాలకు ఘర్షణ సృష్టించి సూటిగా విషయాన్ని మెదడులోకి చొప్పించటం ప్రజాకవులకుండే శైలి. ఈ శైలిని తెలుగు పాట సాహిత్యంలో గద్దర్ అద్భుతంగా సాధించాడు. ఇపుడు నర్సింహులు "తల్లి మన తెలంగాణా తల్లడిల్లెనెందుకూ కోటి రతనాల వీణను కొల్లగొడుతున్నందుకు/ సకల సంపద తెలంగాణది తరలిపోతున్నందుకు" చెప్పే విషయంలో సంక్లిష్టత లేకుండా పాట హాయిగా హృదయాన్ని తాకి మెదడును ఆలోచింపచేయటం.

తెలంగాణ అంటే కేవలం భౌగోళిక తెలంగాణ కాదు. తెలంగాణ పోరాటం భావోద్వేగాల మీద ఏర్పడిన ఉద్యమం అంతకంటే కాదు. ఈ స్పష్టత పోరాడేవారికి తప్పక ఉంటుంది. "భూమి కోసం లడాయి బువ్వ కోసం లడాయి/భుక్తి కోసం లడాయి/ విముక్తి కోసం లడాయి" జామ చెట్టు మీద ఉండే చిలుక కొరికిన పండు ఎంతో రుచి. ఇది మౌఖిక సంప్రదాయం. ఆకులందున అణిగిమనిగి కవిత కోయిల పలుకుతే ఇది లిఖిత సంప్రదాయం. ఈ రెండింటి కలపోత పాట. చింతచెట్టు మీద కోయిలా తెలంగాణ కన్నీళ్లను, కష్టాలను చూడమని, జామ చెట్టు మీద కోయిలా తెలంగాణ బాధలు చూడమని నాగరాజు ఆర్థంగా అడుగుతున్నాడు. కోయిలా చెపచెట్టుమీద, జమ్మిచెట్టు మీద కూడా ఉండగలదనే ఊహను కవి మాత్రమే చేయగలడు.

కవి గొంతెత్తి పాడగలుగుతే ఇంకా ప్రజాదరణ ఎక్కువగా ఉంటుంది. అన్నమయ్యలాగా, రామదాసులాగా, గద్దర్లాగా జీతే(నాండి రాజ్య దోపిడిని పాటల్లో ఎండగట్టాడు. కాని రాజ్యం కన్నెర్ర చేసింది. పాటను బంధించింది. పాటపై విచారణ జరిపింది. పాటకు ఉరివేసింది. ఈ ఉరిని ధిక్కరించే శక్తి కవికి పాట ద్వారానే వచ్చింది. ఆపాట ఏం చేసింది? సుద్దులన్ని ప్రజలకు అద్దినట్లు చెప్పింది/చీకటి బతుకులకు వెలుగు దారి చూపింది''(కోటి) వెలుగును పంచిన పాటను వేటాడితే సూర్యుణ్ణి వేటాడినట్టే. అపుడు ప్రపంచ వ్యాపితంగా కవులు తమ గళాలను పదునుచేసి ఉరితాళ్లను తెంపేస్తారు.

వేంపెంట ఒక విషాదగీతం. లక్షింపేట వర్తమాన దుఃఖచిత్రం. ''కాపు దురహంకారం కూడబలుకొని గుంట నక్కలోలె కుట్రపన్నుకొని/ అంటరాని మాలలంతుతేల్చాలని'' (కోటి) బరిసెలతో చంపేసిన తీరు ఈ పాట కళ్లకు కట్టింది. ఎంత అణచివేసినా ధిక్కరించే స్వభావం నుంచి దళితులు ముందుకే వస్తున్నారు. పోరాడుతున్నారు. అమరులవుతున్నారు. ''కత్తుల వంతెనపైనా-నెత్తుటి ఏరులవుతున్నారు/ఎత్తిన జెండాలల్లో ఎర్రటి మెరుపులవుతున్నారు'' (కోటి) ఈ కవికి ఒక స్పష్టత ఉంది. అది రాజకీయ స్పష్టత. దళిత విముక్తి కుల పోరాటాలలో లేదు. వర్గ పోరాటంలో ఉందనే విజన్ ఉంది. ఎర్రజెండా నీడలోనే వాళ్ల విముక్తి ఉందనే మార్గాన్ని చూపించాడు. కులం కులం అని గిరిగీసుకున్న కులోన్మాదులకు ఇది చెంపపెట్టులాంటిది. విప్లవం ముసుగులో దాగున్న కులతత్వవాదులకూ ఇది గుణపాఠం కావాలి.

''మనిషి కాలుకు అచ్చుకోసి మేకులు దిగ్గొట్టిన మాదిగ శ్రమతత్వాన్ని మన కళ్ల ముందు చిత్రిక కట్టిన మరో పాటను నర్సింహులు రాసాడు. కంపు బట్టలను మల్లెపువ్వుల్లా చేసిన చాకలి సౌందర్యాన్ని, కుమ్మరి చక్రంపై జీవకళని అద్దిన మట్టి బొమ్మను, ఇలా అన్ని శ్రామిక కులాల శ్రమతత్వాన్ని ఈ పాటలో మనం దర్శించవచ్చు.'' (డా॥సి.కాశీం, ఎడిటర్, నడుస్తున్న తెలంగాణ) ప్రజా సమస్యలన్నింటికి పోరాటమొక్కటే మార్గమని గుర్తుచేస్తాయి. సంస్థ ప్రయాణంలో శక్తిమేరకు క్రియాశీలకంగా పాల్గొంటూనే ప్రజల బాధలను, వీర గాథలను పాటలుగా రచించే బాధ్యత మనదేనని గుర్తించి, ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై వెంటనే స్పందించి పాటలను వ్రాసిన సభ్యులందరికి కృతజ్ఞతలు. ఈ సంకలనాన్ని ఆటపాటల రూపంలో పీడిత ప్రజల వద్దకు తీసుకుపోవడంలో సంస్థ సభ్యులందరు ప్రత్యేక శ్రద్ధ వహిస్తారని కోరుకుంటున్నాము. అసమ సమాజంలో అణచివేతకు గురౌతున్న పీడిత ప్రజలు రాజ్యపాలకు వ్యతిరేకంగా, తమ హక్కులకోసం, ఆత్మగౌరవం కోసం, సమాన హక్కుల కోసం, భూమి విముక్తికోసం, వేతనాలకోసం, శ్రమ విముక్తికోసం, సాగుతున్న ప్రజా ఉద్యమాలలో ప్రజలందరూ అశేషంగా పాల్గొని ఈ పాటల చైతన్యంతో పల్లె పల్లెలో పాటల పుంతలై ఉద్యమించారు.

**ముగింపు :**

తెలంగాణలో జోగులవారు, జక్కుల వారు, బాలసంతులవారు, సాతానులు, బుడబుక్కల వారు వంటి జాతుల వారు జానపద భిక్షుగాయకులై తెలుగువారి యొక్క జానపద కళల్ని ఆదరించి, పోషించి వారి యొక్క జీవనాన్ని కొనసాగించేవారు. ఇలా అనేక రకాల జానపద కళాకారులు వారి కళల్ని పల్లెల్లో వారి శ్రమను మర్చిపోయేందుకు పంటల కోత సమయంలో, పండుగలు, జాతరులు, జాతరులు, తిరునాళ్ళు, ఉత్సవాల సందర్భాల్లో వారు ఆడి పాడి ప్రజల్ని ఆనందింపజేసేవారు. ఈ జానపద కళలే పల్లెలకు అందంగా, అలంకరణగా చూడముచ్చటగా ఉండేవి. ఇవి రాను రాను పెరుగుతున్న టెక్నాలజి, ప్రపంచీకరణ నేపథ్యంలో, డబ్బు సంపాదనలో ''ఎవరికి వారే యమునాతీరే'' అలాగే వ్యక్తిగత జీవిత స్వార్థం కోసం పరుగెత్తే ఈ తరం వారు ఈ కళల్ని ఆదరించక, వారిని పోషించక మర్చిపోతుండడంతో జానపద కూడా వారి వృత్తిని వదిలి వేరే జీవిత మార్గంను ఎంచుకుంటున్నారు. ఈ కళలు ఎప్పటిలాగే అలరించాలంటే ''మనవంతు కళాకారుల్ని గౌరవిద్దాం.

ఏ కళ అయినా బ్రతికుండాలంటే అన్నిటికన్నా ముఖ్యమైంది ప్రజాదరణ. జానపద గేయాలు, కథలు, సామెతలు, పొడుపు కథలు, పగటి వేషాలు బుర్రకథల ధూంధాం వంటి కళారూపాలు అన్ని కూడా నేడు కొడిగడుతున్న దీపాలే. ప్రజాదరణ కోల్పోయి కొడిగడుతున్న ఈ జానపద కళలనే దీపాలను ప్రజల ఆదరణ అనే చమురుపోసి బతికించి ప్రాచీన మానవ సంస్కృతి మట్టిలో కలిసిపోకుండా కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిది. నేను సైతం అంటూ ప్రతిఒక్కరూ కూడా తమ వంతు చేయూత నిచ్చి నట్లయితే  వాటికి అవి పూర్వ వైభవాన్ని పొందుతాయి.

జానపదులు పాడే శ్రామిక గేయాలలో వారు వ్యవసాయం చేసేటప్పుడు వినియోగించే వస్తువులు, పండించే ధాన్యపు పేర్లు, ఆభరణాలు, చీరలు, జాలరులు పాడే గేయాలలో చేపల రకాలు మొదలైన అంశాలు ఈ వ్యాసంలో చర్చించబడ్డాయి. ఈ అంశాలను పరిశోధన రూపంలో పొందుపరచడం వల్ల భవిష్యత్తరాలకు వీటిని అందించిన వారమవుతాం. ఈ దిశగా విద్యార్థులతో పరిశోధన చేయించాల్సిన ఆవశ్యకత ఉంది. అప్పుడే ప్రాంతీయ పరమైన సంస్కృతి సంప్రదాయాలు, ప్రజలు వినియోగించే వస్తుసంస్కృతి వెలుగులోకి వస్తుంది. ఆయా వస్తువులను ఒక్కొక్క ప్రాంతంలో వేర్వేరు పేర్లతో పిలుస్తారు. భాషాపరమైన అంశాలు వెల్లడి అవుతాయి. ఈ శ్రామిక గేయాలలో గుర్తించిన వివిధ రకాల వస్తువుల, చేపల, చీరల, మరియు ధాన్య సంబంధమైన పదాలు నాగరిక సమాజానికి తెలియజట్టయడమే ఈ వ్యాసం ఉద్దేశం. ముద్రింప బడిన గేయాలను ఆధారంగా చేసుకుని రాయడం జరిగింది. ఈ పరిశోధన Richard M. Dorson చేసిన వర్గీకరణలోని వస్తు సంస్కృతి అనే విభాగం కిందికి వస్తుంది.

**ఆదార గ్రంథాలు :**


1. జనగానం కె.దేవేంద్ర (సం) ప్రజా నాట్యమండలి, ముషీరాబాద్, హైదరాబాదు, అక్టోబరు, డిసెంబరు, 2011
2. గద్దర్- The Voice of Liberation జనం పాట పబ్లికేషన్స్, సికింద్రబాద్ 2002
3. ప్రజా యుద్ధ పాటకు చావులేదు- కూర్పు-సత్యం గద్దర్‌పై దాడిని ఖండిస్తూ వచ్చిన స్పందన - ప్రతి స్పందనలు, జనం పాట ప్రచురణలు 1999, సికింద్రబాద్.
4. ప్రజా కళా మండలి పాటలు 2014, ప్రజా కళామండలి ప్రచురణ, గుంటూరు.
5. కృష్ణకుమారి, నాయని. 1974. జానపద గేయాలు సాంఘిక చరిత్ర. మురళీ పవర్ ప్రెస్, హైదరాబాదు.
6. మోహన్, జి.యస్. 1981. తెలుగు జానపద విజ్ఞాన వ్యాసావళి. శ్రీనివాస పబ్లికేషన్స్, మలయనూరు.
7. మృణాళిని, సి. 2016. తెలుగు సాహిత్య విమర్శ దర్శనం. విజ్ఞాన సర్వస్వం (సంపుటం-11), కొమ్మర్రాజు విజ్ఞానసర్వస్వ కేంద్రం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
8. రామరాజు, బిరుదురాజు. 1990. తెలుగు జానపద గేయ సాహిత్యం. జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాద్.


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-4 | April 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

**Article Link :** *https://www.bhavaveena.com/*



# వరంగల్ జిల్లా జానపద గేయ కథలో - భీరయ్య గేయకథ

డా॥. ధారవత్ సంతోష్ కుమార్
తెలుగు ఉపాధ్యాయులు, తొర్రూర్, మహాబూబాబాద్, 506163. చరవాణి : 9704450273.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

## పరిచయం

నేటి తెలుగు సాహిత్య పరిశోధన పరిశోధక విద్యార్థి కుటుంబ జీవన పరిస్థితులపై ఆధారపడి వుందనే మాట నమ్మశక్యంగా లేనిది. కానీ ఇది వాస్తవం. ప్రస్తుతం తెలుగుసాహిత్యంలో స్థానిక సాహిత్యాన్ని పునరుజ్జీవింపచేసే ప్రయత్నం విస్తృతంగా జరుగుతున్నది. జిల్లాలవారీగా, మండలాలవారీగా, ప్రాంతాలవారీగా, ఆయాచోట్ల ప్రా ధాన్యం ఉన్న సాహిత్యాన్ని సేకరించి వివిధ వర్గాలుగా సేకరించి వెలువరిస్తున్నారు. ఇది జానపద సాహిత్య పరిశోధనకు వాస్తవిక అంశమని భావించవచ్చు. ప్రపంచంలో ఏ భాషా సాహిత్యానికైనా, ఆ భాష యొక్క గొప్పతనం తెలుసుకోవడానికి, ఆభాష మూలరూపాలు తెలుసుకోవాలన్నా జానపద సాహిత్యమే మూలమని పరిశోధకులు వివరించడం జరిగింది. దీనినిబట్టి తెలుగువారి సాహిత్య చరిత్ర, ఆచారాలు, సంస్కృతి సంప్రదాయాలు ఇత్యాది అంశాలు తెలుసుకోవడానికి జానపద సాహిత్యమే మూలమని తెలుసుకున్నాను.

నేను వరంగల్ జిల్లా స్థిర నివాసికావడంవల్ల, వరంగల్ జిల్లా జానపదుల సంస్కృతి సంప్రదాయాలు, ఆచారాలు, అలవాట్లు మరియు కట్టుబాట్లు, జాతరలు, కథలు, గేయకథలు మొదలగు అంశాలను గూర్చి పరిశోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని భావించి నేను పిహెచ్.డి "వరంగల్ జిల్లా జానపదగేయకథల అధ్యయనం" అనే అంశాన్ని ఎన్నుకుని క్షేత్రపర్యటన ద్వారా జిల్లాలో తిరిగి జానపద మౌఖిక గేయకథలను సేకరించి, సేకరించిన గేయకథలను విశ్లేషించి హైదరాబాదు విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి పట్టాను తీసుకున్నాను.

నేను ఈపరిశోధన కేవలం వరంగల్ జిల్లాలోని జానపద మౌఖికగేయకథలకు పరమితమైయ్యాను. క్షేత్రపర్యటనలో నేను సేకరించిన గేయకథలననుసరించి పరిశోధనను కోనసాగించాను. క్షేత్రపర్యటనలో గ్రామాలను తిరిగి యాభైఎనిమిది (58) మౌఖిక జానపద గేయకథలను సేకరించాను. నాకు లభించిన మౌఖిక జానపదగేయకథలను డా.తంగిరాల వెంకట సుబ్బారావు గారు విభజించిన రీతిలో విశ్లేషించుకుంటే ఎనిమిది గేయకథచక్రాలు. వీటి నిడిది

మూడుగంటల నుండి మూడుగంటల నలభైనిమిషాల వరకు ఉన్నాయి. పదిగేయకథలు (Ballads). వీటి నిడిది ఒకగంటనుండి గంటముప్పైనిమిషాల వరకు ఉన్నాయి. అలాగే నలభైలఘుగేయకథలు(Balladlings). ఇవి ఒకనిముషం నుండి నలభై నిమిషాల వరకు నిడిది ఉన్నాయి.

## భీరయ్య గేయకథ

సురవ్వకు ఒక్కడే అన్న. సురవ్వ పుట్టిన ఏడురోజులకు అమ్మ చనిపోవడం, సురవ్వకు అన్న నారదుడు అన్ని తానై పెంచసాగెను. ఒకరోజు వారి ఇంటికి బ్రాహ్మణులు వచ్చి మీ చెల్లె పుట్టిన ఘడియ బాగా లేదని, ఊరు బయట ఉంచవలెను అని చెబుతారు.

"రామ రామ రామ రామా
రవరాజు ఎమిజెసె రామ రామా
నమినాగుల కొండలొనె రామ రామా
నారదుడు వున్నడమ్మ రామ రామా
నారదుడు చుడవమ్మ రామ రామా
నా సెల్లె సురవ్వనె రామ రామా
ఎడొక్క తల్లి చచ్చె రామ రామా
ఎవంట గ్యానమల్ల రామ రామా
గ్యానమల్ల పలికినాడా రామ రామా
నమినాగుల కొండలొనె రామ రామా
నారదుడు సెల్యనైతే రామ రామా
గారబంగా సాడబట్టె రామ రామా
బ్రహ్మనులు వొచ్చినారా రామ రామా
ఎమాని చెప్పబట్టె రామ రామా
ఎమయ్య నారదుండా రామ రామా
మి సెల్లె పుట్టిన గడియ రామ రామా
మంచిది గాడునయ్య రామ రామా
ఉరుబయటె వుంచవాలో రామ రామా
అపుడు నారదుండు రామ రామా
వురు బయటెమెడ గట్టె రామ రామా
వురు బయటె వుంచినాడా రామ రామా"

నేను సేకరించిన గేయకథకు ప్రారంభం ఇది. అయితే డా. రావి ప్రేమలత గారి బీరప్ప దేవుడు కథలో ఎత్తుగడను చూస్తే "బీరప్ప, నాదర మహారాజు సోదరియైన సూరమ్మ సుతుడు. నారదుడు సోదరికి ఆస్తిలో భాగమివ్వవలసివచ్చునని, ఆమెను కాలుసేతులు లేని వృద్ధున కిచ్చి వివాహము కావించి, సప్త సముద్రమావలి తీరమున వదలివేయును. పార్వతీదేవి అనుగ్రహముచే సూరమ్మకు భోగభాగ్యములు, పుత్రసంతానము ప్రాప్తించెను. సూరమ్మ పుత్రుడైన బీరప్ప జన్మింపగానే, మేనమామ స్వప్నములో సాక్షాత్కరించి, నీవు నాతల్లిని ఇడుములు పాలు కావించిన విధముగా నిన్ను కూడా నేను బాధించి, నీ ఏడుగురు కుమార్తెలను వివాహము చేసుకొనెదనని వివరించెను." (రావి ప్రేమలత, పుట: 2011:220, 221) ఉంది. అలాగే డా. ఎం.శత్రుఘ్నరెడ్డిగారి నల్లగొండ జిల్లా జానపద గేయగాథలు అముద్రిత

సిద్ధాంత గ్రంథంలో బీరప్ప కథ ఎత్తుగడను పరిశీలిస్తే "సూరమ్మ తోడ ఒక్కడే అన్న. సూరమ్మ పుట్టిన వెంటనే తల్లిదండ్రులు శాశ్వతముగా దూరమయ్యెను. సూరమ్మకు ఏడేండ్ల వయసు రాగానే పెళ్ళి చేయ సంకల్పించెను. అందుకాగ్రహించిన అన్న చెల్లెను ఇంట్లోనుంచి వెళ్ళగొట్టెను. సూరమ్మ అడమి చేరుకొనినది. ఆపదలో నున్నానని అనుగ్రహించమని గ్రామ దేవతలైన ముత్యాలమ్మకు, మారెమ్మకు మ్రొక్కొనినది. దేవతల దయవలన అక్కడ చంద్రగిరి పట్నము వెలసినది. పార్వతీదేవి కూతురైన ముత్యాలమ్మయే పై సౌకర్యము సూరమ్మకు కల్పించినది. సూరమ్మకు సంతానము లేదు.

పై మూడు గేయకథ ఎత్తుగడలలో పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. నాకు లభించిన గేయకథలో తన చెల్లెలను మంచివాడిని ఇచ్చి వివాహంచేస్తే, వారి పిల్లలకు తన పిల్లలను ఇచ్చి ఎక్కడ వివాహం జరిపిస్తాడు. అలాగే డా. రావి ప్రేమలత గారి ఎత్తుగడలో ఆస్థిలో వాటా అడుగుతుందేమో అని సూరవ్వకు వృద్ధునికి ఇచ్చి వివాహం జరిపించడం. డా.శత్రుఘ్న రెడ్డిగారి గేయకథలో వేరేవిధంగా ఉండటం గమనించవచ్చు.

బ్రహ్మణులు చెప్పినవిధంగా నారదుడు తన ఊరు అయిన నాగులకొండ నుండి చెల్లెలను పంపడం, సురవ్వ బాధపడటంతో ఆ సోకం శివునికి తగలడం, అపుడు శివుడు బ్రహ్మణుల మారువేషంలో వచ్చి నారదుడి దగ్గరికి వచ్చి, మీ చెల్లెను వివాహం చేయాలని లేకపోతే నీ పట్నం కాలిపోతుందని చెప్పడం జరుగుతుంది. నారదుడు తన చెల్లెను పెళ్ళి చేయాలనుకోని దూరదృష్టితో ఆలోచించి ఆమెకు ఆరోగ్యంగా బాగాలేనివాడికి ఇచ్చి వివాహం చేయాలని నిశ్చయించుకుంటాడు. ఎందుకంటే వారి చెల్లెలకు పుట్టబోయే పిల్లలకు తన పిల్లలను ఇచ్చి వివాహం చేయాలని వారు అడుగుతారెమో అనే ఉద్దేశ్యంతో సురవ్వకు రోగంతో ఉన్నవాడకి ఇచ్చి లగ్గం చేస్తాడు.

"నమినాగుల కొండలొనె రామ రామా
నారదుడు అన్నజుడు రామ రామా
మాసెల్లెకు మంచివాని రామ రామా
మంచివాని జుసి పెండ్లి రామ రామా
నెనైనా చెయ్యనానె రామ రామా
అడవిలా తిరగబట్టె రామ రామా
బ్రహ్మనె వున్నడమ్మ రామ రామా
కాలుచెతులు లెకపాయె రామ రామా
కుస్టాది రుపంమమ్మ రామ రామా
బ్రహ్మకు వున్నదమ్మ రామ రామా
వినికైనా మా సెల్యాకు రామ రామా
కల్యానం జెసుతాను రామ రామా
బ్రహ్మను తీసుకొచ్చి రామ రామా
సెల్లాకు పెండ్లి జెసు రామ రామా"

వివాహనంతరం వెండి చింతల ఊరిలో సురమ్మ కాపురం పెట్టడంతో అన్న నన్ను మోసం చేశాడని బాధపడుతున్న సందర్భంలో ఆ బాధ జంగమునికి సోకం తగలడంతో వర్షం రావడం సురవ్వ భర్త కాలుచేతులు, ఆరోగ్యంగా కావడం జరుగుతుంది. గేయకథలలో ఎక్కువగా ప్రధాన పాత్రదారి అయిన వారికి దేవతలు, ప్రకృతి సహకరించడం జరుగుతుంది. ఈ అంశం ఇక్కడ పునరావృతమైంది. సురమ్మ తన భర్త ఆరోగ్యం బాగా అయ్యేసరికి ఆమె ఆనందానికి అవధులు లేవు. ఆ సంతోషంలో ఆ ఊరిలో ఉన్న పేదవారికి దుస్తులు పంచడం, పెళ్ళికాని వారికి పెళ్ళిళ్ళు

చేయడం జరుగుతుంది. ఈ క్రమంలో సురవ్వ సంతానం కోసం శివుడిని కలవడానికి ఓ రోజు వెళ్ళుతుంది. మార్గమధ్యలో జంగమయ్య వచ్చి సురవ్వతో శివుడు ప్రస్తుతం వెండికొండలో లేడనీ, శ్రీశైలం వెళ్ళడానికి నేను అక్కడికి వెళ్ళుతున్నానని వివరిస్తాడు. వారు ఇరువురు శివుడి దగ్గరికి పోతున్న క్రమంలో సురవ్వకు జంగమయ్య నీవు ఎందుకు అతని దగ్గరికి వెళ్ళుతున్నావని ప్రశ్నించడంతో సంతానం కోసమని చెబుతుంది. అపుడు జంగమయ్య నేను నీకు వరమిస్తానని, నా కొడుకు వీరభద్రుడు నీ కొడుకు రూపంలో పుడతాడని వరమిస్తాడు. సురవ్వకు తొమ్మిది ఘడియలలో సంతానం కలుగుతుంది. ఈ విషయం తెలుసుకున్న నారదుడు తన చెల్లె సంతానమును చంపాలని బావిస్తాడు.

“నమినాగుల కొండ కొచ్చె రామ రామా
నారదుని తొటినమ్మ రామ రామా
ఏమాని చెప్పబట్టె రామ రామా
ఏమయ్య నారదుండా రామ రామా
చంద్రగిరి పట్నం మందు రామ రామా
మిసెల్లె సురవ్వనె రామ రామా
రొండు జివులా మనిసినమ్మ రామ రామా
మి సెల్లె జెప్పు ఆనె రామ రామా
పాపకారి నారదుండు రామ రామా
సెల్లాకు గర్బినైతే రామ రామా
బగు బగ్గున్న మంటలు మండె రామ రామా
మా సెల్లె చావా లెదా రామ రామా
మొలకాయి మొలిచినపుడు రామ రామా
తుంటెదె పొతాదమ్మ రామ రామా
దాని కడుపులా కొడుకులు పుడితే రామ రామా
నాకైనా బిడ్డలు పుడితే రామ రామా
దాని కొడుకు యియ్యవాలె రామ రామా
యిపుడె చంపావాలె రామ రామా
పాపకారి నారదుండు రామ రామా
వానికంట్ల మన్నుబొయ్య రామ రామా
తొడ బుట్టిన సెల్లెనమ్మ రామ రామా
సెల్యాను జుడరామొ రామ రామా
తెల్యాయి యిసలమ్మ రామ రామా
పాములా యిసలమ్మ రామ రామా
సానిలా వాడాకు పొయి రామ రామా
యిసపు చిరనెంచె రామ రామా
పలారాలను జెసుకొని రామ రామా
యిసమును కలిపినాడా రామ రామా
అపుడు ఎద్దుమిద రామ రామా

అపుడు వొత్తడమ్మ రామ రామా
చంద్రగిరి పట్నమైనా రామ రామా
సెల్లి మెడ కొచ్చినాడా రామ రామా
నాసెల్లె సురవ్వనె రామ రామా
కాలాను నీల్లు యిచ్చె రామ రామా
కుసోని పీటలు ఎసె రామ రామా
అ ముచ్చెట యిముచెట రామ రామా
అనైనా అడిగినాదా రామ రామా
ఆడిపిల్ల నెలలు జుడు రామ రామా
అపుడు నారదుండు రామ రామా
ఏమాని అంటడమ్మ రామ రామా
నాయన్న నారదుండా రామ రామా
అన్నములు బెడతానన్న రామ రామా
బొంచెద్దు రమన్నాది రామ రామా
వొ సెల్లె సురమ్మనె రామ రామా
సొమారం నాకునమ్మ రామ రామా
గంగాను తానమైన రామ రామా
తానము ఆడావలె రామ రామా
లెకుంటె అన్నముతినా రామ రామా
అపుడు సురవ్వానె రామ రామా
జల బిందె బట్టుకొని రామ రామా
గంగాకు ఎల్లిపాయె రామ రామా
గంగాల నిలుతెచ్చె రామ రామా
సురమ్మ బొయినంక రామ రామా
తెచ్చిన సద్దులమ్మ రామ రామా
చిలుకకు బెట్టినాడా రామ రామా
నమినాగుల కొండకైనా రామ రామా
నారదుండు ఎల్లిపాయె రామ రామా
చుడమ్మ దాసినమ్మ రామ రామా
చీరంత మంచిగుంద్ది రామ రామా
దాసిలు కట్టుకునిరి రామ రామా
కట్టుకున్న దాసిలమ్మ రామ రామా
అట్టనె సెల్లిపాయె రామ రామా”

సురవ్వ తన కొడుకును తన ఊరిలో ఉంచితే మంచిది కాదని భావించి, భీరయ్యను తన మేనమామ ఇంటికి పంపాలని నిశ్చయించుకుంటుంది. భీరయ్య పంపె క్రమంలో అనేక బుద్దులు చెప్పి, మేనమామ ఇంటికి వెళ్ళాలని

కొడుకును ఆదేశిస్తుంది. భీరయ్య మార్గమధ్యలో వెళ్ళుతున్న క్రమంలో అక్క మాంకాళి అడ్డురావడం, అతనికి తన అమ్మకు జరిగిన అన్యాయమును మొత్తం వివరించడం జరుగుతుంది. అపుడు భీరయ్యకు అన్ని విద్యలును అక్క నేర్పిస్తుంది. అలాగే భీరయ్యకు సహాయం చేస్తానని మాట ఇస్తుంది. భీరయ్య అక్క వరంతో ఎరుకల వేషంలో కల్కిసొభానాల బాయి కాడికి వెళ్ళి తన మరదులను మీ నాన్న చేసిన పాపం, మీకు తగులుతుందని చెప్పడం జరుగుతుంది. గ్రామాలలో ఎక్కువగా ఈ ఆచారం ప్రజలు నమ్ముతున్నారు. ఏమిటంటే తల్లిదండ్రుల పాపలు వారి పిల్లలకు శాపనార్థాలని జానపదులు విశ్వసిస్తారు. అపుడు భీరయ్య వారికి మీకు పాపం తగలకుండా ఉండాలంటే మీరు కల్కి సోభనాల భావిలో స్నానం చేస్తే పోతుందని మారువేషంలో వచ్చిన వ్యక్తి వారికి చెబుతాడు.

"ఎరకాల ఎసం మీదా రామ రామా
నమి నాగుల కొండకు పోతా రామ రామా
కల్కి సొబానాల బాయి రామ రామా
బాయికాడికి తొలుతారా రామ రామా
ఎడుగురి వొక్క తల్లి రామ రామా
ఎరుట్ల రాయి తమ్మి రామ రామా
కడగొట్టు బాలనమ్మ రామ రామా
కన్యనె కామరాతి రామ రామా
కల్యానం ఆడుతమ్మి రామ రామా
అపుడు ఎల్లమానె రామ రామా / గవ్వల దొరసనం రామ రామా
ఎల్లవ్వ బుట్టి బట్టె రామ రామా / ఎరకాల ఎసం ఎసి రామ రామా
నమి నాగుల కొండకు పాయె రామ రామా / ఎరకాను చెప్పబట్టె రామ రామా
ఎవమ్మ మరదల్ లారా రామ రామా / ఎర్రైనా చేసిన పాపం రామ రామా
మితండ్రి చేసిన పాపం రామ రామా / మి గర్భనా వున్నదమ్మ రామ రామా
ఎట్లా బొవాలెనమ్మ రామ రామా / కడికి సొబానాల బాయివుండె రామ రామా
బాయిలొనె తానంమాడితే రామ రామా / పాపపున్యాలు బొవు రామ రామా
నాయనా నారదుండా రామ రామా / తానానికి బొతాం అయ్య రామ రామా
మీ కొడలు ఎల్లమానె రామ రామా / మాకైనా జెప్పినాది రామ రామా
బాయికి బొవ్వదు బిడ్డ రామ రామా / మానెంటె కొనెరు తొడతా రామ రామా
ఎందుకు నాయినారా రామ రామా / మిరు బొయ్యె తొవ్వలొనె రామ రామా
గుడ్డెలుగు వుంటాయి బిడ్డ రామ రామా / గుడ్డెలుగు వుంటె నాయినా రామ రామా
కొర్రాయి బట్టుకుంటాం రామ రామా / పెద్ద పులులు వుంటాయి బిడ్డా రామ రామా
ఎక్కి సావారు గొడుతాం రామ రామా / అదికాదు యిదికాదు రామ రామా
మెనత్త కొడుకు బిడ్డ రామ రామా / పొట్టనె పొరడమ్మ రామ రామా
బీరాడు వుంటడమ్మ రామ రామా / బీరాడు ఎదురు అయితే రామ రామా
పిడికి నిండా ఉసుకె పట్టి రామ రామా / వాని కంట్లె గుప్పుతాము రామ రామా
వాని తలకాయ కొసుకొని రామ రామా / నికైనా జుపిస్తాము రామ రామా
సరె మంచిది అన్నరమ్మ రామ రామా / నారాదుని బిడ్డాలమ్మ రామ రామా

ఎడుగురు మందలమ్మ రామ రామా / కరికి సమనాల బాయి రామ రామా
తారాము ఆడా బట్టె రామ రామా''

నారదుని కూతుర్లు సామనాల బావిలో తానం ఆడుతున్న క్రమంలో వారిపై బండారి చల్లడంతో కామరతి తప్ప మిగిలిన వారు పారిపోతారు. కామరతిని భీరయ్య వివాహం చేసుకోవడం అక్క మాంకాళి సహాయపడటం జరుగుతుంది. దాంతో మాంకాళి ఎల్లమ్మ ప్రతి సంవత్సరం బోనంతో పూజించాలని, ఐదు సంవత్సరాల కొకసారి కురుమ కులస్థులు పండుగ జరపాలని ఎల్లమ్మ తమ్మునితో చెప్పి మాయమవ్వడం జరుగుతుంది. దీనినే గ్రామస్థులు నేటికి ఆచరిస్తున్నారు. ప్రతి సంవత్సరం బోనాలు పండుగ జరపడం ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో బోనం పండుగ పెద్ద పండుగ. ఈ పండుగను గ్రామాలలో కంటే పట్టణాలలో ఎక్కువగా జరుపుకుంటారు.

''మరి వొక్క సెట్టుకిందా రామ రామా / మాంకాలి వున్నదమ్మ రామ రామా
ఎమక్కనాయి అక్క రామ రామా / ఎందుకని వొచ్చినావె రామ రామా
తమ్ముడా బీరయారా రామ రామా / నా దొక్క ఎసం అయ్య రామ రామా
పూర్తయో తమ్ముడారా రామ రామా / నిజరూపం ఎత్తినాది రామ రామా
ఆ గొర్లమందానైనా రామ రామా / కురుమోల్లాకు పంచిబెట్టె రామ రామా
ఎడాది వొక్కసారి రామ రామా / నాకు బొనం చెయ్యవాలె రామ రామా
ఐదెల్లా వొక్కసారి రామ రామా / కురు మోల్లునాయి పండుగా రామ రామా
పండుగాలు చెయ్యవాలె రామ రామా / అపుడు కామారాతి రామ రామా
వొక్క నెమ్రి సెట్టు రామ రామా / మరి సెట్టు కిందనమ్మ రామ రామా
నిజరుపం ఎత్తినారు రామ రామా / అక్కడ నెర్సినారు రామ రామా''

అని కథ సుఖాంతమవుతుంది. నేను ఈ గేయకథను పన్నెపూర్తి ఐలమ్మ, నర్సింహుల పేట వాస్తవ్యులు దగ్గర సేకరించాను. ఆమె కూడా కథ పూర్తి అయిన వెంటనె కథకురాలు పేరు, ఊరు గేయకథ చివరిలో వెల్లడించడం జరిగింది.

''బిరయ కతనైనా రామ రామా
యికడికి పూర్తి ఆయో రామ రామా
యి కత చెప్పె తల్లి రామ రామా
పున్నెపుర్తి ఐలమ్మనె రామ రామా
నర్సిల నేట పరిదినె రామ రామా''

అంటూ ముగించడం విశేషం. ఈ గేయకథ ఇతివృత్త నిర్మాణం చాలా సరళంగా ఉంది. గేయకథలో సంఘటనలు ఒకదాని నుండి మరొకదానికి దారితీస్తూ ముగింపుకు చేరుకున్నాయి. భాష సరళంగా ఉంది. ఒకే కథను వేరువేరు మాండలికాలు మాట్లాడే వ్యక్తులు చెప్పినట్లయితే కథనం వేరువేరు మాండలికాల్లో ఉంటుంది. కథనంతో పాటు పాత్రల సంభాషణ కూడ కథకుడి మాండలికంలోనే జరుగుతుంది. ఈ భీరయ్య గేయకథలో తెలంగాణ మాండలిన భాషను గుర్తించవచ్చు. జానపదులు తన చుట్టూ ఉన్న ప్రపంచంలో కన్నవీ, విన్నవీ తాను పొందిన అనుభవాలూ, అనుభూతులూ, ఆలోచనలు గేయకథల రూపంలో రుపొందిస్తాడు. అందుకే ఒకే కథను వేరు వేరు ప్రాంతాలలో ఆ ప్రాంతాల పరిస్థితులను బట్టి మార్చి పాటడం జరిగింది. డా.రావి ప్రేమలతగారి బీరప్ప కథకు, డా.శత్రుఘ్నరెడ్డి గారి బీరప్ప కథకు మరియు నేను సేకరించిన భీరయ్య గేయకథలలో ఎత్తుగడ ముగింపులలో చాలా భేదాలు ఉన్నాయి. పాత్రల పేర్లు ఒక్కటే ఉన్న కథల విషయంలో మాత్రం వ్యత్యాసం ఉందని వివరించవచ్చు.

**ముగింపు**

జానపద విజ్ఞానంలోని సాహిత్య సంబంధమైన అంశాలను నేడు తెలుగుసాహిత్య పరిశోధనలో భాగంగా పరిశీలిస్తున్నారు. జానపద సాహిత్యంలో పరిశోధనలు గేయ, కథ, జాతీయాలు, సామెతలు, పొడుపుకథలు ఇత్యాది అంశాలపై ఎక్కువగా జరిగాయి. ఇప్పటి వరకు గేయకథలపై కొన్ని జిల్లాల పరిధులకు లోబడి పరిశోధనలు జరిగాయి. కాబట్టి వరంగల్ జానపద గేయకథలను సేకరించి లిఖితబద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈగేయకథలలోని సంస్కృతి సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, సామాజిక మొదలైన అంశాల గురించి విశ్లేషించి భవిష్యత్తరాలకు అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. నేడు ఆధునిక సమాజం పాశ్చాత్యసంస్కృతి వైపు అడుగులు వేస్తోంది. జానపద సాహిత్యం కనుమరుగై పోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. కనుక నావంతు బాధ్యతగా గేయ కథలకు పరిమితమై పరిశోధన కొనసాగించాను.

**ఉపయుక్త గ్రంథసూచి**

1. కృష్ణకుమారి నాయిని, 2012, తెలుగు జానపద గేయగాథలు, హైదరాబాదు : తెలుగు అకాడమి.
2. ప్రేమలత రావి, 2011, తెలుగు జానపద సాహిత్యం పురాగాథలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ప్రథమ ముద్రణ, హైదరాబాద్.
3. రామరాజు బి, 1990, తెలుగు జానపద గేయసాహిత్యం, తృతీయ ముద్రణ, హైదరాబాదు : జానపద విజ్ఞాన ప్రచురణలు.
4. వెంకట సుబ్బారావు తంగిరాల, 2000 తెలుగు వీరగాథా కవిత్వము, మొదటి సంపుటము, శ్రీరస శ్రీకృష్ణదేవరాయ రసజ్ఞసమాఖ్య, బెంగళూరు.
5. శత్రుఘ్నరెడ్డి యం., 1987, నల్లగొండ జిల్లా జానపద గేయ గాథలు అముద్రిత సిద్ధాంత గ్రంథం, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
6. సుందరం ఆర్వీయస్., 1992. ఆంధ్రుల జానపద విజ్ఞానం, ద్వితీయ ముద్రణ, హైదరాబాదు : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. నాంపల్లి.
7. సుబ్బరామిరెడ్డి ఎ., 1991. కడప జిల్లా జానపద గేయగాథలు నిర్మాణం - సమాజం - సంస్కృతి. ప్రథమ ముద్రణ, కడప : శ్రీలక్ష్మిపబ్లికేషన్స్.

★★★

భావవీణ
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
*Journal of Arts, Literary, Culture & Language Study*
ISSN
2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-4 | April 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*



# ఆనందరావు పట్నాయక్ కథలలో మానవీయ విలువలు - విశ్లేషణ

**డా. తోట రామకృష్ణ**
స్కూల్ అసిస్టెంట్, తెలుగు, మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల,
పుల్లాయిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా, ఫోన్ 7569518663.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**ఉపోద్ఘాతం :**

మానవీయ విలువలు అంతకంతకు అడుగంటుకుపోతున్నాయి. మానవత్వం లేని సమాజం త్వరలో చూడబోతున్నాం. మానవత్వం లేకపోవటం వల్ల ఎన్నో అరాచకాలు, ఎన్నో హత్యలు జరుగుతున్నాయి. మనిషి ఏనాడైతే నైతికతను కోల్పోయాడో ఆనాడే మానవీయత దెబ్బతింది. శాస్త్ర, సాంకేతిక, విద్య, వైజ్ఞానిక రంగాల్లో దేశం ఎంత అభివృద్ధి చెందుతున్నా మానవీయ విలువలు అంతవేగంగా కనుమరుగవుతున్నాయి. దానికి కారణం ప్రజల్లో నీతి, న్యాయం, ధర్మం, శాంతి, సహకారం మొదలైనవన్నీ కనుమరుగవుతున్నాయి. ఆదరణ లేదు. అసాంఘిక స్థితి రాజ్యమేలుతుంది. అటువంటి అంశాలను ప్రధానాంశాలుగా చేసుకుని రచయిత ఆనందరావు పట్నాయక్ కొన్ని కథలు రాశారు. వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే మానవీయ విలువలు తెలుస్తాయి.

**కీలక పదాలు :**

ప్రపంచీకరణ, స్వాతనం, కాలచక్రం, కళ్లల్లో ప్రాణాలు నిలుపుకోవడం, ధన వ్యామోహం, బ్రతికిన శవంలా, ఉమ్మడి కుటుంబం, అనుబంధం, ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటి మీద వాలదు, ఆత్మీయ అనురాగాలు, విద్యాబుద్ధులు, అనాథ ఆశ్రమం, గురుదక్షిణ.

**అనుబంధం :**

ఆధునిక సమాజంలో బంధాలు అనుబంధాలు కూడా సమయంతో చిన్నవిగా ఎలా మారుతున్నాయో ఈ కథ ద్వారా చిత్రించారు రచయిత. ఒకప్పుడు కుటుంబం అంటే అమ్మ నాన్న అక్క చెల్లి తమ్ముడు అని ఉమ్మడి కుటుంబంగా ఆప్యాయతలకు అనురాగాలకు పుట్టినిల్లుగా చెప్పేవారు కాని నేడు ఆ పరిస్థితి లేదు. నగరీకరణ పట్టణీకరణలో సగంపోతే ప్రపంచీకరణ సంపాదనలో కుటుంబాన్ని తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడంలో మిగతాది పోయింది.

కథంతా గత వర్తమాలను చేరవేసుకొంటూ సాగుతుంది. సమ సమాజంలో నివసిస్తున్న ఒక మధ్య తరగతి తండ్రిగా సౌజన్యారావు తల్లిగా సావిత్రమ్మ దంతపలను చూడొచ్చు. ఇద్దరు కూతర్లు ఒక కొడుకు ఆయన జీవితంలో వారికి వారి చదువులుకు ఏ ఆంటంకం రాకుండా తను దూరంగా ఉండి కష్టపడి సంపాదించి పిల్లలను చదివిస్తాడు. పిల్లల భవిష్యత్ కోసం ఏమైనా చేయగల తల్లిదండ్రులు ఆదర్శ దంపతులుగా ఈ కథలో వీరు కనిపిస్తారు. సౌజన్యారావు రిటైర్మెంట్ చివరి దశకు వచ్చినప్పటికీ అతడు ఇద్దరి కూతుర్ల పెళ్లి చేయడం వరకు మాత్రమే అతడి ఆర్థిక స్థితి సరిపోతుంది. తర్వాత కొడుకు శ్రావణ్‌కు ఉద్యోగం రావడంతో వారికి కొంత స్వాంతనం లభించినట్లు అవుతుంది. తర్వాత శ్రావణ్ ఒక పెద్ద కంపెనీలో చేరి అక్కడ తన యజమాని కూతురిని పెళ్లి చేసుకొని ధనిక కుటుంబ జీవితానికి అలవాటు పడి తన తల్లిందండ్రులను కుటుంబాన్ని ధన వ్యామోహంలో పడి నిర్లక్ష్యం చేస్తాడు. ఆ నిర్లక్ష్యం విలువ తన తల్లి ప్రాణాలు పోయినా పట్టించుకోని స్థితి. చివరికి తన భార్య ద్వారా తల్లి విలువ తెలుసుకొన్నప్పటికీ ప్రయోజనం ఉండదు.

సావిత్రమ్మ పరిస్థితి ఏదైమైనా "కాలచక్రం మాత్రం ఆగదు! రోజులు, వారాలు, నెలలు గడుస్తున్నాయి.. ఇంట్లోని వెండి బంగారాలు, ట్రీట్మెంటుకి ఖర్చయిపోయాయి. సావిత్రమ్మకి గొట్టంగుండా ద్రవరూపంలో ఆహారం అందిస్తున్నారు. ఆమె నోట మాట పడిపోయింది. ఆవిడ బ్రతికిన శవంలా కళ్ళలో ప్రాణాలు నిలుపుకొని ఉంది. కూతుళ్ళు, అల్లుళు ళ్ళ, మనుమలు, మనవరాళ్ళు వచ్చారు. కాని, ఆమెకి ఇంకా ఎవర్నో కూడాలని ఉంది. బహుశా.. అంతవరకు ఆ జీవి ఆమె కళ్లలో అలానే నిలిచి ఉంటుంది కాబోలు. ఆమె కంట అదేపనిగా కన్నీళ్ళు"! అప్పటి వరకు అందంగా గడిచిన ఒక కుటుంబంలోని సావిత్రమ్మ అనారోగ్యం కారణంగా వచ్చిన ఒక ముప్పు వలన మధ్య తరగతి జీవితాలు వారి ఆర్థికస్థితి ఎలా ఛిద్రమవుతాయో ఇక్కడ చూడవచ్చు.

రచయిత ఈ కథను మనకు రెండు కోణాల్లో అద్భుతంగా ఆవిష్కరించారు అని చెప్పవచ్చును. ఈ కథ ఒక మధ్య తరగతి జీవితాన్ని అలాగే ఒక ధనిక జీవితాలలో మనుషుల నడవడిక బంధాలు అనుబంధాలు కుటుంబ జీవన విధానం ఎలా ఉంటుందో ఈ కథ ద్వారా ఆవిష్కరించారు. సౌజన్యారావు వైపు నుండి చూసినప్పుడు ఒక మధ్య తరగతి తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించడానికి ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి ఎంత శ్రమిస్తారో తెలుస్తుంది. అదే శ్రావణ్ విషయానికి వచ్చేసరికి నిరంతరం ధన వ్యామోహం భార్య ఎప్పుడు క్లబ్బులు, పార్లర్‌లు అంటూ తిరగడం కనిపిస్తూనే ఉంది. అలాగే కథలో సౌజన్యారావు ఆశ్రమంలో ఉండటం అనేది మనకు కన్పిస్తుంది. రచయిత వర్తమాన సమాజాన్ని మన కళ్ళకు కట్టినట్లు చూపించారు. నేటికి పిల్లలు పెద్దవాళ్ళు అయ్యాక తమ తల్లిదండ్రులను వదిలేసి వేరే ఎక్కడో నివసించడం దిక్కుతోచని స్థితిలో తల్లిదండ్రులు అనాథ ఆశ్రమంలో జీవించడం రోజువారి జీవితంలో చూస్తున్న సంఘటనలే సమయం ఉన్నప్పుడు వారిని మనం నిర్లక్ష్యం చేస్తే మన నిర్లక్ష్యాన్ని అర్థం చేసుకొనేటప్పటికి వారు ఉండరు అనే విషయాన్ని ఈ కథ ద్వారా రచయిత వక్కాణించి చెప్పారు.

ఆదర్శవంతుడు అయిన తండ్రి, పిల్లల కోసం తన సర్వస్వాన్ని త్యాగం చేసిన తల్లిగా సావిత్రమ్మ పాత్రలను తీర్చిదిద్దాడు. సమాజంలో నిరంతరం జరుగుతున్న మనం చూస్తున్న అతి సున్నితమైన విషయాన్ని తీసుకొని పిల్లలు తల్లిదండ్రుల పట్ల ప్రవర్తించే తీరు మారాలని వర్తమాన కాలానికి అన్వయిస్తూ ఈ కథ ద్వారా సందేశాత్మకంగా తెలియజేశారు.

**వెండి గిన్నె :**

కనుమరుగవుతున్న మమతానురాగాలు కుటుంబ అనుబంధాలను గురించి రచయిత ఈ కథలో తెలియజేశారు. మనం నివసిస్తున్న సమాజంలో సగటు మనిషి మనలో ఒకడి పాత్రలలాగానే వేదాంతం పాత్రను తీర్చిదిద్దడం జరిగింది. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలఉగా విరాజిల్లుతున్న సమాజం నేడు ఏ చెట్టుకు ఆ కొమ్మలా విడిపోవడానికి

మనమే ఎలా కారణం అవుతున్నాం అనే విషయాన్ని రచయిత ఈ కథలో చర్చకు పెట్టారు. చిన్న చిన్న తగాదాలు మనస్పర&థల వలన దూరమైన సరే వారి మధ్యలో ఉన్న అనుబంధాలు అలానే ఉన్నాయి అనే విషయాన్ని ఈ కథలో వాణి, సిదా&ధంతఎ పాత్రలు ద్వారా తెలిపారు.

వేదాంత్ బ్రాహ్మణ కుటంబానికి చెందిన వాడు తన చిన్ననాటి రోజుల్లో తద్దినం అనగానే జనాలు రావడం అది అతడి ఇంట్లోవాళ్ళు చేసేది కావడం వలన దాని ఖర్చు మిగతా వివరాలు ఏవి తెలీని వయస్సు కాబట్టి ఆస్వాదించడమే గాని దాని ఖర్చు విషయం గాని మిగతా విషయం గాని వేదాంత్‌కి తెలీదు. ఇప్పుడు తను తన తండ్రికి తద్దినం చేసేసరికి పిల్లల చదువుల ఖర్చులు, కుటుంబ పోషణ అరకొర జీతాలు వాటన్నింటిని అధిగమించి ఇలాంటి కార్యక్రమాలు చేయడం అనేది ఎంతటి సాహసమో ఆ ఖర్చు కుటుంబంపై ఎంతటి భారాన్ని చూపుతుందో ఆలోచిస్తాడు. వెంటనే తన భార్య కేక వినిపించేసరికి వెళ్లి చూస్తాడు. అక్కడ భార్య పిల్లలు కలసి కుక్క నల్లగిన్నె ఎత్తుకెళ్ళిపోయింది అని చెప్తారు. దానిని వెతుక్కొంటూ వెళ్లేసరికి వాణి చూసి మామయ్య అని ఆప్యాయంగా పిలుస్తుంది.

'ప్రశాంత్ ఇంజనీరింగ్ చదవడానికి తిరుచ్చి వెళ్ళాడన్నయ్యా!' ఇంతలో.. వాణి గ్లాసులో మజ్జిగ తీసుకువచ్చింది. అప్రయత్నంగానే అందుకున్నాడు. పచ్చిమిర్చి, దుబ్బాకు, చిటికెడు ఉప్పు వేసివున్న మజ్జిగ అది! వాణి బయటపిల్ల కాదు. తన పెద్దక్క కూతురు. ఆ ఇంటికోడలై వచ్చింది. కానీ, తోటికోడళ్ళ మధ్య సఖ్యత కరువైంది. సంవత్సరాలుగా సాగుతున్న అంతర్గత పోరు కుటుంబ విచ్ఛిన్నతకు దారితీసింది. చిన్నోడు కట్టుబట్టలతో బయటకు వచ్చేశాడు. పెళ్ళాం నోటికి జడిపి వేదాంత్ నిశ్శబ్దమూర్తయి పోయాడు. ఆ ఇంటి మీది కాకి ఈ ఇంటి మీదకి వాలేది కాదు''. అలా వారి మధ్య అభిప్రాయ బేధాలు వచ్చి దూరంగా ఉంటారు అని చెప్పడం వలన వివాహం జరిగిన తర్వాత కుటుంబాలలో ఒక రకమైన విచ్ఛిన్నత, ఉమ్మడి కుటుంబాలు విడిపోయి వేర్వేరు కాపురాలు పెట్టుకొని వాళ్ళ మధ్య ఉన్న ఆత్మీయ అనురాగాలకు అడ్డుకట్ట వేసుకొనే పరిస్థితిని ఈ కథలో తెలియజేశారు. అప్పటివరకు ఉన్న మనస్పర్థలను సైతం వేదాంత్ తమ్ముడు మరదలు పలకరించేసరికి వెన్నలా కరిగి అవన్ని మరచిపోతాడు అని చెప్పడంలో దూరంగా నివసిస్తున్న మాత్రాన వారి మధ్యన ఉన్న కుటుంబ బంధాలు ఎటు పోవని శాశ్వతంగా లోపల దాగి ఉంటాయని తెలియజేశారు.

మనకు తెలిసినంతవరకు మానవుడు సంఘజీవి సమాజంలో మమేకం అయ్యి నివసిస్తాడు తప్పించి వాటి దూరంగా జీవించలేదు మానవునికి సమాజం పరిచయం కాక ముందు తన చుట్టూ ఉన్న సమాజం కుటుంబమే కాని మారుతున్న కాలాన్ని బట్టి వర్తమాన సమాజంలో సరికొత్త పరిస్థితులు రూపుదిద్దుకొన్నాయి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అనేది ఎక్కడో తప్ప ఎక్కడ కనిపించట్లేదు. రచయిత ఈ కథ ద్వారా వేదాదంత్ పాత్రతో సగటు మనిషి కుటుంబంలో ఏర్పాట్లు జరగడానికి దానిని సగటు జీవి ఎలా ఎదుర్కొని జీవిస్తున్నాడు అనే విషయాన్ని చాలా వాస్తవికంగా తెలియజేశాడు.

**గురుదక్షిణ :**

మానవ సంబంధాలు, బంధాలు, బాంధవ్యాలు కూడా కనుమరుగవుతున్న ఈ కాలంలో తన గురువును అతడు చెప్పిన నైతిక విలువలను గుర్తుంచుకొని గురువు వృద్ధాప్యంలో కష్టాలు అనుభవిస్తుంటే అతడికి చేదోడుగా నిలిచిన ఒక విద్యార్థి చెల్లించుకొన్న గురుదక్షిణ ఈ కథ.

కొండయ్య మాస్టారు ఈ కథలో ప్రధాన పాత్ర విద్యపరంగా ఎంతో శిష్యులను తయారు చేసిన అతడు తన విధి రాతను మార్చుకోలేదు. అక్కడ ఒక విద్యార్థి కొండాడు, అతడిలో ఉన్న ప్రతిభ పాటవాలను అప్పుడే గుర్తించిన కొండయ్య మాస్టారు అతడి తల్లిదండ్రులకు విషయం చెప్పి అతడితో పాటు తన ఇంట్లో ఉంచుకొని కొండడికి

కావాల్సినవన్నీ ఇస్తూ అతడికి విద్యాబుద్ధులు నేర్పిస్తారు మాస్టారు. ఆ తర్వాత ఉన్నత చదువులకు కొండడకు మాస్టారు ఆర్థిక సాయం చేసి పంపిస్తారు. ఒక విద్యార్థి జీవితాన్ని అద్భుతంగా నిర్మించి వాళ్లకు మంచి భవిష్యత్ ఇవ్వాలనుకొన్ని మాస్టారులందరికి కూడా కొండయ్య మాస్టారు పాత్ర ఒక స్ఫూర్తి. ఆ తరువాత మాస్టారు తన ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టకపోవడం తన ఆరోగ్యం దెబ్బతినడం ఇద్దరు పిల్లలతో ఉన్న కూతురు అర్థాంతరంగా చనిపోవడం మాస్టారు అల్లుడుకు భారంగా ఉండటం అనేవి జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు భవిష్యత్ ఎలాంటిదైనా ఆహ్వానించడమే మానవుని చేతిలో ఉంది అనే విషయం మాస్టారు జీవితంలో జరిగిన సంఘటనల ద్వారా తెలిపారు.

కొండయ్య మాస్టారు అల్లుడు పాత్ర చిత్రణ ఆ వయస్సులో మామ గారిని పట్టించుకోకపోవడం అలాగే అతడికి చేదోడువాదోడుగా ఉండాల్సిన సమయంలో అతడిని అనాధ ఆశ్రమంలో ఉంచడం అనేవి అతడి సంకుచిత స్వభావానికి నిదర్శనం. ఇంకా ఆఫీసర్ కొండడు పాత్ర నిజానికి నేటి తరానికి ఆదర్శప్రాయకంగా రచయిత చిత్రించారు అని చెప్పవచ్చును. విద్యాబుద్ధులు నేర్పిన గురువు నిస్సహాయ స్థితిలో ఉన్నపుడు అతన్ని తనింటికి తీసుకెళ్లడమే కాకుండా అతడు చేసిన సహాయాన్ని మరచిపోకుండా తన ఇంటికి మాస్టారు పేరు పెట్టుకోవడం అతడి వినయ విధేయతలను చూపిస్తుంది.

**ముగింపు :**

తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని పొందిన కథకుడు. జీవిత వాస్తవికతను బట్టి చూసినా, శిల్ప విర్మాణాన్ని బట్టి చూసినా, మంచికి మానవతకు పట్టంగట్టే విధానాన్ని బట్టి చూసినా అర్ధశతాబ్ది తెలుగు కథా సాహిత్య న్యాయం చేకూర్చే కథలు శ్రీ ఆనందరావు పట్నాయక్ గారి కలం నుంచి వెలువడ్డాయి. పల్లెసీమల్లోనూ, నాగరికత అనాగరికతకు మధ్య, జ్ఞానాన్ని అజ్ఞానానికి మధ్య, కలిమికి లేమికీ మధ్య కొట్టిమిట్టాడే ప్రజల జీవన చిత్రణకు అద్దం పడతాయి వీరి కథలు, ఆనందరావు పట్నాయక్ వారు అర్ధ శతాబ్దికాలంలో దాదాపుగా 300 కథలు రాశారని చెప్పుచున్నారు. కానీ నేటి వరకు మూడు కథా సంపుటాలలో 83 కథలు వెలువదించారు. ఆనందరావు పట్నాయక్ వారి కథలు నిదానంగా చదివి నిశితంగా పరిశీలిస్తే ఆ కథల వెనుక రచయిత నిజాయితీ స్పష్టంగా కనిపిస్తుంది. తరువాత తరానికి వీరు మార్గదర్శకులు.

ఈ విధంగా "ఆనందరావు పట్నాయక్ కథలలో మానవీయ విలువలు, విశ్లేషణ" అనే పరిశోధన పత్రంలో భాగంగా ప్రస్తుత సమాజంలో యువకులు ధన వ్యామోహంలో పడి తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం వంటి అంశాలను విశ్లేషిస్తూ గురుదక్షిణ వంటి కథలు నేటి సమాజానికి ఎంతో అవసరం అని భావిస్తూ... గురుశిష్యుల మధ్య బంధం ఎంతో గొప్పదని విశ్లేషించుటకు ప్రయత్నించితిని.

**ఆధార గ్రంథాలు :**


1. అమూల్య కానుక (కథా సంపుటి) - జయంతి పబ్లికేషన్స్ 2006 - ఆనందరావు పట్నాయక్.
2. గురుదక్షిణ (కథా సంపుటి) - ఇందిర పబ్లికేషన్స్, 2008 - ఆనందరావు పట్నాయక్.


★★★

భావవీణ BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-4 | April 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*



# కసిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్యాత్మిక సంపాదకీయ వ్యాసాలు - విశ్లేషణ

**జి. నరేందర్**
పరిశోధక విద్యార్థి, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A): 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహం :**

కసిరెడ్డి సంపాదకీయ వ్యాసాలలో ఆధ్యాత్మికత, తాత్త్వికత గోచరిస్తాయి. ప్రతి విషయాన్ని సాక్షీభూతంగా తిలకించడం ఆయన ఆధ్యాత్మికతలోని ప్రధాన తత్త్వాలు, కసిరెడ్డి వ్యక్తిగాకాని, రచయితగా ఉదాత్తమైన, భారతీయ తత్త్వాన్ని తాను దర్శించి ఆదర్శనాన్ని సంపాదకీయాలలో అద్భుత సత్యాలుగా రూపొందిస్తారు. ఆయన ఎన్నుకున్న విషయం రాజకీయమైన, సాంఘికమైన, ఆర్థికమైనా లేక మరేదైనా ఆధ్యాత్మికతతో పరిపుష్టమౌతుంది. కొన్ని సార్లు లోకమంతా సామాన్య మనుకునే విషయాలు ఆయన రచనలో కొత్త విషయాలుగా తత్త్వాన్ని విశ్లేషిస్తూ వివరిస్తారు. ఆయన జీవితంలో ఎక్కువ భాగం ఒంటరితనంలో పెరగడం, ఉదాత్తమైన గ్రంథాల అధ్యయనం, సదాచార్య సేవనం, సత్యాన్ని హిత్యం కసిరెడ్డిగారిలోని తాత్త్వికతను పెంచి ప్రొదిచేసాయి. నెహ్రూ. గాంధీజి, పటేల్‌లను విపులంగా వివరిస్తూ వారిలో త్రిమూర్తుల తత్త్వాన్ని వారి స్వరూపాన్ని వివరించారు. ఇంకా ఒక్కమాటలో చెప్పాలంటే కసిరెడ్డిగారు వేదాంతి, సాధకుడు, భక్తుడు, పరమ వివేకి, నిరంతరం మల్లెపూవువంటి దుస్తులు ధరించి యుగధర్మాన్ని సంపాదకీయాల ద్వారా భారత వర్షమున సత్యానికి గల స్థానాన్ని వివరించారు.“ఏకం సత్ విప్రా బహుధావదన్తి” అని సత్య స్వరూపాన్ని హృదతము చేసుకొనిన మహానుభావులు, భవిష్యత్తునకు కొత్తబాటలు వేసి భారత శక్తిని నిరూపించిన విధానాన్ని ఈ వ్యాసం ద్వారా విశ్లేషించాను.

**కీలకపదాలు :**

సమాజం, ఆధ్యాత్మిక, సంపాదకీయం, వసుధైక కుటుంబకమ్, ధర్మరక్షణ, హిందుత్వం, ధర్మమార్గం, జాతీయవాదం, అస్తిత్వం, దేశాభ్యుదయం, మానవతా, సప్తవ్యసనాలు.

**ప్రవేశిక :**

ఎంతటి సంక్లిష్ట పరిస్థితులు ఎదురైనను దిగులుపడక, ఏ ప్రలోభాలకు లొంగక, వశిష్ట వ్యక్తిత్వాన్ని, పదునైన

నిజాయితీతో సంపాదకీయాలో మహెూన్నత వ్యక్తిగా తన ముద్రను వేసుకున్నారు. ఆడంబరాలకు, ఆర్భాటాలకు ఆయన జీవితంలో ఎన్నడూ అవకాశం ఇవ్వలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే కవికి, ఋషికి కావలసిన క్రాంత దర్శత్వాన్ని ఆయన సాధించారని చెప్పవచ్చు. ఆధునిక కాలంలో భారత రాజకీయ సామాజిక పాలనా రంగాలన్నీ భ్రష్టాచారంలో కూరుకుపోయాయి. అవినీతిలో పీకలదాకా మునిగిపోయాయి. అధికారం కొరకు, అర్థం కొరకు, కామవాంఛ పరితృప్తి కొరకు ధనం-కులం, హింస-అశ్లీలం-కుటిలత్వం-వీరంగాలు వేస్తున్నాయి. ఈ వీరంగ విషసర్పం, స్వాముల పైన బుసకొడుతుంది. ''(శివనందభారతి-ఇంకెన్నాళ్లీ దిగజారుడు-ఫిబ్రవరి-2005, పుట.3, పాశ్చాత్య సంస్కృతి నుండి హిందుత్వాన్ని పరిరక్షించాలని దీనికి నేటి యువత మరో వివేకానందులై, మరో నేతాజీ సుభాష్ చంద్రులై ఎవరికీ వారే నిలబడవలసిన అవసరం  ఉందని కసిరెడ్డి ఆధ్యాత్మిక సంపాదకీయ వ్యాసంలో పేర్కొన్నారు. అయితే కసిరెడ్డిగారి సంపాదకీయ అధ్యాత్మిక వ్యాసాలలో కొన్నింటిని మాత్రమే ఈ వ్యాసంలో పేర్కొన్నాను.

**ఆధ్యాత్మిక సంపాదకీయ వ్యాసాలు విశ్లేషణ :**

గీతా కల్పతరుం భజే, భగవతాకృష్ణేన సంరోపితమ్
వేద వ్యాస వివర్థితం, శ్రుతిఃశిరో బీజం, ప్రబోధాంకురమ్
నానా శాస్త్ర రహస్య శాఖ మరతి క్షాంతి ప్రవాలాంకితమ్
కృష్ణాంఘ్రిద్వయ భక్తిపుష్ప సురభిం, మోక్ష ప్రదం జ్ఞానినామ్ ॥

భగవానుడు శ్రీకృష్ణుడు నాటినారు; వేద వ్యాసులు వృద్ధి చేశారు. ఉపనిషత్తులే విత్తనాలు; ప్రబోధమే మొలకులు; సకల శాస్త్ర రహస్యాలే మొక్కలు; అనాసక్తి క్షమలనను వేచిగుళ్లు; శ్రీకృష్ణ భగవానుని పాద పద్మాల పైనున్న భక్తి పరిమళమే పుష్పం; జ్ఞానులైన వారికి ఇదే మోక్షదాయకం...... ఇదే గీతా కల్ప వృక్షం. ఈ కల్ప వృక్షాన్ని నేను భజిస్తున్నాను (సేవిస్తున్నాను).

ఎక్కడో ఒక చెడు జరుగుతున్నది. దొంగతనం, దోపిడి, హింస, అవమానం, అవినీతి, ఆక్రమణ, అపహరణ.... ఇలా ఏదో ఒక రూపంలో... చెడు... చెడు...

నైతిక విలువలు ఒంట బట్టిన యువకుడు ఇవన్నీ ఏకరువు పెట్టి ఈ అక్రమాలను నిరోధించాలన్నాడు. అతని తాతగారు వెంటనే నీకేం పట్టింది ప్రభుత్వం చూచుకొంటుంది అన్నాడు. ప్రభుత్వం నడిపిస్తున్న పార్టీవారే అక్రమాలకు పాల్పడితే ఎవరు నిరోధిస్తారు; ప్రజల్లో చైతన్యం కలిగించి నిరోధించాల్సిందే కదా ! అన్నాడు యువకుడు. నువ్విలా మాట్లాడుతున్నావనీ, ప్రజలను సమాయత్తం చేస్తున్నావని తెలిస్తే నీకు ముప్పు వస్తుంది అన్నది తల్లి. అన్నీ దేవుడే చూచుకొంటాడు నీపని నువు చూచుకో అన్నాడు తండ్రి. ఇంట్లో ముగ్గురి వ్యతిరేకత. వాళ్ల దిక్కు ఎగాదిగా చూచి అక్కడే పప్పు రుబ్బుతున్న భార్యవైపు చూశాడు. ''చేతులు లాగుతున్నాయి సాయం చేయండి'' అంది భార్య. వెళ్ళి ఆమె దగ్గర కూచొని పరధ్యానంలో రుబ్బురోలు క్రింద వ్రేలు వేసుకొని అమ్మోయ్ అన్నాడు.

“కూటిలోని రాయి తీయలేని వాడు ఏటిలోని రాయి తీయబోయినాడంట” కిసుక్కు నవ్వింది భార్య.(గీతాజ్ఞానయోగ సమాచార్, ఆగస్టు, 2005, పుట.3) ఇది ఓ యింటిలోని సంఘటన. ప్రతి ఇంటిలో ఇంత చర్చ జరిగి, ఇన్ని విధాల మనస్తత్వాలు అభివ్యక్తమవుతున్నాయా! తమ దేవాలయాల గురించి, దేవుడే తమలోని జీవుడు అనుకొనే హిందువులు ఆలోచిస్తున్నారా! పట్టింపే లేనట్టున్నారా ! దేవుడా నిన్ను నీవే కాపాడుకో అని ఈ యింటి వారంటున్నట్టే అన్ని ఇండ్ల వారనుకొంటున్నారా ! ఆలోచించండి! దేవుణ్ణి, దేవుని సొమ్ములను, ఆస్తులను రక్షించాల్సింది మీలోని దేవుడు (ప్రాణం) కాదా ! ఈ వ్యాసం ద్వారా రచయిత ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చి దేవాలయలన్నింటిని మనమే కాపాడుకోవాలని వివరించారు.

దైవం ద్వారా జాతిలో ఏకత, అవతారాలన్నీ ధర్మరక్షణకే !, దేవాలయాలకు దేవుడే రక్షణా ?, గణపతి-జ్ఞానపతి, అభద్రతలో హిందుత్వం, అమూల్యమైన దివ్య రత్నములు, దైవనిధులు-ధర్మమార్గం, రామసేతువును రక్షిద్దాం !, అధర్మపరిషత్తు ద్వారా ఏకత!?, ఆలయాలు ఆధ్యాత్మిక నిలయాలు, ఆధ్యాత్మిక జాతీయవాదం, స్వతంత్ర భారతంలో ఆలయాల విధ్వంసాలా! , ఆధ్యాత్మిక వీరజాతీయ వాదమే-అస్తిత్వం, శ్రీ భగవద్గీత అంతర్జాతీయ గ్రంథం, దేవాలయో రక్షతి రక్షితః, సామాన్యునికి రామాయణ సందేశం, గోదావరి పుష్కరాల సమరసతా సందేశం, ఆధ్యాత్మిక ఏకత, ఇంకెన్నాళ్లీ దిగజారుడు?, ఆధ్యాత్మిక జీవనానికి అడ్డం ఏది?, శ్రీ ఎన్నాళ్లీ ఔదాసీన్యం?, జీవిత చరిత్రలు-సందేశం, ఆలయాల్లో సామూహిక ప్రార్థనావశ్యకత , భగవద్గీత, భారతీయాత్మ అటల్ బిహారీ వాజ్‌పేయి, హిందుత్వ జాగరణంలో మనమేం చేయాలి ?, సీతారాముల కళ్యాణం జగత్కల్యాణం హిందూ సంక్షేమం వల్లనే హిందూ దేశాభ్యుదయం, దేశ-ధర్మ రక్షణార్థమే రక్ష, సమిష్ఠి శక్తికే విజయం, హిందూ ఏకత నిర్భయమే విజయం, హిందూ ఏకతపై ప్రశ్న చిహ్నం, దేశనాయకులకేది 'సన్'మార్గం ?, తాత్కాలిక హిందుత్వమా! శాశ్వత హిందుత్వమా!, శ్రీరామగీత, ఇంకా కుంభకర్ణ నిద్రేనా !, దీపావళిలో దివ్యగీతాతత్త్వం మొదలైన సంపాదకీయ వ్యాసాలున్నాయి.

భగవంతునికి అనేక నామాలున్నాయి. అయితే కొన్ని నామాలు కొన్ని మతాలుగా స్థిరపడ్డాయి. ఉదాహరణానికి గణపతి పేరిట గాణాపత్యం, విష్ణువు పేరిట వైష్ణవం, శివుని పేరిట శైవం, శక్తి పేర శాక్తేయం, ఇలా ఎన్నో. మామూలుగా వినిపించే విష్ణు, లలితా, శివ సహస్ర నామాలలో ఆ భగవంతుని రూప గుణాలను బట్టి పరమార్థాలను చెప్పుకొంటున్నాం. అయితే కొన్ని మతాలు తమను అనుసరించే వారిని సంసిద్ధం చేసికొన్నాయి.

చారిత్రక విభాత సంధ్యలలో వీటి మధ్య భేదాలు వచ్చాయి. తిక్కన వంటి కవి సంస్కర్తలెందరో ఈ విభేదాలు దూరం చేయడానికే శివకేశవులకు అభేదాన్ని చెప్పారు. శివాయ విష్ణు రూపాయ విష్ణురూపాయ శివాయ అనే పద్ధతి ననుసరించారు. శ్రీ యన్నా గౌరి అన్నా ఒక్కరే అన్నారు. వారి సిద్ధాంతమే హరి హరాద్వైతంగా ప్రచారంలోకి వచ్చింది.

ఓ ప్రభూ ! నీకు పుట్టెలదండ ఇష్టమా ?
కౌస్తుభమణి ఇష్టమా ?
యశోదా మాత క్షీరాలు ఇష్టమా ?
కాల కూట విషం ఇష్టమా ?

అని 'కిమస్థిమాలా...' అనే శ్లోకంతో ప్రశ్నిస్తాడు. ఆ ప్రభువుకు రెండూ సమానమే అని భావించి 'విష్ణు రూపాయ నమశ్శివాయ యని పల్కెడు భక్త జనంబు, వైదికధ్యాయి త కిచ్చ మెచ్చు పరతత్త్వము గొల్చెద నిష్ట సిద్ధికిన్''... అని నిర్ధారిస్తాడు .'' (గీతజ్ఞానయోగి సమాచార్, జనవరి, 2004, పుట.3)

శ్లో॥ ''శాస్తేతి కేచిత్ కతి చిత్ కుమారః
స్వామీతి మాతేతి పితేతి భక్త్యా !
యం ప్రార్థయస్తే జగదీశితారం
సేఏక ఏవ ప్రభురద్వితీయః ॥ ''(గీతజ్ఞానయోగి సమాచార్, జనవరి, 2004, పుట.5)

ఆ అద్వితీయుడు, జగదీశ్వరుడు ఒకే ఒక్కడు అయిన ఆ ప్రభువును కొందరు 'శాస్త' అని పిలుస్తారు. ఈ మాట కూడా వేదంలోనే ఉంది. శాస్త్ర అంటూ శాసకుడు అని అర్థం. ఆయన శాసనం తిరుగులేనిది; అందుకే ఆ పదం సార్థకం. కొందరు కుమారస్వామి అంటారు; మరికొందరు స్వామి అంటారు. కొందరు మాత (తల్లి) అంటారు; కొందరు పిత (తండ్రి) అంటారు. ఎవరెన్ని పేర్లతో ప్రార్థించినా ఆ పరమేశ్వరుడొక్కడే. ఆయనది స్త్రీ రూపమా! పురుష రూపమా ! ప్రకృతా ! జపమా ! ఏది! శాస్త్ర సమ్మతమైతే అన్ని రూపాలు ఆయనవే. మనమెలా చూస్తే అలా కనిపిస్తారు.

సోమకాసురుడనే ఓ రాక్షసుడున్నాడు. అతడు వేదాలను అపహరించాడు. మత్స్యమూర్తి వెళ్ళి ఆ వేదాలను తెచ్చాడు. ప్రళయకాలంలో సర్వ జీవ ధాతువులను రక్షించింది మత్స్యమూర్తే. ఈ జీవరక్షణే ఈ జ్ఞాన రక్షణే ధర్మ రక్షణ. ధర్మాన్ని రక్షించిన వారే అవతారమూర్తిగా కీర్తింపబడతారు.

ఈ అవతారాలన్నీ శుద్ధ ద్వాదశి నాడే జరిగాయనే సంప్రదాయమొకటుంది. అయితే కృష్ణావతారాదులు అష్టమి నాడు జరిగిన కథలున్నాయి. ఒక సంప్రదాయాన్ని, అవతారాలన్నీ గుర్తు పెట్టుకోవడానికి ఈ క్రింది విధంగా ఉత్సవాలు నిర్వహించడం కూడా స్థిరపడింది.

1. మత్స్యావతారం : మార్గశిర శుద్ధ ద్వాదశి
2. కూర్మావతారం : పుష్యశుద్ధ ద్వాదశి
3. వరాహావతారం : చైత్రశుద్ధ ద్వాదశి
4. నరసింహావతారం : ఫాల్గుణ శుద్ధ ద్వాదశి
5. వామనావతారం : కార్తీక శుద్ధ ద్వాదశి
6. పరశురామావతారం : వైశాఖ శుద్ధ ద్వాదశి
7. శ్రీ రామావతారం : జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి
8. శ్రీ కృష్ణావతారం : ఆషాఢ శుద్ధ ద్వాదశి
9. బుద్ధావతారం : శ్రావణ శుద్ధ ద్వాదశి
10. కల్క్యావతారం : భాద్రపద శుద్ధ ద్వాదశి "(గీతజ్ఞానయోగి సమాచార్, నవంబర్, 2004, పుట.3)

ఇవి వైరుధ్యాలు కావు. సమన్వయించుకొనేవే. అయితే మత్స్యావతారం ఏ విధంగా ధర్మ రక్షణం చేసిందో కూర్మమూర్తిని కూడా అదే ధర్మదృక్పథంతో అధ్యయనం చేయాలి. దేవతలు అసురులు పాల సముద్రం చిలికారు. మంథరం కృంగిపోకుండా కూర్మమూర్తి నిలిపాడు. భౌతిక మధనంలో వచ్చిన అంతస్సత్యాలు - అంతస్సత్వాలు దివ్యామృతాలైనాయి; దివ్యులైన వారికే ఇవి అందుతాయని నిరూపించాయి.

భూమిని మొత్తం తానే సొంతం చేసుకొందామనుకొన్నాడు హిరణ్యాక్షుడు. సర్వభూతకోటికి ఉపయోగపడే పృథ్విని ఒక్కడు కాజేయాలనుకోవడం మహాపరాధం. ఆ మహాపరాధానికే శిక్ష. భూమిని ముక్తం చేసి, భూతకోటికి కూడు, గుడ్డ, గూడుకు అస్కారం కల్పించిన ఆది వరాహమూర్తిని అందుకే అవతారంగా భావించారు.

భూమి సొంతం చేసుకోవడానికి ప్రయత్నించి హిరణ్యాక్షుడు ఆది వరాహమూర్తి ఆది ధర్మానికి బలి అయ్యాడు. శాశ్వతకాలాలపాటు రాజ్యంపై- విశ్వంపై ఆధిపత్యం చలాయించాలని నారాయణత్వాన్నే నాశనం చేయాలని యత్నించి, ప్రహ్లాదభక్తికి, నరసింహమూర్తి శక్తికి బలి అయ్యాడు. ధర్మజ్ఞుడైన అసుర రాజు బలి చక్రవర్తి ప్రహ్లాదుని మనుమడు. కాని అతడు కూడా దేవతలను అమరావతి నుండి తరిమి గొట్టి పరిపాలన చేస్తున్నాడు. పరిపాలన బాగానే ఉంది కాని దేవతల నివాసాలను ఆక్రమించి వారికి నిలువ నీడలేకుండా చేయడం ధర్మం కాదు. అందుకే బలి తన వారితో పాటు వామనుని త్రివిక్రమత్వానికి తలవంచి పాతాళానికి వెళ్ళిపోయాడు.

రాజులు ధర్మ పరిపాలన చేయాలి. కార్తవీర్యార్జునుని వంటి రాజులు మున్యాశ్రమాలను నాశనం చేసి, జమదగ్ని వంటి ఋషి సంప్రదాయజ్ఞులను (మేధావులను) సంహరిస్తే ఇదం శాస్త్రం - ఇదం శస్త్రం అంటూ పరశురాముడు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. 21 పర్యాయాలు దేశమంతా తిరిగి మత్తరాజాధములను మాత్రమే సంహరించి ధర్మ పరిపాలన జరిగే విధంగా వ్యవహరించ వలసి వచ్చింది

భార్గవ రాముని అనంతరం ఆ నారాయణమూర్తి పురుషోత్తములెలా ఉండాలో నిరూపించడానికి శ్రీరామునిగా

అవతరించి రావణ కుంభకర్ణులను సంహరించి సీతా (భూమిజ) (స్త్రీ) ధర్మరక్షకులై వ్యవహరించారు. ప్రజానురంజక పరిపాలన చేసి 'రామో విగ్రహవాన్ ధర్మః' వాల్మీకి కోకిల చేత పిలిపించుకోవలసి వచ్చింది.

ఇక అలవైకుంఠపురాన్నే వదలి విశ్వ వ్యాపిత దివ్యశక్తిని ఒకచోట కేంద్రీకరింప చేయాల్సిన ఆవశ్యకతను గుర్తించి, శ్రీకృష్ణునిగా అవతరించి, ధర్మ రక్షణార్థం అధికార పీఠాన్ని ఆశించకుండానే, వ్యక్తి వ్యక్తిలో ధర్మ చైతన్యాన్ని నింపాల్సి వచ్చింది.

బుద్ధుడు ధర్మం శరణం గచ్ఛామి అంటూ వచ్చాడు. రాజ్యాధికారం కన్నా ప్రజా హృదయాధికారం మిన్న అని గుర్తించి సంఘం శరణం గచ్ఛామి అన్నాడు. తన బోధలు అనుసరించండి అంటూ అహింసాతత్త్వ ప్రబోధకులై బుద్ధం శరణం గచ్ఛామి అని పిలుపునిచ్చాడు.

ఇక వచ్చేది కల్కి అవతారం. కలియుగంలో బుద్ధుని కార్యపరిపూర్తి నిమిత్తమే రాబోతున్నాడని భవిష్య దాదిపురాణాలు చెబుతున్నాయి. ఎవరిలో నుండి ఈ కలికి వస్తుంది. ఖడ్గం ధరించి అశ్వంపై వస్తుందని కథనం. అంటే శస్త్రం ఉ ంటుంది, కలియుగానికి తగినంత వేగంతో వెళ్లే (హార్స్ పవర్తో వెళ్లే) వాహనం ఉంటుంది. ఇది అందరిలో ఆశను రేకెత్తించే అంశం. ఆశావాద సమతావాద మానవీయ నైతిక వాద జీవనం వైపు మనిషిని సంసిద్ధం చేసే ఆ మహాసంకల్పం నెరవేరుతుంది. ఈ సంపాదకీయ వ్యాసంలో కసిరెడ్డి దశావతారాలను విశ్లేషిస్తూ ఈ అవతారాలన్నీ ధర్మాన్ని రక్షించడానికే అని వివరించారు.

**ముగింపు :**

సాహిత్యానికి సమాజానికి విడదీయరాని బంధం ఉంటుందన్న సంగతి ప్రపంచంలోని ఏ భాషా సాహిత్యాన్ని పరిశీలించినా తప్పక తెలుస్తుంది. సమాజంలోని సాంఘిక రుగ్మతల నిర్మూలనకు శాస్త్ర కళావైజ్ఞానికాది సమస్త విషయాలకు సాహిత్యాన్ని సాధనంగా చేసుకొని పురోగమించిన వారెందరో మనకు చరిత్రలో దర్శనమిస్తారు. వీరిలో కసిరెడ్డిగారిని ప్రత్యేకంగా పేర్కొనాలి. సాహిత్య ప్రయోజనం సాహిత్యమే అని మల్లాది రామకృష్ణశాస్త్రి చెప్పినట్లు కసిరెడ్డి సమాజానికి మేలుచేసే సంపాదకీయ వ్యాసాలను రాశారు. అవన్నీయు మనిషిని మానవతా పథంలో ముందకు నడిపించే పద్ధతిలో ఉన్నాయి. ఈ వ్యాసాలన్నీ కలకాలం సమాజాన్ని సంస్కరించే విజ్ఞాన వీచికలుగా చెప్పవచ్చు.

కసిరెడ్డి సమాజాన్ని అనేక పార్శ్వల నుండి ధరిస్తూ ఉండడం వలన వీటిలో వైవిధ్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఆ వైవిధ్యాలను పాఠకుని కళ్ల ఎదుట నిల్వటంలోనూ తన దార్శనికతను స్పష్టం చేశాడు. ఈ సంపాదకీయ వ్యాసాలలో సంస్క ృతిని గానం చేసినా, మానవతను గురించి రాసినా, పండగను వర్ణించినా, ఆధ్యాత్మికతను గురించి, అమ్మ, విద్య, స్త్రీ, దేశభక్తి, విశ్వజనీనత, దేశాభ్యుదయం, సనాతన ధర్మం, గురువుల గురించి, నాయకుల గురించి రాసిన అవి తేజస్వంతాలు, తేజస్సును సమాజ హృదయంలోని ప్రసరింపజేస్తాయి. పాఠకులను ఆలోచింపజేస్తాయి. అంతరాత్మలను పదిలపరిచి, సద్గుణ సౌజన్యాలను ప్రేరేపిస్తాయని అనుటలో అతిశయోక్తిలేదు.

కొన్ని వ్యాసాలలో మావనతావాదిగా, మరికొన్ని వ్యాసాలలో సంస్కర్తగా ఆదర్శ వ్యక్తిత్వం గల మనిషిగా విశ్వజనీన దృక్పథాన్ని వెల్లడిచేస్తూ సమాజానికి మార్గదర్శకుడిగా కనిపిస్తాడు. ఇవి అచ్చమైన ప్రజాకవి హృదయతత్త్వాన్ని తెలిపేవిగా ఉన్నాయి. వీటి ద్వారా ఆయన వ్యకిత్త్వంలోని విశాలదృక్పథం ప్రస్ఫుటమవుతుంది. కవి అంటే రుషివంటివాడనే అలంకారికోక్తికి అనుగుణంగా ఉంటారు. కవి ఉపదేశకుడు, సందేశకుడు కావాలని ఆయన అభిలషిస్తారు. ఇజాలకు దూరంగా నిజాలకు దగ్గరగా ఉండడం ఆయన ప్రత్యేకత. ఆయన హృదయం నుంచి వెలువడిన ప్రతి సంపాదకీయ వ్యాసం ఉజ్వలంగా ఉంటుంది. పైన వివరించిన సంపాదకీయాలన్నింటిని శాస్త్రీయంగా పరిశీలించడమే నా వ్యాస ప్రధాన లక్ష్యంగా జరిగింది.

**ఆధార గ్రంథాలు :**


1. దొణప్ప, తూమాటి. 1972. భాషా చారిత్రక వ్యాసావళి. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు.
2. తెలుగుపున్నమి-చరిత్ర, సంస్క ృతి-సాంకేతికత- ప్రచురణ, కృష్ణాజిల్లా రచయిత సంఘం- విజయవాడ
3. తెలుగుసాహిత్య సమీక్ష ద్వానాశస్త్రి విశాలాంధ్ర పబ్లిషర్స్, హైదరాబాద్, 2003
4. ఆంజనేయ శాస్త్రి, పి.యన్.ఆర్ 1985. పత్రికా రచన: పరిమాణాలు, ప్రయోజనాలు. (సం) , రావికంటి వసునందన, హైదరాబాద్
5. రామమూర్తి, గిడుగు వెంకట. 1913. నేటి తేట తెలుగు. సారస్వత వ్యాసములు- తృతీయ సంపుటము. (సం) జి.వి. సుబ్రహ్మణ్యం. హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
6. శివానంద భారతి, విశ్వ హిందు, ధర్మ సారధి, గీతాజ్ఞాన యోగ సమాచార్ మొదలైన పత్రికల్లో సంపాదకీయ వ్యాసాలు.


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN
2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-4 | April 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

**Article Link :** *https://www.bhavaveena.com/*

# బంజారాల గేయ సాహిత్యం సాంస్కృతిక జీవనం



సునావత్ నాగలక్ష్మి
సూర్యాపేట జిల్లా, చరవాణి : 8367587950.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహము**

భారతదేశంలో నివసిస్తున్న అనేక ఆదిమ జాతులలో 'బంజారా' ఒక విశిష్టమైన గిరిజన తెగ. బంజారాల జీవన విధానం విలక్షణమైంది. వైవిధ్యభరితమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని బంజారాలు ఒక విభిన్నమైన భాషనూ, సంస్కృతినీ కలిగి తెలుగువారితో సహజీవనం సాగిస్తున్నారు. వీరి సాంస్కృతిక వ్యవస్థను లోతుగా పరిశీలించినప్పుడు అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

**కీలక పదాలు**

స్థూలంగా 'సంస్కృతి'ని ఒక జాతి పురోగమన విధానంగా పేర్కొనవచ్చు. శాస్త్రవేత్తలు మానవ జీవన పరిణామ క్రమంలో 3 దశలను గుర్తించారు. అవి: 1. అరణ్య జీవనస్థితి 2. అనాగరక స్థితి 3. నాగరక స్థితి. ఈ మూడు దశలు సంస్కృతి లేదా సాంస్కృతిక వికాసంలో భాగమని మానవ శాస్త్రవేత్తల అభిప్రాయం. మొదటిది గిరిజన సంస్కృతిగానూ, రెండవది గ్రామీణ సంస్కృతిగానూ, మూడవది నాగరక సంస్కృతిగానూ భావించవలసి ఉంది.

**ప్రవేశిక**

మానవుడు ఏర్పరచుకున్న భాష, సాహిత్యం, కళలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, జీవన విధానం మొదలగునవి సంస్కృతిలో భాగంగా గుర్తించవచ్చు. తెలుగు భాషను మాట్లాడేవారు ప్రత్యేకమైన భాష, సంప్రదాయం, సాహిత్యం, కళలు, ఆచారవ్యవహారాలు కలిగి ఉన్నారు. అలాగే బంజారాలు (లంబాడీలు) కూడా ఒక ప్రత్యేకమైన భాష, సంప్రదాయాలు, సాహిత్యం, ఆచారవ్యవహారాలు కలిగి ఉన్నారు.

**విషయ వివరణ**

**బంజారాల సంస్కారాలు**

సామాజిక, సామూహిక ఆచార వ్యవస్థ ఒక తరం నుండి మరొక తరానికి కట్టుబాటుగా వస్తుంది. ఈ ఆచారాలే

వ్యవహారాలుగా చలామణి అవుతూ సమాజంలో భాగంగా ఏర్పడతాయి. ఒక కులం ప్రత్యేకమైన ఆచారాన్ని కలిగి ఉన్నప్పుడు అది మతాచారంగానూ చలామణి అవుతూ ఉంటుంది. ఆచారాలకు, సంప్రదాయాలకు అవినాభావ సంబంధం ఉంది. అందుకే ఆచారాలు సంప్రదాయాలుగా మారి సమాజంలో నిలబడిపోతాయి. ఆచార సంప్రదాయాలకు గల అవినాభావ సంబంధాన్ని డా. సి. నారాయణరెడ్డి గారు "ఆచారము ప్రధానముగ ఆచరణకు సంబంధించినది. సంప్రదాయము ఆలోచనకు సంబంధించినది. కానీ, వ్యవహారమునందీ రెంటికంతగా భేదము పాటింపబడుట లేదు"" అని వివరించారు. దీన్ని బట్టి ఆచారం, సంప్రదాయం, పారంపర్యంగా సమకాలీన సంఘంలో అలవాటుగా లేదా అనాదిగా వస్తున్న నియమనిబంధనలచేత ఏర్పడిన జీవనవిధానంగా పేర్కొనడం సముచితంగా ఉంటుంది.

"ఆటవిక, సంచార జాతుల్లో కుల పెద్ద తిరుగులేని ఆధిపత్యం కలిగి ఉంటాడు. ఏ కులస్థునికైనా ఆచార నియమోల్లంఘన చేయరాని పని. నాగరక సమాజ అదుపాజ్ఞలు గాని, అధికార నిర్బంధాలు గాని వీరి ఆచారాల మీద ఎలాంటి ప్రభావం చూపవు. పుట్టుక నుంచి గిట్టేవరకు ఉన్న అన్ని సందర్భాలకు ఎలా నడుచుకోవాలో చెప్పే నియమ నిబంధనల్లాగా ఆచారాలు ఉంటాయి. వాటిని ఆ తెగ వాళ్లంతా తు.చ. తప్పక ఆచరించవలసిందే". "సంస్కారాలు ప్రాకృత దశ నుంచి సామాజికపరంగా మనిషిని సంస్కారవంతుని చేయడానికి తోడ్పడతాయి. సంస్కారాలు పరకర్మలనీ, అపరకర్మలనీ రెండు విధాలు. షోడశ కర్మలలో పెళ్లికి ముందున్నవి పరకర్మలు. ఆ తర్వాతవి అపర కర్మలు. జాతక కర్మాదులన్నీ పరకర్మలే. కర్మకాండ విధులు అపరకర్మల్లో చేరుతాయి. నామకరణం, అక్షర స్వీకారం, చేలం, ఉపనయనం, వివాహం మొదలైనవి పరకర్మలుగా లెక్కింపబడతాయి. ఒక జాతి పాటించే ఆచార సంప్రదాయాలు ఆ జాతి సంస్కృతికి మూలాధారాలు. అలాగే ఒక కులం లేదా జాతి సంస్కృతి గురించి తెలియచేయాలంటే వారి ఆచారాలు, సంప్రదాయాలు తెలుసుకోవడం చాలా అవసరం. ఆచారాల్లోని నియమనిబంధనలను లోతుగా పరిశీలిస్తే మనకు ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఆచారవ్యవహారాలను కూలంకషంగా పరిశీలిస్తే వాటి వెనక ఎన్నో సామాజిక, ఆధ్యాత్మిక, విజ్ఞాన శాస్త్ర విషయాలు దాగి ఉన్నాయనే సత్యం మనకు బోధపడుతుంది.

**జనన సంస్కారాలు**

గృహ జీవనంలో సీమంతం, ప్రసవం, పురుడు, పేరంటం మొదలైన ఆచారాలు ఒక భాగం. తెలుగువారి ఆచార సంప్రదాయాలు పరిణతి చెందిన హిందూ మతపరమైన ఆచారాలు. బంజారాలు కూడా పూర్తిగా హిందూ సంప్రదాయాలను పాటిస్తారు. కాని బంజారాల గృహజీవనంలో ఆచారాలు సంప్రదాయాలు తెలుగువారి కంటే భిన్నంగా ఉంటాయి. పుట్టిన దగ్గరి నుండి సంఘం మనకు ఎన్నో ఆచారాలను నేర్పింది. ఆచారాలు మనిషి జీవితంతో ముడిపడి గిట్టే వరకు అలాగే ఉంటాయి. పుట్టుక మనిషి జీవితంలో మొదటి ఘట్టం. మన పూర్వీకులు పుట్టుకను ఒక పవిత్రమైన సంఘటనగా భావించి, ఆ సమయంలో పాటించవలసిన ఆరోగ్య పద్ధతులు, ఆచారాలను నిర్ణయించి సమాజంలో అమలుపరిచే విధంగా చేశారు. ఒక తరం నుండి మరోతరం వారు ఈ ఆచారాలు పాటిస్తూ వస్తున్నారు. జనన సంస్కారాలకు సంబంధించిన ప్రస్తావన మన ప్రాచీన గ్రంథాల్లో చేయబడింది. దీన్ని బట్టి మన ఆచారాలు, సంప్రదాయాలు ఎంత ప్రాచీనతను సంతరించుకున్నాయో మనకు తెలుస్తూ ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఏ మానవ సముదాయాన్ని పనరిశీలించినా సంతానం కోసం పరితపించని వారంటూ వుండరనేది సత్యం. మాతృత్వం ప్రతి మానవ సమూహానికీ సహజమైన లక్షణం. మానవులు సంతానం కలగకపోతే అనేక వ్రతాలూ, పూజలూ చేయడం పరిపాటి. స్త్రీలు మాతృత్వాన్ని ఒక వరంగా భావిస్తారు. సంతానం కలిగితే తమ జన్మ ధన్యమైందని, తమ వ్రతాలు ఫలించాయని భావిస్తారు. బంజారాలు ఆచరించే జనన సంస్కారాలను పరిశీలిస్తే అనేక విషయాలు తెలుస్తున్నాయి.

బంజారాల జనన సంస్కారాలకు మిగతా సమాజంలోని జనన సంస్కారాలకు గల తేడా తెలుస్తుంది. బంజారాల జనన సంస్కారాలు ఒక విలక్షణమైన రీతిలో ఉండి వారి జీవన స్థితిగతులకు అద్దం పడుతున్నాయి. సాధారణంగా బంజారాల జనన సంస్కారాల్లో సీమంతం, ప్రసవం, పురుడు, బారసాలలు ముఖ్యమైన ఘట్టాలుగా పేర్కొనవచ్చు.

**సీమంతం**

బంజారాలలో గర్భిణీ స్త్రీలకు సీమంతం చేసే ఆచారం లేదు. కానీ తమ చుట్టూ ఉన్న తెలుగు నాగరిక సమాజ ప్రభావంవల్ల రాను రాను కొంత మంది ఈ ఆచారాన్ని పాటిస్తున్నారు. నిజానికి తండాల్లోని లంబాడీ స్త్రీలకు పూర్తిగా నేటికీ సీమంతం అంటే ఏమిటో కూడా తెలియదు. బంజారాలు స్వాతంత్ర్యం వచ్చేవరకు దాదాపుగా సంచార జీవనాన్ని గడిపేవారు. కాబట్టి వారికి స్థిర గృహ జీవనం పూర్తిగా తెలియని పరిస్థితులలో ఇట్టి నాగరిక ఆచారాలకు తావు లేదన్నది సత్యం. స్థిరనివాసం ఏర్పడిన తర్వాత కూడా బంజారాలు నాగరక గృహజీవనానికి అలవాటుపడే పరిస్థితి రూపొందలేదు. అందుకు కారణం తమ స్వంత జాతి ఆచారాలపై గల విశ్వాసం కావచ్చు.

**ప్రసవం**

బంజారాలు ప్రసవ సమయంలో వైద్య సలహాలకోసం వైద్యులను సంప్రదించరు. వీరు సాధారణ పరిస్థితుల్లోనే ప్రసవం జరగాలని భావిస్తారు. మారుమూల ప్రాంతాల్లో గల తండాలను వదిలి పట్టణ వైద్యశాలలకు గర్భిణీ స్త్రీలను తరలించే సదుపాయం వీరికి ఉండదు. అంతటి ఆర్థిక స్థోమత కూడా లేకపోవడంవల్ల గర్భిణీ స్త్రీలకు మంత్రసానుల పర్యవేక్షణలోనే ప్రసవం జరిపిస్తారు. మంత్రసాని సలహామేరకు నాటుమందులను వాడి పురుటి సంస్కారాలు జరిపిస్తారు. నేటి నాగరిక సమాజ ప్రభావంవల్ల కొంతమంది విద్యావంతులైన బంజారాలు ఆర్థిక స్థోమతను బట్టి వైద్యుల సలహాల మేరకు వైద్యశాలలను సంప్రదిస్తున్నారు. మారుమూల ప్రాంతాలలోని గిరిజనులు మాత్రం ఇంకా పాత పద్ధతిలోనే వ్యవహరిస్తూ ఆధునిక వైద్య సదుపాయాలకు దూరంగా ఉండడం వీరి అనాగరిక, ఆటవిక 'సంస్కృతికి దర్పణం పడుతుంది. బంజారాలలో ప్రసవ సమయంలో పాటించే ఇతర పద్ధతులు వీరి అనాగరికతను చాటుతాయి. ప్రసవ వేదన మొదలైనప్పుడు ఆ స్త్రీ ప్రసవ సంస్కారాలు పూర్తిగా తండాలోని లేదా పొరుగు తండాలోని 'దాయి' (మంత్రసాని) పర్యవేక్షణలోనే జరుగుతాయి. ప్రసవ వేదన పడుతూ కూడా ప్రసవం జరగకపోతే గర్భిణీ స్త్రీని ఎడ్లబండిపై పడుకోబెట్టి గతుకుల దారిలో లేదా రాళ్లూరప్పలు గల దారిలో తిప్పడం చేస్తారు. అలా చేస్తే ప్రసవం త్వరగా జరుగుతుందని వారి నమ్మకం. ప్రసవం జరిగిన తర్వాత బిడ్డపై కొంచం నీళ్లు చిలకరిస్తారు. అప్పుడే తల్లి గర్భం నుండి బయటపడిన శిశువు బాహ్య ప్రపంచాన్ని చూసి జడుసుకుంటుందని, శిశు వుపై నీళ్లు చల్లినట్లయితే ఆ భయం పోతుందని వారి నమ్మకం.

తండాలో బంజారాలందరూ ఒక్క తాటిపై నడవడం పరిపాటి. తండాలో ఏదైనా సంఘటన జరిగితే అందరూ స్పందించే ఆచారం వీరిలో ఉంది. ఎవరి ఇంట్లోనైనా ఏదైనా శుభకార్యంగానీ, అశుభ కార్యంగానీ జరిగితే ఆ తండాలోని వారంతా ఒకరికొకరు సహాయకారులుగా ఉంటారు. ఒక ఇంట్లో ఆడశిశువు జన్మిస్తే ఆ ఇంట్లో 'కొచ్నో' (కంచం) అనే ఒక పంచలోహాలతో చేయబడిన కంచు పళ్లాన్ని మ్రోగిస్తారు. అదే మగశిశువు జన్మిస్తే తండా 'నాయక్' (తండా నాయకుడి) ఇంట్లో ఉండే 'నంగారా' (డోలు) వాయిస్తారు. అది విని తండాలోని వారందరికీ ఎవరి ఇంట్లో ఏ శిశువు జన్మించిందీ తెలుస్తుంది. తర్వాత కావలసిన వారు వచ్చి పరామర్శించడం జరుగుతుంది. శిశువు పుట్టిన తర్వాత 'నాళో' (ప్రేగు లేదా మాయి)ను కొడవలితో లేదా రాయితో కోసి వేరు చేస్తారు. తర్వాత ఇంటికి ఈశాన్యంలో ఒక గుంతను తవ్వి ప్రేగును, ఒక పావలా బిళ్లను, జొన్న పిండిని అందులో వేసి పూడ్చి వేస్తారు. అలా చేస్తే తల్లికీ, బిడ్డకు ఎలాంటి హాని జరగదని వారి విశ్వాసం. తర్వాత శిశువుకు ఆవుపేడను వంటికి పూసి నీళ్లతో స్నానం చేయిస్తారు.

ఇలా చేయడం వల్ల పుట్టినప్పుడు శిశువు శరీరంపై ఉన్న రోమాలు రాలిపోయి శిశువుకు ఆరోగ్యం కలుగుతుందని వారి నమ్మకం.

తల్లీబిడ్డలకు వావిలాకు, వేపాకు వేసి మరగబెట్టిన నీటితో రోజూ రెండు పూటలా స్నానం చేయిస్తారు. విజ్ఞానశాస్త్ర రీత్యా చూస్తే ఆవు పేడలో 'అమ్మోనియా' ఉంటుందని, వావిలాకు, వేపాకుల్లో క్రిమిసంహారకాలుగా పనిచేసే మూలికా గుణాలు ఉంటాయని తెలుస్తుంది. బంజారాలు మారుమూల అడవి ప్రాంతాలలో నివసించడంవల్ల ఔషధీ మొక్కలకు సంబంధించిన పరిజ్ఞానం ఉందనేది నమ్మదగిన సత్యం. తల్లి, శిశువుల ఆరోగ్యానికి ఔషధపు మొక్కల వినియోగం మంచిదని వీరి పూర్వీకులు ఈ ఆచారానికి నాంది పలికి ఉండవచ్చు. తల్లీశిశువులకు స్నానం చేయించిన నీరు ఎవ్వరూ తొక్కకుండా ఒక గుంతలోకి పోయేటట్లు ఏర్పాటు చేస్తారు. దీనివల్ల తల్లికి, శిశువుకు ఎలాంటి అంటు తగలదని వీరి నమ్మకం. వైద్య సలహాలను పక్కన పెట్టి బాలింతకి ప్రసవం జరిగిన రోజు సారాయిని తాగించడం వీరి ఆచారం. బాలింత స్త్రీకి నొప్పులు తెలియకుండా ఉండడం కోసం ఈ ఆచారాన్ని పాటిస్తున్నట్లు బంజారాలు చెప్తారు. ప్రసవం తర్వాత దినాలలో వీరు బాలింతకి రోజూ 'కాడో' పాయసాన్ని చేసి పరిగడుపున తాగిస్తారు. ఈ 'కాడో' వంటకం మిరియాలు, పీంపళ్మోడి (పిప్పళ్ళు), సూంట్ (సొంటి) మొదలగు మసాలాలతో కలిపి బెల్లం మరియు నేతితో వండి తయారుచేస్తారు. బియ్యంపిండి, నెయ్యి, బెల్లంతో చేసిన 'లాప్సి' అనే ప్రత్యేకమైన పాయసాన్ని కూడా వండి తినిపిస్తారు. 'కాడో' మరియు 'లాప్సి పాయసం' తినడంవల్ల బాలింత శరీరంలో కొత్త రక్తం తయారై కొత్త శక్తి కలిగి ఆరోగ్యంగా ఉంటారని వీరి విశ్వాసం. బాలింత ఉండే గది గుమ్మానికి 'గారె' కొమ్మలు కడతారు. తద్వారా భూత ప్రేతాలు తల్లి బిడ్డ దరికి చేరవని వీరి నమ్మకం.

**పురుడు (దళ్వా ధోకాయేరో)**

బంజారాలలో కానుపు జరిగిన మూడో రోజున పురుడు పోస్తారు. పురుటి రోజు 'జల్ మాతా (జలమాత) పూజచేస్తారు. ఇంటికి తూర్పు దిక్కున గుంత తీసి, గుంతపై రేగు కంపను పెడ్తారు. ఇత్తడి చెంబుకు నల్లని వెంట్రుకలతో మెలివేసి కట్టి పసుపు సున్నం మరియు బొగ్గుతో బొట్టు పెట్టి అలంకరిస్తారు. చెంబులో నీరు నింపి ఐదు సంవత్సరాల వయసుగల బాలునితో బాలింత తలపై పెట్టిస్తారు. బాలింత, తండా స్త్రీలు కలిసి బియ్యం లేదా జొన్నలను అక్షింతలుగా చల్లుతూ చెంబును గుంత దగ్గర దింపుతారు. చెంబులోని నీళ్ళను గుంతలో పోసి, పిండితో చేసిన నాల్గు ప్రమిదలలో నూనె పోసి వత్తులను వెలిగిస్తారు. ఆ పిండి ప్రమిదలను గుంతకు సమీపంలో ఉంచి, కొడవలితో ఏడు గీతలు గీసి గుంతలోని నీళ్ళలో బాలింతరాలి కుడికాలి బొటనవ్రేలితో ఏడు సార్లు అద్దిస్తారు. ఆ తరువాత పిండి ప్రమిదలను గుంతలో ఉంచి పూడ్చివేస్తారు. బాలింత తన బిడ్డను సుఖంగా ఉంచమని 'జల్మాత' (జల దేవతను)ను ప్రార్థిస్తుంది. అక్కడికి వచ్చిన వారందరికీ బెల్లం, నెయ్యి కలిపిన పిండిని ప్రసాదంగా ఇస్తారు. తరవాత మంత్రసానితో పాటు కొంతమంది తండా స్త్రీలకు కల్లు, సారాయి కొరకు కొంత డబ్బు ఇవ్వడం ఆనవాయితీ. పదకొండో రోజు మోదుగ కాడలో సూదిని గుచ్చి, దారంతో కట్టి, దీపపు మంటలో సూదిని వేడిచేసి, శిశువుకు బొడ్డు చుట్టూ 'ఇంటు' (ఠ) ఆకారంలో చురకలంటిస్తారు. దీనివల్ల శిశువులకు జీర్ణశక్తి పెరుగుతుందని వీరివిశ్వాసం.

"దళ్వా ధోకాయేరో" అనే తంతువును దేవి అర్చనగా పేర్కొనాలి. జన్మించిన శిశువుకు మంచి జీవితాన్ని ప్రసాదించాలని మహిళలు దేవిని ప్రార్థించడం బంజారాలకు ఆనవాయితీగా వస్తున్నది. ఈ సందర్భంలో దేవిని ఈ విధంగా అర్చన చేస్తారు.

**పాట**

ఏ మాతా యాడీ తూ సాయీ వేస్!
హాంస్తీ హాంస్తీ వర్ ఆయేస్, అన్

రోతీ రోతీ పర్ జాయేస్!!
సూయేరో డేరో పర్ లేజాయేస్ అన్,
సణే రో డేరో వరె లాయేస్ !!
సూయీ దోరా లేన్ వరె ఆయేస్
ఏ మాతాయాడీ తూ సాయీ వేస్!

**భావం**

"ఓ మాతా! నీవు సదా దయతో ఉండు, నవ్వుకుంటూ మావైపుకు రా, ఏడుస్తూ అవతలికి పో. సూది మూటైతే వద్దు, జనుము మూటైతే తీసుకురా! సూది దారంతోనైనా రా" అని అర్థం.

ఈ పాటలో పురుడు సమయంలో లంబాడీలు వ్యక్తపరిచే మనోభావాలు మనకు తెలుస్తున్నాయి. లంబాడీలు తుల్జా భవానీని ఆరాధిస్తారు. ప్రతి బంజారా స్త్రీ తుల్జా భవానీ మరో రూపమైన దుర్గామాతను ఆరాధిస్తుంది. పురుడు సమయంలో ముత్తైదువలు తమ చారిత్రక ఆచారాలను పాటించి మాతను కొలుస్తారు. ఆ సమయంలో దేవిని ప్రార్థించే తీరు ఈ పాటలో మనకు తెలుస్తుంది. దేవతను నవ్వుతూ వస్తే మా వైపుకు రమ్మని పిలువడం, ఏడుస్తూ వస్తే అవతలికి పొమ్మనడంవలన వీరు ఏడుపును అశుభంగానూ, నవ్వును శుభంగానూ భావిస్తారని తెలుస్తూ ఉంది. సూదుల మూటను తేవద్దని జనుము మూటను తీసుకొస్తే మంచిదని ప్రార్థించడంలో ఒక నిగూఢత ఉంది. లంబాడీలు సూదిని ఆడపిల్లతోనూ, జనుమును మగపిల్లవానితోనూ పోలుస్తారు. సూదిని తెమ్మనడం అమ్మాయిని, అబ్బాయిని ఇమ్మని కోరుతున్నట్లు తెలుస్తుంది. సూది మూటను వద్దని, జనుము మూటను తెమ్మని, సూది దారాన్ని తెమ్మని కోరడంలో కష్టాల బదులు సుఖాలను ప్రసాదించమని లేదా కష్టమిస్తే సుఖాన్ని కూడా ఇమ్మని వేడుకొంటున్నట్లు తెలుస్తూ ఉంది.

లంబాడీల పాటలు విలక్షణమైనవని పై పాటను పరిశీలిస్తే తెలుస్తుంది. తమ మనసులోని భావాన్ని సూటిగా కాక తమ చుట్టూ ఉన్న ప్రకృతితో పోలుస్తూ వ్యక్తీకరించడం గిరిజనులకు సర్వసాధారణం.

**బారసాల**

బంజారాల బారసాల విలక్షణమైంది. సాధారణంగా తెలుగువాళ్ల లాగానే 21వ రోజు శిశువును ఉయ్యాలలో వేస్తారు. ఈ సందర్భంగా లంబాడీలు చేసే కార్యక్రమం వారి ఆచారాలకు అనుగుణంగానే ఉంటుంది. శిశువును పడుకోబెట్టడానికి ముందు శనగ గుగ్గిళ్లు ఉయ్యాలలో పోసి అందులో చీమల్ని కూడా విడిచిపెడతారు. చీమలు కుట్టడంవల్ల శిశువుకు బాధ కలుగుతుందని మనం అనుకోవచ్చు. కానీ లంబాడీల ఉద్దేశం వేరు. ఈ శిశువు తర్వాత మరో శిశువు ఆ తర్వాత మరో శిశువు ఇలా చీమల్లాగా ఆ ఇంట్లో పిల్లలు పుట్టుకొని రావాలని వారి సంకల్పం.

గృహజీవన ఆచారాలలో జనన సంస్కారాలు ముఖ్యమైనవి. జనన సంస్కారాలను తెలుగువారు, బంజారాలు భిన్న కోణాలలో ఆచరించడం ముఖ్యంగా గమనించదగిన అంశం. తెలుగువారి సామాజిక స్థితిగతులకు బంజారాల సామాజిక స్థితిగతులకు గల భేదం వారి ఆచార వ్యవహారాలలో కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. బంజారాలలో ప్రసవ సమయంలో పాటించే పద్ధతుల్లో, గర్భిణీ స్త్రీని ఎడ్లబండిపై పడుకోబెట్టి గతుకుల దారిలో లేదా రాళ్లూరప్పలు గల దారిలో తిప్పడం, ప్రసవం జరిగిన తర్వాత బిడ్డపై కొంచం నీళ్లు చిలకరించడం వీరి ఆరణ్యజీవన స్థితిని చాటుతున్నాయి.

పేడను శిశువు వంటికి పూసి నీళ్లతో స్నానం చేయించడం, తల్లిబిడ్డలకు వావిలాకు, వేపాకు వేసి మరగబెట్టిన నీటితో రోజు రెండు పూటలా స్నానం చేయించడం, 'కాడో', 'లాప్సీ' (పాయసం) తాగించడం వంటి కొన్ని ఆచారాలు పరిశీలిస్తే ఆరోగ్య పరిరక్షణలో బంజారాలు తీసుకొనే జాగ్రత్తలు తేటతెల్లమవుతాయి. బంజారాలు మారుమూల

అడవి ప్రాంతాలలో నివసించడంవల్ల ఓషధులకు సంబంధించిన పరిజ్ఞానం ఏర్పడింది. బంజారాల జనన ఆచారాలు ఎక్కువగా వనవాసీ సంస్కృతిని సూచిస్తున్నాయి. వీరికి గల మూఢనమ్మకాలే వీరిని ఇట్టి ఆచారాలను పాటించేలా చేస్తున్నట్లు గమనించవలసి ఉంది.

**జోలపాటలు**

బంజారాలలో సాహిత్యానికి అంకురార్పణ జరిగేది తల్లి నోటనే. తల్లి పాడే పాట శిశువు విని తన్మయత్వంతో నిదురిస్తుంది. తెలుగువారు పాడే జోల పాట లాగే బంజారాలు జోలపాటను శిశువును నిద్రపుచ్చే సమయంలో పాడుతారు. వీరి జోల పాటలు చాలా వైవిధ్యాన్ని కలిగి ఉంటాయి. తల్లి జోలపాటను పాడేటప్పుడు తన దైనందిన కార్యకలాపాల్లోని ముఖ్య సంఘటనలను గుర్తు చేసుకుంటుంది. భగవంతుణ్ణి తలుస్తూ, తన తనయుణ్ణి కృష్ణునితోనూ, రామునితోనూ పోలుస్తుంది. ఇంకా మేనమామలతోనూ, వీరులతోనూ పోలుస్తూ రాగయుక్తంగా తన్మయత్వంతో పాడడం గమనించదగ్గ విషయం. జోలపాటలు విభిన్న రకాలుగా వ్యాప్తిలో లేకున్నప్పటికి లయాత్మకంగా మాత్రం ఉంటాయి.

హాలో బాళా హాలో! సోజో బాళా సోజో!!
బాల దేవేరీ దేవళేమార్ఘూంజర బొలెని!
మారే బాళానే నీంద్ ఆయేని!!
హాలో బాళా హాలో! సోజో బాళా సోజో!!
బాలా దేవేరీ దేవళేమమైపు బోలేచ!
మారే బాళానె గ్యారీ నీంద్ ఆవేచె!!
హాలో బాళా హాలో! సోజో బాళా సోజో!!

తల్లి పాడే జోలపాటలో బిడ్డను నిద్రపుచ్చడానికి "హాలో బాళా హాలో" అని రాగయుక్తంగా పాడుతూ మొదలు పెడుతుంది. ఉయ్యాలను ఊపుతూ లేదా వళ్లో పడుకున్న బిడ్డను లయబద్ధంగా ఊపుతూ తన రాగాన్ని ఆలపించడం పరిపాటి. 'బాళా' అంటే బాలుడు అని అర్థం. 'హాలో' అనగా జోల పాడడానికి ఉపయోగించే ఊతపదం. 'సోజో' అనగా నిద్దుర పో అని అర్థం. తెలుగులో పాడే జోలపాటకు ఇది దాదాపుగా మరో రూపమే. తెలుగులో "నిద్దురపో బాబూ నిద్దుర పో" అన్నట్లు ఇక్కడ "సోజో బాళా సోజో" అని సంబోధించడం జరిగింది. బాలాజీ దేవాయలంలో గంటలు చప్పుడు చేయడం లేదు, కాబట్టి మా అబ్బాయికి నిద్ర వచ్చేట్లు లేదు. కాని అదే గుళ్లో 'మైకు చప్పుడుకు మా బాబు మంచిగా నిద్రపోతాడు' అంటూ తల్లి తన బిడ్డను జోలపాటతో లాలిస్తుంది. ఇక్కడ ఒక తల్లి తన బిడ్డను లాలించేటప్పుడు బంజారాల ఇష్టదైవమైన 'బాలాజీ'ని తలుచుకొనే తీరు చూస్తే బంజారాలకు 'బాలాజీ' పట్ల భక్తి ఎక్కువని తమ దైనందిన జీవనంలోని వివిధ సందర్భాలలో బాలాజీని స్మరిస్తారని మనకు తెలుస్తుంది.

**ముగింపు**

లంబాడీల సంస్కారాలు విలక్షణమైనవి. అవి చాలా వరకు హిందువుల సంప్రదాయానికి సంబంధించినవి. అయితే కొన్ని మాత్రం తెలుగువారికంటే భిన్నంగా ఉంటాయి. సంతానం కలగకపోతే వ్రతాలు, పూజలు చేయడం బంజారాలల్లో కూడా ఉంది. వీరిలో గర్భిణిస్త్రీలకు సీమంతం చేసే ఆచారం మాత్రం లేదు. సాధారణ పరిస్థితుల్లోనే స్త్రీ ప్రసవించాలని బంజారాలు భావిస్తారు. ఇది ఆధునిక వైద్యశాస్త్రం తేల్చి చెప్పిన సత్యం కూడా. అయితే ప్రసవ సమయంలో వీరు పాటించే ఆచారాలు మాత్రం అనాగరికమైనవి. శుభాశుభ కార్యక్రమాల్లో ఒకరికొకరు తోడుగా ఉండటం తండా ఆచారం. పిల్లల్ని ఉయ్యాలల్లో వేసి వైవిధ్యభరితమైన జోలపాటలు పాడటం వీరి ఆచారం. 'హాలో చాళహాలో' 'సోజో బాళ సోజో'' అనే వీరి పాట తెలుగులోని నిద్దురపో బాబు, నిద్దురపో అను దానికి అనుకరణ.

బంజారా స్త్రీలు పురుషులతోపాటు పొలం పనుల్లో పాల్గొంటారు. జోల పాటల్లో వైయక్తిక రాగద్వేషాలను కూడా జోడించడం విశేషంగా చెప్పుకోవాలి.

**ఉపయుక్త గ్రంథాలు**


1. నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం, జీవన చిత్రణ - ఆచార్య సూర్యాధనంజయ్
2. ఆదివాసీ పదకోశం, సమత-ధాత్రి రీసోర్స్ సెంటర్ ఫర్ ఓమన్ అండ్ చిల్డ్రన్
3. డా. ఎ. చంద్రశేఖరరావు, 'సవర గ్రామర్'.
4. వెంకటరావు. టి, సవరల గిరిజన సరళి
5. సుగాలి సంస్కృతి, భాషా సాహిత్యాలు, సిద్ధాంత గ్రంథం - ఆచార్య ఎం. గోనానాయక్
6. నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం, జీవన చిత్రణ - ఆచార్య సూర్యాధనంజయ్


★★★

భావవీణ
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-4 | April 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*



# భక్తి, జ్ఞాన, వైరాగ్యాల సమ్మేళనం – ధూర్జటి – శ్రీకాళహస్తీశ్వర శతకం

మాచిరాజు దుర్గ
తెలుగు ఉపాధ్యాయిని, అన్నవరపు వారి ఉన్నత పాఠశాల, బాపట్ల.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహము**

ధూర్జటి తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధ కవి. ఆయన విజయనగర సామ్రాజ్యం పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయలు ఆస్థానంలో అష్టదిగ్గజ కవులలో ఒకరు. ఆయనకు శ్రీకాళహస్తి ప్రాంతంతో గాఢమైన సంబంధం ఉంది. భక్తి, శైవతత్వం ఆయన రచనల్లో ప్రధానంగా కనిపిస్తుంది. సులభమైన తెలుగు భాషలో గాఢమైన భక్తిభావాన్ని పొందుపరిచారు. జీవన తాత్వికతను తన గ్రంథాలలో వివరించారు. శివభక్తి ప్రధానాంశముగా శ్రీకాళహస్తీశ్వర శతకం, శ్రీకాళహస్తి మహాత్మ్యము రచించారు.

**కీలకపదాలు :**

అష్టదిగ్గజకవి - భక్తి,, శైవతత్వం, జీవన సత్యాలు, క్షేత్రమహిమ, జ్ఞానసంపద, వైరాగ్యతత్వం, అద్వైత భావం, భక్తి విశ్వాసం, శివనామస్మరణ మహిమ, నైతిక విలువలు, ఆధ్యాత్మిక ఆనందం.

**ప్రవేశిక :**

విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయలు ఆస్థానంలో అష్టదిగ్గజ కవులలో ధూర్జటి కూడా ఒకరు. తెలుగు సాహిత్యంలో భక్తి కవిత్వానికి ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన మహాకవి ధూర్జటి. ధూర్జటి జన్మస్థలం 'శ్రీకాళహస్తి' అని భావిస్తారు. ఆయనకు శ్రీకాళహస్తీశ్వరుడిపై అపారమైన భక్తి ఉండేది. అందువల్ల ఆయన రచనలలో శివుని మహిమ, భక్తి తాత్విక భావనలు ప్రధానంగా కన్పిస్తాయి. ధూర్జటి రచనలలో శ్రీకాళహస్తీశ్వర శతకం ముఖ్యమైనది. ఈ శతకంలో శివుని స్తుతిస్తూ, భక్తి మార్గాన్ని సులభమైన పదాలతో అందంగా వివరించారు. ధూర్జటి కవిత్వంలో ప్రధాన లక్షణాలు సులభత, భావ గంభీరత, తాత్వికత ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ప్రపంచమంతా దేవుని రూపమే అని ఆయన భావించారు.

**విషయ వివరణ :**

ఏ వేదంబు బఠించె లూత, భుజంగంబే శాస్త్రముల్చూచె దానే
విద్యాభ్యాసనంబొనర్చె గరి, చెంచే మంత్రమూహించె,
బోధావిర్భావనిధానముల్ చదువులయ్యా! కావు! మీ పాద సం
సేవాసక్తియె కాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా!

**భావం :**

శ్రీ కాళహస్తీశ్వరా! సాలీడు, పాము, ఏనుగు ఏ వేదాలు, శాస్త్రాలు, మంత్రాలు చదువుకున్నాయి? కానీ శివుడిని గూర్చి ధ్యానించాయి కాదా. మోక్షాన్ని పొందాయి కదా. అలాగే అన్ని ప్రాణులకూ, జా&ఞనము కేవలం చదువుల ద్వారానే కాకుండా భగవంతుని మీద కూడా ధ్యాస, భక్తి ద్వారా కలుగుతుంది.

నిను సేవింపగ నాపదల్ వొడమనీ నిత్యోత్సవం బబ్బనీ
జనమాత్రుండననీ మహాత్ముడననీ సంసారమోహంబు పై
కొననీ జ్ఞానము గల్గనీ గ్రహగనుల్ గుందింపనీ మేలుప
చ్చిన రాని యవి నాకు భూషణమలో శ్రీకాళహస్తీశ్వరా!

**భావం :**

శ్రీ కాళహస్తీశ్వరా! నిన్ను సేవించుటచేత నాకు ఆదపదలు కలుగనీ, నిత్యము ఉత్సవములే సిద్ధించనీ, ఇతరులు నన్ను సాధారణ మానవునిగ అననీ, మహాత్ముడని మెచ్చుకొనునీ, సంసారబంధ విషయమున సుఖభ్రాంతిచే, మోహమే కలుగనీ, వివేకముచే శివతత్వ జ్ఞానమే కలుగనీ, గ్రహచారవశమున బాధలే రానిమ్ము, మేలే కలుగనీ, అవి అన్నియు నాకు అలంకారములే అని భావించుచు వదలక నిన్ను సేవింతును.

శ్రీ విద్యత్కలితా జపంజప మహా జీమూత పాపంబు ధా
రా వేగంబున మన్మనోజ్ఞ సుముదీర్ణత్వంబు గోలోయితిన్
దేవా! మీ కరుణా శరత్సమయ మింతే చాలు, చిద్భావనా
సేవం దామరతంవరై మనియెదన్ శ్రీ కాళహస్తీశ్వరా!

**భావం :**

శ్రీకాళహస్తి అనగా సాలెపురుగు, పాము, ఏనుగులకు అక్కడ వెలసిన ఈశ్వరుడు మోక్షము నిచ్చుటచే ఆ దేవునికి శ్రీ కాళహస్తీశ్వరుడని పేరు వచ్చినది. ఇటువంటి తిర్యక్కులపైకూడ నీ కరుణ వర్షించిన ఓ దేవా! సంసార బంధములనే మబ్బులతో కమ్మిన నా మనసును నీ దయతో రక్షింపుము. నాలో భక్తి భావమనే వెన్నెలను కురిపించి నా హృదయ పద్మమును వికసింప జేయుము. నీ దయను శరత్కాల సమయమున కూడా కొంచమైనా ప్రసరింప చేయుము. ఎందుకంటే శరత్కాలమున స్వచ్ఛమైన సూర్యకిరణాల చేత తామరులు వికసిస్తాయి.

కలధౌ తాద్రియు నస్థిమాలికయు గోగంధర్వమున్ బున్కయున్
బులితోలం భసితంబు బాపతోడవుల్ పోకుండదోబుట్లకై
తొలి నేవారల తోడ బుట్టవు కళాదుల్గల్గె మేలయ్యె నా
సిలువుల్ దూరము చేసికొంటెఱిగియే శ్రీ కాళహస్తీశ్వరా!

**భావం :**

శ్రీ కాళహస్తీశ్వరా! వెండికొండ, ఎముకల దండ, ఎద్దు, పుఱ్ఱె, పులితోలు, బూడిద, పాములహారాలు - ఇవన్నీ నీ

ఆస్తులు, నీకు తోబుట్టువులెవరైనా వుండి వుంటే ఆ సంపదలలో వాళ్ళకు కొంతభాగం ఇవ్వవలసి వచ్చేది, నీకు ముందూ వెనుకా సోదరులెవ్వరూ లేరు. అందువల్ల ఎవ్వరికీ ఏ భాగమూ పంచి ఇవ్వవలసిన అవసరం లేకుండా నీవు ఒకడే పుట్టావు. ఒకవేళ పంచిపెట్టవలసిన పరిస్థితి వుండినా నీకు కొంతలో కొంత మేలే జరిగింది. చంద్రకళలు నిన్ను ఆశ్రయించాయి. చంద్రకాంతులు పంచడానికి వీలు కానివి. మొత్తం మీద నీవు ఒంటరిగా పుట్టి ఈ ఆస్తుల పంపాకాలనే కష్టాలు లేకుండా చేసుకున్నావు.

'శ్రుతు లభ్యాసము చేసి శాస్త్రగరిమల్ శోధించి తత్త్వంబులన్
మతి నూహించి శరీర మస్థిరము బ్రహ్మంబెన్న సత్యంబు గాం
చితి' మంచున్ సభలన్ వృథావచనముల్ చెప్పంగనేకాని, ని
ర్జిత చిత్తస్థిర సౌఖ్యముల్ తెలియరో శ్రీ కాళహస్తీశ్వరా!

**భావం :**

శ్రీ కాళహస్తీశ్వరా! "వేదాలు అభ్యసించాం, శాస్త్రాలు పరిశీలించాం, లోపలి తత్వాన్ని కూడా మా బుద్ధిబలంతో ఆలోచించి తెలుసుకున్నాం.. చివరకు ఈ శరీరం అస్థిరం. బ్రహ్మమొక్కటే సత్యం అని తెలుసుకున్నాము, చూచాము" - అని సభలలో ఉపయోగం లేని ఉపన్యాసాలు ఇవ్వడమే తప్ప ఎవ్వరూ చంచలమైన మనస్సును స్థిరంగా నిలబెట్టి, జయించి, దాని ద్వారా శాశ్వతమైన సుఖాలను తెలిసికొన్నవారే ఎవ్వరూ లేరు.

గతి నీవంచు భజించువార లపవర్గం బొందగానేల సం
తతముం గూటికినై చరింప వినలేదా "యాయురన్నంప్రయ
చ్ఛతి" యంచున్ మొఱ పెట్టగా శ్రుతులు సంసారాంధకారాభి దూ
షిత దుర్మార్గులు గాన గాన బడవో శ్రీ కాళహస్తీశ్వరా!

**భావం :**

శ్రీ కాళహస్తీశ్వరా! నీవే దిక్కని నమ్మి సేవించేవారికి మోక్షం లభిస్తూ వుండగా ఈ మానవులు కొందరు పొట్టకూడి కోసం అనేకపాట్లు పడుతూ తిరుగుతున్నారు. వేదములు 'ఆయుఃఅన్నమ్ ప్రయచ్ఛతి' (ఆయుస్సే అన్నాన్ని ఇస్తుంది) అని బోధిస్తూ వుండడం వారు వినలేదా? సంసారాంధకారంలో పడి మానవులు చెడుమార్గంలో సంచరిస్తున్నారు. అందుకే వారికి ఆ వేదవాక్కులు వినబడటం లేదు.

పవి పుష్పంబగు, నగ్ని మంచుగు, నకూపారంబుభూమీస్థలం
బవు, శత్రుండతి మిత్రుడా, విషము దివ్యాహారమౌ నెన్నగా
నీవనీమండలి లోపలన్ శివశివే త్యాభాషణోల్లాసికిన్
శివ! నీనామము సర్వవశ్యకరమౌ శ్రీ కాళహస్తీశ్వరా!

**భావం :**

ప్రభో, శ్రీ కాళహస్తీశ్వరా! వజ్రాయుధము కూడా పుష్పమాలికమవుతుంది, అగ్ని మంచులా మారుతుంది, సముద్రము నేలగా పరిణమిస్తుంది, అత్యంత శత్రువు మిత్రుడవుతాడు, విషము ఆహారమౌతుంది కదా ప్రభో "శివ శివా" అని సదా నీ నామ సంస్మరణము చేయువానికి సర్వమూ వవ్యమవుతుంది.

కొడుకుల్ పుట్టరటంచు నేడ్తురవివేకుల్జీవనభ్రాంతులై
కొడుకుల్ పుట్టరె కౌరవేంద్రున కనేకుల్ వారిచే నేగతుల్
వడసెం బుత్త్రులులేని యా శుకునకున్ బాటిల్లెనే దుర్గతుల్
చెడునే మోక్షపదం బపుత్త్రకునకున్ శ్రీ కాళహస్తీశ్వరా!

**భావం :**

ఓ శ్రీ కాళహస్తీశ్వరా! వివేకం లేనివారు కుమారుల పుట్టలేదని బాధపడతారు. ఆ కౌరవరాజు దృతరాష్ట్రుడు అనేకమంది కొడుకులను కనలేదా? మరి వారి వలన ఏ గొప్ప స్థితిని పొందాడు? పుత్రులు లేని శుక మహర్షి ఏమైనా చెడిపోయాడా? మోక్షము కుమరులు లేనివారికి సిద్ధించకుడా ఉండదు కదా. కేవలం సాధన వలనే మోక్షము కలుగుతుంది అని భావన.

అంతా మిథ్య తలంచి చూచిన నరుం డట్లౌ టెఱింగిన్ సదా
కాంత ల్పుత్రులు నర్థమున్ తనువు నిక్కంబంచు మోహార్ణవ
భ్రాంతిజెంది చరించుగాని పరమార్థంబైన నీయందు దా
జింతాకంతయు జింత నిల్పడుగదా! శ్రీ కాళహస్తీశ్వరా!

**భావం :**

ఈ పద్యంలో కవి ఈ లోకంలోని అన్ని విషయాలు - ధనం, గౌరవం, శరీరం, సంబంధాలు - ఇవన్నీ తాత్కాలికమైనవి, చివరకు నశించేవి అని చెప్పుతున్నాడు. మనిషి వీటినే నిజమని భావించి మోహంలో పడిపోతాడు.

కాని నిజానికి ఇవన్నీ "మిథ్య" (అసత్యం/అశాశ్వతం) అని గ్రహించాలి. ఈ సత్యానిన తెలుసుకున్నవాడు అహంకారం, లోభం వదిలి, దైవభక్తి వైపు మళ్ళాలి.

ఆలుంబిడ్డలు దల్లిదండ్రులు ధనం బంచున్ మహాబంధనం
బేలా నామెడ గట్టినాడ విక నిన్నేవేళ జింతింతు ని
ర్మూలంబైన మనంబులోన గడుదుర్మోహాబ్ధిలో గ్రుంకి యీ
సీలామాలపుజింత నెట్లుడిపెదో శ్రీ కాళహస్తీశ్వరా!

**భావం :**

ఈ పద్యంలో కవి మనుషుల జీవితంలో ఉన్న కుటుంబ మోహాన్ని గురించి వివరిస్తున్నాడు. మనుషులు తమ భార్య, పిల్లలు (ఆలుంబిడ్డలు), ధనం వంటి వాటిపై అధికమైన ప్రేమ, ఆశలు పెంచుకుంటారు. ఇవే తమకు శాశ్వతమైనవని భావించి వాటికోసమే కష్టపడుతూ, కొన్నిసార్లు ధర్మాన్ని కూడా మరిచిపోతారు.

మనిషితోపాటు వచ్చేదేది అంటే, అతను చేసిన పుణ్యపాపాలే. అందువల్ల మనుషులు ఈ తాత్కాలికమైన బంధాలపై అధిక మోహం పెట్టకుండా, ధర్మమార్గంలో నడుస్తూ మంచి పనులు చేయాలి.

ఈ విషయాన్ని గుర్తుచేస్తూ కవి చివరగా శ్రీకాళహస్తీశ్వరుణ్ణి ప్రార్థిస్తూ, మనుషులను ఈ మోహం నుండి తప్పించి సన్మార్గంలో నడిపించాలని కోరుతున్నాడు.

**ఉపసంహారం :**

ధూర్జటి కేవలం భక్తి కవి మాత్రమే కాదు, గొప్ప తాత్వికుడూ. మనిషి జీవితం పాపపుణ్యాలు, భక్తి ప్రాముఖ్యత వంటి విషయాలను తన పద్యాలలో స్పష్టంగా వివరించారు. ఆయన కవిత్వం ప్రజలకు మార్గదర్శకంగా నిలిచింది. ధూర్జటి తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన మహాకవి. ఆయన రచనలు నేటికి ప్రజలను ఆకట్టుకుంటూ, భక్తిమార్గంలో నడిపిస్తున్నాయి. తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవ అమ్యూలమైనది. తన కవిత్వం ద్వారా శివభక్తిని ప్రజల్లో వ్యాప్తి చేసిన గొప్ప భక్త కవి. శ్రీ కాళహస్తీశ్వర శతకంలోని పద్యాలు చదివితే ఆధ్యాత్మిక ప్రజల్లో వ్యాప్తి చేసిన గొప్ప భక్త కవి. శ్రీ కాళహస్తీశ్వర శతకంలోని పద్యాలు చదివితే ఆధ్మాత్మిక ఆనందం వెల్లివిరుస్తుంది. శ్రీ కాళహస్తీశ్వర శతకంలోని భక్తి, తాత్త్విక భావనలు, జీవన సత్యాలు అందంగా వ్యక్తమయ్యాయి.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీ కాళహస్తీశ్వర శతకం - ధూర్జటి.
2. ఆంధ్ర సాహిత్య చరిత్ర - పింగళి లక్ష్మీకాంతం
3. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥. ద్వా.నా. శాస్త్రి
4. తెలుగులో భక్తి కవిత్వం - డా॥. పిల్లలమర్రి రాములు
5. ధూర్జటి శతక వ్యాఖ్యానం
6. శతక సాహిత్య పరిశీలన

★★★

భావవీణ
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# దాక్షిణాత్య యక్షగానాలు - విహంగ వీక్షణం

**(తంజావూరు, కర్ణాటక, కూచిపూడి యక్షగానాలు)**



**డోలి ఝాన్సీ**
పరిశోధక విద్యార్థిని, నృత్యశాఖ, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం,
సెల్ : 9912500516, Email : dolijhansi6@gmail.com.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహం :**

యక్షగానం దేశ దక్షిణ ప్రాంతంలో మాత్రమే కనిపించే దేశి కళారూపం. శతాబ్దాల తరబడి ఇటు సారస్వతరంగంలోను, అటు సంగీత నాట్య కళారంగంలోను ఒరవడి సృష్టించిన అద్భుత కళారూపమిది. రాజాస్థానాలు మొదలుకొని గ్రామ రచ్చబండల వరకు ప్రదర్శించబడి అత్యంత జనాదరణను సంతరించుకున్న ఏకైక కళారూపంగా కూడా యక్షగానాన్ని ప్రస్తావించడం అతిశయోక్తి కాదు. వాస్తవానికి ఏదైనా కళారూపం సంప్రదాయంలో మొలకెత్తి వినోద ప్రక్రియగా పరిణమించడం జరుగుతుంటుంది. ఈ నేపథ్యానికి భిన్నంగా వినోదమే ప్రధాన ప్రయోజనంగా ఆవిర్భవించిన యక్షగానం క్రమంగా సంప్రదాయంలో చేరడం విశేషంగా చెప్పుకోవచ్చు. ఏదిఏమైనా శతాబ్దాల క్రితం ప్రభువుల అభిరుచి మేరకు రూపుదిద్దుకున్న యక్షగానం సారస్వత రంగంలో ప్రత్యేకతను చాటడమేకాక సంగీత నాట్యరంగంలో కూడా ఒక అపురూప దృశ్య ప్రక్రియగా రాణించిన తీరు చరిత్రగా చెప్పవచ్చు. ఇలా శతాబ్దాలపాటు నేటి చలనచిత్రాలకు మించిన ఖ్యాతిని, జనాదరణను పొందిన ఈ కళాఖండం కాలానుగుణ ప్రభావంమేరకు తన వైభవాన్ని కోల్పోతూవచ్చింది. అయితే తంజావూరు, కర్ణాటక ప్రాంతాల్లో భాగవత మేళంగాను, తలమద్దెలగాను సంప్రదాయంలో భాగమై అస్థిత్వాన్ని చాటుకోవడం విశేషం. కూచిపూడి యక్షగానాలు మాత్రం దాదాపు కనుమరుగయ్యే స్థితిలో ఉన్నాయి. మొత్తానికి ఒక చారిత్రక పాత్ర పోషించిన యక్షగానాల తీరుతెన్నులను స్పృశిస్తూ తంజావూరు మెలట్టూరు భాగవత మేళ నాటకాలు, కర్ణాటక తాళమద్దెల, కూచిపూడి యక్షగానాల తీరుతెన్నులను సంక్షిప్తంగా వివరించడమే ఈ వ్యాస ఉద్దేశం.

**కీలక పదాలు :**

యక్షగానం, తంజావూరు, తాళమద్దెల, కూచిపూడి, భాగవతమేళనాటకాలు

**పరిచయము :**

వ్యక్తి సృజనాత్మకధోరణికి భౌతికరూపమే కళ. సనాతన భారతీయ సంస్కృతిలో ప్రతివృత్తికళగా ప్రస్తావించబడినప్పటికీ ప్రత్యేకంగా సంగీత, నృత్య, నాటక, సాహిత్య, శిల్ప, చిత్రలేఖనాలు మాత్రం లలితకళలుగా పరిగణించబడ్డాయి. ఈ కళల వికాసానికి, మనుగడకు ప్రధాన ఆలంబనం ఇక్కడి మతవ్యవస్థ. అనాదిగా, అనుచానంగా భారతీయ సంస్కృతి అత్యంతశక్తివంతమైన వ్యవస్థగా రూపుదాల్చిన మతాలే కళలు పరిఢవిల్లడానికి ప్రధాన వేదికలయ్యాయి. చరిత్రలో వివిధ మత సిద్ధాంతాలు సంఘర్షణలకు కారణమవుతూ ప్రమాదంగా పరిణమించిన సందర్భాలున్నా, మరోవైపు జాతి సాంస్కృతిక వైభవానికి మౌలిక బీజాలై ప్రమోదకారిగా పరిణమించిన సందర్భాలకు కూడా చరిత్రే నిదర్శనం. ఏదిఏమైనా భారతీయ సంస్కృతికి ప్రతీకలైన కళలు భక్తినివేదన మార్గంలో ఆగమకళలై, జనరంజక దిశలో దేశికళలై విరాజిల్లాయి. క్రమేణా ఆగమ కళలు కనుమరుగు కాగా దేశీరూపాలు మాత్రం అస్తిత్వాన్ని నిలుపుకోగల్గాయి. ఇలాంటి కళారూపాల్లో దక్షిణ భారతదేశంలో అగ్రగామిగా దర్శనమిచ్చే కళారూపమే యక్షగానం.

**యక్షగానం :**

యక్షగానం ఒక సంస్కృత శబ్దం. ఈశబ్దానికి యక్షులుచేసే గానమనీ, యక్షులకై చేసేగానమనీ, యక్షుల్లాగానం చేయడమనీ రకరకాలుగా పేర్కొంటున్నారు. ఏది ఏమైనా యక్షులంటే దైవత్వం కలిగిన దేవతల్లోని ఒకజాతిగా వేదాల్లో ప్రస్తావించబడి వుంది. అలాగే వివిధ పురాణాలు, వేదాలు, లక్షణగ్రంధాల్లో యక్షుల ప్రసక్తి గాంధర్వ విద్యా పరంగాను, వివిధ విశేషణాలపరంగాను కనిపిస్తుంది. మొత్తానికి వేదకాలం నుండి భారతీయ సంస్కృతిలో ప్రత్యేకస్థానాన్ని పొందిన యక్షులు ఆర్షసంప్రదాయంలోనే కాక బౌద్ధ, జైనమతాల్లో కూడా కామస్వరూపులుగాను, ధర్మరక్షాధికులుగాను తమస్థానాన్ని కొనసాగించిన సందర్భాలూ ఉన్నాయి. అలాగే యక్షశబ్దానికి వికృతిగా తెలుగులో కొన్ని పదాలున్నాయి. ముఖ్యంగా జక్కులు, జక్కిణి అనే పదాలు తారసపడతాయి. పూర్వరచనల్లో జక్కిణి పదాన్ని జక్కువీడు (జక్కుల జాతివాడు), జక్కురేడు (కుబేరుడు), జక్కిణి అంటే కుబేరుని భార్య అనే అర్థాల్లో ప్రయోగించారు. అలాగే యక్షిణి విద్య అంటే కట్టిపడేసే విధం అని కూడా అర్థం ఉంది. బహుశా ఈ అర్థాలమేరకే జక్కులన్నా, యక్షులన్నా తమ గాంధర్వవిద్యలతో ప్రజలను కట్టిపడేసే సమర్థులు కాబట్టి, ఈ శబ్దవ్యుత్పత్తి జరిగివుండొచ్చని చెప్పడానికి అవకాశం ఉంది. మొత్తానికి యక్షసంబంధిత నృత్యసంగీతాలే యక్షగానమని చెప్పడంలో దాదాపు ఏకాభిప్రాయం ఉందని చెప్పాల్సి ఉంటుంది. ప్రదర్శనాపరంగా చూస్తే యక్షగానం మౌఖికంగా సాగే గేయప్రక్రియ. అంటే కథాగానంగా ప్రస్తావించాల్సి వుంటుంది. యక్షుల ప్రీత్యర్థం వివిధ కథలను గానయుక్తంగా చెప్పడంవల్ల యక్షగానంగా స్థిరపడి పోయింది. క్రమేణా ఈ గానప్రక్రియే రూపకంగా పరిణమించింది. గేయప్రక్రియ నుండి క్రమేణా రూపకప్రక్రియగా పరిణమించిన వైనంలో యక్షగానాలకు విశేష ఆదరణ లభించింది. ఫలితంగా యక్షగాన రచనలు ఊపందుకున్నాయి. ముఖ్యంగా నాయకరాజుల కాలం తెలుగు యక్షగాన ప్రబంధాలకు స్వర్ణయుగంగా మారింది. కర్ణాటక ప్రాంతంలో యక్షగానాలు దేవాలయాలతో ముడిపడి ఆర్షసంప్రదాయ ప్రయోగంగా మారాయి. ఆర్ష క్రతువుల్లో తాళమద్దెలగానే యక్షగానశైలిని నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. ప్రారంభంలో గానప్రక్రియగా ఉన్న యక్షగానం కాలానుగుణ మార్పులతో ముఖ్యంగా కేరళ రామనాట్టం, కృష్ణనాట్టం ప్రభావంతో ప్రదర్శనాప్రక్రియగా రూపొంది, నేటికీ ఆలయ సంప్రదాయాల్లో భాగంగా ప్రదర్శించబడుతున్నది. కూచిపూడిలో మాత్రం యక్షగానాలు చాలా అరుదుగా ప్రదర్శించబడుతూ క్షీణదశను సూచిస్తున్నాయి.

**తంజావూరు యక్షగానాలు :**

విజయనగర సామ్రాజ్యం పతనాంతరం ఆంధ్ర సారస్వత కళారంగం తంజావూరు తరలివెళ్ళింది. విజయనగర సామంతులైన తంజావూరు నాయకరాజులు సాహితీ, కళాభిమానులగుటచే వలసవచ్చిన వారందరినీ ఆదరించారు.

సాహిత్యాభివృద్ధి, కళాభివృద్ధికిగాను ప్రబంధ, యక్షగానరచనలు చేసి తమపోషణలో ఉన్న కళాకారులచే ప్రదర్శింప చేసారు. వీరి అస్థానంలోని సంగీతజ్ఞులు, నర్తకీమణులు యక్షగానాలను, పదాలను, ప్రబంధాలను ప్రదర్శించేవారు. నాయకరాజుల కాలంలో అనేక యక్షగానరచనలు వెలువడటమేకాక అనేక సంగీత నాట్యశాస్త్ర సంబంధిత గ్రంథాలు కూడా వెలుగు చూసాయి. వీరు శాస్త్రకర్తలను, కళాకారులను పోషించడమేకాక స్వయంగా యక్షగాన రచనలు, శాస్త్రాలు రచించి చిరస్మరణీయులుగా నిల్చిపోయారు. ఈ క్రమంలో అచ్చుతప్ప నాయకుడు, రఘునాథనాయక భూపాలుడు, విజయరాఘవ నాయకులను ప్రముఖంగా చెప్పుకోవాల్సి ఉంటుంది.

17వ శతాబ్ధం చివరి అంకంలో నాయకరాజుల పరిపాలన తర్వాత మహారాష్ట్రులు తంజావూరును పరిపాలించారు. వీళ్ళది భోంస్లేవంశం. నాయకరాజుల తర్వాత మహారాష్ట్ర ప్రభువులు సైతం అదే ఆదరణను కొనసాగించారు. ఈ క్రమంలో మొట్టమొదట చెప్పుకోవాల్సిన పేరు శహాజి మహారాజు. ఇతను దాదాపు ఇరవైకిపైగా యక్షగానరచనలు చేశాడు. ఇతని తర్వాత తుళుజ మహారాజు, శివాజీలుచెప్పుకోదగ్గవారు. శహాజీ నుండి శివాజీ కాలం వరకు జరిగిన యక్షగాన రచనలు నాయకరాజుల కాలానికి భిన్నంగా వైవిధ్యాన్ని సంతరించుకున్నాయి. ముఖ్యంగా నాయకరాజుల కాలంలో ఒక వీధి భాగవత ప్రక్రియగా, నాటక ప్రక్రియగాఉన్న యక్షగానాలు కేళికాసరళినీ అనుసరిస్తూ నృత్యవిశేషంగా రూపుదుద్దికున్నాయి. సాహిత్యపరంగా మార్గ పద్ధతికి బదులు ఇష్టదేవతా ప్రార్థన, గణపతి ప్రవేశం, కౌతం, పుష్పాంజలి, సరస్వతి ప్రార్థన మొదలైన ఆంశాలతో పాటు సూత్రధారులు, పారిపార్శ్వకులు, పాత్రల ప్రవేశం కూడా చోటు చేసుకుంది. అలాగే ప్రదర్శన పూర్తి అయిన తర్వాత పలికే భరత వాక్యానికి భిన్నంగా మంగళపదం, ద్విపదనుపాడి ముగించే విధానం ప్రారంభించారు. అంతేకాక యక్షగానప్రదర్శనలో వచనంగా ఉపయోగించే భాషాసరళి మార్గ నాటక వైఖరిని విడిచిపెట్టి ప్రాంతీయభాషావచనం కూడా చోటు చేసుకుంది. ఇంకా మార్గసంస్కృత నాటకప్రక్రియలో కనిపించే ప్రరోచనలకు బదులు సూత్రధారుడి సంధివచనాలు, ప్రవేశిక దరువులు చేరాయి. ప్రదర్శన ఆద్యంతం సంగీత నృత్యరీతులలో దేశీబద్ధమైన సరళీలు అనుసరించేపదాలు, ఏలలు జోలలు మొదలైనవి చేరాయి.

తంజావూరు యక్షగానాల పరంపరలో అక్కడ స్థిరపడ్డ మేళాల వారిలో మేళట్టూరు భాగవతమేళాన్ని గూర్చి ప్రధానంగా చెప్పుకోవాల్సి ఉంటుంది. ఈ మేళంవారు శిష్టవైదిక బ్రాహ్మణులు. ప్రత్యేకంగా నృసింహజయంతి రోజున యక్షగానాలను ప్రదర్శిస్తారు. వీరిలో చెప్పుకోదగ్గవారు మేళట్టూరు వెంకట్రామశాస్త్రి. వీరు భాగవత మేళనాటకాలకు తగ్గట్టు ప్రహ్లాద చరితం, మార్కండేయచరిత్ర, ఉషాపరిణయం, హరిశ్చంద్ర నాటకం, రుక్మాంగదచరిత్ర, హరిహరలీలావిలాసం, సీతాపరిణయం, రుక్మిణివివాహం, కంసవధ, దృవచరితం, సతీసావిత్రినాటకం, గొల్లభామ నాటకం లాంటి పన్నెండు యక్షగానాలను రచించారు. మొత్తానికి నాయకరాజుల కాలంలోను, మహారాష్ట్రులకాలంలోను తెలుగుయక్షగాన వాఙ్మయం ఇటు సాహితీపరంగాను అటు ప్రదర్శన పరంగాను విశేషంగా రాణించిందని చెప్పాల్సి ఉంటుంది.

**కర్ణాటక యక్షగానాలు :**

కర్ణాటక రాష్ట్రంలో యక్షగానం విశేషరంగస్థల కళాస్వరూపంగా ప్రచారంలో ఉంది. దక్షిణ భారతదేశంలో ప్రచారమైన యక్షగానాలతో పోల్చుకుంటే విలక్షణ ఆహార్యంతో సజీవతను నిలుపుకున్న యక్షగానంగా కర్ణాటక యక్షగానాన్ని ప్రస్తావించవచ్చు. చారిత్రాత్మకంగా కర్ణాటక యక్షగానాలకు 400 ఏళ్ళ చరిత్ర ఉందని చెబుతారు. పరిశోధకులప్రకారం 16వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్య రాజధానిగా ప్రస్తుతబళ్ళారి ఉండేది. బళ్ళారిలోని సోమసముద్రం లక్ష్మీనారాయణ దేవస్థానంలో లభించిన 18 జూన్ 1556 నాటి శిలాశాసనంలో ఇద్దరు బ్రాహ్మణులు ప్రదర్శించినట్టు తాళమద్దెల ప్రసక్తివుంది. యక్షగానం విశేష ప్రభావం మేరకు నేటికి బళ్ళారి ప్రాంతంలో తోలుబొమ్మలాటను సైతం యక్షగాన కేళికలుగానే వ్యవహరిస్తున్నారు. తాళమద్దెల అనేది కర్ణాటక యక్షగాన ప్రక్రియలో అతిప్రాచీనమైందిగా

పరిగణించబడుతోంది. 1564 కాలానికి చెందిన వారంభలి విష్ణుచే రచించిబడ్డ విరాటపర్వాన్ని అతిప్రాచీన తాళబద్దెల రచనగా ప్రస్తావిస్తున్నారు. ఇదేకాక బాణాసురకెళిగ, ఇంద్రకెళిక అనే మరో రెండు యక్షగానాలను కూడా వారంభల్లి విష్ణు రచించినట్లు తెలుస్తోంది. అలాగే ధర్మస్థల యక్షగాన పరిశోధన కేంద్రం వారు సేకరించిన 1600-1700 ప్రాంతానికి చెందిన తాళపత్ర గ్రంథాలను కూడా తాళమద్దెల ప్రదర్శనకు సంబంధించినవిగా చెబుతున్నారు. మొత్తానికి శిలాశాసనాధారాలను, ప్రాచీన రచనలను బట్టి తాళమద్దెల యక్షగానప్రక్రియ దాదాపు నాలుగు వందల సంవత్సరాలకు మించిన ప్రాచీన తకలిగి ఉందని చెప్పవచ్చు. కర్ణాటక యక్షగానాల ప్రదర్శనారీతులు ఒక్కటైనప్పటికీ దశావతార ఆట, బయలాట, సన్నాట, దొడ్డాట, బడుగుతెట్టు, తెంకుతెట్టు, ముడలపాయ, పడువలపాయ మొదలైన పేర్లతో ప్రచారంలో ఉన్నాయి.

దక్షిణ భారత యక్షగానాల్లో సజీవతను నిలుపుకున్న కర్ణాటక యక్షగానాలు కేవలం వినోదాత్మక ప్రక్రియలు కావు. ప్రజల భక్తి విశ్వాసాలతో ముడిపడి, వారి జీవనంలో భాగస్వామ్యమైన సంప్రదాయిక క్రతువుగా పేర్కొనవచ్చు. అసలు ఇక్కడి ప్రజల మతవిశ్వాసాలు వెన్నుదన్నుగా లేకపోతే బహుశా ఈ కళాప్రక్రియలు దాదాపు అంతరించిపోయేవి. కన్నడ ప్రజల్లో తమకు ఏదైన కష్టం కలిగినపుడు, దాని పరిహారంగా తమదగ్గరి క్షేత్రాన్ని సందర్శించి దశావతార ఆటను ఆడిస్తామని మొక్కుకుంటారు. ఈ మొక్కు బడినే కన్నడభాషలో హరిక్కె అంటారు. ఈ హరిక్కె కోసం యక్షగాన ప్రదర్శనకు కావాల్సి నఖర్చును దేవస్థానానికి చెల్లిస్తారు. ఆమొత్తం దేవస్థానం ఆధీనంలోని యక్షగాన మేళం వారికి చెందుతుంది. వీరు ఏకుటుంబం వారు హరిక్కే కట్టారో వారి ప్రాంతానికి వెళ్ళి యక్షగానాన్ని ప్రదర్శిస్తారు. ప్రతిసంవత్సరం నవంబర్నుండి జూన్వరకు ఇలాంటి ప్రదర్శనలు జరుగుతుంటాయి. మొత్తానికి దక్షిణభారత దేశంలో ఒక్క వెలుగు వెలిగిన యక్షగానం కర్ణాటకరాష్ట్రంలో మాత్రం ప్రజల భక్తివిశ్వాసాలతో ముడిపడి అస్తిత్వాన్ని నిలబెట్టుకుందని చెప్పాల్సి వుంటుంది.

**కూచిపూడి యక్షగానాలు :**

తెలుగు ప్రాంతంలో 14 వశతాబ్దంనాటికీ యక్షగాన రచనల ఉనికి ఉన్నా ప్రదర్శనలకు నోచుకుంది మాత్రం అధునిక కాలంలోననే చెప్పడానికి అవకాశముంది. ముఖ్యంగా కూచిపూడి కళాకారులు వివిధ ప్రక్రియల్లో నిష్ణాతులైనప్పటికీ యక్షగానమనే పేరుతో ప్రదర్శన చేపట్టింది 19వ శతాబ్దంలో మాత్రమేనని తెలుస్తోంది. కూచిపూడి సంప్రదాయంలో యక్షగానాల ప్రస్తావనకు సంబంధించి వివిధ అభిప్రాయాలు కనబడుతున్నాయి.కొందరు మేలట్టూరు వెంకట్రామయ్య శాస్త్రిని దృష్టిలో పెట్టుకొని విజయనగర సామ్రాజ్యం పతనానంతరం కూచిపూడి భాగవతులు తంజావూరు వలస వెళ్ళి నాయకరాజులను ఆశ్రయించి యక్షగానాలను తమదైన బాణీలో ప్రదర్శించే వారని చెబుతారు. అయితే కూచిపూడి కళాకారుడిగా చెప్పుకుంటున్న వెంకట్రామయ్యశాస్త్రి రాజాశ్రితుడు కాదనే విషయం గమనార్హం. ఇంకొందరు తంజావూరు నుండి యక్షగానాలను కూచిపూడి తీసుకొచ్చారని చెబుతారు. దీనికి ఎటువంటి ఆధారాలు లభ్యంకాలేదు. ఇక దక్షిణాదిలో యక్షగానాలను లభించిన విశేష ఆదరణనే పథ్యంలో కూచిపూడి భాగవతులు 19 వ శతాబ్దం పూర్వార్థంలో యక్షగానమనే పేరుతో తొలి ప్రదర్శన చేపట్టిన వైనాన్ని ప్రస్తావించిన మరికొందరి అభిప్రాయం మాత్రం గమనించదగినదిగా ఉంది.

పరిశోధకులు, కూచిపూడి కళాకారుల ప్రకారం 1820-30 మధ్యకాలంలో అంటే 19వశతాబ్దం ప్రారంభంలో తొలి యక్షగానం ప్రహ్లాద ప్రదర్శించినట్లు తెలుసోంది. కూచిపూడి భాగవతులు తమ ప్రదర్శనలతో సంచరిస్తూ సింహపూరి పట్టణానికి చేరిన సందర్భంలో వేదాల తిరునారాయణా చార్యులు అనే యక్షగాన రచయితతో పరిచయం కల్గింది. ఆ రచయిత తాను రచించిన భక్తప్రహ్లాద యక్షగానాన్ని కూచిపూడి బాణీలో ప్రదర్శించమని కోరారట. ఆయన కోరికప్రకారం భాగవతులు ముఖ్యంగా మహంకాళి నారాయణప్ప, భాగవతుల రాజయ్య, హరిరామనాథం,

హరిపెదపాపయ్య, వేదాంతం జనార్థనయ్య, భాగవతుల రామదాసు మొదలగు కూచిపూడి భాగవతులు యక్షగాన రచనను ప్రదర్శనానుగుణంగా మల్చుకొని ప్రదర్శించారని తెలుస్తోంది. తరువాత చింతా వెంకట్రామయ్య గారి అధ్వర్యంలో ప్రహ్లాద మలియక్షగానం గాసింహపూరిలోనే ప్రదర్శించబడ్డట్టుచెబుతున్నారు. ఏదిఏమైనా కూచిపూడి యక్షగానాల్లో చింతా వెంకట్రామయ్య కృషి ఎక్కువగా కనబడుతున్నది. మొత్తానికి ఒకప్పుడు విశేష జనాదరణను సంతరించుకున్న కూచిపూడి యక్షగానాలు క్రమంగా ప్రదర్శనలకు దూరమైనట్టు కనిపిస్తుంది. అక్కడక్కడా ప్రదర్శన ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ నిడివి, నాణ్యతలో జనాలను ఆకర్షించలేకపోతున్నాయని చెప్పవచ్చు.

**ముగింపు :**

దక్షిణ భారతదేశంలో కేరళ మినహా మిగిలిన ప్రాంతాల్లో వివిధ సంప్రదాయాలను శాస్త్రాలను ఆచార వ్యవహారాలను జోడించుకోని పరిపూర్ణరూపకంగా అవిర్భవించిన యక్షగానాలు 18వ శతాబ్దం నుండి 20వ శతాబ్దం పూర్వార్థం వరకు విశేషంగా ప్రదర్శించబడ్డాయి. అయితే 20వ శతాబ్దంలో రాజకీయ పరిస్థితులు, చలన చిత్రాల ప్రభావం మేరకు తెలుగు ప్రాంతంలో దాదాపు కనుమరుగైంది. అయితే కర్ణాటకలో మాత్రం మత సంప్రదాయకళగా పరిణమించడంతో నేటికీ ఆదరణ కొనసాగుతోంది. అలాగే తమిళనాడు తంజావూరులో కూడ ఆలయసంప్రదాయంగా మేలట్టూరు భాగవత నాటకరూపంలో ప్రత్యేకసందర్భాల్లో మాత్రమే ప్రదర్శించబడుతోంది.

శతాబ్దాల పాటు దేశంమొత్తం మీద కేవలం దక్షిణాదిలో మాత్రమే కనిపించే ఈ కళారూపం సంక్షిప్త ముఖచిత్రమిది ఇక్కడ గతవైభవంతో పాటు క్షీణదశకు చేరుకున్నవైనాన్ని కూడా గుర్తించవచ్చు. భాగవతమేళాలు, కర్ణాటక యక్షగానాలు భక్తిసంప్రదాయాల వెన్నుదన్నుతో మాత్రమే అస్తిత్వం కలిగి ఉన్నాయి. అయితే ప్రపంచీకరణ నేపథ్యంలో ఆయా సంప్రదాయాలు సడలిపోయే పరిణామాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరముంది. ముఖ్యంగా ఆధునిక సాంకేతికత వల్లఒకవైపు అరచేతిలో వైకుంఠం అందుకునే సౌలభ్యం ఏర్పడినప్పటికీ మరో వైపు ప్రాచీన కళాఖండాలు పతనమయ్యే ప్రమదాన్ని కూడా గమనిస్తే పరిశోధనల అవశ్యకత తెరమీదికొస్తుంది. ఈ మేరకు దక్షిణాదిలో అగ్రగామిగా ప్రచారమైన ఈ దేశీకళాఖండం వైభవాన్ని, స్వరూపస్వభావాన్ని మరింతలోతుగా పరిశోధించి అక్షరరూపంలో పదిలపర్చాల్సిన అవసరంఎంతైనా ఉంది.

**ఉపయుక్త గ్రంథసూచిక :**


1. ఉమారామారావు, శహాజీయక్షగానప్రబంధాలు, కాత్యాయినిఅర్చ్బుచురణ, 2006.
2. కుసుమాంబ కె, నాయకరాజులచరిత్రకళాసంస్కృతి,శ్రీసాయిప్రెసెస్, హైదరాబాద్, 2001
3. రజనికాంతరావు, బాలాంత్రపు, - ఆంధ్రవాగ్గేయకారచరిత్రము 1,2 తెలుగువిశ్వవిద్యాలయం
4. రాధాకృష్ణమూర్తి, మిక్కిలినేని, ఆంధ్ర నాటకరంగచరిత్ర, శ్రీవేంకటేశ్వరప్రింటర్స్, మద్రాసు, 1997.
5. రామకృష్ణనటరాజ, దాక్షిణాత్యుల నాట్యకళాచరిత్ర, పేరిణి ఇంటర్నేషనల్, హైద్రాబాద్, 1968.
6. రామానాథం, చింతా, కూచిపూడి నాట్యకళ, అఖిల భారత కూచిపూడి నాట్యకళామండలి, కూచిపూడి, రుధిరోద్గారి సంవత్సరము.
7. శ్రీలక్ష్మీనరసింహం, చింతలపాటి, కూచిపూడి భాగవతులు, త్రివేణి ప్రెస్, మచిలీపట్నం, 1983.
8. వెంకటరామనరసింహ, కాకర్ల, యక్షగానములు (తంజావూరు), ఆంధ్ర విశ్వకళాపరిషత్వారి ప్రచురణలు, వాల్తేరు, సంపుటములు, 1973 (2),1974 (3), (4).
9. శ్రీరామ అప్పారావు, పోణంగి, - తెలుగు నాటక వికాసము, నాట్యమాలా ప్రచురణ, సికింద్రాబాదు, 1967.


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Link : https://www.bhavaveena.com/

# తెలుగు పంచ మహాకావ్యాలలో స్త్రీ పాత్రలు



నడింపల్లి నీరజ
తెలుగు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.A.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహం :**

ప్రాచీన భారతీయ సాహిత్యంలో ఎన్నో రసవత్తరమైన ఎన్నో ప్రక్రియలు వెలువడ్డాయి. సంస్కృత సాహిత్యాన్ని అనుసరిస్తూ మన తెలుగు సాహిత్యాలలో కూడా అనేక ప్రక్రియలు వెలువడ్డాయి. కావ్యం, నాటకం, పురాణం, కథా కావ్యాలు, ప్రబంధాలు మొదలైన ఎన్నో ప్రక్రియలు సంస్కృతాన్ని అనుసరించి వచ్చినవే. ఈ ప్రక్రియలో ఆనంద, ఉపదేశాలే ధ్యేయంగా కవులు తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరిచేలా రచనలు చేశారు. ప్రాచీన కవులు ఎక్కువగా తమ భావాలను ప్రబంధాలు ద్వారా తెలిపారు. ఎందుకంటే కావ్యాలు కాంత వాక్కుల వలె సున్నితంగా బోధించినట్టు ఉంటాయి కనుక. ప్రబంధాలలో కథ, దాని నడవడిక, ఆచార వ్యవహారాలు విధానాలు బట్టి ఐదు ప్రబంధాలను ప్రధానంగా తెలిపారు. జి. నాగయ్య గారి ప్రకారం 1.మను చరిత్ర, 2. వసు చరిత్ర, 3. ఆముక్త మాల్యద, 4. పాండురంగ మాహాత్మ్యం, 5.శృంగార నైషధం. ఈ ఐదు ప్రబంధాలను కలిపి పంచ మహాకావ్యాలు అంటారు. తెలుగు ప్రబంధం సాహిత్యంలో తెలుగింటి ఆడపడుచులు ఎలా ఉండాలి, వారి తెలివితేటలను, వారి వస్త్రధారణ గురించి మన కవులు నేర్పుతో వర్ణించారు.

**కీలకాంశాలు :**

కామ కళ, కంకణాలు, అగ్నిహోత్రం,శుక్తిమతి, కోల హాలుడు, శృంగార నైషదం,

ప్రాచీనకాలం నుండి ఆధునికకాలం వరకు ప్రబంధ సాహిత్యం విశిష్టంగా వెలువడ్డాయి. ఈ పంచ మహా కావ్యాలు అనే సాంప్రదాయం సంస్కృతం నుండి వచ్చినా తెలుగులో కూడా చిరస్థాయిగా నిలిచిపోయే కీర్తిని సంపాదించుకున్నాయి. ప్రాచీన పంచ మహా కావ్యాలను ఆదర్శంగా తీసుకొని ఆధునిక పంచ మహాకావ్యాలు కూడా నేడు వెలువడ్డాయి. దీనినిబట్టి ఈ ప్రక్రియ తెలుగు సాహిత్యంలో ఎంత దేదీప్యమానంగా వెలుగుతుందో మనకి తెలుస్తుంది. ప్రబంధాలలో స్త్రీ అంగాంగ వర్ణనే అని భ్రమపడేవారు. కానీ మన సాహిత్యంలో స్త్రీలు శృంగార

వస్తువుగానే కాక సంగీత పరిజ్ఞానం కలిగిన వారిగా, తెలివైనవారిగా, యుద్ధమునందు నేర్పు కలవారిగా, సహనవతిగా, స్నేహితురాలిగా స్త్రీని ప్రధానంగా ధైర్యవంతురాలిగా వర్ణించారు. నేను ప్రస్తుతం "తెలుగు పంచ మహాకావ్యాలలో స్త్రీ పాత్రలు" అనే అంశాన్ని వ్యాసంగా తీసుకున్నాను.

**విషయం :**

కావ్యాలలో స్త్రీ పాత్రలను వర్ణించడం కవులకి కత్తి మీద సాము లాంటిది అని చెప్పవచ్చు. ఎందుకంటే స్త్రీని సామాన్యమైన బలహీన పాత్రలా కాకుండా దానికి విశిష్ట లక్షణాలు కలిగిన, ధీరురాలైన ఒక శక్తి రూపంగా కవులు వర్ణించారు. కవి మొదట తన ఊహలలో ఆ పాత్రను చిత్రించి దానిని కావ్యాలలో అద్భుతంగా మలిచి తన రచనాపాటవాన్ని సమాజానికి చూపించాడు. కవులు తమ రచన ద్వారా నేటి సమాజానికి ఉపయోగపడే విధంగా వందల సంవత్సరాల క్రితమే ముందుగానే ఊహించి రాశారు. నా పరిశోధన అంశం ద్వారా కావ్యాలలో స్త్రీలను ఎలా వర్ణించారు, నేటి సమాజానికి ఆ పాత్రలు ఎలా సరిపోతాయి అనే విషయాన్ని ఈ వ్యాసం ద్వారా తెలియజేయాలని అనుకుంటున్నాను.

**మను చరిత్ర :**

మను చరిత్ర తెలుగు పంచ మహాకావ్యాలలో మొదటి స్థానం దక్కించుకుంది. ఎందుకంటే పంచ మహాకావ్యాలలో సర్వ లక్షణాలు కలిగిన మొదటి కావ్యం మను చరిత్రగా చెప్పవచ్చు. ఈ మను చరిత్రను అల్లసాని పెద్దన్న గారు రాశారు.

**వరూధిని పాత్ర :**

మనుచరిత్రలో వరూధిని కామకళ అందు అరితేరినది అనుటకంటే సంగీతజ్ఞానం కలిగిన గొప్ప సంగీత విద్వాంసు రాలు అని చెప్పవచ్చు. ప్రవరుడు ఆమెను తిరస్కరించినప్పటికీ ఆమె ప్రవరుడిని మనసు యందు తలుచుకుంటూ విలపించింది. మాయాప్రవరుడి రూపంలో వచ్చిన గంధర్వుడు అంతకుముందు చాలాసార్లు వరూధిని చేరాలను కున్నాడు. కానీ వరూధిని అతనిని అంగీకరించలేదు. ఇక్కడ ఆమె ప్రవరుడిని ఇష్టపడింది వేరొకరిని ఇష్టపడలేదు.

ప్రౌఢిఁ బలికించు గీత ప్రబంధములక్రఁ
గమ్రకరపంకరుహ రత్న కటక ఝణఝ
ణధ్వనిస్ఫూర్తి తాళమానములు గొలుప
నింపు దళుకొత్త వీణ వాయింపుచుండి.

పై పద్యం ద్వారా వరూధిని ఒక మంచు అరుగుపై కూర్చొని అందమైన ముఖం కలిగినదై, రత్న కంకణాలు చేతులకు ధరించి, ఝణఝణ అనే గాజుల చప్పుడు చేస్తూ వీణను వాయిస్తుంది. దీని ద్వారా వరూధిని అందమైనదని అలాగే ఆమె చేతులు పద్మాల వలె మృదువైనవని. ఆమె సంగీతంలో దిట్ట అని అర్థమవుతున్నది. అలాగే వరూధిని ప్రవరుడితో జరిపిన సంభాషణ ఆధారంగా ఈమె సంభాషణ జరపటంలో నేర్పరి అని చెప్పవచ్చు. నేటి యువతకి ఇతరులతో ఎలా మాట్లాడాలో తెలియక సరైన సంబంధాలు లేక ఏకాకి జీవిలా జీవిస్తున్నాడు. కావ్యాలలో కవులు ఇతరులతో ఏ విషయాన్ని ఎలా సంభాషిస్తే మన పనులు పూర్తవుతాయి అనేది ఈ పాత్రల ద్వారా తెలియజేస్తున్నారు.

ఈ వరూధిని ప్రవరుడిని ఎలా అయినా తనకు అనుకూలంగా మార్చుకోవాలని అనుకుంటుంది. కానీ ప్రవరుడు పరస్త్రీలు తల్లులతో సమానమని చెప్పి అగ్నిహోత్రం సహాయంతో అక్కడి నుండి తన ఊరికి వెళ్ళిపోయాడు. ప్రవరుడు ఇంటికి వెళ్ళిపోయిన తరువాత వరూధిని ఛీ!ఛీ! నాకు ఈ జన్మ ఎందుకు! మేము దేవతలమైనాము మాకు చావే లేదు! అని విరహంతో దుఃఖిస్తుంది. ప్రస్తుత సమాజంలో కూడా వరూధిని వంటి మనుషులు ఉంటారు. మనిషి

తమ పంచేంద్రియాలు నిగ్రహించుకునే విధంగా జీవించాలని, అలా జీవించకపోతే జీవితంలో చాలా నిర్వుహానికి గురి అవుతారు అని కవి ఈ వరూధిని పాత్ర ద్వారా మనకు తెలియజేశాడు.

స్వరోచి పెళ్లి చేసుకున్న ముగ్గురూ కూడా ఏదో ఒక విద్య యందు సిద్ధహస్తులు. మనోరమ అస్త్రవిద్య యందు, విభావసి మృగవిద్య, కళావతి పద్మినీ విద్యల యందు నేర్పరులే. స్త్రీలు ఏ విద్య అందు కూడ తక్కువ కాదు అని, అన్నింటిలో పురుషులతో సమానమే అని కవి భావించారు. వీళ్ళు తమ శక్తులు ఇవ్వడం వల్లనే ఈ కథ మలుపు తిరిగింది. మనోరమ అస్త్రవిద్య స్వరోచికి ఇవ్వడం వలన అతడు ఆ ఇందివరాక్షసుడ్ని గెలిచి ఆయుర్వేద విద్యను పొందడమే కాకుండా అతని కుమార్తె అయిన మనోరమను వివాహం చేసుకున్నాడు. ఇందీవరాక్షసుడు ఇచ్చిన ఆయుర్వేద విద్యతో విభావసి, కళావతిలకు ఉన్న కుష్టి రోగాన్ని నయం చేసి వారిని వివాహం చేసుకున్నారు. వారు తమకు ఉన్న విద్యలను స్వరోచికి ఇచ్చారు. ఈ ముగ్గురు తమ శక్తిని స్వరోచికి ఇవ్వడం వలన కథ మలుపు తిరిగింది. కవి ఒక విషయాన్ని కావ్యం మొదట ఎక్కడో చెప్పి, దానిని మలుపు తిప్పే చిన్న విషయాన్ని కావ్యం చివరన ఎక్కడో చెబుతాడు. అల్లసాని పెద్దన స్త్రీ పాత్రను తీర్చిదిద్దడంలో అందవేసిన చేయి అని చెప్పవచ్చు.

**వసు చరిత్ర :**

వసుచరిత్ర తెలుగు పంచ మహా కావ్యాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇది రామరాజభూషణుచే రచింపబడినది. దీనిలో వసురాజు గిరిక ప్రేమ గురించి కవి ఎంతో అద్భుతంగా వివరించాడు.

**శుక్తిమతి :**

శుక్తిమతి(నది)ని కోలాహలుడు (పర్వతం) ప్రేమించాడు. ఎన్ని విధాలుగా చెప్పినా శుక్తిమతి తన ప్రేమ అంగీకరించక పోయేసరికి శుక్తిమత్తిని బలవంతంగా లొంగ తీసుకోవాలని ప్రయత్నించాడు. కానీ శుక్తిమతి కోలాహలుడిని తిరస్కరించి అక్కడ నుండి పక్కకు వెళ్లిపోయింది. దీనిని బట్టి శుక్తిమతి గుణవంతురాలు అని తెలుస్తుంది.

సీ॥ నిలువెల్ల నీచాతినీచోపసరణంబు,
ప్రకృతి యెల్లను జాడ్యపరిణతంబు,
పెం పెల్ల నియతగాంభీర్యమానవిహీన,
మంతరం బెల్లఁ బంకావిలంబు,
జీవనం బెల్ల నంచితబుద్బుద ప్రాయ,
ముదయ మెల్లను దుర్దినోన్ముఖంబు,
గతు లెల్లఁ గుటిలప్రకారకారణము, లు
త్సేకంబు లెల్ల భంగాకులములు,

తే॥ నిలుకడ హుళిక్కి, తావులు పాలసు వల్చు
నిట్టి మా బోంట్లతోఁ జెల్మి యెట్లు పొసఁగు
నచలుతోత్తుంగధైర్యున కలఘుమతికి,
ననఘగతికి, నభంగశీలునకు నీకు.

ఈ పద్యంలో శుక్తిమతి నది కనుక అచంచలమైనది. ఎప్పుడు కదులుతూనే ఉంటుంది. కనుక స్థిరమైన ఉన్నతమైన మీతో స్నేహం నేనెలా చేయగలను. నీ స్థాయికి నేను తగను అని కవి శుక్తిమతి కోలాహలుల సహజ స్వభావమైన నది పర్వత వర్ణన చాలా చక్కగా అద్భుతంగా వర్ణించారు. శుక్తిమతి గొప్ప వ్యక్తిత్వం కలది. కనుక కోలాహలున్ని ఎక్కడా కూడా కించపరచకుండా సున్నితంగా తన మాటల నేర్పుతో తిరస్కరించింది. ఇక్కడ ఆవిడ

సంభాషణ చాతుర్యం తెలుస్తుంది. "ఆకలి వేస్తుంది అంటే శత్రువుకైనా అన్నం పెట్టాలి" అని మానవతా విలువలు కలిగిన సాంప్రదాయంలో జీవిస్తున్నాము మనం. నేటి తరానికి మంచి, చెడ్డలు తెలియక ఎదుటి వ్యక్తితో ఎలా మాట్లాడాలో తెలియక అమర్యాదగా ప్రవర్తిస్తున్నారు. ఎదుటివారు మంచివారు కానీ చెడ్డవారు కానీ వారిని గౌరవభావంతో మాట్లాడాలి అని ఈ పాత్ర తెలియజేస్తుంది. గౌరవభావంతో మాట్లాడటం వల్ల మనపై వారికి గౌరవం పెరుగుతుందే కానీ తగ్గదు. కవులు స్త్రీ పాత్ర ద్వారానే ఈ విషయం చెప్పడానికి కారణం ఏమిటంటే "ఇంటికి దీపం ఇల్లాలు" అనే సామెత ద్వారా మన ఇంటికి మంచి పేరు రావడానికి అయినా చెడ్డ పేరు రావడానికి అయినా స్త్రీలపై ఆధారపడి ఉంటుంది కనుక స్త్రీలు సంభాషణ నైపుణ్యం కలిగి ఉండాలని ఈ పాత్ర ద్వారా కవి చక్కగా తెలిపారు.

కోలాహలుడు సాధారణమైనవాడు కాదు. సంగీత సాహిత్యాలతో ఎప్పుడు విలసిల్లేవాడు. అంత గొప్పవాడు అయినప్పటికీ శుక్తిమతికి ఇష్టం లేదు కనుక అక్కడ నుండి వైదొలిగిపోయింది. అలాగే తనని బలాత్కరించిన కోలాహలుడితో తన పిల్లల కోసం సర్దుకొని జీవించింది. దీనిని బట్టి ఇష్టం లేకపోయినప్పటికీ పిల్లలు పుట్టారు కనుక వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కలిసి జీవించింది. ప్రస్తుత సమాజంలో కుటుంబంలో చిన్నచిన్న తగాదాల వల్ల బంధాలను తెంచుకొని పిల్లలను, తల్లిదండ్రులను ఏకాకులుగా వదిలేసి వెళ్ళిపోతున్న నేటి సమాజానికి శుక్తిమతి పాత్ర ద్వారా జీవితంలో వచ్చే చిన్న చిన్న సమస్యలను ఎలా తొలగించాలి, ఎలా సర్దుకుపోవాలి, అసలు ఎలా జీవించాలి అనే విధంగా ఆదర్శవంతంగా కవులు వర్ణించారు.

**గిరిక :**

వసు చరిత్రలో గిరిక ప్రధాన స్త్రీ పాత్ర. ఈమె వసుమహారాజు యొక్క భార్య. గిరిక ఎంతో సౌందర్యవతి, వినయశీలి, సద్గుణ సంపన్నురాలు. ఆమె తన భర్తపై అపారమైన ప్రేమ, భక్తి కలిగిన పతివ్రత స్త్రీగా మనం చెప్పవచ్చు. కవి గిరిక పాత్ర ద్వారా స్త్రీలలో ఉండవలసిన పతివ్రత ధర్మం, వినయం, శీలం వంటి సద్గుణాలను తెలియజేశాడు. నేడు కొంతమంది స్త్రీలు తమ అందం పాడవుతుందని పనులు చేయక పిల్లను సరిగ్గా చూసుకోక భర్తలను ఇబ్బంది పెడుతున్నారు. నేటి సమాజంలో చాలామందికి ఇరుగుపొరుగువారే ఒకరికొకరు తెలియక ఫోన్లలో జీవితాన్ని గడుపుతున్నారు. దీనివల్ల ఎవరు ఎవరికి తెలియక విషమ కాలంలో ఒకరికొకరు సహాయం చేసుకోకుండా జీవిస్తున్నారు. గిరిక పాత్ర ద్వారా భర్తకు అనుకూలంగా జీవించడం వలన ఆమెకు పేరు ప్రఖ్యాతలు వచ్చాయి. అలాగే తన చెలికత్తెలు, ఇతరులు ప్రేమను కూడా గిరిక పొందింది. ఎప్పుడు ఇతరులతో ప్రేమపూర్వకంగానే మాట్లాడాలి ఇలా జీవించడం వలన వారు మనని అభిమానిస్తారు అనే విషయాన్ని ఈ పాత్ర ద్వారా తెలుసుకున్నాము.

**ఆముక్త మాల్యద :**

శ్రీకృష్ణదేవరాయలచే రచింపబడినది ఆముక్తమాల్యద. నాయిక ఆధారంగా వచ్చిన మొదటి కావ్యం ఆముక్తమాల్యద. ఆముక్తమాల్యద అంటే అలంకరించుకోబడిన పూల దండలు ఇచ్చునది అని అర్థం. ఇందులో రాజునీతి, భక్తి, సాహిత్య విషయాలు ఎన్నో చర్చించబడ్డాయి. ఇందులో ప్రధాన పాత్ర గోదాదేవి.

> తెల్గుఁగ దేల యన్న, దేశంబు దెల్గుఁ, గేను
> దెల్గుఁగు, వల్లభుండఁ, దెల్గుఁగొ కండ,
> యెల్లనృపులు గొలువ నెఱ్ఱుఁగవే బాసాడి,
> దేశభాషలందుఁ దెల్గుఁగు లెస్స.

ఈ పద్యంలో శ్రీకృష్ణదేవరాయలు తెలుగు భాష గొప్పతనాన్ని ఎంతో గొప్పగా చెప్పాడు. దేశ భాషల్లో తెలుగే గొప్ప అని తెలుగు భాష యొక్క ఔన్నత్యాన్ని చక్కగా తెలిపాడు.

**గోదాదేవి :**

గోదాదేవి భూదేవి యొక్క అవతారముగా భావిస్తాము. ఈమె ఎప్పుడు భగవంతుని ధ్యానిస్తూ భగవంతునిపై ప్రేమను పెంచుకున్నది. ప్రతిరోజు పొద్దున్నే లేచి స్నానం చేసి శ్రీరంగనాథస్వామికి చెంగల్వ పూలదండను సమర్పించేది. ఆమె నిత్యము భగవంతుడి గురించి ధ్యానించేది. ఈ పాత్ర భక్తికి పరాకాష్టగా కవి వర్ణించాడు. చివరిలో గోదాదేవి శ్రీరంగనాథునిలో ఐక్యమయింది. శ్రీరంగనాథుని వివాహమాడుతుంది. ఈ పాత్రలు కవి ఎంతో మృదుస్వభావం, స్వచ్ఛమైన ప్రేమ, అమాయకత్వం కలిగిన పాత్రగా వర్ణించాడు. స్వచ్ఛమైన ప్రేమతో దేనినైనా సాధించవచ్చు అని ఈ పాత్ర నిరూపించింది. నమ్మకంతో చేస్తే అసాధ్యమైనదానినైనా సుసాధ్యం చేయవచ్చని గోదాదేవి పాత్ర ద్వారా తెలుస్తుంది. నేడు యువత సగం నమ్మకం లేకనే అన్ని పనులు విఫలం చెందుతున్నారు. గోదాదేవి నమ్మకంతో భగవంతుని ధ్యానించడం వలన ఆయనలో ఐక్యమైనది. దేనినైనా సాధించాలి అంటే దానిని మనం సాధించగలమనే నమ్మకం మనకు ఉండాలి.

**పాండురంగ మాహాత్మ్యం :**

ఈ గ్రంథం తెనాలి రామకృష్ణుడు రచించాడు. దీనిలో భక్తినే పరాకాష్టగా వర్ణించాడు. ఈ ప్రబంధం మొత్తం భక్తి ప్రధానంగా కనిపిస్తుంది. ఐదు పంచ మహా కావ్యాలలో రాజుల ప్రస్తావన ఎక్కువగా లేని కావ్యం ఇదే.

**నిగమ శర్మ అక్క :**

పేరులేని పాత్రగా తెనాలి రామకృష్ణ కవి వర్ణించాడు. అయినప్పటికీ ఈ పాత్ర ఎంతో ప్రసిద్ధమైనది. సర్వ విద్యల యందు పండితుడైన తన సోదరుడు భ్రష్టుడై, వ్యసనాల బారినపడి చెడిపోతుంటే దానిని చూసి తట్టుకోలేని అక్క వచ్చి తన సోదరుడికి అనేక విధాలుగా బుద్ధి చెప్పడానికి ప్రయత్నిస్తుంది. బ్రహ్మ దగ్గర నుండి మన తరం వరకు పవిత్రమైనది మన వంశం. దానిని పవిత్రంగా చూసుకోవలసిన బాధ్యత నీకు ఉంది అని సున్నితంగా కర్తవ్య బోధ చేసింది. అక్క తమ్ముళ్లకు ఒకరిపై ఒకరికి ప్రేమ ఉంటుంది అని, వారి జీవితమును బాగు చేసే విషయంలో వారికి బాధ్యత ఉంటుందని ఈ పాత్ర తెలియజేస్తుంది. అలాగే తల్లిదండ్రులను, వంశ గౌరవాన్ని నిలపాలని ఆమె పరివిధాలుగా ప్రయత్నించింది. దీనిని బట్టి పెళ్లి అయినప్పటికీ స్త్రీకి పుట్టింటి పై ఉన్న మమకారం పోదు అని ఈ పాత్ర ద్వారా కవి తెలియజేశాడు. ప్రాచీన కాలం నుండి నేటికీ కూడా స్త్రీలకు పెళ్లి అయిన తర్వాత కూడా పుట్టింటి పై ఉన్న మమకారం పోదు అని కవి చక్కగా వివరించాడు.

**సుశీల కథ :**

సుశీల పూర్వజన్మ యందు ఒక ఆవు. ఒకసారి శ్రీకృష్ణుడు మురళి వాయిస్తూ ఉండగా ఆవు తన్మయత్వానికి లోనై పాలధారలు కారుస్తూ ఉండగా యాదృచ్ఛికంగా అందులో ఒక బిందువు శ్రీకృష్ణుని నుదుటిపై పడినది. ఆవుకు మోక్షం ప్రాప్తించింది. తర్వాత జన్మలో సుశీలగా పుట్టగా భగవంతుడికి ఆమెను పరీక్షించాలని అనిపించింది. అందుకే ఆమెకు నీచుడైన భర్త వచ్చేలా చేశాడు.

> తాళి విభుండు గట్టినమొదల్ పతిదేవత యాసుశీల, పెన్
> గోలతనంబున్ మగఁడు కొట్టినఁ దిట్టిన రట్టు పెట్టినన్
> దాళి, దినంబ్రుఁ దచ్చరణతామరసంబులు గొల్చు, నేలయుం
> బోలునె యీపె కంచ్రుఁ గృతబుద్ధులు వృద్ధులు ప్రస్తుతింపఁగన్.

ఈ పద్యంలో భర్త ఎంత నీచుడైన సుశీల నిరంతరం అతన్నే సేవిస్తూ ఉండేది. అతడు సుశీలను అనేక విధాలుగా ఇబ్బంది పెడుతూ, సరిగా భోజనం పెట్టక, హింసిస్తూ ఉన్నప్పటికీ భర్తనే పూజిస్తూ పతిభక్తిని చాటుకునేది.

అందుకే సుశీలను పతివ్రతల్లో ఒకరిగా చెప్పుకుంటున్నాము. ఈ పాత్రను కవి మృదు స్వభావముగా, పతిగౌరవం కలదిగా, కల్లాకపడం తెలియని పాత్రగా, ముఖ్యంగా సహన స్వభావం కలదిగా చిత్రించాడు.

సుశీల మంచితనాన్ని చూసి ఆ ఊరి వారందరూ కూడా మెచ్చుకుంటూ ఉండేవారు. ఒకసారి భర్త వేరే ఊరు వెళ్ళగా భగవంతుడు బ్రహ్మచారి వేషంలో సుశీల దగ్గరకు వచ్చి అన్నం పెట్టమని అడిగాడు. ఆమె తన కోసం దాచుకున్న కొంచెం అన్నాన్ని కూడా అతనికి దానం చేసింది. దీనిని బట్టి ఆమె తీర్థయాత్రలకు వెళ్ళే వారిపై గల గౌరవం దీని ద్వారా అర్థమవుతుంది. కావాలని ఆ బ్రహ్మచారి ఆమెను ఆహారం కోసం ఒత్తిడి చేస్తూ ఉంటే తన భర్త దాచిన ఆహారాన్ని కూడా అతనికి దానం చేస్తుంది. భర్త ఏమంటారు అని భయం ఉన్నప్పటికీ బ్రహ్మచారిని అర్థ ఆకలితో పంపించడం మంచిది కాదని మొత్తం ఆహారాన్ని అతనికి పెడుతుంది. దీనిని బట్టి ఆమె మంచి హృదయం అర్థం అవుతుంది. చివరికి భగవంతుడు ఆమె భక్తికి మెచ్చి ఆమె భర్తని మంచి దైవభక్తి గలవాడిగా మారుస్తాడు. ఈ పాత్ర ద్వారా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ సహనంతో ఓర్చుకుంటే మార్పు కచ్చితంగా ఒకరోజు వస్తుందని కవి చెప్పదలుచుకున్నాడు. నేటి సమాజంలో చిన్న చిన్న కారణాలకే విడిపోతున్న దంపతులకు ఈ పాత్రను ఉదాహరణగా చెప్పవచ్చు. నేటి మానవ జీవితానికి సహనం, ఓర్పు, పట్టుదల ఇలాంటివి చాలా ముఖ్యం ఎందుకంటే ఇవేవీ లేకపోతే మనిషి ముందుకు వెళ్లలేడు. ప్రాచీన కవులు కూడా తమ కావ్యాల ద్వారా మనిషి ఎలా జీవిస్తే మానవజాతికి ఉపయోగపడతాడు అనే ఉద్దేశంతోనే తమ రచనలలో ఇటువంటి పాత్రలు ప్రవేశపెడతారు.

**శృంగార నైషధం :**

పంచ మహాకావ్యాలలో చివరిది శృంగార నైషధం. ఎందుకంటే ముందు నాలుగు మహాకావ్యాలు కూడా పురాణాలోని కథలను తీసుకొని పెంచి రాశారు. కానీ శృంగార నైషధంలోని కథ భారతంలో ఉన్న కథ ఒకటి కథలో చిన్న చిన్న వర్ణనలే చేయగలము దానిని మార్చి రాయలేము కనుక ఇది ఐదవ మహా కావ్యమైనది.

**దమయంతి :**

శృంగార నైషధంలో ముఖ్యమైన స్త్రీ పాత్ర దమయంతి పాత్ర. ఎందుకంటే ఈ కథ మొత్తం నలదమయంతుల ప్రేమ చుట్టూనే తిరుగుతూ ఉంటుంది. ఈ క్రింది పద్యంలో నలమహారాజుకు హంస దమయంతి యొక్క అందమును వివరించును.

వనజాతేక్షణ యూరు యుగ్మమున లావణ్యంబునం గేళికా
నన సంక్రందన పట్టణ ప్రకట జన్మ స్థానలన్ రంభల న్
ధన దాపత్య తపః ఫలస్తనుల నత్యంతాభిరామాంగుల న్
మనుజాధీశ, యధఃకరించు; బొగడన్ మాబోంట్లకున్ శక్యమే?

పై పద్యం ద్వారా దమయంతి ఎంత అందమైనప్పటికీ నలుని గురించి హంస చెప్పగా విని అతన్ని ఇష్టపడుతుంది. మంచి మనసు ఉంటే చాలు అని అతని రూపురేఖలు అవసరం లేదని దమయంతి భావించింది. అలాగే స్వయంవరంలో దమయంతి ఐదుగురు నలరాజులు ఉండగా వీరిలో సరైన వారిని గుర్తిస్తేనే మీకు వారితో వివాహం జరుగుతుందని చెప్తారు. ఆ సమయంలో దమయంతికి అది పెద్ద పరీక్షే. ఎందుకంటే మిగిలిన నలుగురు దేవతలు వారిలో నలమహారాజును గుర్తించడం కష్టమైన పని. కానీ దమయంతి తన ప్రేమ, తెలివితేటలతో నలమహారాజును ఇట్టే కనిపెట్టినది. నల, దమయంతి ప్రేమను చూసి దేవతలు సంతోషించి, ఆశీర్వదించారు. ప్రస్తుత కాలంలో యువత అందం అనే మోజులో పడి మంచి గుణగణాలు, నడవడికలేని మనుషులను ఎన్నుకుంటున్నారు. "అందము మోసకరము, సౌందర్యము వ్యర్థము" ఈ సామెత ఆధారంగా భార్యాభర్తల సంబంధానికి అందం అవసరం లేదని

ఉండవలసింది కేవలం ప్రేమ అని దమయంతి పాత్ర ద్వారా కవి తెలియజేశారు.

**ముగింపు :**

నేటి కాలంలో స్త్రీలు ఎన్నో రంగాలలో ముందడుగు వేస్తూ అంతరిక్షంలోకి దూసుకు వెళుతూ, అతఃపాతాళాన్ని చీల్చుకొని పోతూ, ప్రపంచాన్ని చుట్టి వస్తున్నారు. స్త్రీలు ఇంటినే కాదు దేశాన్ని కూడా చక్కబెట్టగలరని ప్రధానమంత్రిగా ఈ దేశాన్ని పాలించిన ఇందిరా గాంధీని, సమాజంలో మూఢనమ్మకాలు పోవాలి అంటే ముందు చదువుకోవాలని చెప్పిన సావిత్రిబాయి పూలే కాని, కథన రంగంలో శత్రువుల గుండెల్లో గుబుళ్లు పుట్టించిన రుద్రమదేవి కానీ, తన ఇంటికే కాదు దేశానికి సైతం కాపాడగలిగే ధీరురాలుగా ఆపరేషన్ సింధూరిలో పాల్గొన్న కల్నల్ సోఫియా ఖురేషి మరియు వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ సత్యభామ వలే రాక్షసులను వధించారు. వీరందరూ స్త్రీలే అనే విషయాన్ని మనం గుర్తించాలి. ఆ కాలంలోనే కవులు స్త్రీల యొక్క శక్తిని గుర్తించి తమ కావ్యాలలో పొందుపరిచారు. కవులు స్త్రీ పాత్రలను చిత్రించడంలో తమ నేర్పును, నైపుణ్యాన్ని పాత్రల ద్వారా తెలియజేస్తూ నేటి తరానికి ఉపయోగపడుతుందని ముందుగానే ఊహించి కవులు తమ కావ్యాన్ని రాసారేమో అనే సందేహం మనకు కలిగేలా కావ్యాలను రాశారు. నేటితరం వారు కావ్యాలలో స్త్రీ అంటే కేవలం అంగాంగ వర్ణనే కాదు స్త్రీ అంటే ఆదిశక్తి స్వరూపం అనే విషయాన్ని అర్థం చేసుకుంటారు. కావ్యాలలో నిగూఢంగా కవులు చెప్పదలుచుకున్న మంచిని నేటి సమాజానికి తెలియజేయవలసిన ఆవశ్యకత ఎంతో ఉన్నది. ఇటువంటి కావ్యాలపైన ఎక్కువ పరిశోధనలు రావాలని, నేటి సమాజానికి ఉపయోగపడాలని ఈ వ్యాసం ద్వారా తెలియజేస్తున్నాను.

**ఉపయుక్త గ్రంథ సూచిక :**

1. డాక్టర్ పమ్మి పవన్ కుమార్. 2022, ఆముక్తమాల్యద, శ్రీ రాఘవేంద్ర పబ్లికేషన్స్, హైదరాబాదు.
2. డాక్టర్ పమ్మి పవన్ కుమార్ & డాక్టర్ కప్పగంతుల రామకృష్ణ. 2022, మను చరిత్రము, శ్రీ రాఘవేంద్ర పబ్లికేషన్స్, హైదరాబాదు.
3. విశ్వనాథ సత్యనారాయణ. 2013, వసు చరిత్రము, ఎమెస్కో పబ్లికేషన్స్, విజయవాడ.
4. వేదం వెంకటరాయ శాస్త్రి. 2015, శృంగార నైషదము, ఎమెస్కో పబ్లికేషన్స్, హైదరాబాదు.
5. డాక్టర్ పమ్మి పవన్ కుమార్ & డాక్టర్ డి.వి.జి. ఏ. సోమయాజులు. 2022, పాండురంగ మాహాత్మ్యం, శ్రీ రాఘవేంద్ర పబ్లికేషన్స్, హైదరాబాదు.

★★★

భావవీణ BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

**Article Link :** *https://www.bhavaveena.com/*



# చిత్తూరు జిల్లా రచయిత్రుల స్త్రీ వాద కథలు - స్త్రీ జీవిత చిత్రణ

టి. మంజుల
పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు అనువాద అధ్యయనశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం - 517 426, చరవాణి : 94943 79155.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

## స్త్రీవాదం :

### స్త్రీవాదం పదం వివరణ :

ఫెమినిజం Feminism అనే ఆంగ్ల పదానికి స్త్రీవాదం అనే పదాన్ని సమానార్థకంగా జయప్రభ గారు ఉపయోగించారు.

### స్త్రీవాదం అంతర్జాతీయ నేపథ్యం :

1789లో ఫ్రెంచి విప్లవం ద్వారా మహిళలు తమ హక్కుల కోసం పోరాడారు. 1847లో ఇంగ్లండు చట్టసభలో మహిళా హక్కుల బిల్లు ప్రవేశపెట్టబడింది. 1848లో వ్యక్తి స్వాతంత్ర్యాన్ని చర్చిస్తున్నప్పుడు స్త్రీ విముక్తికి ప్రాధాన్యమిస్తూ మహిళా పోరాటం ప్రారంభమైంది. 1889లో పారిస్ అంతర్జాతీయ సమావేశంలో స్త్రీ పురుషుల సమాన హక్కుల ప్రస్తావన వచ్చింది. 1911లో చైనా విప్లవంలో స్త్రీలు కార్మిక పోరాటాల్లో పాల్గొన్నారు. ఆధునిక స్త్రీవాద ఆలోచనా ధోరణులకు అమెరికా ఆరంభస్థానం అయింది. 1975-85 మధ్య కాలాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ మహిళా దశాబ్దంగా ప్రకటించింది.

### స్త్రీవాదం - అంతర్జాతీయ రచనలు :

ప్రపంచంలో తొలి స్త్రీవాద గ్రంథంగా 1792లో ఇంగ్లాండు రచయిత్రి మేరీ హోల్ స్టోన్ క్రాఫ్ట్ రాసిన ఎవిండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ ఉమెన్ అనే గ్రంథం ప్రసిద్ధి చెందింది. స్త్రీల హక్కులను గురించి, కుటుంబ వ్యవస్థను గూర్చి చర్చించిన మొట్టమొదటి పుస్తకం ఇదే. సైమన్ ది బొలియర్ అనే ఫ్రెంచ్ తత్వవేత్త ది సెకండ్ సెక్స్, బెట్టి ఫ్రీడన్ (అమెరికా) - ఫెమినైన్ మిస్టేక్, ది సెకెండ్ ఫేం అనే గ్రంథాలు రాశారు.

### తెలుగులో స్త్రీ వాద నేపథ్యం :

తెలుగులో స్త్రీ జనోద్ధరణకు కంకణం కట్టుకున్న మొట్టమొదటి మహనీయుడు కందుకూరి. ఈయన స్త్రీల కొరకు వివేకవర్ధిని పత్రిక స్థాపించి 'సత్యవతి చరిత్ర' అనే నవలను రాశాడు. గురజాడ అప్పారావు స్త్రీల దైన్యాన్ని

పూర్ణమ్మ, కన్యక మొదలగు గేయాలలో చూపాడు. చలం స్త్రీకి లైంగిక స్వేచ్ఛ, వివాహం స్వాతంత్ర్యం ఉండాలని రచనలలో నొక్కి వక్కాణించాడు.

**స్త్రీవాదం నిర్వచనాలు :**

ఫెమినిజం స్త్రీ పురుషుల సమానత్వాన్ని ఆకాంక్షించే కాని స్త్రీలను, పురుషులను విడదీయదు. స్త్రీవాద దృక్పథమంటే స్త్రీల జీవితాల్లోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ అంశాల్ని పురోగమి దిశగా మలుపు తిప్పగల దృక్పథం.

**స్త్రీవాద కవయిత్రులు – రచనలు :**

1972లో ఓల్గా (పోపూరి లలిత కుమారి) రాసిన ''ప్రతి స్త్రీ ఓ నిర్మల కావాలి'' అన్న కవితతో తెలుగులో స్త్రీవాదం ప్రారంభమైంది. మొట్టమొదటి స్త్రీవాద రచయిత్రి ఓల్గా. ''పెళ్లంటే పెద్దశిక్ష, మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడు. మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే మమ్మల్ని విభజించి పాలిస్తోంది'' అంటూ బందిపోట్లు కవిత ద్వారా సావిత్రి పేర్కొన్నారు. ''ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి అయినా చివరకు వంటింటి గిన్నెలన్నిటిపైనా మా నాన్న పేరే! అంటూ 'వంటిల్లు' కవిత ద్వారా వెల్లడించారు. ''పైటను తగలెయ్యాలి'' అంటూ తన కవిత ద్వారా జయప్రభ స్త్రీల ఆవేదనను తెలియజేశారు.

| స్త్రీవాద రచయిత్రులు | | కథలు |
|---|---|---|
| బండారు అచ్చమాంబ | - | ధనత్రయోదశి, స్త్రీవిద్య |
| కనుపర్తి వరలక్ష్మమ్మ | - | మూడు తీర్మానాలు |
| ఓల్గా | - | రాజకీయ కథలు |
| జయధీర్ తిరుమలరావు | - | స్త్రీవాద కథలు |
| పి. సత్యవతి | - | ఇల్లలకగానే |
| కొండెపూడి నిర్మల | - | శత్రుస్పర్శ |

**చిత్తూరు జిల్లా స్త్రీవాద రచయిత్రులు – కథలు**

స్త్రీవాద భావజాలం ద్వారా ఉత్తేజితులై ప్రేరేపితులైన చిత్తూరు జిల్లా రచయిత్రులు అనేక కథలు రాశారు. చాలామంది స్త్రీవాద దృక్కోణంతో అనేక కథలు రాశారు.

- వారి కథల్లో అడుగడుగునా స్త్రీవాద భావజాలం కన్పిస్తుంది.
- వారు స్త్రీవాద ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనకపోయినా సాటి స్త్రీ రచయిత్రులుగా తమకథల ద్వారా సమాజంలో స్త్రీల పట్ల జరుగుతున్న అన్యాయాలను ఎత్తి చూపుతూ స్త్రీలలో అభివృద్ధిని కాంక్షిస్తూ సమాజం పట్ల తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించారని చెప్పవచ్చు.

| రచయిత్రులు | | కథలు |
|---|---|---|
| 1. ఎం.ఆర్. అరుణ కుమారి | - | మన్నులో మన్నునై, సాగరకోయిల |
| 2. ఎ. పుష్పాంజలి | - | అమ్యూజింగ్స్ |
| 3. పద్మావతి వాచస్పతి | - | ప్రేమపందిరి, జ్ఞాననేత్రం |
| 4. అరుణా సహదేవ్ | - | వేగుచుక్క |
| 5. డా॥. కె.వి. లక్ష్మిరాఘవ | - | నావాళ్ళు |
| 6. ఎం.కె. దేవకి | - | ముళ్ళదోవ |
| 7. ఆర్. వసుంధరా దేవి | - | ఆర్. వసుంధరాదేవి కథలు |
| 8. కానాల నాగలక్ష్మమ్మ | - | చీకట్లో చిరుదీపాలు, నమ్మకం |

- వీరు తమ కథల ద్వారా స్త్రీవాద దృక్పథాన్ని విశ్లేషిస్తూ సమకాలీన సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను విభిన్న కోణాల్లో చిత్రించారని చెప్పవచ్చు.
- సమాజ హితాన్ని కోరడమే సాహిత్య లక్ష్యం కాబట్టి వీరి కథలు కూడా సమాజంపై ప్రభావం చూపాయని చెప్పవచ్చు.

**చిత్తూరు జిల్లా స్త్రీవాద రచయిత్రుల కథలలోని అంశాలు :**

**1. సామాజింకాశాలు :**

సామాజికాంశాలలో ముఖ్యంగా ఆడవారు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించటం జరిగింది. వాటిలో బాల్య వివాహాలు, అవిద్య, స్వేచ్ఛలేనితనం, లైగింక దాడులు, అత్యాచారాలు మొదలైనవి. ఈ సమస్యలు స్త్రీల అభివృదిదకి ప్రతిబంధకాలుగా ఉన్నాయి.

ఈ సమస్యలను రచయిత్రులు తమ కథలలోని పాత్రల ద్వారా చక్కగా చిత్రీకరించారు. సతీసహగమనం పూర్తిగా నిర్మూలించబడిందని చెప్పవచ్చు. కానీ ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేపట్టినప్పటికీ అక్కడక్కడా బాల్య వివాహాలు ఈ నాటికీ జరుగుతూనే ఉన్నాయి. వాటిని అరికట్టలేకపోతున్నామనీ చెప్పాలి. రాలయసీమ రచయిత్రలు కథలలో 'ది మెర్సీ కిల్లింగ్' అన్న కథ ద్వారా తెనాలి సుశీలాదేవి గారు పిల్లలకు పెళ్ళిళ్ళు చేయడం ద్వారా బాల్యంలోనే ఆడవారికి వారు పడుతున్న కష్టాలు, సమస్యలు గూర్చి ఎం.కె. దేవకి ముళ్ళదోవ కథా సంపుటిలో అంగడి సరకు అనే కథ ద్వారా కోడలిని భర్త, అత్తమామలు వరకట్నం కోసం ఎలా వేధిస్తారో స్పష్టంగా తెలియజెప్పారు. సమాజం అంటే ఏమిటో, సమాజంలోని ప్రజల జీవన విధానం ఎలా స్త్రీల జీవితాలపై పరిణామం చెందిందో, ఎలా ఈ పరిణామాలు ప్రభావం చూపాయో రచయిత్రులు కథల ఆధారంగా చక్కగా విశ్లేషించారు.

**సాంస్కృతికాంశాలు :**

ఆనాటి బాలికల జీవన స్థితిగతుల గూర్చి, పుట్టినింట మెట్టినింట ఆడవారి సమస్యలు, వితంతువైన బాలికల దుర్భర స్థితిగతులు, ఆనాటి నాగరిక సమాజాన్ని కళంకితం చేస్తున్న దుర్మార్గపు దేవదాసీ వ్యవస్థ స్వరూప స్వభావాలను, భర్త చనిపోయిన స్త్రీకి ముత్తైదువతనాన్ని తొలగించటం, ఇలాంటి మూఢాచారాల వల్ల స్త్రీలు పడుతున్న బాధలను గూర్చి రచయితలు  తమ కథల ద్వారా చక్కగా విశ్లేషించారు.

**ఆర్ధికాంశాలు :**

ఆనాటి కాలంలో స్త్రీకి ఆర్ధిక స్వేచ్ఛ లేదనే చెప్పాలి. స్త్రీలు ఆర్ధికంగా ఎదుర్కొంటున్న సమస్యల గూర్చి రచయిత్రలు తమ కథల ద్వారా క్లుప్తంగా చిత్రీకరించారు. బాలికలను ఇతరుల ఇళ్లలో జీతానికి పనిలోపెట్టుట, డబ్బుకు ఆశపడి వృద్ధుడికి యువతికిచ్చి పెళ్ళి చేయుట, భర్త చెడు వ్యసనాలకు లోనైతే భార్య జీవితం ఎంత దుర్భరం, డబ్బు లేదని బాలికను చదువు మాన్పించడం మొదలగునవి.

**చైతన్యాంశాలు :**

స్త్రీలు పడుతున్న సమస్యలను చిత్రించడమే కాకుండా సమస్య వచ్చినప్పుడు ఎదుర్కొని పోరాడి ఎలా ఆత్మ స్థైర్యాన్ని నింపుకోవాలో కూడా తమ కథల ద్వారా తెలియజేశారు. స్త్రీలు చైతన్యవంతులై కలసికట్టుగా ముందుకు నడిస్తే సాధించలేనిది ఏదీ లేదని రచయిత్రి అరుణా సహదేవ్ 'వేగుచుక్క' కథా సంపుటి ద్వారా తెలియజేశారు. చిన్న వయస్సులోనే నాకు పెళ్ళి వద్దు అంటూ ధిక్కరించిన కూతురు. ఇలా రచయిత్రులు తమ కథల ద్వారా స్త్రీలలో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నించారని చెప్పవచ్చు.

**చిత్తూరు జిల్లా రచయిత్రులలో ఒకరైన ఎం.ఆర్. అరుణ కుమారి గురించి విషయ వివరణ :**

ఎం.ఆర్. అరుణ కుమారి గారు చిత్తూరులో 'పల్లెసీమ' పత్రికకు సంపాదకత్వం వహించి పత్రికా రచయితగా, నాటకకర్తగా, కార్మికనేతగా ఎనలేని సేవలు అందించి అప్పట్లో మాజీ రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి గారిచే ప్రశంసలందుకున్న శ్రీ యం.ఆర్. చంద్ర గార్ల కుమార్తె.

అరుణ కుమారి గారి తల్లిదండ్రులు శ్రీమతి అలివేలమ్మ, శ్రీ యం.ఆర్. చంద్ర గారు. శ్రీ యం.ఆర్. చంద్ర గారు కలాన్ని కరవాలంగా మలచి సమాజంలో వేళ్ళూనుకొంటున్న అనాహూత ధోరణులను తనుమాడటానికి కలం పట్టారు. ఈయన నాటకకర్తగా దర్శకుడిగా, నటుడిగా, పాత్రికేయుడిగా, గేయ రచయితగా సుప్రసిద్ధులు. ఆయన రచనల ప్రభావం రచయిత్రిపై ఉందని చెప్పవచ్చు. నాటకీయత, సంభాషణ చతురత, శిల్ప విన్యాసం మొదలైన వాటిని నాన్న నుంచి పుణికిపుచ్చుకున్నది.

అరుణ కుమారి గారు బి.ఎస్సీ., ఎం.ఏ., డి.ఇడి. చేసి 1983 నుంచి చిత్తూరులో మండల ప్రాథమిక పాఠశాల ప్రాధానోపాధ్యాయురాలిగా ఉద్యోగ ప్రస్థానంలో ఉంటూ వున్న రోజుల్లో 'జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డ్' పొందారు. "ఆమెకు జీవితం పట్ల సమాజంలోని స్థితిగతుల పట్ల చక్కని అవగాహన, శాస్త్రీయమైన ఆధునిక దృక్పథం ఉన్నాయని చెప్పవచ్చు. తినే తిండి ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది. చదివే సాహిత్యం ఒక రచయిత స్థాయిని నిర్ణయిస్తుంది. ఈమె రచనలే తెలుగు సాహిత్యంలో అరుణోదయంలా వికసించి పరిపుష్టిని అందించాయి. ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టాయి.

ఆమె వచనా శైలి నివురు కప్పిన నిప్పులాంటిది. నివుర, వచనమైతే నిప్పు అందులో దాగిన కవిత్వం. కథనంతా సంభాషణలపైనే నడిపించి రక్తి కట్టించే శిల్ప కళాకౌశలం ఆమె ప్రత్యేకత. అరుణ కథల్లో స్త్రీ జన పక్షపాతం ఉంటుంది. అప్పటి సామాజిక పరిస్థితులకు అనుకూలంగా స్త్రీ పడుతున్న సమస్యల్ని, బాధకాల్ని ప్రపంచానికి తెలియజెప్పాలని అనుకున్నారు.

పురుషాధిక్యతను నిర్మూలించడమే ధ్యేయంగా కథలు, కథా సంపుటాలు రచించారు. స్త్రీని వ్యక్తిత్వం లేని ప్రాణిగా, బిడ్డలు కనే సాధనంగా చాకిరీ చేసే యంత్రంగా భావించడాన్ని దూషించారు. మనునీతిని నిలదీస్తూ పురుసాధిక్యత ఇంకానా ఇకపై చెల్లదు అని గర్జించారు.

అరుణ గారు రచించిన కథా సంపుటాలు : 3. అవి. 1. వేగుచుక్క, 2. సాగరకోయిల, 3. మన్నులో మన్నునై.

వేగుచుక్క కథా సంపుటిలో తమకు కుమారుడు జన్మించాలని తమను పున్నామ నరకం నుండి రక్షించేది తన కుమారుడే అని భావిస్తారు. అందుకోసం ఎన్నో నోములు, వ్రతాలు చేస్తారు. దేవుళ్ళని పూజిస్తారు. మొక్కుకుంటారు. ఈ కథలో తల్లి తనకు పుత్రుడు జన్మించాడని ఎంతగానో సంతోషిస్తుంది. గారాబంగా పెంచుతుంది. తను కష్టపడి తన బిడ్డకి ఉన్నత చదువులను చదివిస్తుంది. అలా చదివి పైస్థాయికి ఎదిగిన ఆ కుమారుడు తన తల్లి చనిపోయినదని తెలిసినా చివరి చూపు చూడటానికి ఆ తల్లికి అంత్యక్రియలు చేయడానికి వెళ్ళాడు. వాళ్ళ అక్క తల్లికి అన్ని కార్యాలు చేసి ఈ అస్థికలనైనా నీ చేతులతో పుణ్యనదిలో కలిపి అమ్మ ఆత్మకు శాంతి కలిగించు అని వేడుకుంటుంది. ఇలాంటి సంఘటనలను ఇప్పటికీ సమాజంలో అక్కడక్కడ చూస్తున్నాం. అన్య దేశాలల ఉద్యోగలు చేస్తూ తల్లిదండ్రులను పట్టించుకోకుండా "ఎప్పుడో అమావాస్యకో, పౌర్ణానికో ఒక ఫోన్ కాల్ చేస్తూ తాము పనులలో ఎప్పుడూ బిజీ బిజీ అని చెప్తూ ఉంటారు.

ఆ తల్లిదండ్రులు తమ పిల్లలు తమను చూడటానికి ఎప్పుడో ఒకప్పుడు వస్తారని ఎదురుచూస్తూ ఎదురుచూస్తూ కాలం గడుపుతుంటారు. కొంతమంది మానసిక వేదనతో ఆరోగ్యం పాడు చేసుకుని వృద్ధాప్యం మీద పడటంతో

దగ్గరుండి చూసుకునేవారు లేక మానసిక చెందుతూ చనిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఆ చనిపోయిన తల్లిదండ్రులను కనీసం చూడటానికి కూడా రానివారు ఉన్నారు.

దేవుడు, ఉన్నాడో లేదో తెలియదు కానీ రాతిలో దేవున్ని చూస్తాం. గుడులు కట్టించి ఆ గుడిలోని దైవాన్ని పూజిస్తాం కొబ్బరికాయలు కొడతాం. కోరికలను తీర్చమని వేడుకుంటాం, ఆ కోరికలు నెరవేరుతాయో లేదో కూడా తెలియదు మన కంటికి కనిపించని దైవత్వానికి ఎంతో విలువ ఇస్తాం. పుట్టినప్పటినుంచి కంటికి రెప్పలా కాల్చుకుంటూ అడిగినవన్నీ అందిస్తూ మన కోరికలను నిత్యం తీరుస్తున్న అమ్మా నాన్నలని మాత్రం దైవంగా ఎందుకు చూడకూడదు? మన కంటికి కనిపించే నిజమైన దేవుళ్ళు తల్లిదండ్రులే.

ఒక భార్య, భర్త తల్లిదండ్రులు అయినప్పటి నుంచి తమ పిల్లలని అపురూపంగా కంటికి రెప్పలా కాపాడుతారు. తమ పిల్లల కోసమే తమ జీవితం అన్నట్లు కష్టపడతారు. వారికి మంచి భవిష్యత్తును ఇవ్వాలని నిరంతరం శ్రమిస్తారు. వేలకు వేలు ఫీజులు కట్టి ఉన్నత చదువులు చదివిస్తారు. అప్పు చేసి మరి అన్య దేశాలకు పంపి చదివిస్తారు. మా అమ్మాయి అబ్బాయి ఫారెన్‌లో ఉన్నారంటూ గొప్పగా 10 మందికి చెప్పి మురిసిపోతుంటారు. చివరికి ఆ పిల్లలే ఒక స్థాయికి ఎదిగాక రెక్కలు వచ్చిన పక్షి పిల్లలు ఎగిరిపోయినట్లుగా తల్లిదండ్రుల నుంచి దూరమై వారిని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎవరి వల్ల వారు ఇంత స్థాయికి ఎదిగారు అన్న విషయాన్ని మర్చిపోతున్నారు. పూర్వకాలంలో రాజుల దగ్గర నుంచి అందరూ తల్లిదండ్రులను పూజిస్తూ దైవంగా భావించారు. శ్రవణ కుమారుడు వృద్ధాప్యంలో తన తల్లిదండ్రులు పుణ్యక్షేత్రాలను చూడాలనే కోరికను తీర్చడానికి కావడిలో తన తల్లిదండ్రులను ఉంచి తన భుజంపై మోసుకుంటూ వెళ్ళాడు. రాముడు తండ్రి మాట కోసం 14 సంవత్సరముల అరణ్యవాసం చేశాడు. శివాజీ ప్రతి స్త్రీలోనూ తన తల్లిని చూసుకునేవాడు. అలాంటి ఎందరో మహాత్ములు జన్మించిన కర్మభూమి మనది.

అరుణ కుమారి గారు అప్పటి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా కథలను చిత్రీకరించారు. కూతురిని వెధవరాలిని చేయడాన్ని ధిక్కరించిన ఒక తల్లి ధైర్యాన్ని విషాదగీతం అనే కథ చక్కగా విశ్లేషించారు.

ఈ కథలో సుధీర పెళ్లి అయినా ఐదేళ్లకు ఎందరో దేవుళ్లను దర్శించి, ఎన్నో నోములు వ్రతాలు చేసి, ఎందరో మరెందరో డాక్టర్లను సందర్శించి, లెక్కకుమించిన మందులు వేసుకొని గర్భం దాల్చి, ఒక ఆడబిడ్డకు జన్మనిస్తుంది. ఆ పాపకు రోజా అని నామకరణం చేస్తుంది. అమ్మాయిని పూర్తి అల్లారుముద్దుగా పెంచుతుంది. అమ్మాయి డిగ్రీ పూర్తి కాగానే సొంత ఊళ్లో ఉద్యోగం చేసే అబ్బాయికి ఇచ్చి వివాహం జరిపిస్తుంది. పసుపు పారాణి ఇంకా ఆరనే లేదు మెడలో పచ్చని పసుపు తాడు కరకు మాయనే లేదు. పెళ్లయిన రెండో నెల పూర్తికాకుండానే రోజా భర్త యాక్సిడెంట్లో మరణిస్తాడు.

భర్తను కోల్పోయిన స్త్రీ భౌతిక అలంకరణలన్నిటిని తొలగించుకోవాల్సి ఉంటుంది. విచిత్రం ఏమిటంటే తాళిబొట్టు, మెట్టెలు తప్ప తక్కినవన్నీ అంటే పూలు పెట్టుకోవడం, బొట్టు, కాటుక పెట్టుకోవడం వంటివి భర్త ప్రమేయం లేకుండా వచ్చినవి. వాటిని కూడా తొలగిస్తారు. అలా తొలగించే అధికారం ఎవరికి లేదు. అయినా తొలగిస్తారు. అలా చేయడాన్ని కథలో సుధీర అంగీకరించదు. తన కూతురిని విధవరాలని చేయడానికి ససేమిరా ఒప్పుకోను అంటుంది.

ఒక అమ్మగా, అక్కగా, చెల్లిగా, ప్రియురాలిగా, ఎల్లాలిగా, కూతురిగా, మనుమరాలిగా, మగవాడి ప్రతి జీవన దశలోనూ తన ప్రేమతో త్యాగంతో అలరిస్తూ జీవిత గమ్యానికి చేరుస్తుంది. అదే ఆడది.. దురదృష్టవశాత్తు భర్తను కోల్పోతే ఇక తన జీవితం మకరందానందాన్ని సహజ అలంకారాన్ని కూడా త్యాగం చేయాల్సిందేనా? అని సుధీర ప్రశ్నిస్తుంది. తన బిడ్డ బతుకు వసంతంలో శిశిరమై పోకూడదని ఒక్కసారిగా దృఢవిశ్వయంతో లేచి ఇది అభ్యర్థన

కాదు ఆదేశం అంటూ తన కంఠం గంభీరథంలో పూలు తెంచేయబోతున్న చేతుల్ని నుదుట కుంకుమ చెరిపేయ బోతున్న చేతుల్ని వెనక్కి విరిచి పట్టుకొని గాజులు పగలగొట్టబోతున్న చేతుల్ని విస్మయపరుస్తుంది. తన చేతిలోని పసుపు కూతురు మోహానికి రాసి కుంకుమను నుదుట దిద్దుతూ పలుకుతుంది. మీరంతా నన్ను నా కుటుంబాన్ని వెలివేసినా సరే నా బిడ్డ పసుపు కుంకాలు మాత్రం చెదరనీయను అంటూ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంటుంది.

సుధీర లాంటి ఆడవాళ్లు ధైర్యంగా ముందుకు సాగితే తప్ప మిగిలిన స్త్రీలలో మార్పు రాదు. తన కూతురిని అటువంటి పరిస్థితులలో చూడలేని సుధీర ధైర్యంగా ఎదిరించింది. తన బిడ్డ పసుపు కుంకాలు మాత్రం చదరనీయను అని గట్టిగా చెప్పింది. ఆమె సాహసానికి మెచ్చుకోక తప్పదు. చిన్నవయసులోనే భర్తను కోల్పోయిన స్త్రీ జీవితమంతా సమాజంలో ఎలా బ్రతకగలదు. ఆమెకు మళ్లీ వివాహం జరిపించి కొత్త జీవితాన్ని అందించాలి. భార్య చనిపోయిన కొద్ది రోజులకే భర్త ఏ విధంగా వివాహం చేసుకుంటాడో అదే విధంగా భార్య (వితంతువు)కు కూడా వివాహం జరిపించాలి. అప్పుడే సమాజంలో సమానత్వం ఉంటుంది. సమాజ పురోగతి జరుగుతుంది.

**ముగింపు :**

ఆర్థిక స్వేచ్ఛ లేకుండా, బయటకు వెళ్లే స్వాతంత్రం లేకుండా వంటింటి కుందేలులా ఇంటిపట్టున ఉండి ఇంటి పనులు చేసుకుంటూ, ఇంటిని చక్కదిద్దుకుంటూ భర్త, పిల్లల యోగక్షేమాలు చూసుకుంటూ, చదువుకునే అవకాశమే లేకుండా అబల అని ముద్ర వేసుకున్న ఆనాటి స్త్రీ జీవితం నేడు పూర్తిగా మారిందనే చెప్పుకోవాలి.

నేటి కాలంలో స్త్రీలు చదువులో, ఉద్యోగాలలో ముందుకు దూసుకెళుతున్నారు. అబల కాదు సబల అని నిరూపిస్తూ పురుషులతో దీటుగా అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు. పూర్తి ఆర్థిక స్వేచ్ఛను అనుభవిస్తున్నారు. ప్రభుత్వం స్త్రీల విద్యకై చాలా సౌకర్యాలు కల్పిస్తోంది.

- ఇలా స్త్రీకి స్వాతంత్రం రావడం వెనుక చాలా కృషి ఉందని చెప్పవచ్చు.
- ఈ విజయం ఎంతోమంది సాంఘిక నాయకుల ఉద్యమాలు, స్త్రీవాద రచయిత్రుల కృషి ఫలితమే అని చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. స్నేహిత, డాక్టర్ కిన్నెర శ్రీదేవి, చినుకు పబ్లికేషన్స్, 2015.
2. జ్ఞాన నేత్రం, పద్మావతి వాచస్పతి, విక్టరీ ప్రెస్, 1965.
3. నా వాళ్లు, డాక్టర్ లక్ష్మి రాఘవ, జయంతి పబ్లికేషన్స్, 2014.
4. ఎంకే దేవకి, ఎంకే దేవకి, దీప్తి టెక్నికల్ ప్రింటర్స్, 2005.
5. రాయలసీమ రచయిత్రుల కథలు, డాక్టర్ ఎం. హరి కిషన్, దీప్తి పబ్లికేషన్స్, 2020.
6. మన్నులో మన్నున్నాయ్, ఎం ఆర్ అరుణ కుమారి, ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 2006.
7. ఆర్ వసుంధర దేవి కథలు, ఆర్ వసుంధర దేవి, వసుంధర పబ్లికేషన్స్.
8. అమ్యూజింగ్స్ కథలు, ఏ. పుష్పాంజలి, విజయవాడ ప్రింటర్స్, 2010.
9. సాగర కోయిల, ఎం ఆర్ అరుణకుమారి, పృథ్వి పబ్లికేషన్స్, 2003.
10. వేగుచుక్క, అరుణా సహదేవన్, పృథ్వి ప్రచురణ, 1896.


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
Article Link : https://www.bhavaveena.com/

# కడుపు కోత కథా సంపుటి – సామాజిక విశ్లేషణ



ఎస్. గాయత్రి
తెలుగు అధ్యాపకురాలు, శ్రీ ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొండనాగుల.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A): 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహం :**

తెలుగు సాహిత్యంలో కథ ప్రక్రియల్లో వచ్చిన కథలలో సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆర్థిక స్థితిగతులు, గ్రామీణ జీవనశైలి, విద్యా వైద్య విధానం, మూఢనమ్మకాలు, జీవన విధానాలు, భావద్వేగాలు, తాత్వికచింతన మొదలైన అంశాల మీద తెలంగాణ మాండలికంలో దేవరాజు మహారాజు గారు రచించిన కడుపుకోత కథల సంపుటి.

**కీలక పదాలు :**

శేరీకు, అంబ్యాదది, అనామతు, ఎగపోసుకుంటా, తాఖతు, పెనిమిటి, వోల్ల, బలిశి, తంబం, ఒరిగి, కులాసా, అచ్చం, దాష్కం, పసందు, గమ్మత్తు, కుశయిండు.

**ఉపోద్ఘాతం :**

మానవుని ఊహ ఏనాడు మొదలైందో ఆనాడే పుట్టింది ఈ కథ అనే ప్రక్రియ. సాహిత్యంలో కథ అనేది ప్రాచీన సాహిత్యంలో ఉందని అయితే అది కావ్యంలో అంతర్భాగంగా కొనసాగిందని లిఖిత సాహిత్యం రాకముందు నుండి కథ ఉందని తెలుగు కథపై పరిశోధన చేసిన పోరంకి దక్షిణామూర్తి గారు మొదలైన వాళ్లు విమర్శించారు.

ఆధునిక కాలం వచ్చేసరికి కథలో రాయడంలో కవులకు ఎంతో మక్కువ పెరిగింది. కవులు చెప్పదలుచుకున్న విషయాన్ని తమ కథల ద్వారా ప్రజలకు దగ్గరయ్యే విధంగా వారి వారి మాండలికల్లో, యాసలలో, భాషా సొగసులతో ఎన్నో రచనలు చేశారు. అందులో పేర్కొనదగిన వారిలో దేవరాజు మహారాజు గారు ఒకరు. సాహిత్యంలో వారు రాసిన కథలకు విశేషమైన ప్రత్యేక స్థానం కలదు.

**విషయ విశ్లేషణ :**

మంత్రం అనే కథలో ఆనాటి సమాజంలో పేట్రేగిపోయినా మూఢనమ్మకాలలో మునిగిపోయిన ప్రజలు

ఉచితంగా నాటు వైద్యం లభిస్తుందని ఆశతో మంత్ర తంత్రాలతో వైద్యం చేసే పూజారి మోసాలను ఈ కథలో పొందుపరిచాడు రచయిత.

తన సొంత మనుగడకు ప్రజలు నమ్మకం అనే బలహీనతను తాను బలంగా చేసుకొని పూజారి వైద్యం చేయడం ఈ కథలో కనపడే ప్రధాన అంశం. తన పిల్లకు బాగోలేదని వాంతులు దగ్గరకి సుఖం మా వైద్యం చేయించడానికి వస్తుంది "ఆ పిల్ల అది నల్లగా బక్కగా ఎండిపోయిన చింతపండులే" అంటే ఆ పిల్ల శరీరం ప్రాణాలు కొంచెం కొంచెం వ్యాధి వలన బలహీనమవుతుందని చెప్పండి ఇంకా ఆ పిల్ల అనారోగ్య పరిస్థితి స్పష్టంగా తెలుస్తుంది. కొన్ని రోజుల క్రితం పూజారి ఇల్లు కడుగుతున్నాడని సుక్కమ్మ తెలుసుకొని పని కోసం వెళ్తే "నువ్వెందుకు వచ్చినవే? అంటూ ముట్టుడయితది పో పో మాకు ఇంట్లో కలిసినా కూలోల్లు గావాలి" అని సుఖమని వెళ్ళగొడతాడు బ్రతుకుతెరువు కోసమని సుక్కమ్మ పంతులు దగ్గరికి పనికి వస్తే చీదరించుకుంటూ తక్కువ కులం దానివని నిందించిన పంతులు వైద్యం కోసమే అతను దగ్గరకు పోతే ఏం బిడ్డ ఏం కావాలి అంటా అని అడిగి తెలుసుకుని కొల్ల పేయి చూసి చెప్పిండు పోరికి ఏం కాదు జర శాంతి చేయాలే. పోతది ఏదో గాలి సోకింది. సూడ పానాల కండ్లకొచ్చినయి. రేపురా తాయిత గడ్త. ఆరంగూడా మంచిగున్నది సుక్రరం గడితే మంచిగుంటది. గాసామాన్లు దీస్కోని రేపు గీయాల్లకు రాసో"ర్ అని నెమ్మదిగా శాంతంగా చెప్పాడు. పై రెండు వాక్యాలలోని విషయాలు సమాజంలో గల అంటరానితనం, అస్పృశ్యతను గూర్చి తెలియజేస్తున్నాయి. పనికని వస్తే మాత్రం అంటరానిది. వైద్యం చేయించుకోవడానికి మాత్రం బిడ్డ అని పలకరించి వారిని అప్పుడు ముట్టుకున్నా ఏం కాదు. ఎందుకంటే తనకు వచ్చే లాభం ఎక్కడ పోతుందేమోనని భయం. పనికి కులం వద్దు వస్తుంది. వైద్యానికి మాత్రం అడ్డురాదు. కులం సమాజంపై పూజారి లాంటి కుల పీడితలు చాలామంది ఉన్నారు. కానీ పైకి మాత్రం మాకు అవన్నీ పట్టింపులు ఏమీ లేవని సభలలో ఉపన్యాసాలు ఇస్తారు.

"సామాన్లెందేవాలె? బత్కలేన్దాన్ని ఏం దీస్కోక మంత్రమేసి తాయితగడ్తనని మొన్నగే సోములన్న అందరికీ సెప్పినట్టుగా నాకు జేస్తే" అని అంటే "పంతులు లేత శింతకాయ పులుసొలెనగిండు" అనే ఒక్క ఈ వాక్యంలో అతని స్వభావం గురించి చెప్పాడు రచయిత. తనను తన నవ్వు ఎంత మోసపూరితంగా తెలుసుకోవచ్చు. అలా నవ్వి నాకు ఏమీ వద్దు నేను ఊరికినే మంత్రం వేస్తాను కానీ పోచమ్మకు కోడిపిల్లని హరామియ్యాలని కట్టమైసమ్మకు కళ్ళు పోయాలని చెప్పి, ఊదు పొగాకు రాణి డబ్బా తయారు చేసినందుకు అవుసలోనికి ఇవ్వాలని అబద్ధం చెప్పి వీళ్ళు ఇచ్చే డబ్బులతో, మంత్రానికని ఇచ్చే సామాను తీసుకొని వాటిని తన ఇంటికి ఉపయోగించుకుంటూ ప్రజల సొమ్మును దోపిడీ చేస్తున్నాడు. ఇదంతా తెలియక సుక్కమ్మ, పంతులు జీతగాడైన సోములు చెప్పాడని వస్తే అక్కడ జరిగే మోసాన్ని గ్రహించి, ప్రజల నోరుకొట్టి పంతులు కొత్త ఇంటిని కట్టాడని తెలుసుకుంటుంది. ఈ పంతులు చేసే మోసాన్ని చూడలేక సహించలేకపోయింది. సుక్కమ్మకు పంతులు చూస్తే భవిష్యత్తులో పంతులు డబ్బుకు ఆశపడి ఎవరికో విషం పెట్టడానికి ఆ కుట్రలో పాల్గొన్నందుకు పోలీసులు అతనికి బేడీలు వేసి తీసుకెళ్తున్నట్లు తన భర్త గూడెంలో ఉన్న వాళ్లంతా పంతులు పై దాడి చేయటానికి వస్తున్నట్లు అనిపించింది. యజమానులు చేసే అన్యాయాలలో వారి జీతగాళ్లు కూడా ఇలా పాలుపంచుకున్నందుకు సోమల లాంటి వాళ్లకు నాశనం తప్పదని అనుకొని అక్కడ నుంచి వెళ్ళిపోతుంది. అక్కడకు వచ్చిన ప్రజలకు చైతన్యం కలగడం ప్రారంభమైందనే విషయం నాందిగా సుక్కమ్మ అక్కడి నుంచి వెళ్లిపోవడాన్ని రచయిత ప్రస్తావించారు.

'కండ్లు దెరిచిన నెత్తురు' కథలో మనకు కనబడతారు. ఈ కథలో రెండు తరాలకు సంబంధించిన వైద్య విధానాన్ని గురించి మనం గమనించవచ్చు.

ఈ కథ కూడా మొదటి కథలాగే ప్రథమ పురుషలో సాగుతుంది. ఈ కథలో నరసింహుడు నాన్న పాత్రకు పేరు లేదు. కానీ ఈ కథంతా ఆయనే ఉంటాడు ఆ పాత్రను నరసింహుడు నాన్న అని మాత్రమే ఉంది. ఈ కథలో డాక్టర్ ద్వారా జరిగే మోసాన్ని గూర్చి నరసింహుడు భార్య లక్ష్మి వాళ్ళ మామకు చెప్తే వాళ్ల మామ కాలంలో మంత్రాల వల్ల జరిగే మోసాన్ని నరసింహుడు నాన్న వాళ్ళ కోడలైన లక్ష్మితో చెబుతాడు. అంటే ఎవరి కాలాల్లో జరిగే మోసాన్ని ఇద్దరు పరస్పరం చెప్పుకుంటారు.

నరసింహుడు వాళ్ళ నాన్న వేరే ఊళ్ళల్లో ఉంటారు. నరసింహున్ని, వాళ్ళ భార్య లక్ష్మిని పిల్లలను చూడటానికి వెళ్తాడు నరసింహుడి నాన్న. కథ ఇదా మొదలవుతుంది. "ఇంటికి ఎంత పొద్దుడంగనే చేరుకున్న పాయే తలకు కొడుకు నర్సింహుడు లేడు. కోడలున్నది. కాళ్లకు నీల్లిచ్చింది అత్తమ్మ గిట్ల అందరూ బాగున్నారాంటని అడిగింది".

ప్రేమానురాగాలను, ఆప్యాయతలను వారి బాగోవులను గురించి అడగటం, పలకరించటం అనేది మన భారతీయ సాంప్రదాయం, రచయిత మానవ సంబంధాలను గురించి మన ఆచారాల వ్యవహారాలకు, విలువలకు ప్రాణం పోశారు. ఈ వాక్యం మన మత ఆచార సాంప్రదాయాలు ఏ విధంగా ఉంటాయో అనే విషయం తెలుస్తుంది. "పొద్దు మూకింది కల్లు బొట్టు యాల్లయ్యింది. కానీ ఈడయేడ దొర్కుతది? ఇగ అడిగెలేదని పిచ్చుకొనుడెందుకు? వాళ్లను బేజారు చేసుడు. ఇక గమ్మున వూకోని చాయ్ తాగిన" ఇక్కడ మనకు పల్లెటూరి వాతావరణం కనిపిస్తుంది. ఎండకు కాయ కష్టం చేసే వారికి తెల్లవారుజాము నుండి చీకటి పడే వరకు వాళ్ళ పొలంలోనే ఉంటారు. కాబట్టి తెలంగాణ ప్రజలకు కొంతమందికి సాయంత్రం అయ్యేసరికి వారికి కల్లు గుర్తుకు వస్తుంది. అంటే ఆ కల్లు తాగి వారు అలసట మరిచిపోతారు అనుకుంటారు.

చిన్న బుజ్జి లేదు పడుకుందా? అని వాళ్ళ మామ అడిగినప్పుడు లేదు జ్వరం వాంతులు అయ్యాయి. మంచంలో ఇంతకుముందే పడుకుందని చెబుతుంది. అప్పుడు వాళ్ళ మామ మన ఇంటి ముందున్న డాక్టర్కు చూపించారా? అని అడిగినప్పుడు ఆ డాక్టర్ చేసిన మోసాన్ని గురించి కోడలు ఎలా చెబుతుంది. ఆ డాక్టర్‌కు వైద్యం రాదని పెద్ద డాక్టర్ కోర్స్ చేసిన వాడిలా అందరినీ నమ్మించి చారాననో, ఆరాననో మందిచ్చి మూడు నాలుగు రూపాయలు తీసుకుంటాడు. అందులో ఏదో ఒకటి పనిచేసి తక్కువైనట్టు అనిపిస్తుంది వాళ్లకు. కానీ ఆ పిల్లవానికి తొడకు సూది గుచ్చుకుంటే ఆ డాక్టర్ వస్తా సూది తీయకుండానే తీశానని వేరే సూది చూపించి వారి దగ్గర బాగా డబ్బులు తీసుకున్నాడు. కానీ ఆ నిజం తెలుసుకున్న తల్లిదండ్రులు వేరే హాస్పటల్‌కి తీసుకెళ్లి అక్కడ సూది తీయించారు. ఆ తర్వాత ఇతనిపై కేసు పెట్టారని చెబుతుంది.

ఇలా చేసిన వారు బాగుపడరని తిడుతూ లక్ష్మికి వాళ్ళ మామ కూడా వారి కాలంలో జరిగిన మోసాన్ని "మా కాలంలో యేమున్నది? అంతా గొర్రెదాటేనామె. అవునంటే అవును. కాదంటేకాదు ఛాదస్తాలు, నమ్మకాలు ఉండే. గీ వెంకటరమణ అసుంటోడు, మెల్లమెల్లగా జనుల కమూరేమున్నది? ఆయువుపట్టు యేంటివేంటివని శిన్న శిన్నగ గుంజుకొని ఆటాడిచ్చేది" వెంకటనారాయణ కూడా మంత్రాలు, తాయెత్తులు, ఊదు పొగలతో రోగాలను తగ్గిస్తాడని ప్రజలు నమ్మేవారు. ఏదో మంత్రం వేసేది తాయత్తు కట్టేది విభూది పూసేది చేతి కట్టను పైనుండి కింద దాకా ఒళ్ళు పై రాసి భూమ్మీద కొట్టేది. ఏ రోగానికైనా ఇలానే చేసేవాడు. ఒకరోజు రెడ్డి జీతకానికి పాము కరిసింది. అది కరిసిందో తాకిందో తెలియదు గానీ వెళ్లి వెంకటరమణను పిలుసుకుని రమ్మని చెబితే ఏముంది మంచిగా కల్లు తాగుతూ "ఇపుడు నేనేడొన, మా ఇంటికి బోయి పడమటి సాయంబాన నా చేతి కట్టే కొయ్యకున్నది. కొంచవాయివొల్లె దల్పుంద్రి అని అలా చేస్తే వాడు బతికాడు. ఇంకా ఆ కట్టెకు పూజలు చేసేవాళ్ళు. మా తమ్మునికి నిజంగా దానిలో మంత్రాలున్నాయని, నమ్మి దానిని మనకి తెలియకుండా తీసుకొచ్చాడు.

ఆ కట్టే పోయినందుకు వెంకటనారాయణ ఆ కట్టెతీసుకున్న వారి వంశం నాశనంఅవుతుందని తిట్టడం మొదలుపెట్టాడు. ఆ కట్ట తెచ్చినప్పటి నుండి మా తమ్మునికి అంతా నష్టం జరగడం వలన భయపడి వారి బిడ్డ అనారోగ్యంతో దాన్ని బ్రతికించమని వేడుకున్నాడు వెంకటనారాయణను. కానీ వాడు మా తమ్ముని తిట్టి పైసలు ఎక్కువగా తీసుకొని బిడ్డను బతికించలేదు. ఇదంతా నాకు తెలియదు. నేను వచ్చేసరికి మా తమ్ముడు ఏడుస్తూ జరిగినదంతా నాతో చెప్పాడు. ఇంకా కోపంతో వాడి ఇంటికి వెళ్లి మంత్రాలు కట్టెను విరిచి మంటల్లో వేసి తాయత్తులను, విభూతులను పెంటలో పడవేశాను. ఆ మంత్రం కట్టె అంటే ఏంది మన తెలివి తక్కువ తనం, పిచ్చి మాత్రం అనే వాస్తవాన్ని గ్రహించి ఆ మంటల వెలుగులో అందరి మూఖాలు ఎర్రబడ్డాయి. వారి శరీరాల్లోని నెత్తురు కండ్లు తెరిచింది. వారిలో సామూహిక చైతన్యం కలిగింది.

ఈ కథలో మొదటి తరంలో ఉన్న వైద్యులు మంత్రాల కట్టుతో వైద్యం చేయడం మంత్రాల తాయత్తుల ద్వారా ప్రజల్ని మోసం చేయడం కనబడుతుంది.

రెండవ తరం వచ్చేసరికి అరకొరగా వైద్యం నేర్చుకుని అంతంత మాత్రం వైద్యం చేసి పేషంట్లను ఇబ్బందులకు గురి చేయడం మనం చూడవచ్చు. అంటే మూఢనమ్మకాలతో మొదటితరం వాళ్ళు మంత్రాలు మంత్రాల కట్టే తాయత్తులతో మోసపోతే, ఆధునిక కాలంలో వాటికి బదులుగా వాటి స్థానంలో సూదులు, మందులతో ప్రజలను మరింతగా మోసం చేసేవారిని ఈ కథలో తెలుసుకోవచ్చు. ఇక్కడ వైద్య విధానంలో జరిగే మోసంలో తేడా రాలేదు. కానీ వైద్య పరికరాల్లో తేడా రావటం గమనించవచ్చు. అంతేకాకుండా పల్లె జీవనానికి, పట్నం జీవనానికి తేడా కూడా చూపించారు రచయిత.

‘‘ఇదేం తిండి ఏం కథ’’ మంచిగ ఉన్న ఊర్లుంటే ఎవ్రసంమీదొచ్చిన సాంబ బియ్యం... పెరట్లో గాసే కాయగూర, బర్రె పాలు, పెరుగు ఏంటయినా దానిమీద కెట్లొస్తది? ఎన్ని పైసలు పోస్తే ఏంది? దుక్నం మీద్ది దుక్నం మీద్దానోల్లెనె ఉంటది. ఇంట్ల ఎట్లుంటది అని అనుకున్నాడు. ఊరిలో అయితే అన్ని పొలంలో పండుతాయి. కాబట్టి కొనవసరం లేదు. పాలు పెరుగు కూడా పుష్కలంగా దొరుకుతాయి. అదే పట్నంలో ఎన్ని డబ్బులు పెట్టినా అంత మంచిగా ఉండదు. ప్రతిదీ కొనడం. కొన్నది కొన్న దానిలానే ఉంటుంది. బ్రతుకుతెరువుకై ఊళ్లను వదిలి బయటకు వచ్చిన వాళ్ళ పరిస్థితి ఈ కథలో స్పష్టంగా తెలియజేశాడు రచయిత.

ఈ కథలో కల్లు ప్రస్తావన రెండుసార్లు వచ్చింది. అంటే ప్రజలు కల్లుకు ఎంతగా అలవాటు పడ్డారో తెలుస్తుంది. ఒకరోజు తాగకపోతే దాని మీదకి ప్రాణం గుంజడం. అలాగే అక్కడ పాము కలిసి ప్రాణాలు పోతున్నాయని చెప్పినా కల్లు తాగుతూ నింపాదిగా కూర్చొని వైద్యం చేయడానికి రా బాబు అంటే ఇంటి దగ్గర నా చేతి కట్టే ఉంది. దాన్ని తీసుకెళ్లి నీవు అంతా నిమ్మరపో అని చెబుతాడు. అంటే ప్రాణాల కంటే కల్లు ముఖ్యం ఇతనికి. ప్రజలు బాగా కల్లు తాగే వారిని తెలుస్తుంది ఈ సంభాషణ ద్వారా.

**ముగింపు :**

కడుపు కోత కథ సంపుట్లో మొత్తం 10 కథలు ఉన్నాయి. రచయితల దృష్టికి వచ్చిన ఆనాటి సామాజిక పరిస్థితులను నాటి కాలంలో జరిగే అన్యాయాలను, అక్రమాలను, అమాయక ప్రజల దైనందిత జీవితాలను మనకు కళ్ళకు కట్టే విధంగా తనదైన శైలిలో భాషలో అందరి ఆకర్షించే విధంగా రాశారు.

ఈ కథ సంపుట్లో కొన్ని కథలు వైద్యం పేరుతో జరిగే అన్యాయాలను గురించి, కొన్ని కథలు దొరల దౌర్జన్యం గురించి, మరికొన్ని కథలలో రాజకీయ నాయకుల వ్యక్తిత్వాలను గురించి ఉన్నాయి, ఈ కథలలో కొన్ని చోట్ల వస్తువు ఒకటిగా కనిపించిన జరిగే మోసాన్ని పలు కోణాల్లో తెలిపారు.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. అప్పారావు గురజాడ, కథానికలు, విశాలాంధ్ర బుక్ హౌస్.
2. ఈశ్వరరావు శెట్టి, హైదరాబాద్, 2021.
3. గురజాడ రచనలు కథానికలు, విశాలాంధ్ర పబ్లిక్ సింగ్ హౌస్, విజ్ఞాన భవన్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్, ప్రథమ ముద్రణ 1984.
4. కృష్ణకుమారి డి, డాక్టర్ దేవరాజు, మహారాజు ఆవరణం, జీవన ప్రచురణలు, హైదరాబాదు, మొదటి ప్రచురణ 2011.
5. కృష్ణకుమారి డి, డాక్టర్ దేవరాజు, మహారాజు (సాహితీ స్వర్ణోత్సవ సందర్భంగా 1942-2010)
6. కృష్ణమూర్తి, బద్రిరాజు వ్యాసాలు, జీవన ప్రచురణలు, హైదరాబాద్, మొదటి ప్రచురణ, 2011.
7. తెలుగు భాషా చరిత్ర, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 2004.
8. తిరుమల రావు, జయధీర్ జీవన్, ఇప్ప పూలు, ప్రతిభ ప్రచురణలు.
9. దక్షిణామూర్తి పోరంకి, తెలుగు కథానిక స్వరూప స్వభావాలు, జగదా-శిఖరం అండ్ అవరల్ చిరుకథలు, నెంబర్ 24, కృష్ణస్వామి వీధి, పాండీబజార్, త్యాగరాయ నగర్, చెన్నై.


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*



# ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారి నవలలు – దళిత స్త్రీ పోరాట గాథలు

డా॥. సురేఖ దుగులూరు
పాఠశాల సహాయకులు (తెలుగు), ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, సత్యవేడు.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహం :**

ఇనాక్ గారి రంధి, వలస, పైమెట్టు నవలల్లో దళితస్త్రీలు కులవివక్ష, లింగ అసమానత, ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కోవడం గమనించవచ్చు. వీరు కేవలం బాధితులు మాత్రమే కాదు హక్కుల కోసం పోరాడే శక్తివంతమైన వ్యక్తులు కూడా అన్నది ఈ వ్యాసంలో స్పష్టంగా కనిపిస్తుంది.

**కీలక పదాలు :**

దళిత స్త్రీలు, కులవివక్ష, లింగ అసమానత, హక్కుల కోసం పోరాటం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం మొదలైనవి.

**ప్రవేశిక :**

ఇనాక్ గారు దళిత స్త్రీ చేత మలచబడిన మేలి శిల్పం, కష్టాలు, ఆటుపోట్లను ఎదుర్కొని కష్టించి పైకి వచ్చినవారు కనుక స్త్రీ సమస్యలు, అందునా దళిత స్త్రీ ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటుందో తెలుసు. దళిత స్త్రీ ఆత్మస్థైర్యం మనుగడ, జీవన విధానం, బ్రతుకు పోరాటం చూస్తూ, వింటూ పెరిగారు. కావున వారి నవలల్లో దళిత స్త్రీల పోరాట గాథలు వైవిధ్యభరితంగా ఉండడాన్ని మనం గమనించవచ్చు. దళిత స్త్రీల స్థితిగతులు, వారు సంఘంలో బ్రతకడానికి ఏ విధంగా పోరాటం చేస్తున్నారన్నది తెల్పడమే ఈ వ్యాస ఉద్దేశ్యం. ఒక వ్యక్తి బ్రతకడానికి చేసే పోరాటమే బ్రతుకు పోరాటం. ఇనాక్ గారి మూడు నవలల్లో స్త్రీల పోరాట గాథలు ఏవిధంగా ఉన్నాయో చూద్దాం!

అవి 1) రంధి - సువ్వి

2) వలస - రమ

3) పైమెట్టు - రవ్వ

**1. రంధి**

నవలలో వేజండ్ల మాదిగ పల్లెకు చెందిన సువ్వి, గుంటూరులో ఆడపిల్లల హైస్కూల్‌లో చదువుతుంటుంది. ఆడపిల్ల, అందునా మాదిగ పిల్ల గుంటూరులో చదవడం జీర్ణించుకోలేకపోతాడు రాముడు. అదే గ్రామానికి చెందిన నాంచారయ్య, లచ్చిందేవిల కొడుకు రాముడు. వీరికి మాదిగలు అంటరానివారు. ఒకే కొడుకు కావడం వల్ల, కులంలోనూ, ధనంలోను గొప్పదనం ఆపాదించుకోవడం వల్ల, దేనినైనా డబ్బుతో కొనవచ్చు అనే అహం తండ్రి నుంచి సంక్రమించి మనుషులందరూ జీతగాళ్లే అనే భావన రామునిలో బలపడి, అతని దుష్ట చేష్టలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది.

రాముడు సువ్వి రైలెక్కడం చూసి, పేరు అడిగి "నేను ఎక్కిన రైలు పెట్టెలో ఇవ్వాళ ఎక్కితే ఎక్కావు గానీ, రేపు నేనెక్కే పెట్టెలో ఎక్కవద్దు" (26) నీ ముఖం చూస్తే కంపరంగా ఉంది అన్నాడు. దళిత స్త్రీ తనతో సమానంగా రైలెక్కడం ఏమిటి? అన్నది రాముని భావన.

డాబా సత్తెయ్య జీతగాడుగా పేరు పొందిన చందిరికి తల్లిదండ్రులు లేరు. చందిరి మూగవాడు. కానీ చెవులు బాగా పనిచేస్తాయి. డాబా సత్తెయ్య మేడ పక్కనే సువ్వి ఉండడం వల్ల సువ్వి, చందిరిలు కలిసి మెలిసి పెరిగారు. చందిరి రోజా సువ్విని రైలెక్కించి, తిరుగు ప్రయాణంలో తీసుకెళ్తుండేవాడు. ఒకరోజు సువ్వితో గుంటూరు రైలెక్కిన చందిరి, సువ్విని కొట్టడానికి రాముడు చేయ్యెత్తాగా కొట్టేలోపే చందిరి రాముడి చేతిని ఉండుంపట్టులాగా పట్టగా, తేతిని విదిలించుకోలేక గిలగిలా, తనకలాడాడు రాముడు. అందుకే రాముడి బలం వాళ్ళ నాయన ఆస్తిలో ఉంటే, చందిరి బలం వాడి వంట్లో ఉంది" అంటాడు రచయిత.

దళితుల్లో ఆడపిల్లలకు పేదరికం కారణంగా, సాంఘిక పరిస్థితుల కారణంగా చిన్నవయస్సులోనే పెళ్ళి చేసేస్తారు. లేదా చదువు ఆపేస్తారు. అలాగే థర్డ్ ఫారమ్ చదువుతున్న సువ్విని కూడా చదువు మాన్పించి ఇంటికే పరిమితం చేయాలనుకున్నారు తల్లిదండ్రులు. కానీ సువ్వికి చదువుమానడం ఇష్టం లేదు. అందుకే ఏడ్చి, మొండికేసి "ఎస్.ఎస్.యల్.సి. పాసయ్యి, సెకండరీ గ్రేడు టీచర్ ట్రయినింగ్ పూర్తి చేసి, టీచర్‌ను అవుతా, ఆపైన పెళ్ళి చేసుకోవచ్చు" అని తల్లిదండ్రుల్ని ఒప్పించి చదువుకొనసాగించడం మంచి పరిణామం. బాల్యవివాహాలకు బలౌతున్న ప్రతి బాలికకు సువ్వి ఆదర్శం. రైలులో ఒకసారి బడికి వెళ్ళి వస్తున్న సువ్విని వాటేసుకోవాలనుకొని పట్టుతప్పి, నేలపై పడబోతే జీతగాడు కాపాడుతాడు. అప్పుడు సువ్వి ఎందుకురా గాడిద నా మీద పడ్డావు? అంటే నువ్వే నన్ను పడేశావే అంటూ అసభ్యపదజాలం వాడతాడు. సువ్విపై ఇష్టం ఉన్నా, దళిత స్త్రీ కనుక పెళ్ళి చేసుకోడు. అగ్రకుల మగవాళ్ళకు దళిత స్త్రీ పెళ్ళికి పనికిరాదు. కాని కామించడానికి, కౌగిలించుకోవడానికి పనికి వస్తుంది.

రాముని చెయ్యి, సువ్వి ఉరస్థలిని తాకగా, తన ఆడతనం చెయ్యెత్తి చంపపై ఈడ్చి కొట్టేలా చేసింది. దాంతో "నిన్ను నెత్తురు కారేట్టు చరచకపోతే నా పేరు రాముడే కాదు" (40) అని ప్రతిజ్ఞ చేశాడు. దాన్ని ఖండించాల్సిన నాంచారయ్య శభాష్ అన్నాడు. నాటి నుంచి సువ్వి శీలంతో బ్రతకడానికి పోరాటం చేసింది. ఈ ప్రతిజ్ఞతో సువ్వి చదువుకు ఆటంకం ఏర్పడింది. ఇక్కడే "అంటరాని అత్యాచారం" (1996) అనే కవితలో "ఇప్పుడు చెప్పండి / ఈ దేశంలో హత్యలకి / అత్యాచారాలకి సైతం / అంటరానితనం లేదంటారా?" అన్న చల్లపల్లి స్వరూపరాణి ప్రశ్న పాఠకుల్ని ఆలోచింపజేస్తుంది.

నిజానికి సువ్వి దళిత స్త్రీ. ఆమెను రాముడు కోరుకుంటున్నాడు. అగ్రవర్ణ పురుషత్వానికి బలైన స్త్రీగా ఆమెను కోరుకుంటున్నాడు. రాముని ప్రతిజ్ఞ, నాంచారయ్య, వంత పాటతో సువ్విని బడి మాన్పించి, పెళ్ళి చేసి పంపాలన్న ఆలోచన సువ్వి తల్లిదండ్రులకు కలిగింది. ప్రతిజ్ఞ నెరవేరకముందే పెళ్ళిచేయాలని, చుట్టుప్రక్కల పల్లెల్లో సంబంధం

వెతికితే, ప్రతిజ్ఞ మాట తెలిసి, మాటతప్పని నాంచారయ్య వారసత్వాన్ని తలచి, ఎవరూ సువ్విని పెళ్ళిచేసుకోవడానికి ముందుకు రాలేదు. అప్పుడు సువ్వి రెండుసార్లు రాముని నుండి తనను కాపడిన చందిరి తనకు భర్త అయితే రాముని భరతం పట్టగలడని, భావించి తల్లిదండ్రులను ఒప్పిస్తే చందిరితో పెళ్ళి నిశ్చయమైంది. తాను పెళ్ళి చేసుకోబోతున్న అమ్మాయి శీలాన్ని కాపాడమని చందిరి ప్రాధేయపడినా, నాంచారయ్య, మాట తప్పలేదు. తెల్లారితే పెళ్ళి అనగా, కాలకృత్యాలు తీర్చుకోవడానికి తాటి తోపుకు వెళ్ళిన సువ్విని గాయపరచి, రక్తపు ముద్దలా పడి వున్న సువ్విని స్పృహ తప్పేలా చేసి, చెరిచాడని పల్లెంతా అనుకునేలా చేసి వెళ్ళిపోయాడు రాముడు. ఇంత జరిగాక చందిరి సువ్విని పెళ్ళాడతాడో లేదోనని, పెళ్ళిపందిట్లోని జనం అనుకుంటుండగా, చందిరి సువ్విమెళ్ళో తాళి కట్టి, ఆమెకి భర్త అయ్యాడు.

పెళ్ళి జరిగాక, సువ్వికి జరిగిన అన్యాయానికి జరిమానా విధించి, ఆ సొమ్మును రాముడే నేరుగా సువ్విని ఇచ్చే ఏర్పాటు చేస్తే, సువ్వి ఆ డబ్బు తీసుకోకుండా నిరాకరిస్తే, డబ్బు జారి గాలికి ఎగురుతుంది. అలా ఎగరడాన్ని విసిరి ముఖాన కొట్టినట్లు భావించి "సువ్వీ నిన్ను చెరిసి, పీకపిసికి, చంపి రైలుకింద పెట్టకపోతే విననేను రాముణ్ణే కాదు" (192) అని మళ్ళీ ప్రతిజ్ఞ చేశాడు. పెళ్ళయ్యాక తప్పించుకుందనుకున్న సువ్వి, మళ్ళీ బ్రతుకు పోరాటం చేయాల్సి వచ్చింది. అన్నట్టుగానే రాముడు ఒకసారి కత్తితో, రెండుసార్లు విషప్రయోగంతో సువ్విని చంపడానికి ప్రయత్నించగా, మూడోసారి చంపాలనుకున్నప్పుడు రామున్ని చందిరి వెంటాడి అసహజ మాన భంగం చేయబోగా, సువ్విని చెరచలేదు. గాయపరిచాను అనే నిజాన్ని చెప్పి, చందిరి పెట్టిన ప్రాణభక్షితో బ్రతకలేక, రైలుకింద పడి చనిపోతాడు.

కవయిత్రి చల్లపల్లి స్వరూపరాణి అన్నట్లు దళిత స్త్రీ "ఒక వైపు కులపరమైన అణిచివేతతో పాటు అదనంగా జెండర్ అనిచివేతకు, వర్గపరమైన దోపిడికీ గురౌతూ దళితుల్లో దళితగా అట్టడుగు స్థాయికి నెట్టవేయబడింది". ఇక్కడ సువ్వి కూడా కుల వివక్షనూ, జెండర్ వివక్షను అనుభవించింది. సువ్వి స్త్రీ కాకుండా, పురుషుడైయ్యుంటే మానభంగం చేస్తానని రాముడు ప్రతిజ్ఞ చేసేవాడు కాదు కదా! ఆచార్య కొలకలూరి మధుజ్యోతి గారు అన్నట్లు "దళిత పురుషుడు పోరాడే అస్పృశ్య అవమానాన్ని ఈస్త్రీ పొందుతుంది. సాధారణ స్త్రీ పొందే లైంగక వివక్షా పొందుతుంది. ఈ రెండు సమస్యలతో దళిత స్త్రీ ప్రయాణం నిరంతరం రెండు కత్తుల మధ్యే" అన్న మాటలు అక్షర సత్యాలు. ఇక్కడ సువ్వి లక్ష్యం గల స్త్రీగా కన్పిస్తుంది. రాముడు ఉన్నన్ని రోజులు తన బ్రతుకు నిలుపు కోవడం కోసం పోరాడింది. రాముని మరణం తర్వాత భర్తని ఒప్పించి, లక్ష్యం కోసం చదువుకోవడానికి వెళ్తుంది.

**2. వలస**

అనగానే ఈ మధ్య గుర్తుకొచ్చే పదం వలసకూలీలు. ఎక్కడ నుంచో పిల్లా జెల్లలతో పొట్ట చేత పట్టుకొని, పొట్ట కూటికోసం పెద్ద పెద్ద పట్టణాలను వలన వచ్చిన వలస కూలీలు, బ్రతుకుదెరువు లేక స్వగ్రామాలకు వెళ్ళలేక ఇబ్బందులు పడుతుంటే, సోనూసూద్ లాంటి దయామయులు, వీరిలో కొందర్ని సొంతగూటికి చేర్చి, వారి కళ్ళల్లో ఆనందాన్ని నింపారు. ఎంతో మంది కాలినడకన బయలుదేరడం చూశాం. సామాన్యులం కాబట్టి ఊరుకున్నాం. ఈ సంఘటనకు చలించింది కవి హృదయం. తత్ఫలితమే వలస నవల. ఈ నవలలో ఉన్న వలస కూలీలంతా దాదాపుగా దళితులే. ఆ వలస కూలీల్లో ఒక సమూహం రతన్ నాయకత్వంలో హైదరాబాద్ నుండి ఆదిలాబాద్ మీదుగా బీహార్ లోని ససారం ప్రాంతానికి బయలుదేరింది. ఆ సమూహంలోని దళిత స్త్రీనే రమ.

ససారం దగ్గరలోని పల్లె రమ స్వగ్రామం. రమ ఒక్కటే కూతురు తల్లి లేదు. తండ్రి రోగిష్టి ఎస్.ఎస్.సి. వరకు హాస్టల్‌లో ఉండి చదువుకున్న రమకు పదహారో ఏటే పెళ్ళి చేశారు. భర్త సదానందంతో కలిసి, హైదరాబాదుకు వచ్చిన రమకు మూడేళ్ళకు ఒక కొడుకు పుట్టాడు. కొడుకు పుట్టిన సంవత్సరానికి భర్త పాము కాటుకు గురియై

గతించాడు. భర్తతో కలిసి హైదరాబాదు వచ్చిన రమ, భర్తను పోగొట్టుకొని కొడుకుతో కలిసి, బ్రతుకుదెరువు లేక హైదరాబాదు నుండి బయలుదేరింది.

సగటు స్త్రీకి భర్త అన్న భరోసా లేకపోతే, సమాజంలోని ప్రతి మగాడు ఆమెకు ఇష్టం ఉన్నా, లేకపోయినా ఆమెను కోరుకుంటాడు. భర్త ఉన్నప్పుడు 'బహెన్' అని సంబోధించిన కిశోర్‌కి కూడా ఇప్పుడామె కావాలి. భర్తతో కలిసి ఇటుక ఆవలో పనిచేసే రమ, భర్త గతించాక ఆవలో పని వదిలి, ఇల్లు కట్టుబడి పని కూలీగా కుదిరింది. అప్పటి నుండే రాం అనే 30 ఏళ్ళ మంచి ఆలోచనాపరుడితో పరిచయం ఏర్పడింది.

రతన్ సమూహంలో ఎక్కువ బరువు మోస్తున్న స్త్రీ రమ. సుకుమారి అయిన రమను నువ్వు ఇంతదూరం నడపగలవా అని రాం అంటే నడవగలను రోజుకు 100కి.మీ. నడిస్తే, రెండు వారాల్లో ఊరు చేరవచ్చు" అని ధీమాగా ఐదు సం॥ల కొడుకును ఎత్తుకొని రతన్ సమూహంతో కాలినడకన ససారం బయలుదేరింది. ఒళ్ళంతా చెమటతో నిండినా, నెత్తిపై మూట, వీపు మీద బేక్‌పాక్‌తో, భుజంపై కొడుకుతో వెళ్ళున్న రమను చూస్తే, దళిత స్త్రీ ఎంత కష్టాన్నైనా అలవోకగా ఎదుర్కొనగలదని అన్పిస్తుంది. భర్త ఉన్నన్ని రోజులు తనని సోదరిగా భావించిన కిశోర్, వంకర చూపులు చూస్తున్నాడని తెలిసినా, అతని వల్ల ప్రమాదం ఉందని తలచినా, ధైర్యంగా బయలుదేరింది. కిశోర్ తనకు పక్కనున్న ప్రమాదం అయితే, మార్గమధ్యంలోని చాలా మంది అన్నదాతలు, యువకులు ఆమెకు పరోక్ష ప్రమాదాలు. ప్రతివారూ ఆమె అందానికి దాసోహమయిన వారే. దారిలో రమ ఆడతనంపై ఎందరి కళ్ళు పడ్డాయో, అయినా భరించింది. రతన్ సమూహం విడిది ఏర్పాటు చేసుకొన్న చోట నడిచి నడిచి ఆదమరచి అందరూ నిద్రపోతుండుగా, కిశోర్ ఆమెపై చెయ్యి వేశాడు. తన్నులు తిన్నాడు. అలాంటి వాడి చేత కూడా చివరికి చెల్లీ! అని పిలిపించుకుంటుంది.

రమ భర్త లేకపోయినా ఊరుగాని ఊరిలో ధైర్యంగా బ్రతికింది. ఎక్కడా ఎలాంటి తప్పు చేయలేదు. దారిలో ఎంతో మంది ఆమెను మోహించి, మోసం చేయాలని ప్రయత్నించినా ఎక్కడా మోసపోకుండా, వారందరి చూపులు భరిస్తూ, రాం అండతో స్వగ్రామం చేరింది. కాలినడక ప్రయాణంలో ఒకర్ని ఒకరు అర్థం చేసుకున్న రమ, రాంలు రాం స్వగ్రామం అయిన రాంపూర్ ఊరిబయట రమ తండ్రి, రాం తల్లుల సమక్షంలో ఒకటై, ససారం నుండి బ్రతుకుదెరువు కోసం భర్త రాం, కొడుకు జయేష్‌లతో కలిసి హైదరాబాదుకు బయలుదేరింది. ఇక్కడ రమ సమాజం అనే వ్యవస్థతో పోరాడి జీవితాన్ని నిలుపుకుంది. ఇరులలో విరులు నవలలో రమ ఎంత జాగ్రత్త మనిషో, వలస నవలలో రమ కూడా అంతే జాగ్రత్త పరురాలు. రెండు నవలల్లోని ఇద్దరు రమలు కూడా ఎక్కడా దారి తప్పలేదు. చాకచక్యంగా జీవితాన్ని ముందుకు నడిపించుకున్నట్లు తెలుస్తుంది.

**3. పైమెట్టు**

నవలలో రవ్వ సింధుభాగం ఆడపిల్ల, ఏళ్ళనాటి కట్టుబాట్ల కారణంగా సిందుభోగం ఆడపిల్లలు పెళ్ళికి అనర్హులు. కేవలం కన్నెరికానికే (ఉంచుకోవడానికే) అర్హులు. సింధుభోగం కులం. అక్కాదమ్ముళ్ళు అయిన మల్లి, చిట్టోడు మాదిగ కులస్థులే. ఒకరంటే ఒకరికి వల్లమాలిన అభిమానం. చిట్టోడు దారి తప్పడం గమనించిన మల్లి తల్లిదండ్రులతో మాట్లాడి పెళ్ళి చేయించింది. చిట్టోడి దంపతులకు ఒక కొడుకు. అయినా చిట్టోడి ప్రవర్తనలో మార్పులేదు. సింధుబోగం పిల్ల రవ్వను ఇష్టపడి పెళ్ళి చేసుకుంటానంటే మాదిగ పెద్దలు ఒప్పుకోలేదు. కావాలంటే కన్నెరికం పెట్టుకోమన్నారు. పెద్దల మాటకు కట్టుబడి రవ్వకు కన్నెరికం పెట్టాడు. ఇప్పుడు రవ్వకు కన్నెరికం కారణంగా ఒక కొడుకు, ఒక కూతురూ పుట్టారు. కూతురు పేరు మువ్వ.

చిట్టోడు కన్నెరికం పెట్టినపుడు రవ్వ ఒక పట్టానా లొంగలేదు. పైగా "నేను కనే నా పిల్లలకు నా ఇంటి పేరు వదులుకుంటా, నీ ఇంటి పేరు పెట్టుకుంటా" అంది రవ్వ. వాస్తవానికి కన్నెరికం కారణంగా కలిగిన సంతానానికి

తండ్రి వారసత్వం గానీ, ఇంటిపేరుగానీ, ఆస్తుల్లో వాటా గానీ రాదు. ఇక్కడ రవ్వ ఆస్తుల్లో వాటా అడగలేదు. ఎంతో ముందు చూపుతో ఇంటి పేరు అడిగింది. చిట్టోడ్ని, పెద్దల్ని ఒప్పించి, కట్టుబాట్లను అతిక్రమించేలా చిట్టోడి ఇంటి పేరు సంపాదించి, ఆ ఇంటి పేరుతోనే కొడుకుని, కూతుర్ని బళ్ళో చేర్పించింది. ఇప్పుడు రవ్వ కూతురు మువ్వ సింధుబోగం పిల్లకాదు. మాదిగ పిల్ల ఇక పెళ్ళికి అర్హురాలు. తనలా కన్నెరికం ఆడదిగా తన కూతురు బ్రతకనవసరం లేదు.

చిట్టోడి అక్కాబావాలైన మల్లి, బుజ్జిబాబు దంపతులకు ఒక్కగానొక్క కొడుకు దొరబాబు. బుజ్జిబాబు చెల్లెలు నల్లమ్మ పెళ్లి చేసుకొని వెళ్తూ తనకు కూతురు పుడితే, బుజ్జులు కొడుక్కు చేసుకోవాలని అన్న దగ్గర మాటతీసుకుంది. ఆ మాటకు కట్టుబడే దొరబాబు పెళ్ళిని, నల్లమ్మ కూతురు బుజ్జితో నిర్ణయించారు. మాదిగ పెద్దలు.

అయితే రవ్వ మరో ఆడుగుముందుకు వేస్తూ, మల్లి గుండెల్లో స్థానాన్ని సంపాదించి తన కూతురు మువ్వను దొరబాబును చేసుకోవాలనే ఆలోచనను మల్లికి కల్పించింది. మువ్వను దొరబాబుకు పెళ్ళాన్ని చేయాలన్నదే రవ్వ సంకల్పం. అందుకు మొదటి నుంచి ప్రణాళిక ప్రకారం ప్రయత్నించింది. మువ్వను బడికి పంపింది. దొరబును బడికి వెళ్ళేలా చేసింది. దొరబాబుకు, మువ్వకు సాన్నిహిత్యం పెరిగేలా పరోక్షంగా ప్రయత్నించి, వాళ్ళిద్దరినీ మొగుడూ పెళ్ళాం అనుకునేలా, అలాగే పిలిచేలా చేసింది. మువ్వను దొరబాబుకు చేసుకోమని, బుజ్జిల్ని అడిగింది. చెల్లెకిచ్చిన మాట తప్పనన్నాడు. కావాలంటే వేరే సంబంధం చూసి, మువ్వకు పెళ్ళి జరిపించమన్నాడు. బుజ్జితో పెళ్ళి ఆగే ప్రసక్తే లేదని తేల్చి చెప్పేశాడు బుజ్జులు. అయ్యవారు వచ్చి దొరబాబును, బుజ్జిని పీటల మీద కూర్చోబెట్టాక మువ్వ పెళ్ళి చీరతో, వడిబియ్యంతో పెళ్ళి కుతురై వచ్చి, దొరబాబుతో తన పెళ్ళి జరిపించమని బీష్మించుకొని నిలబడింది. ఈ పోరాటాన్ని నేర్పిపంపింది రవ్వే. మువ్వతో పెళ్ళి కుదరదని, దొరబాబు పెళ్ళి బుజ్జితో పెద్దలు నిర్ణయించారని, కావాలంటే మువ్వకు కన్నెరికం పెట్టుకోమని ఎవరో అంటే "రవ్వ నిప్పుల గుండంలా సెగలు కక్కింది. కన్నెరికం పెట్టడానికి అది సింధుబోగం పిల్లగాదు. మాదిగ పిల్ల... కన్నెరికం మాట ఎత్తితే ఇక్కడే నా గొంతు కోసుకుంటాను. మువ్వను ఉరివేసి చంపుతాను. చేస్తారా దాని పెళ్ళి చేయండి. చెయ్యలేరా మానండి. కన్నెరికం అన్నారా, ఈ పెళ్ళి పందిరి తగులబెడతాను. రెచ్చిపోయింది రవ్వ" (70) చివరకు పల్లె పెద్దలు దొరబాబు, బుజ్జి, మువ్వల అంగీకారంతో, వారి తల్లిదండ్రుల్ని ఒప్పించి, ఒకే లగ్నంలో దొరబాబు పెళ్ళి బుజ్జితోనూ, మువ్వతోనూ జరిపించారు. ఇది రవ్వ విజయం. ప్రశ్నించే తత్వం, పోరాడే తత్వం లేనిచోట బానిసత్వం కొనసాగుతుంది." అన్న అంబేద్కర్ మాటలను ఆదర్శంగా తీసుకున్న దళిత స్త్రీగా రవ్వ కన్పిస్తుంది. రవ్వలో ప్రశ్నించే తత్త్వమూ, పోరాడే తత్త్వం రెండూ ఉన్నాయి. అందుకే బానిసత్వాన్ని ఛేధించి "పోరాడితే పోయేదేముంది బానిస సంకెళ్ళు తప్ప" అన్న మాటల్ని నిజం చేసింది. కూతుర్ని మాదిగల ఇంటి కోడల్ని చేసి, ఆమెకు తల్లిగా మాదిగ అయింది రవ్వ. మువ్వ పుట్టినప్పటి నుండి పెళ్ళి, అక్కర కార్యం జరిగే వరకూ తన కూతురు జీవితాన్ని నిలబెట్టడం కోసం, తన కన్నెరికపు బానిసత్వాన్ని పోగొట్టుకోవడానికి "నీ బానిసత్వాన్ని నీవే పోగొట్టుకోవాలి. దేవుడి మీద కానీ, మహానుబావుల మీద కానీ ఆధార పడకు" అన్న అంబేద్కర్ మాటల ప్రకారం తానే ఆరాటపడి, తన కూతురు బ్రతుకును, తద్వారా తన బ్రతుకును నిలుపుకుంది. రవ్వ ఆరాటం, పోరాటం, ఉబలాటం అంతా తన బ్రతుకుబరువు తన కూతురు మోయకూడదు. అందుకోసమే పోరాడింది. 'రంధి' నవలలో సువ్వి, 'పైమెట్టు' నవలలో రవ్వ ఇద్దరిలోనూ తిరుగుబాటు స్వభావం కన్పిస్తుంది.

**ముగింపు :**

ఆచార్య ఇనాక్‌గారి నవలల్లో దళిత స్త్రీలు ఎక్కడా నిరాశానిస్పృహలకు లోనైనట్టుగానీ, అధైర్య పడ్డట్టుగానీ కన్పించరు. చిన్నప్పటి నుండి తల్లిని, ఆమె తెగువను, ధైర్యాన్ని, గట్టిదనాన్ని, మొండితనాన్ని చూస్తూ పెరిగిన

ఇనాక్‌గారు, తన నవలల్లోని దళిత స్త్రీ పాత్రలను ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొని, పోరాడి జీవితాన్ని నిలుపుకునేట్లు చిత్రించారు. వీరి దళిత స్త్రీ పాత్రల్లో ఎక్కడా ఆత్మహత్య అన్న ఆలోచన గానీ, వెనకడుగు అన్న తలంపు కానీ లేదు.

**ఆధార గ్రంథాలు :**


1) రంధి

2) వలస

3) పైమెట్టు

4) ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్య సృష్టి-దృష్టి- ఆచార్య కొలకలూరి మధుజ్యోతి

5) సాహిత్య వీక్షణం-డా॥ కొలకలూరి మధుజ్యోతి

6) ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సమాలోచనం సం. గుజ్జర్లమూడి కృపాచారి.


★★★

భావవీణ BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-4 | April 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# అక్షర శిల్పం - నమో శిల్పి : ఒక సమీక్ష



బోరవెల్లి పవన్ కుమార్
పరిశోధక విద్యార్థి, భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ & టెక్నాలజీ యూనివర్సిటీ
(BESTU), అనంతపురం.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహము :**

ఈ వ్యాసం డాక్టర్ కే. బాలస్వామి గారు రచించిన "నమో శిల్పి" అనే కావ్యంపై సమగ్ర సమీక్షను అందిస్తుంది. నిర్జీవమైన శిలలకు ప్రాణం పోసే శిల్పిని, వారి సృజనాత్మకతను కీర్తిస్తూ సాగిన ఈ కావ్యం, భారతీయ పుణ్యక్షేత్రాలలోని శిల్పకళా వైభవాన్ని ముక్తక పద్య రూపంలో ఆవిష్కరిస్తుంది. శిల్పిని దైవంతో పోలుస్తూ, కళాఖండాల శాశ్వతత్వాన్ని ఈ వ్యాసం విశ్లేషిస్తుంది.

**కీలక పదాలు :**

నమో శిల్పి, డా. కే. బాలస్వామి, ముక్తక కావ్యం, శిల్పకళ, కంద పద్యం, భారతీయ దేవాలయాలు, సమీక్ష.

## 1. ప్రవేశిక :

సాహిత్య రంగంలో నిరంతర కృషీవలురు, రాష్ట్రపతి పురస్కార గ్రహీత డాక్టర్ కే. బాలస్వామి గారి లేఖిని నుండి జాలువారిన అద్భుత కావ్యం "నమో శిల్పి". శిల్పి చేతిలో ఉలి దెబ్బలు తిని, సుందర రూపాలుగా మారిన శిలల సౌందర్యానికి ముగ్ధులై కవి ఈ కావ్యాన్ని రచించారు. ఇది కేవలం ఒక పుస్తకం కాదు, భారతీయ వారసత్వ సంపదైన శిల్పకళకు అర్పించిన అక్షర నీరాజనం.

## 2. విషయ వివరణ :

### 2.1 కావ్య నేపథ్యం మరియు విశిష్టత :

"నమో శిల్పి" ఒక కథా కావ్యం కాదు. ఇది వివిధ క్షేత్రాలలోని శిల్ప విశేషాలను వర్ణించే లి"ముక్తక రచన"లి. శ్రావణ బెళగోడ, చిదంబరం, హలేబీడు, రామేశ్వరం వంటి చారిత్రక పుణ్యక్షేత్రాల్లోని శిల్పాలను దర్శించి, ఆ అనుభూతిని కవి పద్యరూపంలో భద్రపరిచారు. "పరమాత్మ లోకాన్ని కాపాడుగాక, శిల్పకళ వర్ధిల్లుగాక" అనే మహోన్నత ఆశయం ఈ కావ్యంలో అంతర్లీనంగా కనిపిస్తుంది.

**2.2 కావ్యారంభం – ముగింపు**

ఈ కావ్యం విఘ్నేశ్వర ప్రార్థనతో ప్రారంభమవుతుంది:

"శ్రీ విఘ్నేశ్వర నిను మును భావము నందున నుతించి భాగ్యం బలరన్ నేవేళను శుభములొసగ గావించెద కావ్య సృష్టి ఘనతర శిల్పిన్ కావ్య ముగింపులో 264వ కంద పద్యంగా

కం॥ హారతి శిల్పాచార్య హారతి శిల్పాలకెపుడు హారతి భక్తిన్
హారతి గుడి గోపురముకు
హారతి మా దైవములకు అంజలి తోడన్"సమర్పించి
శిల్పికి అత్యంతలి గౌరవపూర్వకంగా వందనం చేశారు

**2.3 పద్య విశ్లేషణ – అలంకార వైభవం**

శిల్పం యొక్క గొప్పతనాన్ని చాటే ఒక పద్యం పరిశీలిస్తే :

కం॥ కల్పాంతము నీ శిల్పము
నిత్య శ్రేయం బిడగన్
శిల్పీ నిన్ను పొగడగా మా
వేల్పులకు అలవిగాదు విశ్వాకృతులన్

ఈ పద్యంలో శిల్పం యుగాల పాటు నిలిచి ఉంటుందని, దాన్ని దర్శించడం వల్ల సమాజానికి శ్రేయస్సు కలుగుతుందని కవి వర్ణించారు. ఇందులో లిఅతిశయోక్తి అలంకారంలి ద్వారా శిల్ప సౌందర్యాన్ని దేవతల వర్ణనకు కూడా అందనంత ఎత్తులో నిలిపారు. ఉత్వ, సవర్ణదీర్ఘ సంధులు మరియు షష్ఠీ తత్పురుష సమాసాల ప్రయోగం కవి భాషా పటిమకు నిదర్శనం.

**2.4 ప్రముఖుల అభిప్రాయాలు :**

ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు బాలస్వామి గారిని "నిరంతర సాహితీ వ్రతుడు" అని కొనియాడారు. అలాగే ఆచార్య కసిరెడ్డి గారు "నమో శిల్పి చదువుదాం.. ఈ కవన శిల్పిని గౌరవిద్దాం" అని పిలుపునిచ్చారు. కీర్తిశేషులు కపిలవాయి లింగమూర్తి గారి అంతేవాసిగా బాలస్వామి గారు తన గురువుల బాటలో సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

**3. ఉపసంహారం**

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయంతో ముద్రితమైన ఈ కావ్యం, ఫిబ్రవరి-2025లో పాఠకుల ముందుకు వచ్చింది. శిల్పిని ఒక సృష్టికర్తగా, శిల్పాన్ని ఒక దివ్య రూపంగా భావించి రాసిన ఈ కావ్యం తెలుగు సాహిత్య చరిత్రలో శిల్పకళా సంబంధిత రచనల్లో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. బాలస్వామి, కే. (2025). నమో శిల్పి (పద్య కావ్యం). మహబూబ్ నగర్: శ్రీరామ ఆఫ్ సెట్ ప్రింటర్స్.
2. నారాయణపేట జిల్లా సమగ్ర స్వరూపం, తెలంగాణ సరస్వ పరిషత్ వారు ప్రచురించిన గ్రంథం.

★★★

భావవీణ
BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# ఎన్నార్ పాటలలో సమాజ పరివర్తకులు



మఠంస్వామి రేవప్పయ్య
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 9441140238.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A): 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహం :**

ఉపాధ్యాయుడిగా, రచయితగా గాయకుడిగా తన పాటల ద్వారా సమాజాన్ని మేల్కొల్పున గొప్ప గాయకుడు ఇంజమూరి నరసింహులు. ఏన్నార్ కలం పేరుతో వీరు సుపరిచితుడు. మహిళలను, దళితులను,బహుజనులను, ఉద్యోగులను, విద్యార్థుల సైతం చైతన్య పరిచిన గొప్ప సామాజిక కార్యకర్త మన ఏఎన్నార్. పూల తోటలో పువ్వులకు దేని రంగు దానిదే, దేనివాసన దానిదే, ఎర్ర గులాబీలు నల్లకలువలు ,సన్నజాజులు సంపెంగలు మల్లెలు ఇలా వైవిధ్యపు పూల తోటలోని పూల లాంటివి మన ఏఎన్ఆర్ పాటలు. విద్యార్థుల సైతం చైతన్యపరిచిన గొప్ప సామాజిక కార్యకర్త మన ఏఎన్నార్. ప్రకృతిలో మానవుడు స్వేచ్ఛగా జీవించాడు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చట్టాలు, శాసనాల పేరుతో మానవుడిని సర్వత్ర సంకెళ్లలో బంధించారని వాపోయాడు ఏఎన్నార్. కులాలు మతాలు వర్గ వైశ్యామ్యాలతో మానవజాతికి మనుగడే లేకుండా చేశారు. సంఘం చరణం గచ్చామి అన్న గౌతమ్ బుద్ధుని బోధనలను పక్కన పెట్టారు మానవ సమాజం. భక్తి ఉద్యమ కాలానికి చెందిన మహాకవి రవి దాస్ ఆశయాలను తుట్లపరిచింది సమాజం మొదలగు పాటలు పాడారు.

అదేవిధంగా కుల వ్యవస్థ వ్యతిరేకంగా పోరాడిన జ్యోతిరావు పూలే బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహానుభావుల త్యాగాలకు ప్రతిరూపంగా ఎన్నో ఉద్యమ పాటలు పాడు సమాజాన్ని మేల్కొలిపాడు. కామాంధుల కామానికి పూలందేవి ఏ విధంగా బలైందో తన గేయాల ద్వారా వివరించాడు ఏ న్నార్.

**కీలకాంశాలు :**

త్రి పీఠికలు, చరణం గచ్చామీ, చరితార్థుడు, గులాంగిరి, మనుస్మృతి.

**ప్రవేశిక :**

చిన్ననాటి నుండి ఉద్యమాల దారిలో నడుస్తూ, ప్రగతిశీల ప్రజాస్వామ్య సమాజాన్ని కాంక్షిస్తూ, 1989లో

ఉపాధ్యాయునిగా నియామకమై 1990 నుండి తన పాటలతో సమాజంలో మార్పు తేవడానికి తన జీవితాన్ని పాటకు అర్పించిన ప్రగతివాది ఇంజమూరి నర్సిములు. 'ఎన్నార్' కలం పేరుతో ప్రసిద్ధుడు. ఎన్నార్ అంటే 'న్యూ రెవల్యూషన్' అని అర్థం. విద్యార్థులను, ఉద్యోగులను, మహిళలను, దళితులను, బహుజనులను చైతన్య పరుస్తూ సామాజిక కార్యకర్తగా బాధ్యతలను నిర్వర్తిస్తూనే ఒక ప్రత్యేకత కలిగిన కవిగా, కళాకారునిగా గుర్తింపు పొందాడు. ఆయన ఏ ఒక్క విషయానికో కట్టుబడలేదు. ఆయన కలం తోటలో విరిసిన పూలెన్నో ప్రజల పాటలెప్పుడూ ప్రజల వైపే ఉంటాయి. ఔషధంలా పనిచేస్తాయి. సంఘటిత పరుస్తాయి. మన ఎన్నార్ పాటలు ఈ కోవలోనివే ఆయన పాటలు వివిధ రకాలుగా పూసిన పూలతోటలోని పూలవంటివి. ఆ పూలలో కూడా దేని రంగు దానిదే, దేని వాసన దానిదే. ఎర్రగులాబీలు, నల్లకలువలు, సన్నజాజులు, సంపెంగలు, మల్లెలు ఇలా వైవిధ్యపు పూలతోటలోని పూలలాంటివే ఈ ఎన్నార్ పాటలు. ఈ పాటల్లో సమాజాన్ని ప్రభావితం చేసిన ఎంతోమంది పరివర్తకులను ఎన్నార్ అక్షరబద్ధం చేసాడు.

పూర్తిగా నాగరిక సమాజం ఏర్పడక ముందు మనుషుల మధ్య ఎలాంటి వ్యవస్థలు లేకుండా స్వేచ్ఛగా, సహజంగా ఎలాంటి నియమనిబంధనలు లేని State Natureలో జీవించారు. అందువల్ల వారి జీవన విధానం Pre Social State అని చెప్పవచ్చు. ఇలా వారు నివసించిన విధానాన్నే ప్రకృతి వ్యవస్థ అని భావించవచ్చు. కొన్ని ఉమ్మడి ప్రయోజనాల వల్ల మానవులు స్వయంగా తమ మధ్య ఒక ఒడంబడికను ఏర్పరుచుకుని జీవనం కొనసాగించే విధానం రావడం వల్ల సమాజం ఏర్పడి, అందుకు అనుగుణంగా మానవులు జీవనం కొనసాగిస్తున్నారు.

సమాజం ఏర్పడటానికి ముందు ఉన్న ప్రకృతి వ్యవస్థలో మానవుల మధ్య సహజీవనం, పరస్పర సహకారం, ఉమ్మడి ప్రయోజనాలు కరువై తద్వారా బలవంతుడిదే రాజ్యం అన్నట్లు ఉండడం వల్ల, ఉమ్మడి ప్రయోజనాల వల్ల కలిగే ఉపయోగం బోధపడి మనుషులందరూ కలిసి శాంతియుత సహజీవనం కోసమై సమాజాన్ని ఏర్పాటు చేసుకున్నారని వీరి వాదన. ఈ క్రమంలో కొన్ని స్వార్థపూరిత ఆలోచనలు కూడా ఇందులో చట్టబద్ధం చేయబడి కులాల నిచ్చెన పుట్టుకొచ్చింది. మళ్ళీ దాంట్లోంచి కొన్ని నిమ్నకులాలు ఆవిర్భవించాయి. 'సామాజిక ఒడంబడిక' అనే గ్రంథంలో రూసో ప్రాకృతిక వ్యవస్థలో సంతోషకరమైన జీవనాన్ని గడిపినా క్రమక్రమంగా జనాభా పెరగడంతో స్పర్థలు, కలహాలు మొదలయ్యాయని ఫలితంగా సమాజ రక్షణ కరువైందని, అందువల్ల మానవులందరూ ఉమ్మడిగా సహకార జీవనం కోసం ఒప్పందానికి వచ్చారని దీంతో సమాజం ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. అందుకే రూసో మానవుడు స్వేచ్ఛాజీవిగా సర్వత్రా సంకెళ్లతో బంధింపబడ్డాడని అభిప్రాయపడ్డాడు. +ూ దీూజఖ ూ చీూుఖ=జు అనే నినాదాన్ని ఇచ్చాడు.

కానీ అప్పటికే అగ్రవర్ణాలుగా పాతుకుపోయిన వారు, ఈ వ్యవస్థను అట్లానే పెంచి పోషించారు. ఈ వ్యవస్థను కూలదోయడానికి ప్రతియుగంలో ఎవరో ఒకరు ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఈ ప్రతిఘటన మొదలైనప్పుడల్లా కొందరి కులాలు కదిలిపోయినంత పనయ్యేది. అవిద్య, అసంఘటితం, అవగాహన లేమి వల్ల ఈ కులలా నిచ్చెన ఇట్లానే కొనసాగుతూనే వస్తోంది. బాబాసాహేబ్ రాకతో ఈ పరిస్థితిలో కొంత మార్పును ఆశించగలిగాం. ఈ యుగంలో అణగారిన వర్గాలను ప్రభావితం చేసిన సమాజ పరివర్తకులు ఎందరో ఉన్నారు. వారిలో కొందరిని ఎన్నార్ తన పాటలతో కొలిచిన వైనం మనకు కనిపిస్తుంది. అలాంటి వారిలో బుద్ధుడు, గురు రవిదాసు, మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేద్కర్, కాన్షీరాం, మాయావతి, పూలన్ దేవిలాంటివారున్నారు.

**బుద్ధుడు**

బుద్ధుడు బౌద్ధ ధర్మానికి మూల కారకుడు. నాటి ఆధ్యాత్మిక గురువులలో ఒకడు. బౌద్ధులందరిచే మహాబుద్ధుడిగా కీర్తింపబడేవాడు. బుద్ధుని జనన - మరణాల కాలం స్పష్టంగా తెలియరావడం లేదు. 20వ శతాబ్దపు చారిత్రకకారులు

క్రీ.పూ. 563 నుండి 483 మధ్యలో జననం అని, క్రీ.పూ 410 నుండి 400 మధ్యలో మరణం ఉండవచ్చు అని భావిస్తున్నారు. మిగతా లెక్కలను ఇంకా అత్యధికుల ఆమోదించలేదు. గౌతముడిని శాక్యముని అని కూడా పిలుస్తారు. శాఖ్య వంశస్థులు వ్యవసాయముతో పాటు పరిపాలన చేసేవారు. ఆయన జీవిత సంఘటనలు, బోధలు, భిక్షువుల నడవడికలు మొదలగునవి అన్ని ఆయన మరణం తరువాత సంఘముచే తరతరాలుగా పారాయణం చేయబడ్డాయి. మొదట నోటి మాటగా బోధింపబడినా, దాదాపు నాలుగు వందల సంవత్సరాల తరువాత 'త్రిపీటక' అనే పేరుతో మూడు పీఠికలుగా విభజింపబడి భద్రపరిచారు. ఆ బుద్ధుడు చెప్పిన మార్గాన్ని పాటించమని అంటాడు ఎన్నార్.

**పల్లవి :**

బుద్దుడు జెప్పిన పంచశీలకు /బద్దుల మౌదామ - నిబద్దుల మౌదామా /బుద్ధుడు జెప్పిన బాటలో వెళ్ళి / బుద్ధితో మెలగాలె మనము బుద్ధితో మసలాలె/జ్ఞానమే మార్గం - జ్ఞానమే వెలుగని /లోకమంత చాటే - ఈ లోకమంత చాటె /బుద్ధం శరణం గచ్ఛామన్న /ఆ బుద్ధుని బోధన మరవొద్దు.

**చరణం :**

సంఘములోన - మనుషులందరూ /ఒక్కటేనన్నాడు - వాళ్ళను ఒక్కటవ్వమండు /సంఘం శరణం గచ్ఛామన్న / బుద్ధుని మాటను మరవద్దు

**చరణం :**

కులం మతాలు - స్వర్గం నరకం /బూటకమన్నాడు - అవి దోచెటోల్లవానె /సత్యాన్ని సత్యముగ దెల్సుకుంటేనే / ధైర్యమొస్తుందండు దండిగ ధైర్యమొస్తదండు

**చరణం :**

దేవుడు దయ్యం - నమ్మకాలను /వమ్ము చేయమండు - వట్టి బూటకమన్నాడు /జ్ఞానం శీలం కరుణల వెలుగులో /బుద్ధిగ నడక నేర్వమండు బుద్దిగా కలిసి బ్రతకమండు.

కొందరు ఆయన్ని గొప్ప తత్త్వవేత్తగా కొనియాడతారు. ఇంకొందరు సమాజాన్ని చక్కదిద్దిన సంస్కర్తగా శ్లాఘిస్తారు. ఆయనే పశువుల్లా, పాశవికంగా బతికే మానవులకు శాంతి, అహింస, కరుణ, దయ, జాలి, ప్రేమ, మైత్రి లాంటి ధర్మాల్ని ప్రబోధించిన బుద్ధుడు. క్రీస్తుకు 600 సంవత్సరాల పూర్వమే మనిషి నడవడికకు మెరుగైన దారి చూపిన మార్గదర్శి ఆయన. అంతటి మహనీయుడు మన దేశం నేలమీద పుట్టడం మనందరికీ గర్వకారణం. ప్రపంచానికి శాంతి, అహింసల్ని ప్రబోధించిన దేశంగా భారతదేశం పొందిన కీర్తికి ఈ తథాగతుడే కారణం.

బుద్ధుని బోధనలు ఎన్నెన్నో ఉన్నాయి. అన్నీ ఆణిముత్యాలే. అజరామరాలే. వీటన్నింటిలో వెలకట్టలేనివి పంచశీల. బుద్ధుడు జ్ఞానానికి ఎంతటి ప్రాధాన్యత ఇచ్చాడో, అంతకు మించి శీలానికి ఇచ్చాడు. శీలం అనేది అందరికీ ఉం డాల్సిన నైతిక గుణంగా భావించాడు. ప్రబోధించాడు. శీలం మన జీవన విధానమని చాటాడు.

బుద్ధుడు చెప్పిన శీలం అంటే నైతిక జీవనమే. మనవల్ల ఇతరులెవరూ ఇబ్బంది పడని విధానమే శీలం. ఈ నైతిక జీవనం మనిషిని మానసిక రుగ్మతలకు దూరం చేస్తుంది. మనశ్శాంతిని ప్రసాదిస్తుంది. ఉత్సాహాన్ని నింపుతుంది. నిజం చెప్పాలంటే పరిపూర్ణమానవుడిగా జీవించే అవకాశాన్ని కల్పిస్తోంది.

బుద్ధుడు బోధించిన ఈ పంచశీల మనిషి జీవితానికి ఒక చక్కటి నియంత్రణ. ఎందుకంటే - ప్రతివ్యక్తి పంచశీల ధరించి, స్వతంత్ర నియంత్రణ కలిగి ఉంటే... ఒక వ్యక్తి మరో వ్యక్తిని మోసగించడు. ఒకడు మరొకని దోపిడీ చేయడు. దగా చేయడు. చంపుకు తినడు. ఎదుటి వారి జీవితంలో అనవసరంగా తల దూర్చడు. దురాశాపరుడు కాడు- తోటి వ్యక్తుల్తో, సమాజంతో తగవు పడడు. ద్వేషాన్ని పెంచబోడు. పాపాన్ని మూటగట్టుకోడు. నలుగురితో

మంచిగా ఉంటాడు. నలుగురి మేలు కోరుకుంటాడు- కాబట్టి అతనికి అడుగడుగునా అడ్డంకులుండవు. వెనక్కి లాగేవారు కానీ, ఎత్తి పడేసేవారు గానీ ఉండరు. ప్రతి వ్యక్తి మరో వ్యక్తిలో మానవీయతనే చూస్తాడు. మానవీయునిగానే జీవిస్తాడు. పంచశీలను తెలుసుకున్నవాడు తనను తాను తెలుసుకుంటాడు. పంచశీలను పాటించేవాడు తనను తాను గెలుచుకుంటాడు. జీవితాన్ని గెలుస్తాడు, జీవనాన్ని గెలుస్తాడు. నిజమైన విజేతగా నిలుస్తాడు. అందుకే... బుద్ధం శరణం గచ్ఛామి.

**రవిదాసు**

రవిదాస్ లేదా రైదాస్, 15వ నుండి 16వ శతాబ్దపు సమయంలో భక్తి ఉద్యమానికి చెందిన భారతీయ ఆధ్యాత్మిక కవి. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పంజాబ్ మరియు హర్యానాలోని ఆధునిక ప్రాంతాలలో గురువుగా (ఉపాధ్యాయుడిగా) గౌరవించబడ్డాడు. అతను కవి, సంఘ సంస్కర్త మరియు ఆధ్యాత్మిక వ్యక్తి. రవిదాస్ జీవిత వివరాలు అనిశ్చితంగా మరియు వివాదాస్పదంగా ఉన్నాయి. అతను క్రీస్తు శకం 1450లో జన్మించాడని పండితులు నమ్ముతారు. కానీ కొంతమంది పండితులు అతను క్రీస్తు శకం 1377లో జన్మించాడని మరియు క్రీస్తు శకం 1528లో మరణించాడని నమ్ముతారు. అతను కుల, లింగవివక్షలను యొక్క సామాజిక విభేదాలను తొలగించడానికి కృషిచేశాడు. కులరహిత సమాజాన్ని గురించి బోధించాడు, వ్యక్తిగత ఆధ్యాత్మిక స్వేచ్ఛ సాధనలో ఐక్యతను ప్రోత్సహించాడు.

**పల్లవి :**

గురువులకే గురు బోధ జేసినా /రవిదాసును గాంచరయ్యా /మహనీయున్ని తలువరయ్యా /కులమతాలపై నిప్పులు చెరిగిన/ చమారుపుత్రుడ తడయ్యా /సమసమాజ స్వాప్నికుడయ్యా

**చరణం :**

దేవుడందరిని సమానంగనే /సృష్టించెనని స్పష్టంజేసెనా /మనుషులపైన జాలిజూపని /పూజలు యాత్రలు ఎందుకన్నాడు /సత్యం ధర్మం సంపాదనలో... /సాటిరారు రవిదాసుకెవ్వరు /జైబోలో రవిదాస్కో జైబోలో కవిదాస్కో

**చరణం :**

పంజాబు భాషకు ప్రాణంబోసి /పండితునిగా పేరుగాంచెనా /భక్తిమార్గమే ఎంచుకొని /కోట్లజనులనాకర్షించెగా / ఛమారు కులానికే వన్నెదెచ్చెనా /చరిత్రలో చరితార్థుడయ్యెగా /జైబోలో రవిదాస్క జైబోలో కవిదాస్కో

**చరణం :**

సత్యవాక్యముల దాటించెనా /రవిదాస్ రచించిన శ్లోకమ్ములు /గురుగ్రంథ సాహెబుల చేరిపాయె /ప్రపంచ ధార్మికులె ప్రశంసించిరా /ప్రపంచ జ్ఞానులె అభిమానులైనర/జైబోలో రవిదాస్కో జైభోలో కవిదాస్కో

**చరణం :**

ఆ మహనీయుని బోధనలే /భక్తజనుల కాదర్శమాయెగా /దీనబంధు మన అంబేద్కరు /మనసుదోచిన తాత్వికుడురా /ఆత్మగౌరవమే మానవత్వమే /దేశమంతట బోధించెరా/జైబోలో రవిదాస్కో జైబోలో కవిదాస్కో

రవి వున్నన్నినాళ్లు రవిదాసు బోధలు రమణీయమైనవే మధురమైనవే. రవిదాస్ యొక్క భక్తి పద్యాలు 'గురు గ్రంథ్ సాహిబ్' అని పిలువబడే సిక్కు గ్రంథాలలో చేర్చబడ్డాయి. హిందూమతంలోని దాదు పంతి సంప్రదాయానికి చెందిన పంచ వాణి వచనంలో రవిదాస్ యొక్క అనేక పద్యాలు కూడా ఉన్నాయి. అతను రవిదాస్సియా మత ఉద్యమంలో ప్రధాన వ్యక్తి కూడా.

అతను ప్రస్తుతం భారతదేశంలోని ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి సమీపంలో ఉన్న సర్ గోబర్ధన్‌పూర్ గ్రామంలో

జన్మించాడు. అతని జన్మస్థలం ఇప్పుడు శ్రీ గురు రవిదాస్ జనమ్ అస్థాన్ అని పిలుస్తారు. మాతా కల్సి అతని తల్లి, అతని తండ్రి సంతోఖ్ దాస్. అతని తల్లిదండ్రులు తోలు పని చేసే చమర్ కమ్యూనిటీకి చెందిన వాడు. అంటరాని కులస్థుడై కూడా అమోఘమైన బోధనలు చేసిన వాడిగా ఆయనకు పేరుంది. అతని అసలు వృత్తి తోలు పని అయితే, అతను గంగా ఒడ్డున ఆధ్యాత్మిక సాధనలో ఎక్కువ సమయం గడపడం ప్రారంభించాడు.

అతని ఆలోచనలు మరియు కీర్తి అతనితో పాటే పెరిగాయి, బ్రాహ్మణులు (పూజారి, ఉన్నత కులాల సభ్యులు) కూడా అతనికి మోకరిల్లేవారని తెలుస్తుంది. అతనికి అందరూ నమస్కరించేవారట. గురువులనబడే వారెందరికో గురుబోధ చేసిన ఘనుడాయన. తన అభివృద్ధిని కులం పేరుతో ఆపడానికి ప్రయత్నించేవాళ్ళు తనలోని జ్ఞానాగ్నిని ఎలా ఆర్పగలరని ప్రశ్నించాడు.

**మహాత్మా జ్యోతిరావు పూలే**

అతను అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసాడు. 1873 సెప్టెంబరు 24న, పూలే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి 'సత్యశోధక్ సమాజ్' (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్)ను ఏర్పాటు చేశాడు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన ఈ సంఘంలో అన్ని మతాలు, కులాల ప్రజలు కూడా చేరవచ్చు. లాగ్రేంజ్‌లోని సామాజిక సంస్కరణ ఉద్యమంలో పూలే ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడ్డాడు. అతను, అతని భార్య సావిత్రిబాయి పూలే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకులు. అతను మహిళలకు, తక్కువ కుల ప్రజలకు విద్యను అందించే ప్రయత్నాలకు ప్రసిద్ధి చెందాడు. పూలే బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణేలో ప్రారంభించాడు. అతను వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించాడు. భారతదేశ బాలికల కోసం ఒక పాఠశాల ప్రారంభించిన మొట్టమొదటి స్థానిక భారతీయులలో ఈ జంట ఉన్నారు. విద్య యొక్క విశ్వీకరణను సమర్థించిన మొదటి సంస్కర్త కూడా ఆయనే.

**పల్లవి :**

జ్యోతిరావు పూలె జ్యోతయ్యి వెలిగిండు /రావణ ఉయ్యాలో అయ్యో దేవన ఉయ్యాలో /సాంఘిక విప్లవ సూర్యుడై వెలిగిండు /రావణ ఉయ్యాలో అయ్యో దేవన ఉయ్యాలో /జ్యోతి రావు పూలె బాటల్లో రండో /రావణ ఉయ్యాలో అయ్యో దేవన ఉయ్యాలో

**చరణం :**

ఏ రాజులొచ్చిన ఏమొరిగెనన్నడు /రావణ ఉయ్యాలో అయ్యో దేవన ఉయ్యాలో /కర్మరాతల పేర కాల్చింద్రు అండో /రావణ ఉయ్యాలో అయ్యో దేవన ఉయ్యాలో /కన్నీళ్ళ బతుకులకు కారణం దెలిపిండు /రావణ ఉయ్యాలో అయ్యో దేవన ఉయ్యాలో /పోరు బాటల్లోన నడ్వమని అన్నడో

**చరణం :**

శూద్రుల చరితకు వన్నె దెచ్చిండో /రావణ ఉయ్యాలో అయ్యో దేవన ఉయ్యాలో /బలి చక్రవర్తికి బంధువుల మన్నడే /రావణ ఉయ్యాలో అయ్యో దేవన ఉయ్యాలో /బ్రహ్మనిజం మీద దండెత్తి నాడే /రావణ ఉయ్యాలో అయ్యో దేవన ఉయ్యాలో /మత దోపిడి మీద మంటయ్యి లేసిండు

**చరణం :**

మొట్టమొదట మహిళ స్కూళ్ళు పెట్టిండు /రావణ ఉయ్యాలో అయ్యో దేవన ఉయ్యాలో /అనాథ పిల్లల హక్కున చేర్చిండో /రావణ ఉయ్యాలో అయ్యో దేవన ఉయ్యాలో /అంటరానోళ్ళకు విద్య నేర్పిండో /రావణ ఉయ్యాలో అయ్యో దేవన ఉయ్యాలో.

1848లో జరిగిన తన బ్రాహ్మణ స్నేహితుడి వివాహంలో పూలే, బి.సి. 'మాలి' కులానికి చెందిన వాడవడం వల్ల కులవివక్షకు గురయ్యాడు. ఆ క్షణం నుండి కుల వివక్షపై పోరాడాలని నిశ్చయించుకున్నాడు. కుల విధానంలో ఆయన బ్రాహ్మణులను విమర్శించడమే కాకుండా సమాజంలో వారి ఆధిపత్యాన్ని వ్యతిరేకించాడు. జ్ఞాన సంపదకు అందరికీ అవకాశం ఇవ్వక పోవడానికి ఆయన అభ్యంతరం తెలిపాడు.

బ్రాహ్మణాధిపత్యాన్ని వ్యతిరేకించవలసినదిగా సామాన్యుల్ని ప్రోత్సహించాడు. సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని పూలే భావించాడు. అందువల్ల స్త్రీలు విద్యావంతులు కావాలని నమ్మాడు. ఇతరులకు ఆదర్శంగా ఉండాలని ముందుగా తన భార్య సావిత్రిని పాఠశాలకు పంపాడు. 1848 ఆగస్టులో బాలికలకు పాఠశాల స్థాపించాడు. ఈ పాఠశాలలో అన్ని కులాలకు ప్రవేశం కల్పించడం, అంటరాని వారికి కూడా బోధించవలసిరావడంతో ఉపాధ్యాయులెవరూ ముందుకు రాలేదు. చివరకు జోతిరావ్‌పూలే తనభార్య సావిత్రి సహాయంతో పిల్లలకు పాఠాలు బోధించేలా చేశాడు. పాఠశాల నిర్వహణలో అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. కొంతకాలం పాఠశాలను నిర్వహించలేక మూసివేశాడు. అయినా పట్టు వదలక తన మిత్రులైన గోవింద్, వల్వేకర్‌ల సహాయంతో పాఠశాలను పునఃప్రారంభించాడు. క్రమంగా ఆదరణ పెరగడంతో 1851-52లో మరో రెండు పాఠశాలలు స్థాపించాడు.

1873 సెప్టెంబరు 24న సత్యశోధక సమాజాన్ని పూలే స్థాపించాడు. దేశంలోనే ఇది మొట్టమొదటిసంస్కరణోద్యమం. శూద్రులను బ్రాహ్మణ చెర నుండి కాపాడటమే ఈ ఉద్యమ ముఖ్య ఉద్దేశం. ఈ సంస్థ సభ్యులు పురోహితుల అవసరం లేకుండానే దేవుణ్ణి పూజించేవారు. కుల, మత వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికి సభ్యత్వం కల్పించేవారు. వేదాలను పవిత్రంగా భావించడాన్ని పూలే వ్యతిరేకించాడు. విగ్రహారాధనను ఖండించాడు. 1891లో ప్రచురించిన 'సార్వజనిక్ సత్యధర్మపుస్తక్' మత, సాంఘిక విషయాలపై పూలే అభిప్రాయాలను తెలియచేస్తుంది. స్త్రీ, పురుషుల మధ్య లింగవివక్షను పూలే విమర్శించాడు. సమానత్వం, స్వేచ్ఛ, ఐకమత్యంతో కూడిన సమసమాజాన్ని కాంక్షించాడు. 1853లో వితంతు మహిళల అనాథ శిశువుల కోసం 'సేవాసదనం' ప్రారంభించాడు. ఈ తరహాలో ఒక భారతీయ హిందువు ఒక సంస్థను ప్రారంభించడం అదే మొదటిసారి. 1868లో తన ఇంటి దగ్గరున్న స్నానాల తొట్టి వద్ద స్నానం చేసేందుకు అంటరాని వారికి కూడా అనుమతి ఇచ్చాడు. 1869లో 'పౌరోహిత్యం యొక్క బండారం' పుస్తక రచన చేశాడు. 1877లో సత్యశోధక సమాజం తరపున 'దీనబంధు' వార పత్రిక ప్రారంభించాడు. 1880లో భారత ట్రేడ్ యూనియన్ ఉద్యమ పితామహుడు లోఖాండేతో కలసి రైతులను, కార్మికులను సంఘటితం చేసేందుకు ప్రయత్నించాడు. 1873లో 'గులాంగిరి' (బానిసత్వం) పుస్తకం ప్రచురించాడు.

దీనిలో బ్రాహ్మణీయ అమానుష సూత్రాలను, శూద్రులపై బ్రాహ్మణుల క్రూర వైఖరిని పూలే తులనాత్మకంగా పరిశీలించాడు. సహపంక్తి భోజనానికి సంసిద్ధత ప్రకటించాడు. 1883లో 'కల్టివేటర్స్ విప్‌కార్డ్' (సేద్యగాడి చెర్నకోల) పుస్తక రచన పూర్తిచేశాడు. ఏప్రిల్‌లో బొంబాయిలో జరిగిన ఒక సమావేశంలో పుస్తకాన్ని వినిపించాడు. 1885లో 'సత్యసారాంశం' ప్రచురించాడు. ఇదే సమయంలో ప్రచురితమైన తన 'హెచ్చరిక' (వార్నింగ్) బుక్‌లెట్‌లో ప్రార్థనా సమాజం, బ్రహ్మసమాజం తదితర బ్రాహ్మణీయ సంస్థలమీద తీవ్ర విమర్శలు చేశాడు. 1891లో పూలే రచించిన 'సార్వజనిక్ సత్యధర్మ పుస్తకం' ఆయన మరణాంతరం ప్రచురితమైంది. ఇందులో చాతుర్వర్ణ వ్యవస్థను దుయ్యబట్టాడు. మద్యపానాన్ని వ్యతిరేకించి, 1888లో మున్సిపాలిటీ అధ్యక్షునికి మద్యం షాపులను మూసి వేయవలసిందిగా ఉత్తరం వ్రాశాడు. ఆయన వ్రాసిన 33 ఆర్టికల్స్ గల సార్వజనిక్ సత్యధర్మ పుస్తకంలో కుటుంబ సృష్టి నియమాల గురించి వివరిస్తూ ప్రపంచం మొత్తాన్ని ఒక కుటుంబంగా వ్యక్తీకరించాడు.

**అంబేద్కర్**

డా.బి.ఆర్. అంబేద్కర్ పూర్తి పేరు భీంరావ్ రాంజీ అంబేద్కర్. కొందరు బాబాసాహెబ్ అంబేద్కర్ అని కూడా పిలుస్తారు. అంబేద్కర్ భారతదేశానికి చెందిన న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత, సంఘ సంస్కర్త. అంబేద్కర్ భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తరవాత నియమించబడ్డ మొదటి న్యాయ శాఖ మంత్రి మరియు రాజ్యాంగ శిల్పి.

అంబేద్కర్ 14 ఏప్రిల్ 1891వ సంవత్సరంలో మధ్యప్రదేశ్ లోని 'మౌ' అన్న జిల్లాలోని మిలిటరీ కంటోన్మెంట్‌లో పుట్టారు. ప్రస్తుతం 'మౌ' అన్న జిల్లాను డాక్టర్ అంబేద్కర్ నగర్ అని పిలుస్తారు. అంబేద్కర్ సుబేదార్ రాంజీ మలోజీ సక్పాల్ మరియు భీమాబాయి సక్పాల్ దంపతులకు పుట్టిన 14వ మరియు చివరి సంతానం. వీరి కుటుంబం మహారాష్ట్ర రాష్ట్రానికి చెందినది. అంబేద్కర్ మహర్ అనే కులానికి చెందిన వారు. ఆ రోజుల్లో కొన్ని కులాల వారిని అంటరాని వారుగా పరిగణించేవారు. మహర్ కులం కూడా అంటరాని కులాలలో ఒకటి. అంబేద్కర్ అంటరానితనం మరియు కుల నిర్మూలనకు వ్యతిరేకంగా పోరాడారు. ఆ రోజులలో తక్కువ కులాల వారు కూడా చదువుకునేవారు కానీ క్లాస్ లోపల కాకుండా బయట కూర్చునేవారు. టీచర్ల నుంచి కూడా ప్రత్యేక శ్రద్ధ మరియు సహాయం ఉండేది కాదు. తక్కువ కులం వారు నీళ్లు తాగాలన్న ఉన్నత కులం వారి సహాయం తీసుకోవాలి, వారు పోస్తేనే తాగాలి. తక్కువ కులం వారు నీటి గ్లాస్ ను ముట్టుకునే అనుమతి ఉండకపోయేది.

**పల్లవి :**

ఆహా! అంబేద్కరా దళితులకు బాంధవా /నీ త్యాగం నీ మేలు మరువలేమయ్యా /

**చరణం :**

గొప్ప గొప్ప చదువులు చదివిన నీవు /నీ వాళ్ళనెన్నడు మరువలేదయ్యా
అంటరానోళ్ళకు చదువులేనోళ్ళకు /వెలుగును యిచ్చేటి దీపమైనావు
రాజ్యాంగం రాసినా నీ తెలివి వల్లనే /ఈ పాటి చదువులు చదువుచున్నాము

**చరణం :**

దళితుల వంచించినా గాంధీ నెహ్రూల /భాగోతాన్ని బట్టబయలు జేశావు
దేశ దేశాల చరితలు చదివావు /దళితుల విముక్తికై పోరును నడిపావు
స్త్రీల హక్కులను కాలరాచేస్తే /న్యాయమంత్రి పదవి వదిలేసినావు

**చరణం :**

కులకంపు ప్రాణము హిందు మతమన్నవు /హిందువులుగ బతకొద్దని హెచ్చరించావు
సాంఘిక విప్లవం ఆర్థిక విప్లవం /సాధించిన నాడే స్వాతంత్ర్య మన్నవు
నీ చల్లని సందేశము అందరికి స్ఫూర్తిలే /నీ ఆశయ సాధనకై శపథం జేస్తున్నము.

చదువు పూర్తిచేసుకున్న తరవాత ట్యూషన్ మాస్టర్‌గా, అకౌంటెంట్‌గా మరియు వ్యాపార సలహాదారుడిగా (investment consulting business) చేసారు, కానీ ఇవన్నీ విఫలం చెందాయి. అంబేద్కర్ అంటరానివాడని తెలుసుకున్న వెంటనే దూరంగా ఉంచేవారు.

1918వ సంవత్సరంలో ముంబైలోని సిడెన్‌హామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఎకనామిక్స్ కాలేజీలో పొలిటికల్ ఎకానమీ ప్రొఫెసర్‌గా చేరారు. అక్కడ పనిచేసున్న సమయంలో కూడా తోటి ప్రొఫెసర్లు అంబెద్కర్ నీళ్ల జగ్‌ను ఉపయోగించటంపై అభ్యంతరం వ్యక్తం చేసారు.

1926వ సంవత్సరంలో ముగ్గురు బ్రాహ్మణేతర నాయకుల తరపు నుంచి వాదించారు. బ్రాహ్మణులు భారతదేశాన్ని నాశనం చేస్తున్నారని వాదించి గెలిచారు. బాంబే హైకోర్టులో 'లా' ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు అంటరాని వాళ్ల కోసం చదువు అందాలని సామజిక - ఆర్థిక ఎదుగుదల కోసం కృషి చేసారు. దళితుల హక్కుల కోసం మూక్ నాయక్, బహిష్కృత్ భారత్, సమానత్వ జంట అనే పత్రికలను ప్రారంభించారు. 1925వ సంవత్సరంలో సైమన్ కమిషన్‌లో భవిష్యత్తు భారత రాజ్యాంగంలో మార్పుల కోసం సలహాలు ఇచ్చారు.

1927వ సంవత్సరంలో అంటరానితనానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు మరియు పాదయాత్రలు చేసారు. ప్రజలందరికి నీళ్ళ సౌకర్యం మందిరాలలో ప్రవేశం కోసం పోరాడారు. రాయగడ్ జిల్లాలోని మహాద్ నగరంలో అంటరాని వారికి వాటర్ ట్యాంక్ నుంచి నీళ్ళు తీసుకొనే సదుపాయం కలిగించాలని సత్యాగ్రహం కూడా చేసారు. 1927వ సంవత్సరంలో జరిగిన సమావేశంలో అంబేద్కర్, మనుస్మృతిలో కుల వివక్షత, అంటరానితనం గురించి ఉందని చెప్పి సాంప్రదాయబద్ధంగా మనుస్మృతి కాపీలను కాల్చారు. 25 డిసెంబర్ 1927వ సంవత్సరంలో వేల మంది అంబేద్కర్ అనుచరులు మనుస్మృతి కాపీలను కాల్చారు. అంబేద్కర్ అనుచరులు డిసెంబర్ 25ను మనుస్మృతి దహన్ దినోత్సవంగా జరుపుకుంటారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ అంబేద్కర్‌ను భారత రాజ్యంగం నిర్మాణం కోసం ఆహ్వానించారు. ఈ రాజ్యాంగంలో అంటరానితనాన్ని రద్దు చేయటం అన్ని రకాల వివక్షతలను చట్ట విరుద్ధం చేసారు.

**కాన్షీరాం**

బహుజన సమాజ్ పార్టీ నిర్మాత. రామదాసియా శిక్కు చమార్ కులస్తులైన తేల్‌సింగ్, బిషన్‌సింగ్ కౌర్‌లకు మార్చి 15, 1934 పంజాబ్ రాష్ట్రంలో రోపార్ జిల్లా కావాస్‌పూర్ గ్రామంలో జన్మించాడు. జ్యోతిరావ్ పూలే, ఛత్రపతి సాహు మహరాజ్, పెరియార్ ఇ.వి. రామస్వామి నాయకర్, నారాయణ గురు, అంబేద్కర్‌ల ప్రబోధాలతో ప్రేరేపితుడయ్యి తన జాతి ప్రజలను రాజ్యాధికారం వైపు నడిపి విజయాలు సాధించాడు. తన 31వ ఏటనే అంబేద్కర్ రచించిన 'కుల నిర్మూలన' గ్రంథం ద్వారా ప్రేరేపితుడయ్యాడు. తన తల్లికి ముప్పై పేజీల ఉత్తరం రాస్తూ 'ఇక నుంచి నేను కుటుంబ బాంధవ్యాలను తెంచుకుంటున్నాను. నా కోసం మీరు వెతకవద్దు' అంటూ బయటికి వెళ్లి, చనిపోయే వరకు తిరిగి ఇంటికి వెళ్లలేదు.

**పల్లవి :**

బహుజన నాయకుడా- బహుజన ప్రేమికుడా /బడుగు బలహీనుల ఆశల స్వప్నమా /కరుణామయ
కాన్షీరాం కన్నీళ్ల వందనము /కలాల వందనమో - గళాల వందనమో

**చరణం :**

సైంటిస్టుగా వుంటె - సేవజేయలేనాని /ఉద్యోగమొదిలేసి - ఉద్యమంలో దూకి /ఉద్యోగుల కూడగట్టి
బ్యాంసెఫ్‌ను స్థాపించి /బహుజనుల పార్టీకే సారథి వైతివ నీవు

**చరణం :**

ఆస్తులను కీర్తులను - కోరుకోలేదన్నడు. /నలభయేండ్ల జీవితము - ఆదర్శ జీవితమే /అలుపెరుగని
యోధుడా ధీరుడా ఓ కాన్షీరాము /బహుజనుల ప్రేమికుడా బహుదూరపు బాటసారి

**చరణం :**

కాలినడకన దిరిగి - క్యాడరును పెంచినావు /సైకిలు మీద దిరిగి - లీడర్ల మలచినావు /అంబేద్కరు
ఆలోచనల కార్యశిల్పివి నీవు /కర్పూర హారతిల కరిగి కరిగి వెలుగైతివ

**చరణం :**

ఎట్టి బతుకులల్లా - వెలుగులు రావాలంటే /మట్టి బతుకులన్ని మారిపోవాలంటే /ఓటుకున్నా పవరు బుల్లెట్టుకు లేదంటు /ఓట్లన్ని యేసుకుంటే రాజ్యమే మనదంటివి.

1984 ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించాడు. ఒక ఓటు-ఒక నోటు అనే నినాదంతో ప్రజల దగ్గరకు వెళ్లి వారిచ్చే డబ్బుతోనే ప్రచారం చేశాడు. 'కులాన్ని నిర్మూలిద్దాం - బహుజన సమాజాన్ని నిర్మిద్దాం' అంటూ దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టాడు. నువ్వు 85 శాతం ఉండగా 15 శాతం మీద ఎందుకు ఆధారపడతావు? నడువు పార్లమెంటు, అసెంబ్లీకి నడువు. నీ కాళ్లమీద నీవే నడువు అంటూ బహుజనులను ఉసిగొల్పాడు. ప్రభుత్వ భూమి అంటే ప్రజల భూమి. ప్రజల భూమి మీద ప్రజలకు హక్కులేదా? అనేవాడు. కులాన్ని కులంతోనే జయించాలని కులాన్ని రాజకీయ ఆయుధంగా వాడుకున్నాడు. యూపిలోని చమార్లనే పునాదిగా చేసుకొని పంజాబ్, హర్యానా, ఢిల్లీ, కాశ్మీర్, బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లలో ఇతర కులాలను కలుపుకొని పార్టీని బలోపేతం చేశాడు. మాయావతిని ముఖ్యమంత్రిగా చేశాడు. 1984లో ప్రారంభమైన బి.ఎస్.పి. 1996 నాటికి జాతీయ పార్టీగా ఎదిగింది. 2006 అక్టోబరు 9న కాన్షీరాం మరణించాడు.

## పూలన్ దేవి

పూలన్ దేవి కొంతమందికి మంచిది. మరికొందరికి కిరాతకరాలు. ఓ నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆడపిల్ల. సమాజంలో జరిగే అన్యాయాలను ప్రశ్నిస్తూ పెరిగింది. ఉత్తరప్రదేశ్‌లో యమునా నది తీరంలోని మారుమూలగ్రామమైన 'గోర్హా పూర్వా'లో 1963 ఆగస్టు 10న పూలన్ దేవి జన్మించింది. ఆమె తల్లిదండ్రులు, నదిపై పడవలు నడిపే సాంప్రదాయక వృత్తిగల అత్యంత వెనకబడిన సామాజిక వర్గమైన మల్లా కులస్తులు. పూలన్ దేవి తల్లిదండ్రులకు అండగా నిలబడడం కోసం చిన్నతనం నుంచి పశువులు మేపేది. యమునా నదితో ప్రత్యేక అనుబంధం ఉంది. పడవలు నడిపింది. నదిలో చేప పిల్లలా ఈదింది. బతకడం కోసం బరువులు మోసింది. పొలం పనులు చేసింది.

భూమి, సంపద, అధికారం కలిగి అగ్రకుల ఠాకూర్ల దర్పాలనూ, దాష్టీకాలనూ చూసింది. చమార్, జాతవ్, మల్లా మొదలగు అణగారిన కులాల దైన్యాన్నీ, అశక్తతలనూ అర్థం చేసుకుంది. తండ్రికున్న కొద్దిపాటి ఆస్తినీ కాజేసిన దగ్గరి బంధువుల మోసాన్ని చిన్ననాడే ప్రశ్నించి దెబ్బలు తిన్నది. 11 ఏళ్ల వయసులోనే 35 ఏళ్ల వయసున్న వ్యక్తితో బాల్య వివాహం జరిగింది. భర్త లైంగిక హింసలకు గురైంది.

**పల్లవి :**

పులిబిడ్డా పూలన్ దేవి - వందనాలు పేదజనం వందనాలు. /తిరగబడ్డ తుపాకినమ్మో - వందనాలు
దళితజనం వందనాలు /చెరచబడ్డా చెల్లెలాకు, ఊపిరివి పూలనమ్మా /
నీపేరు వింటే కామంధులకు సల్లసేమటలు బుట్టెనమ్మ

**చరణం :**

పసిప్రాయములోన పెళ్ళని /ముసలోన్ని అంటగడితే /వాడు బెట్టె హింసలాకు /ఎదురుదిరిగి యిల్లు
జేరే /చిత్రహింసలల్ల నలిగిన /పూలనమ్మ ఏడ్వనెలేదు /పుట్టినిల్లు చేరిన పూలన్
/అడవిలోకి పయనమయ్యే

**చరణం :**

చిత్రహింసలపాలుజేసిన /కామంధు ఠాకురుగాల్ల /వదలనంటు శపథంజేసి /దెబ్బదెబ్బకు ఒక్కోక్కన్ని
/బందుకెత్తి గుండెల్లోనా /గురిచూసి కాల్చితివమ్మో /చంబల్యరాణివయ్యి భూస్వాముల వణికిస్తివి.

1981లో పూలన్ దేవిపై ఠాకూర్ సామాజిక వర్గానికి చెందిన మరో ఇద్దరు బందిపోటు దొంగలు లాలారామ్, శ్రీరామ్‌లు అత్యాచారం చేశారు. ఇందుకు ప్రతీకారంగా పూలన్ దేవీ వారి సామాజిక వర్గానికి చెందిన 20 మంది ఠాకూర్లను ఊచకోత కోసినట్లు ఆరోపణలు వినిపించాయి. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ అడవుల్లో చంబల్ లోయల్లో ఒంటరిగా నడిచింది. జంతువులతో సహజీవనం చేసింది. పేరుకు బందిపోటుగా మారినా బాధితులకు, పేదలకు ఆర్థిక సాయం చేసి, బతకడానికి ధైర్యాన్ని ఇచ్చింది. మగ, కుల దురహంకార ఠాకూర్లకేగాక, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర ప్రభుత్వానికీ పూలన్ దేవి పెద్ద సవాలుగా మారింది. అప్పటి ఇందిరాగాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమూ, అర్జున్ సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వమూ పూలన్‌దేవితో చర్చలకు ముందుకొచ్చాయి. దీంతో 1983లో మధ్యప్రదేశ్ పోలీసులకు లొంగిపోయి పూలన్ దేవి అప్పట్లో సంచలనం సృష్టించింది. ఊచకోత జరిగిన రెండేళ్ల తర్వాత పూలన్ దేవి మధ్యప్రదేశ్ పోలీసులకు క్షమాభిక్ష పథకం కింద లొంగిపోయింది. ఉత్తర్‌ప్రదేశ్ జైలుకు కాకుండా పూలన్ దేవి విన్నపం మేరకు గ్వాలియర్ జైలులో ఉంది. దాదాపు 11 ఏళ్లు గ్వాలియర్, జబల్ పూర్ జైలులో ఉంది పూలన్ దేవి. విచారణ ఎదుర్కోకుండానే 1994లో విడుదల అయ్యింది.

తర్వాత పూలన్ దేవి 34వ ఏట 1998లో ఉత్తప్రదేశ్ సమాజ్‌వాది పార్టీ నుంచి పార్లమెంటు సభ్యురాలిగా ఎన్నికైంది. పూలన్ దేవి 37వ ఏట దేశ రాజధాని ఢిల్లీలో హత్యకు గురయ్యింది. 2001 జూలై 25న పూలన్ దేవి ఇంటి ముందు గుర్తు తెలియని దుండగులు తుపాకీతో కాల్చి చంపారు. దీనికి కారణం పూలన్ దేవి ఠాగూర్లను చంపినందుకు ప్రతీకారహత్య అని అంటారు. నిరుపేద కుటుంబంలో పుట్టి, బందిపోటు దొంగగా. పేదల పాటి దేవతగా.. పార్లమెంట్ మెంబర్‌గా నిజజీవితంలో విభిన్న పాత్రలను పోషించిన పూలన్ దేవి జీవితం, కత్తి పట్టినవారు ఆ కత్తికే బలి అవుతారు అనడానికి సజీవ సాక్ష్యం. ఇక పూలన్ జీవిత చరిత్ర పుస్తకంగానే కాదు, బాలీవుడ్‌లో సినిమాగా కూడా తెరకెక్కింది.

**ముగింపు :**

సమాజాన్ని సంస్కరించడానికి ఎందరో కవులు కళాకారులు, సాహితీ వేత్తలు, గాయకులు తన వంతు ప్రయత్నం చేశారు. అలాంటి వ్యక్తుల్లో వింజమూరి నరసింహులు ఒకరు. వీరి పాటలు, గేయాలు ద్వారా సమాజంలో అసమానతలు, కులతత్వం, మతతత్వం, అస్పృశ్యత మొదలైన సమస్యలపై వెలుగెత్తి సాటిన గొప్ప వ్యక్తి. నిద్రాణమైన సమాజం తన పాటల ద్వారా మేల్కొలపడానికి తన వంతు ప్రయత్నం చేసిన గొప్ప ఎన్నార్.

**ఆధార రచనలు :**

1. నవయుగ వైతాళికుడు మహాత్మా జ్యోతిరావు పూలే, డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు, నవతెలంగాణ, ఏప్రిల్ 11, 2015.
2. కొందరికి సివంగి.. మరికొందరికి అమ్మోరు తల్లి.., సూర్యకళ, తెలుగు వార్త, జాతీయం, అగష్టు 10, 2021.
3. జ్ఞానం వికసించిన రోజు, బొర్రా గోవర్ధన్, సాక్షి, ఏప్రిల్ 30, 2015.
4. అసలైన జాతీయవాది, డాక్టర్. దొంతగాని వీరబాబు, ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 13, 2018.
5. దళిత జాతుల వైతాళికుడు అంబేద్కర్, మాండవ శ్రీరామమూర్తి, పాలు సత్యనారాయణ, జయంతి పబ్లికేషన్స్, విజయవాడ, 2011.
6. https://en.wikipedia.org/wiki/ravi daas
7. https://te.wikipedia.org/wiki/ kaanshIraam
8. ఎన్నార్ పాటలు, ఎన్నార్, వాల్యూం 1 & 2. మార్పు కళామండలి, మెదక్, 2007, 2015.

★

భావవీణ BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253
**Article Link :** *https://www.bhavaveena.com/*

# వడలి రాధాకృష్ణ కథలు - స్త్రీ సమస్యల చిత్రణ



**నేరెళ్ల ఆంజనేయులు**
పరిశోధక విద్యార్థి,
తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వ
కళాపరిషత్, విశాఖపట్టణం,
చరవాణి : 7993918070

**ఆచార్య జర్రి అప్పారావు**
పర్యవేక్షకులు
తెలుగుశాఖాధ్యక్షులు
ఆంధ్ర విశ్వకళాపరిషత్,
విశాఖపట్టణం.



సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహం :**

ఆధునిక సాహితీ లోకంలో ఎందరో కథా రచయితలు పుట్టుకొచ్చినా, వారిలో కొందరే ఈ ప్రక్రియకు న్యాయం చేయగలిగి, వారి కథల్లో సమాజాన్ని చెప్పించి, సమాజాంతర్గత పరిస్థితులను చిత్రించడం చేయగలిగారు. అలాంటి రచయితల్లో వడలి రాధాకృష్ణ ఒకరు. వీరు పశ్చిమగోదావరి జిల్లా, భీమవరానికి చెందిన వీరు వడలి వెంకట సుబ్బారావు, సూరమ్మ దంపతుల సంతానం. ఇంజనీరింగ్‌లో మాస్టర్ డిగ్రీతో పాటు, ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ మరియు ఎంబీఏ పూర్తి చేశారు. ఐటీసీ లిమిటెడ్-ఎబిడి చీరాలలో ప్రాసెసింగ్ మేనేజర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసి ఇప్పుడు పూర్తిస్థాయి సాహిత్య రచనలు వెలువరించడంలో నిమగ్నమయ్యారు. వీరు 700కి పైగా కథలు రాశారు. ఇవన్నీ 10 కథా సంపుటాల్లో ముద్రింపబడ్డాయి. అలాగే మూడు కవిత సంపుటాలు వెలువరించారు. అంతేకాకుండా 15కి పైగా ఇతర సాహితీ గ్రంథాలకు సంపాదకత్వం వహించి తెలుగు సాహితీ ప్రభను భుజాన వేసుకుని తనదైన శైలిలో సేవ చేస్తున్నారు. మీరు రాసిన కథా సంపుటాల్లో వస్తువును గమనిస్తే సమాజంలో నుండి తీసుకోబడిన అంశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మీరు రాసిన కథల్లో స్త్రీ జీవనం ఉన్న కథలను పరిశీలించి, అందులోనూ స్త్రీల సమస్యలను అధ్యయనం చేసేదే ఈ పరిశోధన వ్యాసం.

**కీలక పదాలు :**

మధ్యతరగతి, శీలవతి, తాగుబోతు, నిస్పహాయత, మనోవేదన, వివాహ వ్యవస్థ, గృహహింస, ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం, పచ్చిపాగరుబోతు, సంస్కారం, మహాతుంటరి మొదలైనవి.

## స్త్రీ సమస్యల చిత్రణ

### ఉపోద్ఘాతం

అనాదిగా స్త్రీ జీవిత గమనాన్ని పరిశీలిస్తే సమస్యలతో ఆమె సహజీవనం చేస్తుందనక తప్పదు. కొన్ని సాంఘిక

దురాచారాలు, మూఢాచారాల ఫలితంగా ప్రధానంగా కష్టపడింది స్త్రీ మాత్రమే అన్నది వాస్తవం. ఇక స్వేచ్ఛలేని జీవితం, పురుష ప్రపంచ పెత్తనం వంటివి ఆమె రెక్కలను విరిచి ఎగిరే స్వాతంత్ర్యాన్ని కోల్పోయేలా చేశాయి. ఆధునిక కాలంలో అన్ని రంగాల వృత్తుల్లో పురుషునికి ధీటుగా దూసుకుపోతూ సాధికారిత అనిపించుకుంది. కానీ పాత సమస్యల స్థానంలో సరికొత్త కష్టాలు పలు విధాలుగా ఆమె వైపు దూసుకువస్తున్నాయి. దీంతో ఆమె శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి అవుతుంది. కుటుంబ పరంగా ముఖ్యంగా వివాహానంతరం ఆమెకు భర్త అత్తింటి నుండి ఎదురయ్యే సంకటాలు అన్నీ ఇన్నీ కావు. ఇక అడుగు బయట పెడితే ఆకతాయిలు, దుర్మార్గుల చర్యలకు ఆమె భయకంపితురాలు అవుతుంది. చట్టాలు ఎన్ని ఉన్నా రక్షణ లేని బతుకుతో బిక్కుబిక్కుమానక తప్పడం లేదు.

సమాజంలో స్త్రీ సమస్యలు స్థూల సూక్ష్మాలుగా ఉంటున్నాయి. వీటి పట్ల ఆధునిక కథా రచయితులు తగు కోణంలో పలు రచనలు చేస్తున్నారు. ఈ కథల ద్వారా స్త్రీల సమస్యలను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారు. అలాంటి వారిలో వడలి రాధాకృష్ణ ఒకరు. పైకి కనిపించే కష్టాలే కాక ఆమె మౌనం వెనుక దాగున్న సమస్యలను చదవగలిగి వాటిని అక్షరీకరించారు. అధికంగా ఆమె సమస్యలు వ్యవస్థనుండో, సమాజం నుండో, లేక పలు ఆచార సంప్రదాయాల వల్ల ఏదో ఒక రూపంలో ఉండటాన్ని గమనించారు. వాటికో ఆకృతిని ఇచ్చి కథలుగా విలువరించారు. కష్టాలను, కన్నీళ్లను లోకానికి చెప్పే ప్రయత్నాన్ని మనస్ఫూర్తిగా చేశారు. కథల్లో స్త్రీల వేదనలను ఇతివృత్తాలుగా చేసుకొని రాసి కథలను ఈ వ్యాసంలో పరిశీలించడమైనది. దీనిలో భాగంగా రాధాకృష్ణ వెలువరించిన కథలను విశ్లేషణ చేయడమైనది.

**పశ్చాత్తాపం లేదు :**

నేటి సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ కథ చిత్రించింది. ఒక మధ్యతరగతి మహిళ తన జీవితములో తాను అనుభవించిన సమస్యలను, ఎదురైన భయంకరమైన పరిస్థితులను ఎదురించి తన మనుగడ కోసం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాల సమాహారంగా ఈ కథ కనిపిస్తుంది. ముఖ్యంగా మహిళల మనుగడ, సామాజిక పోరాటం, విముక్తి ఈ కథలో ముఖ్యాంశాలుగా చిత్రించబడ్డాయి. ఇంకా చెప్పాలంటే ఒక సామాన్య మహిళ అసాధారణ పరిస్థితుల్లో తన ఉనికిని కాపాడుకోవడానికి చేసిన పోరాటమే ఈ కథ. తాను తీసుకున్న ఏ నిర్ణయం పట్ల ఆమెకు అపరాధ భావం లేకపోవడమే ఈ కథలోని ప్రధాన అంశం. సమాజంలోని మధ్యతరగతి స్త్రీలు ఎదుర్కొనే భయంకరమైన సమస్యలను, వారి నిస్సహాయతను మనుగడ కోసం వారు చేసే పోరాటాన్ని, రచయిత కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. ఈ కథలోని స్త్రీల సమస్యలను గమనిస్తే ప్రధానంగా చిత్రాంచబడిన సమస్య గృహహింస. కథానాయక శీలవతి తన భర్త గుంద్రాజు చేతిలో అనుభవించే నరకాన్ని రచయిత అత్యంత హృదయ విధారకంగా వర్ణించారు. గుంద్రాజు ఒక తాగుబోతు. శాడిస్ట్. శీలవతి శరీరంపై అతడు చేసిన గాయాలు, రక్తం కారే వాతలు, ఆమె పడే వేదనకు నిదర్శనం. భార్యను జుట్టు పట్టుకొని వీధిలోకి లాగి కొట్టడం అతని క్రూరత్వానికి పరాకాష్టగా కనబడుతుంది. రాత్రంతా ఇంట్లో జరిగే అరాచకాల వల్ల శీలవతి భయంతో వణికిపోతూ మంచానికి అతుక్కుపోయే స్థితికి చేరుకుంటుంది. ఆమె మనసులో ఎప్పుడూ ఒక బీకర సంగ్రామం జరుగుతూనే ఉంటుంది. అలాగే నేటి సమాజం ఇలాంటి హింసను చూస్తూ కూడా మౌనంగా ఉండటం మరో పెద్ద సమస్య. ఇరుగుపొరుగు వారు గుంద్రాజు దౌర్జన్యాలకు భయపడి తమకు ఎందుకులే అని తలుపులు వేసుకుంటారు. “ఆయన ఉన్నా ఏం చేస్తారు లేండి... అందరూ మూకుమ్మడిగా కలిసి నా గొంతు కోశారు” అంతే అని శీలవతి అనడంలో సమాజం పట్ల ఆమెకున్న ఆవేదన ఎలాంటిదో అర్థమవుతుంది. గృహహింస అనేది భరించలేని ఆవేదనను మిగిల్చే ఒక పెద్ద సమస్యగా చాలా కుటుంబాల్లో కనబడుతున్న వైనం నేడు చూస్తూనే ఉన్నాం. ఇలాంటి పరిస్థితి తెలియ చెప్పడానికే శీలవతి పాత్రను చిత్రించారని అర్థం చేసుకోవచ్చు.

ఈ కథలో స్త్రీ సమస్యలను చిత్రించే క్రమంలో వృద్ధ స్త్రీల నిస్సహాయత గురించి కూడా ప్రస్తావించారు రచయిత. శీలవతి అత్తగారు కోమలి, కూడా ఇలాంటి బాధితురాలే. తన కొడుకు చేసే అన్యాయాలను ఆపలేక ఎదురు తిరిగితే తాను దెబ్బలు తింటూ నిస్సహాయంగా ఉండిపోతుంది. కోడలు వ్యవస్థ చూసి జాలి పడడం తప్ప ఆమె ఏమీ చేయలేదు. ఇటువంటి పరిస్థితులు నిత్యం చూస్తూనే ఉన్నప్పటికీ ఆయా సమస్యలు ఎప్పటికీ పరిష్కారం కావానే ఆలోచనకు వారు వెళ్ళిపోతారు. దీంతో జీవితాంతం మనోవేదనకు లోనవుతూనే ఉంటారని వారి జీవితాల గురించి నేపథ్యం గురించి చెప్పడం చూస్తే నేటి సమాజ పరిస్థితులను వాస్తవ కోణంలో తెలియజెప్పడానికేనని గ్రహించవచ్చు. అలాగే మరో ప్రధాన విషయాన్ని చిత్రించారు రచయిత.

ఈ కథలో వివాహ వ్యవస్థలో లోపాలు ప్రస్తావిస్తూ స్త్రీ ఆత్మగౌరం కోసం పోరాడిన సంవత్సరాన్ని నొక్కి చెప్పడం గమనించవచ్చు. కథ ముగింపులో స్త్రీ తన ఉనికిని చాటుకోవడం సాంప్రదాయ నీతి సూత్రాలను దిక్కరించడం కనిపిస్తుంది. శీలవతి తనను ప్రేమించిన కోటిని కాదని తల్లిదండ్రుల నిర్ణయం ప్రకారం గుండ్రాజుని పెళ్లి చేసుకోవడం ఆమె జీవితాన్ని నాశనం చేస్తుంది. స్త్రీ తన భాగస్వామిని ఎంచుకునే విషయంలో సొంత నిర్ణయం తీసుకోలేకపోవడం అనే సమస్య ఇక్కడ వ్యక్తం అవుతుంది. నేడు ఎంతోమంది యువతలు తమకి ఇష్టం లేని వివాహాలు చేసుకుని నరకయాతన అనుభవిస్తున్న సంఘటనలు చాలానే ఉన్నాయి. చాలా విషయాల్లో తల్లిదండ్రులు తమకు నచ్చిన వాటిని ఎంచుకునే స్వేచ్ఛ ఇచ్చినప్పటికీ, పెళ్లి విషయంలో తనకు నచ్చిన వ్యక్తిని వివాహం చేసుకోవడానికి మాత్రం అంగీకరించట్లేదు. చివరకు కూతుర్ల జీవితాలు పోయాక కన్నీరు పెట్టుకోవడమే కనిపిస్తుంది.

ఈ కథ ద్వారా రచయిత ఇచ్చిన సందేశం మనుగడ మరియు ఆత్మ రక్షణే స్త్రీల ప్రథమ కర్తవ్యం అని హితబోధ చేశారు. ఒక స్త్రీ గృహహింసను అనుభవిస్తూ ప్రాణాలు కోల్పోవడం కంటే తనను తాను రక్షించుకోవడానికి ఎటువంటి కఠిన నిర్ణయాలైన తీసుకోవచ్చని ఈ కథ చెబుతుంది. తనని హింసించే భర్త నుండి విముక్తి పొందడానికి ఆమె ఎంచుకున్న మార్గం ఆమె పరిస్థితిలో దృశ్య సమర్థనీయమని రచయిత పేర్కొన్నారు. అలాగే స్త్రీ ఆర్థికంగా నిలబడినప్పుడే ఆమెకు గౌరవం రక్షణ లభిస్తాయని ఈ కథ స్పష్టం చేసింది. ఈ కథ స్త్రీల సమస్యను చిత్రిస్తేనే వారి శక్తిని ఆత్మవిశ్వాసాన్ని మరియు పరిస్థితులను లొంగిపోకుండా తన జీవితాన్ని తానే నిర్మించుకోవాలనే పోరాటపటమును సందేశంగా అందించింది.

**ఇటుకల బట్టీ :**

ఒక స్త్రీ కన్నీటి వేదన చిత్రించిన కథ ఇది. ఈ కథ ఒక ఇటికలు బట్టి చుట్టూ ఆ బట్టి యజమాని కొండప్ప కుటుంబం చుట్టూ తిరుగుతుంది. భర్త తప్పుకు భార్య ఎలా బలైపోయిందో ఈ కథనంలో చర్చించబడింది. అలాగే ఒక కుటుంబం ఎదుర్కొన్న సామాజిక ఆరోగ్య విషాదాన్ని ఇది చిత్రించింది. అలాగే కథలో స్త్రీలు ఎదుర్కొని వివిధ సామాజిక కుటుంబ, ఆరోగ్యపరమైన సమస్యలను రచయిత వాస్తవ కోణంలో చిత్రించారు. ఒక వ్యక్తి చేసే తప్పులు లేదా అతని దురలబాట్లు కేవలం మత్రకే పరిమితం కాకుండా అతనిపై ఆధారపడిన మొత్తం కుటుంబాన్ని ఎలా నాశనం చేస్తాయో ఈ కథ హెచ్చరించింది. ప్రధానంగా మాలతి మరియు రమణమ్మ అనే ఇద్దరు స్త్రీల పాత్రల ద్వారా నాటి సమాజంలోని చేదు నిజాలను విశ్లేషించారు. భర్త దురలవాట్ల వల్ల భార్య అనుభవించే నరకం భయంకరంగా ఉంటుంది. భర్త అదుపు లేని ప్రవర్తన వల్ల భార్య బలికావడం అనేది విషాదకర సంఘటన. కథానాయకుడు కొండప్ప ఊరిలో పేరు ఉన్న వ్యాపారైనప్పటికీ అతని వ్యక్తిగత జీవితం విచ్చలవిడిగా ఉంటుంది అతనికి ఉన్న పరస్త్రీ వ్యామోహం, మద్యపానం వల్ల అతను ఎయిడ్స్ బారిన పడతాడు. అయితే ఈ విషయాన్ని దాచిపెట్టి తన భార్య మాలతికి కూడా ఆ ప్రాణాంతక వ్యాధిని అంటిస్తాడు. మాలతి ఏ తప్పు చేయకపోయినా భర్త చేసిన పాపానికి శిక్ష అనుభవిస్తుంది. తను చేయని తప్పుకు తన ప్రమేయం ఏమాత్రం లేని విషయానికి నిరంకుశంగా ఇంట్లోంచి

జీవితంలో నుంచి బయటకు నెట్టి పారేయడం అనేది ఆమె పడుతున్న మానసిక క్షోభ తెలియజేస్తుంది. ఇది స్త్రీలను సహాయతకు నిదర్శనంగా చెప్పొచ్చు.

స్త్రీలు ఎదుర్కొంటున్న మరొక ప్రధాన సమస్య గృహింస మరియు సామాజిక వివక్ష. నేటి వ్యవస్థలో స్త్రీలు శారీరక హింస కంటే మానసిక హింసను ఎక్కువగా అనుభవిస్తున్నారు. ఈ కథలో కూడా ఇలాంటి ఆలోచనలు కథాగమనంలో చిత్రించారు రచయిత. కొండప్ప భయం నీడలో మాలతి ఆమె అత్త రమణమ్మ బ్రతుకుతుంటారు. కొండప్ప ఎంత క్రూరుడో రమణమ్మ మాటల్లో కనిపిస్తుంది. "వాడికి తెలిసిందంటే నన్ను నిన్ను నరికి పోగులు పెట్టేస్తాడు" అని ఆమె కోడలతో అనడం, ఆ ఇంట్లో స్త్రీలకు ఉన్న అబద్ధ భావాన్ని సూచిస్తుంది. కొండప్ప 'పచ్చి పొగరుబోతు', 'మహా తుంటరి' అని కథలో వర్ణించబడింది. తల్లి పెంపకంలో నియంత్రణ కలిగి ఉండాల్సిన కొడుకు ఆమెను సైతం భయపెడుతున్నాడు అంటే అతని పైశాచిక చర్యలు ఎంత ఘోరంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఈ కథలో మరో సమస్యను చిత్రించారు రచయిత. అది స్త్రీల శ్రమదోపిడి. అంతేకాకుండా వారికి బాధ్యతల భారం కట్టబెట్టడం. ఈ రెండు స్త్రీలను స్వేచ్ఛ తీరిక అనే వాటికి దూరం చేస్తున్నాయి. నిత్యం ఏదో ఒక పని భారంతో సతమతమవడం వారికున్న సమస్య. వీరు కేవలం గృహలు గానే కాక కష్టపడే కార్మికులుగా కూడా అనేక ఇబ్బందులు పడతారనేది జగమెరిగిన సత్యం. కొండప్ప తల్లి రమణమ్మ కథలు ఒక బలమైన స్త్రీ పాత్ర. భర్త పోయిన తర్వాత ఇతరులతో పనిచేస్తూ తన కొడుకుని పెంచి పెద్ద చేస్తుంది. ఆమె పడే కష్టం ఆమె పెంపకం సంస్కారం కొండకు అబ్బకపోయినా ఆమె మాత్రం నిరంతరం కుటుంబం కోసం శ్రమిస్తేనే ఉంటుంది. తల్లిగా ఒక్కడుకి ఎంత చేయాలో అంతకుమించి చేసింది. కానీ కొడుకు కొడుకు నుండి తను ఆశించిన ప్రేమ భరోసా ఎక్కడా లభించలేదు. ఒక తల్లి విఫలమైంది. ఇంకా చెప్పాలంటే ఒక స్త్రీగా విఫలమైంది. ఇలాంటి సంఘటనలు నేటి సమాజంలో ఎన్నో తారస పడతాయి. వాడిని రూపుమాపి స్త్రీలకు తగిన విలువ గౌరవం కల్పించాలని యోజన ఈ కథలో కనబడింది.

మాలతి మరణం కేవలం ఒక వ్యక్తి మరణం కాదు, అది వ్యవస్థలో చిక్కుకున్న ఒక అవల. చివరకు ఆమె మరణానికి స్పందించి కరిగిపోయిన ఇటుకలు, సమాజంలోని కఠినత్వాన్ని ఎత్తిచూపుతాయి. 'అమ్మ అంటే ఒక వెలుతురు ప్రపంచమని', 'జీవన మకరందమని' తెలియని పసిపిల్లల స్థితి స్త్రీ లేని కుటుంబం ఎంతటి అంధకారంలో ఉంటుందో తెలియజేస్తుంది. అనైతిక ప్రవర్తన వల్ల కలిగే అనర్థాలను గుర్తిస్తూ బాధ్యతాయుతమైన జీవనం గడపాలని, అమాయక స్త్రీలు మరియు పిల్లలు అన్యాయం కాకుండా చూడాలని ఈ కథ సమాజానికి బలమైన సందేశాన్ని ఇచ్చింది. ఈ విధంగా 'ఇటుకల బట్టి' కథ ద్వారా రచయిత స్త్రీలు అనుభవిస్తున్న ఆరోగ్య, సామాజిక మరియు కుటుంబ సమస్యలను మనకు కళ్ళకు కట్టినట్టు చూపారు. కథ ముగింపులో ఒక గొప్ప ప్రత్యేక కనిపిస్తుంది. ఎప్పుడు వర్షానికి కూడా నాన్నని దృఢమైనవి అని పేరుగాంచిన కొండప్ప బట్టిలోని ఇటుకలు మాలతి మరణ వార్త విన్నట్లుగా చిన్నచినుకులకే కరిగి నీరు అయిపోతాయి. ఆ ఇట్టుకలు కూడా కన్నీరు కారుస్తున్నాయా అన్నట్లుగా రచయిత ఈ కథను ముగించారు. ఇది మాలతి పట్ల ప్రకృతి చూపిన సానుభూతిని కొండప్ప నిర్మించిన కృత్రిమ సామ్రాజ్యం కూలిపోవడాన్ని సూచిస్తుంది.

నూతిలోని తాబేలు :

ఈ కథ సాంప్రదాయక విలువల పతనాన్ని చర్చించింది. భర్త అక్రమ సంబంధం వల్ల అవమానం భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకోవడం ఈ కథలోని ప్రధానాంశం. సమాజంలోని ధోరణులు, న్యాయస్థానాల తీర్పులు మహిళల జీవితాలను ఎలా చిన్నాభిన్నం చేస్తున్నాయో వివరించబడింది. ఇంకా చెప్పాలంటే ఈ కథ సమాజంలోని పురుషాధిక్యతను, చట్టాలను తమకు అనుకూలంగా మార్చుకుని స్త్రీలను హింసించే తీరును ఎండగట్టింది. సమాజంలో

స్త్రీలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను, కథలోని సన్నివేశాలను ఉదహరిస్తూ చేసిన సమగ్ర విశ్లేషణ పాఠకులను ఆలోచింపజేస్తుంది. స్త్రీల సమస్యల్లో గృహ శ్రమ ఎంత చేసినా అది గుర్తింపు లేకుండా పోతుందని ఆమె చేస్తున్న త్యాగం గుర్తింపు నోచుకోవట్లేదనేది ప్రధానంగా కనిపిస్తుంది. కథ ప్రారంభంలోనే రచయిత సరళమ్మ పాత్ర ద్వారా సగటు భారతీయ గృహిని జీవితాన్ని చిత్రించారు. దేవి బాబు ఆ ఇంటికి వెళ్ళినప్పుడు సరళమ్మ మడి బట్టలతో గ్యాస్ స్టవ్ మీద వంట చేస్తున్న ఆమె ముఖానికి పట్టిన చెమటల్ని పైట జరుగుతో తుడుచుకుంటూ కనిపిస్తుంది. ఈ దృశ్యం ఒక గురినిగా తాను ఎలా ఉండాలో ఏమి చేయాలో అలా ఉంటూ తన ధర్మాన్ని నిర్వర్తించినట్లు చదివించినట్లుగా ఉంది. అతిధులకు వేడివేడిగా కాఫీ అందించడం ఆఫీకానికి రావాల్సిన వంటలన్నీ శ్రద్ధగా సిద్ధం చేయడం వంటి పనుల్లో ఆమెకుడమై ఉంటుంది. ఇంటి పనుందండి తానే చూసుకుంటూ అందరికీ వడ్డించి చివరిగా అతిథులకు తినుబండారాలు ప్యాక్ చేసి ఇచ్చే ఆమె శ్రమను అందరూ సహజంగానే తీసుకుంటారు తప్ప ఆశ్రమ వెనుక ఉన్న అల్సర్ ను ఎవరు గుర్తించరు. స్త్రీ శ్రమకు ఇంట్లో సరైన గుర్తింపు తక్కువ పోవడం ఇక్కడ ఒక ప్రధాన సమస్యగా కనిపిస్తుంది.

ఈ కథలో సమాజంలోని మార్పులు, కోర్టు తీర్పుల ప్రభావం అత్యంత విచారకరమైన రీతిలో వ్యక్తం అయింది. ముఖ్యంగా కోర్టు తీర్పులు దుర్వినియోగం అవుతున్నాయి. సుప్రీంకోర్టు అక్రమ సంబంధాలు తప్పు కాదని సహజీవనం సమర్ధనీయమేనని ఇచ్చిన తీర్పు సమాజంలో పెద్ద సంచలనం సృష్టించింది. ఈ తీర్పును కొందరు పురుషులు తమ స్వార్థం కోసం, తమ పరస్త్రీ సంబంధాలను సమర్థించుకోవడానికి ఒక ఆయుధంగా వాడుకుంటున్నారని రచయిత చూపించారు. చట్టం మరియు నైతికత మధ్య సంఘర్షణ చంద్రమూర్తి వంటి వ్యక్తులు చట్టాన్ని అడ్డం పెట్టుకొని, వైవాహిక బంధాన్ని, నైతిక విలువలను కాలరాస్తున్నారు. అతను పరిమళ అనే స్త్రీని ఇంటికి తెచ్చి అది తప్పేం కాదు. 'అక్రమ సంబంధాలను కూడా క్రమసంబంధాలుగా పరిగణించాలంటూ పెద్ద కోర్టు ఇచ్చిన తీర్పును చదవండి' అని వాదించడమే దీనికి నిదర్శనం. ఇటువంటి తీర్పులు భారతీయ సంస్కృతి సంప్రదాయాలను తప్పుదారి పట్టిస్తున్నాయని ప్రజలు వాపోతున్నట్లు కథలో పేర్కొనబడింది.

'నూతిలోని తాబేలు' కథలో పరిమళ పాత్ర నేరుగా కనిపించకపోయినా, ఆమె ఉనికి సమాజంలోని ఒక చీకటి పార్శ్యాన్ని మరియు మారుతున్న సామాజిక విలుల ప్రభావాన్ని బలంగా ప్రతిబింబించింది. పరిమళ పాత్ర ద్వారా సమాజంలో గుప్తంగా ఉండే వైవాహికేతర సంబంధాలు ఎలా బహిర్గతం అవుతున్నాయో రచయిత కళ్ళకు కట్టినట్టు చూపారు. చంద్రమూర్తి తన అక్రమ సంబంధాన్ని మొదట్లో రహస్యంగా ఉంచి ఆ తర్వాత ఏకంగా తన ఇంటికే తీసుకురావడం ద్వారా ఇటువంటి సంబంధాలు ఇప్పుడు గడప దాటి లోపలికి వస్తున్నాయని వాస్తవాన్ని ఈ పాత్ర ప్రతిబింబిస్తుంది. అక్రమ సంబంధాలు తప్పు కాదన్న కోర్టు తీర్పురు అడ్డం పెట్టుకొని సమాజంలో కొందరు పురుషులు అనైతిక ప్రవర్తనను ఎలా సమర్థించుకుంటున్నారో పరిమళ పాత్ర వెనుక ఉన్న పరిస్థితులు స్పష్టంగా వివరించాయి.

**ఏటి కెరటం**

సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సున్నితమైన, సంక్లిష్టమైన సమస్యలను హారిక పాత్ర ద్వారా ఎంతో లోతుగా విశ్లేషించింది ఈ కథ. స్త్రీలు ఎదుర్కొనే వరకట్నం వేధింపులు, లైంగిక ఒత్తిడి, కుటుంబ మద్దతు లేకపోవడం, సామాజిక అవమానాలు వంటి అనేక సమస్యలను లోతుగా విశ్లేషించింది. ముఖ్యంగా వివాహ వ్యవస్థలో స్త్రీల స్థితిగతులు, వారి ఆత్మాభిమానం గురించి ప్రస్తావించింది. స్త్రీలను వివాహ మార్కెట్లో ఒక వస్తువుగా చూసే దృక్పథాన్ని ఎండగట్టారు రచయిత. పెళ్లి చూపుల సమయంలో అమ్మాయిలను 'ఇంటర్వ్యూలు' చేయడం, వారి అందచందాలను బట్టి వెలకట్టడం వంటివి సాధారణమైపోయాయని కథ ప్రారంభంలోనే తెలుస్తుంది. సాఫ్ట్వేర్ ఇంజనీర్ సంబంధం అనగానే అమ్మాయి వ్యక్తిత్వం కంటే అబ్బాయికి ఇవ్వాల్సిన కట్న కానుకల గురించిన చర్చ సమాజంలో ఉన్న ఆర్థిక

ఒత్తిడి సూచిస్తుంది. మరొక ప్రధాన సమస్య స్త్రీల నిర్ణయాధికారం. జీవితాంతం బతకాలనుకునే స్త్రీలకు తన భర్తని ఎంచుకునే అవకాశం ఇవ్వకపోవడం నేటి కుటుంబాల్లోని లోపం. ఈ కథలో హారిక తండ్రి అదే చేశాడు. ఆమె పెళ్లి విషయంలో ఆమె ప్రమేయానికి కనీస ప్రాధాన్యత ఇవ్వలేదు. హారిక తండ్రి వీరేశం పెళ్లి సంబంధం గురించి మాట్లాడుతూ "హారిక నా కూతురు. ఆమెకే మభ్యంతరాలు ఉండవు" అని గర్వంగా చెప్పడం, అమ్మాయిల ఇష్టంలకు కనీస విలువ ఇవ్వని పితృస్వామ్య ధోరణికి అర్థం పడుతుంది. చదువుకున్న హారిక వంటి యువతను కూడా తమ తల్లిదండ్రుల పరిస్థితిని చూసి తమకు ఇష్టం లేకపోయినా పెళ్లిళ్లకు సిద్ధపడాల్సి రావడం వారి ఎదుర్కొనే మానేస్తే మానసిక సంఘర్షణను తెలియజేస్తుంది.

సామాజిక కళంకం స్త్రీలను మరింత కృంగుబాటుకు గురయ్యేలా చేస్తుంది. స్త్రీ తన ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవడానికి చేసే ప్రయత్నాన్ని సమాజం తప్పుదారి పట్టడంగానే చూస్తుంది. హారిక ఇంటి నుండి వెళ్లిపోయినప్పుడు బంధువులతో పాటు ఆ ఊరి జనం కూడా ఆమె పెంపకం గురించి, శీలం గురించి దుమ్మెత్తిపోవడం కనిపిస్తుంది. హారిక తిరిగి వచ్చినప్పుడు ఆమె తండ్రి కూడా 'ఏ మోజు తీరి తర్వాత వచ్చావు?' అని చాలా దారుణంగా ప్రశ్నించడం ద్వారా సమాజమే కాదు, కుటుంబం, ముఖ్యంగా తల్లిదండ్రులు కూడా స్త్రీలను ఎంత భయంకరంగా అవమానిస్తూ అనుమానిస్తున్నారో నిరూపించడంలో వాస్తవాన్ని గమనించవచ్చు. 'ఇంకా నిన్ను చేసుకునేందుకు ఎవడు ముందుకు వస్తాడు' అనే తండ్రి మాటలు, స్త్రీ విలువ కేవలం వివాహం, కన్యత్వంపైనే ఆధారపడి ఉందనే సంకుచిత భావనను ఎత్తిచూపుతున్నాయి. అయితే, ఈ సమస్యలన్నింటినీ అధిగమించడానికి ఆర్థిక స్వాతంత్రం ఏకైక మార్గమని హారిక నిరూపిస్తుంది.

స్త్రీ ఆత్మగౌరవం, వ్యక్తిత్వానికి ప్రాముఖ్యతనివ్వాల్సిన అవసరాన్ని ఈ కథలను నొక్కి చెప్పారు రచయిత. స్త్రీ తన ఆత్మ గౌరవాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోకూడదు. పెళ్లి నిశ్చయమైనంత మాత్రాన లేదా అబ్బాయి అమెరికా వెళుతున్నాడన్న సాకుతో తన ఇష్టానికి విరుద్ధంగా శారీరక సంబంధానికి ఒప్పుకోవాల్సిన అవసరం లేదని హారిక పాత్ర ద్వారా సూచన చేశాడు. చదువు మరియు ఉద్యోగం స్త్రీలకు ఎలా రక్షణగా నిలుస్తాయో చెప్పడాన్ని బట్టి రచయిత స్త్రీ విద్య అవసరాన్ని పేర్కొన్నారు. ఆర్థిక స్వవలంబన ఉంటే స్త్రీలు తమపై జరిగే ఒత్తిళ్లను ఎదిరించి, తమ సొంత నిర్ణయాలను తీసుకోగలరని సందేశం ఇచ్చారు. అలాగే సంప్రదాయం, ఆధునికత మధ్య సమతుల్యత అవసరమని బోధించడం నేటి యువతకు మంచి ఆలోచన కలిగించాలనిపించింది.

**ముగింపు :**

ఈ కథల పరిశీలించాక పలు విషయాలు. స్త్రీలు సంప్రదాయాల వల్ల ముఖ్యంగా పురుషాహంకారం వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నారు అనే విషయం తెలియవచ్చింది. అంతేకాకుండా సమానత్వ భావన అనే కోణంలో స్త్రీలను అసలు చూడట్లేదు అనే రచయిత ఆవేదన వ్యక్తం అయింది. ఆధునికత పేరుతో జరిగే అచాలక వల్ల స్త్రీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఉటంకించటం ప్రధానంగా కనిపించింది. ఆధునిక భావాలు అంటే విచ్చలవిడితనం కాదని, ఒకరి వ్యక్తిత్వాన్ని మరొక గౌరవించడమని, అందులోనూ స్త్రీలను గౌరవించాలని పేర్కొనడం గమనించదగిన విషయం. పిల్లలు సమస్యల్లో ఉన్నప్పుడు తల్లిదండ్రులు కేవలం సామాజిక గౌరవం గురించి కాకుండా, పిల్లల మానసిక స్థితిని, వారి విలువలను అర్థం చేసుకోవాలని రచయిత సూచించడంలో తల్లిదండ్రులకు కూడా హితబోధ చేయడం. ఇంకా ప్రేమ కేవలం శారీరిక ఆకర్షణే కాదని, ఒకరు విలువలను మరొక గౌరవించుకోవడమేనని స్పష్టం చేయడానికి నేటి ప్రేమికులకు కూడా హితసూచన చేశారనిపించింది. మొత్తంగా స్త్రీలు తమను తాము తక్కువ అంచనా వేసుకోకుండా సామాజిక ఒత్తిళ్ళకు లొంగకుండా తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకోవాలని ఈ కథలో సందేశాన్ని ఇచ్చాయి.

**పాదసూచికలు :**

1. మంచినీటి సముద్రం (కథా సంపుటి), వడలి రాధాకృష్ణ, పుట : 81.
2. మంచినీటి సముద్రం (కథా సంపుటి), వడలి రాధాకృష్ణ, పుట : 21.
3. గ్రీన్‌లైట్ ఏరియా (కథా సంపుటి), వడలి రాధాకృష్ణ, పుట : 55.
4. వడలి రాధాకృష్ణ కథలు (కథా సంపుటి), వడలి రాధాకృష్ణ, పుట : 49.

**ఆధార గ్రంథాలు :**


1. నాగయ్య జి - తెలుగు సాహిత్య సమీక్ష (1, 2 సంపుటాలు), నవ్య పరిశోధన ప్రచురణలు, 18-1-699, భవానీ నగర్, తిరుపతి.
2. మందేశ్వరరావు వడలి - అనుశీలన సాహిత్య విమర్శ, తెలుగు అకాడమీ, హైదరాబాద్, 1992.
3. రంగనాథాచార్యులు కె.కె. - ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాద్, 1982.
4. రాధాకృష్ణ వడలి - మంచినీటి సముద్రం (కథా సంపుటి)
5. రాధాకృష్ణ వడలి - గ్రీన్‌లైట్ ఏరియా (కథా సంపుటి)
6. రాధాకృష్ణ వడలి - వడలి రాధాకృష్ణ కథలు (కథా సంపుటి)


★★★

BHAVAVEENA
(A Monthly Peer-Reviewed Telugu Research Journal)
Journal of Arts, Literary, Culture & Language Study
ISSN 2456 - 4702
Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002. Andhra Pradesh, India. Cell : 7386529274, 7989781963.
BHAVAVEENA | Volumne-23 | Issue-5 | May 2026 | Peer-Reviewed | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

**Article Link :** *https://www.bhavaveena.com/*

# తెలంగాణ కథా సాహిత్యం - కులవృత్తుల విధ్వంసం



**జి. ప్రేమలత**
పరిశోధక విద్యార్థిని తెలుగు అధ్యాపకురాలు, గురుకుల పాఠశాల, రంగారెడ్డి జిల్లా.

సమర్పణ (D.O.S) : 20-04-2026 ఎంపిక (D.O.A) : 28-04-2026 ప్రచురణ (D.O.P) : 01-05-2026

**వ్యాస సంగ్రహం :**

బ్రిటీష్ వాళ్ళు భారతదేశంలో అడుగిడిన తరువాత భారత అర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయింది. ఫలితంగా వృత్తి కులాలు ఉత్పతి కులాలు స్థిరత్వం లేక విధ్వంసం కావడం ప్రారంభమైనాయి. వృత్తిదారులు మరింత దిగువభాగంలోకి నెట్టబడ్డారు.తెలుగు సాహిత్యంలో జాతియోద్యమం, సంస్కరణోద్యమం, తదనంత కాలంలో మార్క్సిజం ద్వారా అభ్యుదయ సాహిత్యత రైతు కులాలకు అండగా నిలబడింది. శ్రీశ్రీ ప్రవేశంతో శ్రామిక వర్గాలు చైతన్యం పొందాయి. కమ్మరి కొలిమి కుమ్మరి చక్రం/ జాలరి పగ్గం, సాలెల మగ్గం/ శరీర కష్టం, స్ఫురింపచేసే / గొడ్డలి, రంపం, కొడమలి, నాగలి

సహాస్ర వృత్తుల సమస్త చిహ్నాలు అంటూ వృత్తి పరమైన చైతన్యంతో కవిత్వం కొత్త దారులు పరచుకొంది. శ్రీశ్రీ అభ్యుదయ సాహిత్యం ద్వారా ఉత్పతి కులాలైన కమ్మరి, గొల్ల, కురుమ మొదలైన కులాల వృత్తులు కూడా సృష్టించబడ్డాయి. వర్గ పోరాట మార్గంలో వృత్తి, కులాల సమస్యలు పరిష్కారమవుతాయని భావించారు.కులవృత్తుల నైపుణ్యాన్ని వర్ణిస్తూ రచయితలు కుమ్మరి, కమ్మరి, మేదర సాలి, కంసాలి ఇలా అన్ని కుల మతాలపై రచనలు ఆవిష్కరించారు. తెలంగాణ కథాసాహిత్యంలో వచ్చిన కొన్ని ముఖ్యమైన చేనేత వృత్తి కథలను సామాజికతను పరిశీలించడం జరిగింది.

**కీలకపదాలు :**

కథ - కథానిక, ఆర్థిక వ్యవస్థ, వృత్తిదారులు, చైతన్యం, ఉత్పత్తి కులాలు, సామాజిక జీవనం, వృత్తి కళాకారులు, చారిత్రక అంశాలు, సామాజిక న్యాయం.

**ప్రవేశిక :**

తెలంగాణలో తిరుగులేని కులవృత్తి నైపుణ్యం ఉంది. ఇది నేటి కార్పోరేటీకరణ, ప్రపంచీకరణల ఇనుపపాదాల

కింద నలిగినశ్యమై పోతున్నాయి. తెలంగాణ కథా సాహిత్య వికాసంలో బహుజన కులవృత్తుల కథలకు ప్రత్యేకమైన స్థానం కలదు. అని అచ్చమైన తెలంగాణ జీవన చిత్రణలు, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, పద్మశాలి, గొల్ల, కాపు, తెనుగు, బెస్త కుర్మ, చాకలి, మంగలి, మేర లాంటి వృత్తుల జీవన స్థితిగతులపై ఎన్నో కథలు వచ్చాయి వస్తున్నాయి కూడా ప్రపంచీకరణ క్రమంలో పెరుగుతున్న డబ్బు అవసరాల ప్రాధాన్యత వృత్తిపనివాళ్ళ జీవితాలలో వస్తున్న సంక్షోభం వీటికి మధ్య ఉన్న సంబంధాన్ని రచయితలు తమ కథల్లో చిత్రించిన వైనం ఈ కథల్లో కనబడుతుంది. జి.రాములు- ఆత్మఘోష, బి.యస్.రాములు- బతుకుపయనం, నానమ్మ ప్రేమధార, ప్రేమధార - అసందిగ్ధ కర్తవ్యం, ప్రశాంతం, రాత్రిపూలు, వరుసలు. జూకంటి జగన్నాధం, వలస, యాతన బి.వి.ఎన్.స్వామి-వలస, పరిగడపు, మూడు వలసలు, రాత్రిపగలు, కొక్కుల భాస్కం-తెగినపోగు, బొంబాయి ప్రయణం, సాలోళ్ల పని సన్యాసులల్ల గల్సింది ,వుప్పల నరసింహ, బిర్లామందిర్, పి.చంద్, పాతచీర, నూలుపోగు, బంధం -ఎన్నార్ భోలా, దిలావర్- ఉరితాళ్ళు, సాహు-నాడి, ఐతా చంద్రయ్య-చిలకపచ్చ చీర మొదలైన కథకుల కథల్లో కులవృత్తుల విధ్వంసానికి సంబంధించిన అనేక సామాజిక అంశాలు కన్పిస్తున్నాయి.

**కులవృత్తుల విధ్వంసం – విశ్లేషణ :**

ఈ కులవృత్తుల ప్రాంతీయ అస్తిత్వ కథలు సామాజిక, ఆర్థిక, రాజకీయ, వాతావరణ, పరిసర అంశాలు ప్రభావాన్ని చూపుతాయి. మానవ సమాజంలో కష్ట సుఖాలు మనిషి జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. మానవ జీవితానికి ప్రతిబింబంగా నిలిచే కథలో రచయిత కథా వస్తువుగా సమాజంలో ఉన్న స్వీకరిస్తాడు. అందుకనుగుణమైన పాత్రల్ని ఎన్నుకుంటాడు. ఆయా పాత్రలు సమాజంలోని వివిధ వర్గ ప్రతినిధులకు నమూనాలుగా నిలుస్తాయి.

గత యాభై ఏళ్ళ నుండి సామాజిక జీవనంలో మమేకమైన వ్యక్తులను పోలి ఉన్న పాత్రలు తెలంగాణ కథల్లో కన్పిస్తాయి. అందుకే ఈ పాత్రల సజీవ మూర్తుల్లా మనం నిత్యం చూస్తున్న వ్యక్తుల్లా అనిపిస్తాయి. అన్ని వర్గాల కులవృత్తి స్త్రీ,పురుష పాత్రలు వాస్తవిక జీవితానికి దగ్గరగా ప్రవర్తిస్తాయి. గ్రామీణ సమాజాన్ని పట్టి చూపే కులవృత్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తుల్ని పాత్రలుగా స్వీకరించిన వాటిలో ముఖ్య పాత్రలుగా చిత్రీకరించబడ్డాయి. ఆయా వ్యక్తుల సంస్క ృతి, సంప్రదాయాలు ఈకథల్లోని పాత్రల వల్ల వ్యక్తం అవుతాయి. సంస్కృతి, సంప్రదాయాలు ఈ కథల్లోని పాత్రల వల్ల వ్యక్తం అవుతాయి. ఇట్లా సమాజంలోని భిన్న వ్యక్తుల వ్యక్తిత్వాన్ని, స్వభావాన్ని పాత్రలుగా స్వీకరించిన కథకులు కథలకు సమగ్ర సామాజికతను కల్గించడం వల్ల, ఆ పాత్రలన్నీ సజీవ మూర్తుల్లా అగుపిస్తాయి.

మాజీ ప్రధాని స్వర్గీయ పాలమూర్తి వెంకట నర్సింహారావు రాసిన "గొల్లరామప్ప" కథ రజాకారు పోరాట నేపథ్యంలోంచి వచ్చిన గొల్లల వృత్తి, సంస్కృతిని ప్రతిబింభించిన కథ. గూడూరి సీతారాం నారిగాని బతుకు "గౌండ్ల" కులస్థుల వెతలను చిత్రించిన కథ. కాలువ మల్లయ్య రాసిన "ఘర్మజలానికి ఖరీదు కట్టి షరాబు" కథల సంకలనంలో మగ్గంపని చేసే నేతకారులు, బట్టలుతికే చాకలివారు వంటి వృత్తికారుల వాళ్ళ జీవితాలలోని ఆర్తి, ఆశ, అసంతృప్తి కథావస్తువులుగా చేసికొని కథలు రాసాడు.

జాతశ్రీ రాసిన "చలివేంద్రం" కథలో కుమ్మరి పనివాళ్ళ జీవితం, జీవన యానంలోని ఆటుపోట్లను వర్ణించాడు. ఇతను రాసిన మరోకథ "అంతర్ముఖం" కథలో గౌడ కులస్థులు తాళ్ళగీత వృత్తి గిట్టుబాటు కాక డబ్బు సంపాదనకై కువైట్ వలసపోవడాన్ని చిత్రించింది. "కుట్ర" కథలో వడ్రంగం పనివారి కథ చిత్రించాడు. ఈ కథలో కూతురు పురిటికి రాగా ఐదువందల అప్పుకోసం వూరంతా తిరిగిన నాగముని అనే వృత్తికారుని దయనీయ పరిస్థితిని చిత్రించింది.

పెద్దింటి అశోక్ కుమార్ కూడా విస్తృతంగా కులవృత్తులు అంతరిస్తూ, జీవితాలలో వచ్చే సంక్షోభాన్ని తన కథల్లో చిత్రించాడు. ఇతను రాసిన "తెగిన బంధాలు" కథలో పెండ్లిళ్ళు పద్ధతులు మారడం వల్ల కూరాడు కుండలకు, పోలుముంతలకు పెళ్ళితంతులో స్థానం లేకుండా పోవడం చిత్రితమైనాయి. ఇతను రాసిన "కాగుబొత్త" ఈ కథలో

కుమ్మరివారి జీవన విషాదాన్ని చిత్రించడం జరిగింది. జాతరలో చలివేంద్రం పెట్టడానికి మట్టికాగులు చేసే పని తండ్రి చేపడితే నీటి ప్యాకెట్లను అమ్ముకునే కాంట్రాక్టు పట్టాడు కొడుకు. బతుకు దెరువు పాకులాటలో తండ్రీ - కొడుకుల సంబంధాలు నిలబడనివే అయినాయి. నీళ్ళను ముల్లెగట్టి అమ్మే వ్యాపారం పచ్చి కాగుబోత్తకు స్థానం లేకుండ చేసిన క్రమంలో ఉన్న హింసను ఈ కథలో అమృతంగా చిత్రించాడు రచయిత. చాకలి, గౌడ, మంగలి మొదలగు కులవృత్తుల వారు "కొత్త పరిస్థితులలో ఎదుర్కొనే కొత్త సమస్యలను చిత్రిస్తూ 'వెలి' ఇనుపహక్కుకాకులు' మొదలగు కథలు రాసాడు అశోక్ కుమార్.

జూకంటి జగన్నాథం కథలు ప్రధానంగా వలస కథలు చేనేత కార్మికులను వలసలకు తరిమే పరిస్థితులను, వలసవెల్లేవారి మానసిక ఆందోళనలను చిత్రించే కథలు. "యాతన' దూగోడ' వంటి కథల్లో బ్రతుకు తెరువుకై దుబాయికీవోయి తల్లిదండ్రులకు, భార్య పిల్లలకు దూరమైన మనుషుల మనసులు పడే రంపపుకోతను (వడ్రంగి) చిత్రించాడు జగన్నాథం.

పద్మశాలీల బతుకుల గూర్చి "తెగినపోగు", "బొంబాయి ప్రయాణం" లాంటి కథల్లో కొక్కుల భాస్కర్, బొంబాయిలో ఉంటూ ప్రవాసాంధ్ర పద్మశాలీల బతుకుల గూర్చి బొంబాయి కథలు రాసాడు అంబట్ల జనార్థన్, ఆడెపు లక్ష్మీపతి పద్మశాలీ బతుకులు చిధ్రమవడాన్ని త్రిభుజపునాలుగోకోణం కథలోనూ, మొసల్దానిముల్లే కథలోనూ ఐతా చంద్రయ్య 'చిలుక పచ్చచీరక కథలోను చిత్రించారు. పుప్పలనరసింహం గారి స్వగతాలు వివిధ వృత్తిపనివారి బతుకుల జీవితాలను చిత్రించే కథలు. చాకలి వృత్తి వారి బతుకుల నేపథ్యంలోంచి ఐతా చంద్రయ్య రాసిన 'వరాలమూట' కథ చెప్పుకో దగినది. కూతురు రాంరెడ్డి గౌడుల సమస్యపై వంకతాడు కథలో చిత్రించాడు. 'తలకోరుకుండ' కథల సంపుటిలో వివిధ కులాలు, వారి వృత్తులు ఏ విధంగా చిద్రమైపోతున్నాయో కళ్ళకు కట్టినట్లు చూపించాడు బోయజంగయ్య. దర్జీవారి బతుకుల చిత్రాన్ని, వారి వృత్తికి ఆటంకపర్చిన రెడిమెంట్ షాపుల దుస్థితిని పరవస్తు లోకేశ్వర్ ' దర్జీసాబ్' కథలో సూక్ష్మంగా వర్ణించాడు. ఇలా తెలంగాణ కథాసాహిత్యంలో బహుజనవాద అస్తిత్వంపై ఎన్నో కథలు వచ్చాయి. మరెన్నో వస్తూనే ఉన్నాయి.

'చిరునామా' కథలో జాతశ్రీ ఉదయం నుంచి పనిలో నిమగ్నమై బతుకులను నెట్టుకొస్తున్న నేతన్నల గురించి ఈ కథ రాశాడు.. ఈ కథలో ప్రధాన ఇతివృత్తం చేనేత వృత్తిదారుల ఆకలికేకలు. వలసలు పోవటానికి ప్రేరేపించే కారణాలను ఈ కథలో పొందుపరిచాడు.

కాలువ మల్లయ్య పద్మశాలీల సమస్యలను వివరించిన మరోకథ 'ఎదురుచూపు'.పద్మశాలీల, చేనేత కార్మికుల దీనమైన జీవితం, వలసలు పోవాల్సిన అనివార్వత భీవండికిగాని, గల్ఫ్ దేశాలకు గాని పోయిన క్రమం, పడిన బాధలు, అనుభవించిన వేదన, భీవండిలో జరిగిన మతకలహాల్లో మృత్యువాత పడ్డ యువకులు మొదలైన అనేక చారిత్రక అంశాలు ఈ కథల్లో కనబడతాయి.

పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 'గోస' కథ పద్మశాలీల ఆశ్రిత కులం వారైన సాధన శూరుల గురించి తెలియజేస్తుంది. "ఒకవైపు కులవృత్తులే నాశనమైపోతుంటే ఇక ఆశ్రిత జాతులను పట్టించు కునేవారెవరు? పద్మశాలీలకే పనులు లేక, పస్తులుంటుంటే వారినాశ్రయించుకొని బతికే సాధన శూరులు దిక్కులేక గారడీ చేసుకు బతికే వీలు కూడా లేక చివరకు బిచ్చగాళ్ళుగా మారిపోతున్న దయనీయ కథనమే ' గోస". వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక ప్రజానీకానికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న చేనేత రంగం అభివృద్ధి ద్వారా భారతీయ చేనేత కారుల నైపుణ్యాలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవచ్చు.

అనిశెట్టి రజిత 'కొత్తపాట' కథలో అనిశెట్టిరజిత పద్మశాలి కులంలో చైతన్యవంతమైన ఒక మహిళ కష్టపడి చదువుకొని సామాజిక న్యాయం కోసం ప్రజల జీవితాలలో వెలుగు కోసం నిత్య చైతన్యంతో అనేక ప్రాంతాలు

పర్యటిస్తుంది. పద్మశాలి కులంలో చైతన్యవంతమైన ఒక మహిళ కష్టపడి చదువుకొని సామాజిక న్యాయం కోసం ప్రజల జీవితాలలో వెలుగు నింపడానికి చేసిన ప్రయత్నం ఇందులో కనిపిస్తుంది. ఈ కథా నాయకురాలు చదువుకుని జీవితాన్ని గెలిచిన తీరు కనిపిస్తుంది.

సబ్బని లక్ష్మీనారాయణ కరీంనగర్ జిల్లాకు చెందిన సబ్బని లక్ష్మీనారాయణ 'బాధ్యత' కథలో చేనేత కార్మికుల ఆర్థిక, సాంఘిక జీవితం చిక్కిపోయిన క్రమంలో బాధ్యతలను, సాంప్రదాయాలను పాటించలేని దుస్థితిని చిత్రించారు. చేనేత కుటుంబాల్లోని దుస్థితిని సబ్బని లక్ష్మీనారాయణ బాధ్యత' (2005) కథలో చిత్రించారు. నారాయణ చేనేత కార్మికుడు. నలుగురు ఆడపిల్లలతోడుగా పుట్టిన నారాయణ చిన్నప్పుడే తండ్రి మరణించడంతో ఎన్నో కష్టాల్ని అనుభవిస్తాడు.సాంచెల మీద పని చేయాల్సి రావడం, కరెంట్ సరిగ్గా ఉండకపోవడంతో కుటుంబం భారంగా తోచేది. అతని భార్య శాంత బీడీలు చేయడంతో అతికష్టం మీద పిల్లల్ని పోషిస్తూ వస్తాడు. బతకడమే కష్టమైన దశలో ఆడబిడ్డలకు పెట్టే లాంఛనాలకు ఇబ్బంది పడుతాడు. కుటుంబావసరాలకు భార్య, చిల్లర ఖర్చు నిమిత్తం తల్లి, కొత్త బట్టలు, బడి ఫీజులు, బొమ్మలకోసం పిల్లలు తనను అడిగేవారని, ఇవన్నీ తలచుకుంటే అందరి ఖర్చుల కోసం తానున్నానని, తన కోసం ఎవరూ లేకున్న బాధ్యతలు మాత్రం మిగిలున్నాయని అనుకుంటాడు. ఇట్లా చేనేత కార్మికుడు తనలో తాను పడే సంఘర్షణ ఈ కథలో కనిపిస్తుంది.

ఆడెపు లక్ష్మీపతి 'త్రిభుజపు నాల్గోకోణం' కథలో పద్మశాలి జీవితాల్లో కులవృత్తులు కోల్పోయి. అనేక ఇతర వృత్తులు, వ్యాపారాలు చేపట్టి, నష్టాలు సంభవించి జీవితాలు,కుటుంబాలు ఎలా శిథిలమవుతూ వస్తున్నాయో చిత్రించారు. బీసీ కులాల నుండి మధ్య తరగతిగా ఎదుగుతున్న జీవితాలలోని సంఘర్షణను, సంక్లిష్టతను శిల్ప వైవిధ్యంతో చిత్రిస్తున్నారు. పద్మశాలీలకు నష్టాలు వచ్చి జీవితాలు ఎలా శిథిలమయ్యాయో తెలిపే కథ 'త్రిభుజపు నాల్గో కోణం'. రచయిత ఆడెపు లక్ష్మీపతి. ఈ రచయితదే మరోటి 'ముసల్దానిముషా' అనే కథ కూడా పద్మశాలీల జీవితాన్ని చిత్రిస్తుంది.

ఆడెపు లక్ష్మీపతి మరోటి 'ముసల్దానిముషా' అనే కథ కూడా పద్మశాలీల జీవితాన్ని చిత్రిస్తుంది. ఆడెపు లక్ష్మీపతి రాసిన 'ముసల్దాని ముల్లె' కథలో ప్రజల్లో కనిపించకుండా పోతున్న ప్రేమ, ఆప్యాయత, అనురాగాలను కాపాడే ప్రయత్నం చేశాడు కథకుడు. ముసల్దాని ముల్లెలో ఉన్నవి మాగిన అరటి పండ్లే కాని ఆ పండ్లను ఆరాటంగా తన మనవలకు ఇవ్వాలని దాచుకుంటుంది. మనుషుల మధ్య 'ప్రేమ' అనే బంధం శాశ్వతంగా కొనసాగాలని కోరుతూ అర్థాలు చెప్పలేని, మనసుకు సంబంధించిన భావాలకు ఉనికి లేకుండా చెయ్యొద్దని ఈ కథ ద్వారా కథకుడు కోరుతున్నాడు. ఈ కథల ద్వారా పద్మశాలీల జీవితాలను ఆవిష్కరిస్తూ, వాస్తవ పరిస్థితులను వివరిస్తూ సమాజంలోని మనుషుల ఆలోచనల్లో మార్పు రావాలని కోరుతున్నారు.

వల్లూరిపల్లి రంగారావు గ్రామీణ చేనేత కార్మికుల వలసలను చిత్రించిన కథ 'లాకౌటు'. పల్లెసీమలలోను నాగరికతా పరిణామాలు తరతరాలుగా సాగివస్తున్న చేనేత వృత్తులను వదులుకునేలా చేశాయి. తెలంగాణా జిల్లాలోని ఓ మారుమూల కుగ్రామంలో చేనేత వృత్తిచే జీవించే వ్యక్తి యాదయ్య. పల్లె సీమలలో చేనేత వృత్తులు మూలపడడంతో బ్రతుకుదెరువునన్వేషిస్తూ యాదయ్య పట్టణం చేరి అక్కడొక నూలు మిల్లులో కూలీ అయ్యాడు.

మిల్లు లాకౌట్‌తో. ఈ కథలో ప్రధానంగా కనబడేది యాదయ్య, చంద్రమ్మల కుటుంబం పడే కష్టాలను ఈ కథలో వివరించారు.

బి.వి.ఎన్.స్వామి "కుంఠనం" కథ నేత కార్మికుల ఆత్మహత్యల్ని, వాటి కారణాల్ని విశ్లేషిస్తుంది. పెట్టుబడిదారి విషప్రభావానికి వారసులైన మన నాయకుల దుర్మార్గం కలసి మన చేనేతను పరిశ్రమ స్థాయికి రాకుండా నాశనం

చేసిన విధానం. అప్పటికే అభివృద్ధి చెందిన దేశాల బట్టలు తక్కువ ఖరీదుకే మన చేనేతకు పోటీ కావటం, చేనేత కార్మికులను బ్రతికించడంగా కాక చేనేతను బ్రతికించడంగా చేసే మోసపూరిత కార్యక్రమాలు వారిని మరింత దిగజారుస్తున్న స్థితికి అద్దం పడుతుంది.

కొట్ల వనజాత పారిశ్రామీకరణ వల్ల నేత కార్మిక కుటుంబాలు వీధి పాలు కావడాన్ని కోట్ల వనజాత 'సముద్రం' (2008) కథ సూచిస్తుంది. ఈ కథలో మహేష్ నేత కార్మికుడు. మరమగ్గాలు పడి చేనేతకు ఆదరణ తగ్గడంతో పాలమూరు నుండి బొంబాయికి వలస వెళ్లాడు. అక్కడికి వెళ్ళిన కొన్నాళ్ళకే అనారోగ్యంతో ఉన్న భార్యకు వైద్యం చేయించే స్తోమత లేకపోవడంతో ఆమె చనిపోతుంది. అంత్యక్రియలు జరిపంచలేని దుస్థితిలో భార్య మృతదేహాన్ని రహస్యంగా సముద్రంలో వదిలేస్తాడు. పాలమూరుకు తిరిగి వచ్చేటప్పుడు చిన్నకూతుర్ని పోగొట్టుకుంటాడు.

వెల్దండి శ్రీధర్  తెలంగాణ నేపథ్యంలో చేనేత కార్మికుల దుఃతిని చిత్రిస్తూ పేదరికం వల్ల ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనం 'పొద్దు పొడుపు' (2009) కథలో వెల్దండి శ్రీధర్ చిత్రించారు. బాల్రాజు చేనేత కార్మికుడు. తొమ్మిదో తరగతిలో చదువాపి భీవండి వెళ్ళి మరుమగ్గాలపై పని చేస్తాడు. ఈ లోగా భీవండిలో అల్లర్లు జరుగగా తిరిగి ఊరు చేరుతాడు. సిరిసిల్లలో సాంచెలు పడటంతో కుటుంబంతో వెళ్ళి స్థిరపడతాడు. భార్య బీడీలు చుట్టినా, తాను సాంచెలు నడిపినా పస్తుల బతుకే గడుపాల్సి వస్తుంది. కూళ్ళరేట్లు తగ్గడం, కరెంట్ పోవడం వల్ల కూలీ గిట్టుబాటులేక ఇబ్బందులు పడుతాడు.

ఒకనాడు పల్లె ప్రజలకు ముఖ్యమైన వ్యక్తి పాత్ర పోషించిన 'టైలర్' వృత్తి రెడీమేడ్ దుస్తుల రాకతో ఎలా, అయోమయంలో పడిందో మహమ్మద్ ఖదీర్ బాబు న్యూ బాంబే టైలర్స్' కథ వివరించింది. కూతురు రాంరెడ్డి రాసిన 'వంకతాడు' కథలో గౌడ జీవనంలోని విషాదం, గౌడుల మధ్య నెలకొన్న సంఘర్షణ చిత్రించబడింది. ఈ కథలో సారయ్య ఎవరూ పట్టించుకోని పెద్ద చెరువు కట్టకున్న వంకతాడును గొబ్బెలొలిచి, మట్టలుకొట్టి, చేవ చేసుకొని కల్లు పారిస్తాడు. ఆ చెట్టుకల్లు కోసం పోటీ నెలకొనడంతో అందరి చూపు వంకతాడు పైనే ఉంటుంది. బావా నీకు దండంబెడుతగనీ గా వంకతాడు నాకొద్దు... నువ్వే గీసుకో.." ఇట్లా ప్రాణాపాయమైన వృత్తిలో గౌడులు కొనసాగుతుండాన్ని ఈ కథ స్పష్టం చేస్తుంది.

శిరంశెట్టి కాంతారావు రాసిన 'ప్రయాస' ప్రపంచీకరణ విసిరిన సవాళ్ళను ఎదుర్కొని సంప్రదాయ కులవృత్తిని వదలుకొని ప్రత్యామ్నాయ వృత్తిని స్వీకరించే క్రమంలో పడే ప్రయాసను శిరంశెట్టి కాంతారవు 'ప్రయాస' (2007) కథలో చిత్రించారు. కుమ్మరి అయోధ్య కుండలు చేస్తూ జీవనం కొనసాగిస్తాడు. పారిశ్రామికాభివృద్ధి ఫలితంగా మార్కెట్లోకి ఫ్రిట్లు వచ్చి చేరడం, మధ్య తరగతి వాళ్ళకు అందుబాటులో ఉండటం వల్ల కుండల అమ్మకం తగ్గుతుంది. ఇవాళ కుండలెవరు కొంటారు? ఇంట్లో కుండలు పేరిస్తే కడుపులు నిండవు, కాపురాలు సాగవు. మరి అట్లాగని వేరేపని చేయాలంటే మనస్సు ఒప్పుకోదు. బతికేదెట్ల అన్న భయం ఆందోళన మధ్య ఆయోధ్య కొడుకు వీరన్న తన బిడ్డల్ని పోషించుకోవడానికి తండ్రి వద్దంటున్న వ్యవసాయంలోకి దిగుతాడు. ఎంతో కష్టపడి పనికి రాదనుకున్న భూమిలో బొప్పాయి తోట వేసి పంట తీస్తాడు. డబ్బుతోపాటు మంచి రైతుగా పేరుగడిస్తాడు వీరన్న.

జూకంటి జగన్నాథం అందమైన వస్త్రాలు తయారు చేసే సమర్థత గల చేనేత పరిశ్రమ వారు పవర్లూమ్స్ వచ్చాక తాము నేస్తున్న బట్టలకు ప్రతిఫలం దొరక్క ఆత్మహత్యలకు పాల్పడుతున్న నిజాన్ని 'వైపని' కథలో జూకంటి జగన్నాథం వివరించాడు. రచయిత 'వైపని'లో ఒక కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుని చనిపోయిన తీరును తెలియపరుస్తాడు. భర్త బంబాయిలో చనిపోగా ఇద్దరు పిల్లలతో సక్కుబాయి పడ్డ కష్టాల్ని చూపిస్తాడు. కూతురు పెళ్ళిచేసిన తర్వాత ఏ పనిచేసుకున్నా పొట్టనిండక ఆత్మహత్య చేసుకుని కుటుంబం పూర్తిగా మరణించిన తీరు పాఠకులందరిని ఆలోచింప చేస్తుంది. కులవృత్తిని కోల్పోయిన పద్మశాలీలు వ్యాపారం చేయడం ప్రారంభిస్తారు.

**ముగింపు :**

కథను నడిపించే వారూ, కథా వస్తువును భరించే వారూ, కథాంశాన్ని సూచించే వారు పాత్రలు. నవలలోని పాత్రల్లో కనిపించే విశాలత్వమూ, లోతూ కథల్లోని పాత్రల్లో కనిపించవు. నవలలో అనేక పాత్రలు ఉంటాయి. కాబట్టి విభిన్న మానవ వ్యక్తిత్వాలను ఒక దాంతో మరొకటి పోల్చి చూపవచ్చు. కథలో అలాంటి అవకాశం చాలా తక్కువ. నవలలోని పాత్ర పాఠకుని మనసులో రూపొందుతుంది. అంటే నవలా రచయిత ఒక పాత్రకు సంబంధించిన అనేక ముఖాలను పాఠకుని ముందుంచితే పాఠకుడు వాటి సహాయంతో ఆ పాత్ర వ్యక్తిత్వాన్ని తన మనసులో నిర్మించుకుంటాడు. కథలో అలా కాకుండా రచయిత మనసులో రూపొందిన పాత్ర పాఠకుని ముందుకొస్తుంది. కథలోని పాత్ర కూడా సాధారణ మానవుడే కాబట్టి అతడికీ అనేక ముఖాలూ, అతనిలోనూ అనేక విభిన్న లక్షణాలు ఉండవచ్చు. కథా రచయిత వాటిలోంచే కథాంశానికి దోహదం చేసే లక్ష్యాన్నో, లక్షణాల్నో మాత్రమే ఎన్నుకోవలసి ఉంటుంది. ఈ ఎన్నికలోనే కథ రచయిత జీవితానుభవమూ, శిల్ప సామార్థ్యమూ వ్యక్తమౌతాయి.

ఈ కథల వల్ల మనిషిలోని నిస్వార్థమే మానవసంబంధాల విఘాతానికి మూలమౌతున్న క్రమాన్ని రచయితలు స్పష్టంగా ఈ కథల్లో వివరించారు.

**ఆధార గ్రంథాలు :**


1. కుంతనం- బి.వి.ఎన్.స్వామి - సాహిత్య ప్రస్థానం, 2005
2. చేనేత చిత్రం - మునిపల్లెరాజు - కొత్తకథ కథా సంకలనం - వేదగిరి రాంబాబు, 1994
3. గొల్లరామవ్వ - పి.వి. నరసింహరావు - తొలితరం తెలంగాణ కథలు - సంకలనం, ముదిగంటి సుజాతారెడ్డి, ప్రథమ ముద్రణ 2002
4. భారతదేశంలో కులాలు వాటి పుట్టుక, పనితీరు, అభివృద్ధి - అంబేద్కర్ - హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్రథమ ముద్రణ, 2006
5. తెలుగు కథలు - కథన రీతులు- సంపాదకులు - సింగమనేని నారాయణ, 2008
6. కొలిమి - మేరెడ్డి కొలిమి కథాసంపుటి, 2010.


★★★

భావవీణ
May 2026
Journal of Arts, Literary, Culture & Language Study
Reffered Journal & Peer Reviewed Journals
ISSN No. 2456-4702 | RNI No. APTEL/2003/12253
Web : www.bhavaveena.com

Low Cost.. Super Taste...

fssai
20126141000928





# జె.కె.యల్. ఎంటర్‌ప్రైజస్

# JKL ENTERPRISES

**Proprietor : JOGI BRAMARAMBA**

మావద్ద గొడ్డు కారం, మసాలా కూర కారం & పసుపు లభించును

5/3 మల్లిఖార్జునపేట, గుంటూరు - 2. సెల్ : 6301155041.

Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11, Brodipet, Guntur - 522002.
Andhra Pradesh, Cell : 7386529274, 7989781963, Web : www.bhavaveena.com,
E-mail : parisodhanatelugu@gmail.com, Printed at : GLS Enterprises,
Guntur - 522 002. Ph. 9494 660 509.